ఈనాడు

విజయవాడ 24-11-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 104
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




సత్యసాయిబాబా స్వర్ణ రథానికి నమస్కరిస్తున్న తమిళనాడు మంత్రి శేఖర్‌బాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, సీఎం చంద్రబాబు, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, మంత్రి లోకేశ్, మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సోమన్‌సేన్, సత్యసాయి సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే, ట్రస్టు సభ్యుడు చక్రవర్తి

సత్యసాయి.. స్ఫూర్తిప్రదాత

ఆయన బోధనలతో ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది భక్తులు ప్రభావితం • సెంట్రల్ ట్రస్టు సేవలు అద్భుతం

బాబా శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ • తెలుగు రాష్ట్రాల సీఎంలు, త్రిపుర గవర్నర్ సహా పలువురి హాజరు

ఈనాడు - పుట్టపర్తి

పరోపకారమే పరమావధిగా తన బోధనలు, ఎన్నో సామాజిక కార్యక్రమాలతో భక్తుల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించిన సత్యసాయి ప్రపంచానికే స్ఫూర్తిప్రదాత అని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. హిల్‌వ్యూ స్టేడియంలో జరిగిన వేడుకలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, ఏపీ ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్, తమిళనాడు మంత్రి శేఖర్‌బాబు, మేఘాలయ, ఉత్తరాఖండ్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సోమన్‌సేన్, జస్టిస్ గుహనాథన్ నరేంద్ర, సత్యసాయి సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే, ట్రస్టు సభ్యులు కె.చక్రవర్తి, ఎస్.నాగానంద్, జస్టిస్ రామసుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. 1964-65 మధ్య తన అత్త పుట్టపర్తికి వచ్చి 15 రోజులు ఉండి బాబా ఆశీస్సులు తీసుకున్నారని గుర్తు చేసుకున్నారు. "శాంతి, ప్రేమ, నిస్వార్థ సేవలకు ప్రతిరూపం బాబా. 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు, ఎప్పుడూ సాయం చేయి.. ఎవరినీ నొప్పించకు' వంటి బోధనలు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేశాయి. ఓ తమిళ కవి చెప్పినట్లు ఇతరుల కోసం జీవించే జీవితం మాత్రమే నిజమైన ఆధ్యాత్మికత. దీన్ని అక్షరాలా బాబా ఆచరించి చూపారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు దేశవ్యాప్తంగా (మిగతా 2లో)


ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ఆకట్టుకున్న స్వర్ణ రథోత్సవం

వేదమంత్రోచ్చారణల నడుమ స్వర్ణరథంపై సాయిబాబా ఊరేగింపు కనులపండువగా జరిగింది. రథోత్సవానికి ముందు వివిధ రాష్ట్రాలకు చెందిన బాలవికాస్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ముందు నడిచారు. ప్రముఖ సంగీత కళాకారుడు శివమణి ఆధ్వర్యంలో డ్రమ్స్, ఇతర వాయిద్యాల నడుమ గాయకుడు మనో పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. భారత దేశం భిన్నత్వంలో ఏకత్వం స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ నెల 18న ప్రారంభమైన శతజయంతి ఉత్సవాలను ఆరు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. దేశ నలుమూలల నుంచి, విదేశాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో వచ్చి సత్యసాయి సమాధిని దర్శించుకున్నారు. ఉత్సవాల కోసం అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రస్టు ఆధ్వర్యంలో భోజన, వసతి కల్పించారు.

నేడు 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం



దిల్లీ: సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా సోమవారం జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం చేయనున్నారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టబోతున్న తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించబోతున్నారు. ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీ కాలం ఆదివారంతో ముగిసింది. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిస్సార్ జిల్లాలో జన్మించారు. 1981లో డిగ్రీ పూర్తి చేశారు. 1984లో రోహతక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్ర పట్టా పొందారు. అదే సంవత్సరం హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించారు. 1985లో పంజాబ్, హరియాణా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. రెండు దశాబ్దాలుగా వివిధ (మిగతా 2లో)

ప్రభుత్వ వ్యతిరేక తీర్పులే స్వతంత్రతకు రుజువు కాదు

అలా వెళ్లాలనుకోవడం సరైనది కాదు

ఏ ప్రభుత్వ పదవీ చేపట్టను

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టీకరణ 12లో



భద్రతా మండలి సంస్కరణలు తప్పనిసరి

అవి ఎంతమాత్రం ఐచ్ఛికం కావు

ఐబీఎస్ఏ నేతల సమావేశంలో మోదీ స్పష్టీకరణ

అందరికీ అందుబాటులో నూతన సాంకేతికతలు

జీ20 సదస్సులో ప్రధాని పిలుపు

11లో

కర్ణాటకలో సీఎం కుర్చీకోసం ఆగని పోరు

అధిష్ఠానమే పరిష్కరిస్తుందన్న ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడిని కలవని డీకే వర్గం

11లో

జలాశయాల్లో మృత్యు సుడులు

వివిధ ఘటనల్లో నీట మునిగి ఇద్దరి మృతి • 9 మంది గల్లంతు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వాహనం

నలుగురి మృతి, ఆరుగురికి గాయాలు

లోపలి పేజీల్లో

'చండీగఢ్ బిల్లు'పై రగడ



- భగ్గుమన్న పార్టీలు
- వెనక్కి తగ్గిన కేంద్రం
- శీతాకాల సమావేశాల్లో తేబోమని ప్రకటన

దిల్లీ, చండీగఢ్: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకున్న 'చండీగఢ్ బిల్లు'పై పంజాబ్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ బిల్లు ద్వారా సమాఖ్య నిర్మాణాన్ని కేంద్రం దెబ్బతీస్తోందని అన్ని పార్టీలూ ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. బిల్లును ఈ శీతాకాల సమావేశాల్లో పెట్టడం లేదని, అందరితో చర్చించాకే తీసుకొస్తామని వివరణ ఇచ్చింది. శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే 10 బిల్లుల వివరాలను లోక్‌సభ, రాజ్యసభలు శనివారం విడుదల చేసిన బులెటిన్లలో పేర్కొన్నాయి. అందులో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు-2025 ఉంది. ఆ బిల్లు ప్రకారం.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 240 కింద చండీగఢ్ రాష్ట్రపతి పర్యవేక్షణలోకి వస్తుంది. దీనివల్ల దానిపై నియంత్రణతో పాటు నేరుగా చట్టాలు చేసే అధికారం రాష్ట్రపతికి సంక్రమిస్తాయి. స్వతంత్ర పాలకుడిని నియమించే (మిగతా 2లో)

బయో డీజిల్ కేంద్రంలో ఎగిసిన మంటలు



డీజిల్ కేంద్రంలో ఎగసిపడుతున్న మంటలు ★ రషీద్

యువకుడి సజీవదహనం

అనుమతుల్లేకుండా దుకాణం నిర్వహణ

రెంటచింతల, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బయో డీజిల్ కేంద్రంలో మంటలు చెలరేగడంతో ఓ యువకుడు సజీవ దహనమయ్యాడు. పల్నాడు జిల్లాలోని మాచర్ల - దాచేపల్లి రహదారి పక్కన ఈ ఘటన చోటుచేసుకుంది. గురజాలకు చెందిన షేక్ శివయ్య (అలియాస్ షరీఫ్) నాలుగేళ్ల కిందట పాలువాయి జంక్షన్‌లో ఒక భవనం అద్దెకు తీసుకుని (మిగతా 2లో)



లైసెన్సు ఉంటేనే ఇక ప్రచారం!

హోర్డింగులపై డిస్‌ప్లే డివైజెస్ ఫీజు

విధాన సవరణలతో త్వరలో మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: ప్రధాన కూడళ్లు, ప్రదేశాల్లో అనుమతులు తీసుకోకుండా, పట్టణ స్థానిక సంస్థలకు ఫీజు చెల్లించకుండా హోర్డింగులు, ఫ్లెక్సీలు పెడతామంటే ఇకపై కుదరదు. కచ్చితంగా లైసెన్సులు తీసుకుని నిర్దేశించిన ఫీజులు చెల్లించాల్సిందే. అలాంటి హోర్డింగులు, ఫ్లెక్సీలనే అనుమతిస్తారు. అడ్వర్టైజ్‌మెంట్ పాలసీలో ఈ మేరకు పలు సవరణలు చేసి కొత్త మార్గదర్శకాలను త్వరలో జారీ చేయనున్నారు. (మిగతా 2లో)

సొంతిల్లు @ 3.47 లక్షలు

- గ్రామీణ ప్రాంతాల్లో వెల్లువెత్తిన దరఖాస్తులు
- ఈ నెల 30 వరకు గడువు
- 'ఆవాస్+' యాప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక



ఈనాడు - అమరావతి

మీరు గ్రామీణ ప్రాంతంలో ఉంటున్నారా? సొంతిల్లు లేదా? అయితే దరఖాస్తు చేసుకునేందుకు మరో 6 రోజులే గడువుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణానికి.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ)- ఎన్టీఆర్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఇందుకు అర్హులను గుర్తించేందుకు ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చి ఎంపిక చేపట్టాయి. ఈ నెల 30తో గడువు ముగియనుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో 3.47 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గతంలో పట్టణాభివృద్ధి సంస్థల(యూడీఏ) పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన(పట్టణ) పథకాన్ని అమలు చేయగా, కేవలం ఇళ్ల నిర్మాణాల మంజూరు కోసమే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలను యూడీఏలుగా మారుస్తున్నాయనే ఆలోచనతో కేంద్రం వీటిల్లో అనుమతిని నిలిపేసింది. దీంతో యూడీఏల్లో కూడా గ్రామీణ పథకాన్ని అమలు చేస్తున్నారు. వీటి పరిధి లోనూ అర్హుల ఎంపికను చేపడుతున్నారు.

సొంత స్థలమున్నా.. లేకపోయినా

పేదల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం రెండు విధాలుగా చేపడుతోంది. సొంత స్థలం ఉండి అక్కడే నిర్మాణం చేపడతామనే వారికి ఇంటిని(ఆర్థిక సాయం) మంజూరు చేయనుంది. స్థలం లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లను కేటాయించి అక్కడ నిర్మాణం చేపట్టేందుకు ఇల్లును (మిగతా 2లో)

అత్యంత పేదలకే మొదటి ప్రాధాన్యం

దరఖాస్తుదారుల్లో మొదట అత్యంత పేదలకే ఇల్లు మంజూరయ్యేలా యాప్‌ను కేంద్రం డిజైన్ చేసింది. యాప్‌లో నమోదైన వివరాల ఆధారంగా అర్హుల జాబితా సిద్ధం కానుంది. ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రాధాన్యమిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్ ద్వారా నమోదు చేసిన వారి వివరాలను కేంద్రానికి నివేదించనుంది. అక్కడ మరోసారి తనిఖీ చేయనున్నారు. తుది జాబితాకు అనుగుణంగా ఇల్లు మంజూరు ఉంటుంది.

గూగుల్ వచ్చాక.. ఐటీ కంపెనీలు క్యూ కడతాయి

- ఏపీ డిజిటల్ హబ్‌గా మారుతుంది
- డేటా సెంటర్‌తో పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన
- అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ గొప్ప ముందడుగు

'ఈనాడు' ముఖాముఖిలో అమెరికా ఏఐ నిపుణుడు, సీఎస్ఐఎస్‌లో సలహాదారు గ్రెగరీ సి.అలెన్



ఈనాడు - అమరావతి

ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.34 లక్షల కోట్లు) భారీ పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద వరమని, భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ డిజిటల్ హబ్‌గా మారేందుకు ఇది ఉత్ప్రేరకంగా ఉపయోగపడుతుందని అమెరికాకు చెందిన ఏఐ నిపుణుడు గ్రెగరీ సి.అలెన్ అన్నారు. డేటా సెంటర్ వల్ల పెద్దగా ఉద్యోగాలు రావన్న వాదన తప్పన్నారు. పలు అంతర్జాతీయ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కు క్యూ కట్టేందుకు గూగుల్ డేటా సెంటర్ చుక్కానిలా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్)లోని వాధ్వానీ ఏఐ సెంటర్‌లో గ్రెగరీ సీనియర్ సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. ఈ సంస్థ టెక్నాలజీ పాలసీలపై పరిశోధనలు నిర్వహిస్తోంది. ఏఐ పాలసీపై అమెరికా సహా పలు దేశాలకు సలహాలు ఇస్తోంది. ఇటీవల విశాఖలో పెట్టుబడిదారుల సదస్సులో ఏఐ రంగంపై మేధోమథనంలో పాల్గొనేందుకు వచ్చిన గ్రెగరీ 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

డేటా సెంటర్‌తో భారీగా ఉద్యోగాల కల్పన

ఏఐ రంగంలో ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పెట్టుబడి గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఏపీకి వస్తోంది. 15 బిలియన్ డాలర్లంటే ఆషామాషీ కాదు. బహుశా అది ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ అవుతుంది. దీనికి అవసరమైన విద్యుత్ కోసం ప్రభుత్వం పెద్ద సంఖ్యలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల్ని ప్రోత్సహిస్తుంది. డేటా సెంటర్‌కు సమీపంలో ఉండటానికి మిగతా ఐటీ కంపెనీలు తరలి వస్తాయి. నిర్మాణ, ఐటీ, విద్యుత్ రంగాలతోపాటు, ఏఐని వినియోగించే అన్ని పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పనకు ఇది దోహదం చేస్తుంది. తొలి దశలో డేటా సెంటర్, (మిగతా 2లో)

> దేశంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయనుండటం ఏపీ ప్రభుత్వం వేస్తున్న గొప్ప ముందడుగు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చాలా తక్కువ క్వాంటమ్ కంప్యూటర్లున్నాయి. అందరూ వాటిపైనే ఆధారపడుతున్నారు.






హిల్‌వ్యూ స్టేడియంలో కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, భక్తులు ● ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు బాబా చిత్రపటాన్ని బహూకరిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్. చిత్రంలో సీఎం చంద్రబాబు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ● విద్యార్థుల పరేడ్

సత్యసాయి.. స్ఫూర్తిప్రదాత

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్న మహత్తర సేవలు ప్రశంసనీయం. కుల, మత, ధనిక, పేద అన్న తేడా లేకుండా ప్రతిభ ఆధారంగా ఎంతోమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడం అభినందనీయం'' అని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు పునరుద్ధరణ, చెన్నైకి నిరంతరం తాగునీరు అందించడంలో సత్యసాయి సేవలు అమోఘమని కొనియాడారు. బాబా వారసత్వాన్ని మాటల్లోనే కాకుండా సేవలోనూ కొనసాగించాలని భక్తులకు పిలుపునిచ్చారు.

సకలజనుల సంక్షేమం కోరుకున్న బాబా: చంద్రబాబు



సరిగ్గా వందేళ్ల కిందట ఇదే రోజున పుట్టపర్తిలో సత్యసాయి బాబా ఒక లక్ష్యం కోసం అవతరించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పవిత్ర నేలపై 86 ఏళ్ల పాటు ఆదర్శ జీవన ప్రయాణాన్ని సాగించి సాయి సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించారన్నారు. ''జ్ఞానాన్ని బోధించి సన్మార్గంలో నడిపించారు. సమాజ సేవ, సమస్యకు పరిష్కారం, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తి మార్గంతో కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేశారు. చిత్రావతి నది ఒడ్డున పుట్టపర్తిని ఆధ్యాత్మికత, దైవత్వానికి నిలయంగా మార్చారు. 1960లో బాబా స్థాపించిన సత్యసాయి సంస్థలతో సేవలకు శ్రీకారం చుట్టారు. విశ్వశాంతి, సౌభాగ్యం, సకల జనుల సంక్షేమాన్ని కోరుకున్నారు. ఆయన మనోదర్శనంతో దేశ, విదేశాల నుంచి సంపన్నులు, ప్రముఖులు వచ్చి సేవామార్గాన్ని అనుసరించారు. బాబా లేకపోయినా.. ఆయన నింపిన స్ఫూర్తి ఉంది. ప్రశాంతి నిలయం నిర్మించి నేటికి 75 ఏళ్లు. ప్రజల దాహార్తి తీర్చడానికి రూ.550 కోట్లతో ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో 1,600 గ్రామాల్లో 30 లక్షల మందికిపైగా తాగునీరు అందిస్తున్నారు. చెన్నైకి తాగునీటి సరఫరా కోసం రూ.250 కోట్లు ఖర్చు పెట్టారు. ఆయన సేవలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలు నిర్వహిస్తోంది. 'వసుధైవ కుటుంబకం' భారతీయుల మూలం. సత్యసాయి బోధనల ద్వారా దాన్ని నిలబెట్టుకుందాం'' అని పిలుపునిచ్చారు.

ప్రేమతో ప్రజల మనసులు గెలిచిన సత్యసాయి: రేవంత్‌రెడ్డి



సత్యసాయి ప్రేమతో ప్రజల మనసు గెలిచారని, ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందన్న బాబా సందేశం యుగయుగాలపాటు ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు కూడా చేయలేని పనిని బాబా ట్రస్టు చేపట్టి లక్షల మంది మన్ననలు అందుకుందని చెప్పారు. ''బాబా భౌతికంగా లేకపోయినా.. ఆయన భావన, ఆలోచనలు, సేవా స్ఫూర్తి శతజయంతి ఉత్సవాల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా చదువుకుంటే.. జీవితంలో రాణిస్తారు అని భావించి ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించి లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపారు. చివరి దశలో ఉన్నవారిని, మరణం తప్ప ప్రత్యామ్నాయం లేదు అన్న సమయంలో ఉన్న లక్షల మందికి వైద్యం అందించి బాబా బతికించారు. ఈ కారణంగానే ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. పాలమూరు లాంటి వలసలు అధికంగా ఉండే జిల్లాలు, కరవు, కాటకాలతో కునారిల్లుతున్న అనంతపురం లాంటి ప్రాంతాలకు ప్రభుత్వాలే తాగునీటి సౌకర్యం సమకూర్చలేని స్థితిలో.. బాబా ట్రస్టు ద్వారా ప్రజల దాహార్తి తీర్చారు. ఏపీ, తెలంగాణ మాత్రమే కాకుండా తమిళనాడు రాష్ట్రంలోనూ సేవలు విస్తరించి అందరి హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించారు. ఎవరూ పిలవకపోయినా.. స్వయంగా ఇక్కడికి రావాలి.. ఇది జన్మకు ఒక్క అవకాశమని భావించి వేల మంది భక్తులు ఇక్కడికి వచ్చారు. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రుల నుంచి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల వరకు, ప్రపంచంలోని ప్రముఖులు రావడం ఈ భూమి పవిత్రతను తెలియజేస్తోంది. బాబా శతజయంతి ఉత్సవాలను ఆంధ్రప్రదేశ్ మాదిరి తెలంగాణలోనూ అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చాం. తెలంగాణలో బాబా సేవలను విస్తృతం చేయడానికి, ఆయన ఆలోచనలు, విధానాన్ని ప్రజలకు చేరవేయడానికి ప్రభుత్వం సహకరిస్తుంది. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుంది'' అని వివరించారు.

విలువల వికాసానికి బాబా కృషి అమోఘం: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



మానవ విలువల వికాసానికి సత్యసాయి చేసిన సేవలు అపూర్వమని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ''1950లో స్థాపించిన ట్రస్టు మానవత్వం, దైవత్వం మధ్య నున్న దూరాన్ని తగ్గించేందుకు బాబా తీసుకున్న దైవసంకల్పం. పుట్టపర్తిలో నాడు గ్రామస్థుల కోసం ప్రారంభించిన చిన్న ఆసుపత్రిలో నేడు ఉచితంగా ప్రపంచస్థాయి సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందించే స్థాయికి ఎదగడం ఆయన దివ్యకార్యానికి సాక్ష్యం. సేవ ద్వారా ప్రతి వ్యక్తిలోని దైవత్వాన్ని వెలికితీయాలన్న బాబా సంకల్పం నేటికీ కొనసాగుతోంది. ఆయన చూపిన సేవామార్గాన్ని అందరం అనుసరిద్దాం'' అని పిలుపునిచ్చారు.



వేదికపై తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి మాటామంతి

మంచి చేస్తే దానంతటదే ప్రకాశిస్తుంది: రత్నాకర్



బాబా మహోన్నత కార్యాలు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని, మంచి చేస్తే దానంతటదే ప్రపంచానికి తెలుస్తుందని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. శతజయంతి ఉత్సవాల్లో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బాబా ఆయనకు వ్యక్తిగతంగా బోధించిన అనేక విషయాలను స్మరించుకున్నారు. 'సూర్యుడు ఉదయించినప్పుడు వెలుగు ఉందని ప్రపంచానికి చెప్పాల్సిన పని లేదని, మంచి పనిచేస్తే అది తనంతట తానే ప్రకాశిస్తుంది' అని బాబా చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. గంగానదిలో స్నానం చేయడం వల్ల నదిని పవిత్రం చేయడం లేదని, మనల్ని మనం పునీతుల్ని చేసుకుంటున్నామని.. అలాగే గంగానదిలా సత్యసాయి సేవా సంస్థలు ఎప్పటికీ నిలిచే ఉంటాయని బాబా చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ నమ్మకంతోనే విశ్వాసం, అంకితభావం కలిగిన 7.50 లక్షల మంది సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ అమిత్ ఖరె, సినీనటుడు సాయికుమార్, ఏపీ మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవిత, కందుల దుర్గేష్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, ఎం.ఎస్.రాజు, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, గీతారెడ్డి, మాజీ డీజీపీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ

శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ రాష్ట్రానికి చెందిన మంత్రి శేఖర్ బాబు ద్వారా లేఖ పంపారు. దాన్ని సభలో చదివి వినిపించారు. చెన్నైకి తాగునీటిని సరఫరా చేయడంలో ట్రస్టు చేసిన సాయం మరువలేనిదని సీఎం పేర్కొన్నారు. ట్రస్టు సేవలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని కోరారు.



సత్యసాయి గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు (ఎడమ నుంచి రెండో వ్యక్తి) సునీల్ గావస్కర్, పక్కన ఆధ్యాత్మిక గురువు ప్రశాంత్ గురూజీ, ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ మధుపండిట్ దాస్, ఫిజీ దేశాధ్యక్షుడు లాలాబాలావు తదితరులు

కన్నడనాట మారుమోగిన సత్యసాయి నామస్మరణ

బెంగళూరు(యలహంక), న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం యలహంక సమీప ముద్దెనహళ్లిలోని సత్యసాయి గ్రామంలో శ్రీసత్య సాయిబాబా జయంతి సందర్భంగా ఆదివారం జరిగిన 'వన్ వరల్డ్.. వన్ ఫ్యామిలీ మిషన్' వేడుకల్లో సత్యసాయి నామస్మరణ మారుమోగింది. సద్గురు మధుసూదన్‌సాయి నేతృత్వంలో వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ వరల్డ్ కల్చరల్ ఫెస్టివల్-2025ను ఈ ఏడాది ఆగస్టు 16 నుంచి ఆదివారం (ఈ నెల 23) వరకు వంద రోజులపాటు నిర్వహించారు. వంద దేశాలను ఒకే వేదికపైకి తెచ్చి కళలు, సంగీతం, నృత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు, సేవా కార్యక్రమాలతో భగవాన్ శ్రీసత్య సాయిబాబాకు ఘననివాళి అర్పించారు. శతజయంతి వేడుకల్లో భాగంగా 60 దేశాల నుంచి వచ్చిన 450 మంది సంగీత విద్వాంసులు, సత్యసాయి లోకాసేవా గురుకుల పాఠశాలకు చెందిన రెండు వందల మంది విద్యార్థులు సాయికృష్ణన్ క్రికెట్ స్టేడియంలో అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఈ వేడుకల్లో ఫిజీ దేశ అధ్యక్షుడు లాలాబాలావు, ప్రముఖ మాజీ క్రికెటర్లు సునీల్ గావస్కర్, అరవింద డిసిల్వా తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న వివిధ దేశాలకు చెందిన సంగీత కళాకారుల ప్రదర్శన

అమెరికా వీసా రద్దుతో వైద్యురాలి బలవన్మరణం



కాకు రోహిణి

గుంటూరు (నెహ్రూనగర్), న్యూస్‌టుడే: అమెరికా వీసా రద్దు కావడంతో ఓ వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్న ఉదంతమిది. గుంటూరుకు చెందిన కాకు రోహిణి(38) కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ చేసి మూడేళ్ల కిందట హెచ్1బీ వీసాపై అమెరికా వెళ్లారు. అక్కడ ఓ ప్రముఖ ఆసుపత్రిలో ఉద్యోగానికి ప్రయత్నించే క్రమంలో అందుకు సంబంధించిన మూడు దశల పరీక్షల్లో మంచి మార్కులు సాధించారు. అబ్జర్వర్‌షిప్ మూడు సార్లు చేశారు. రెసిడెన్సీ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. కుటుంబసభ్యులను చూసేందుకని గత మేలో భారత్‌కు వచ్చారు. ఇంతలో అమెరికా వీసాల జారీలో నిబంధనలు కఠినతరం చేశారు. రోహిణి హెచ్1బీ వీసాను జే1 వీసాగా అప్‌గ్రేడ్ చేసుకోవడానికి దరఖాస్తు చేస్తే తిరస్కరించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈ నెల 22న హైదరాబాద్‌లోని నివాసంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నారు. రోహిణి మృతదేహం ఆదివారం గుంటూరులోని నివాసానికి చేరుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తన బిడ్డ ఎంతో ధైర్యవంతురాలని, తమను ఎంతో ప్రేమగా చూసుకునేదని, అందరికీ సహాయం చేయాలని తపన పడేదని రోహిణి తల్లి డాక్టర్ లక్ష్మీరాజ్యం కన్నీటి పర్యంతమయ్యారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కఠిన నిర్ణయాలతో మనస్తాపం చెందిన తన సోదరి బలవన్మరణానికి ఒడిగట్టిందని విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్న సుజన్‌బాబు వాపోయారు. రోహిణి అంత్యక్రియలు ఆదివారం పూర్తయ్యాయి.

నేడు 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనాల్లో పని చేసిన జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దు, బిహార్ ఓటర్ల జాబితా సవరణ, పెగాసస్ కేసు సహా పలు కీలక తీర్పుల్లో ఆయన భాగం పంచుకున్నారు.

ప్రమాణ స్వీకారానికి విదేశీ ప్రతినిధులు: సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ కార్యక్రమానికి నేపాల్, భూటాన్, శ్రీలంక, మారిషస్, కెన్యా, మలేసియాల నుంచి దాదాపు 15 మంది విదేశీ ప్రతినిధుల బృందాలు, వారి కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. ఇలా ఓ సీజేఐ ప్రమాణస్వీకారానికి విదేశీ ప్రతినిధి బృందం రావడం ఇదే తొలిసారి.

'చండీగఢ్ బిల్లు'పై రగడ

(మొదటి పేజీ తరువాయి)

అధికారం లభిస్తుంది. ఈ బిల్లుపై పంజాబ్‌లో తీవ్ర నిరసన వెల్లువెత్తడంతో కేంద్ర ప్రభుత్వం ఆదివారం వివరణ ఇచ్చింది. బిల్లును పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే తీసుకొచ్చే ఉద్దేశం లేదని కేంద్ర హోంశాఖ పేర్కొంది. 'చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంత ప్రయోజనాలను గమనంలోకి తీసుకుని భాగస్వాములందరితో సంపూర్ణంగా చర్చించాకే సరైన నిర్ణయం తీసుకుంటాం. ఈ విషయంలో ఆందోళన అవసరం లేదు. రానున్న శీతాకాల సమావేశాల్లోనే బిల్లును తేవాలన్న ఆత్రుత కేంద్ర ప్రభుత్వానికి లేదు' అని వెల్లడించింది. ఈ బిల్లు లక్ష్యం.. చండీగఢ్, పంజాబ్, హరియాణాల మధ్య ఉన్న సహజ సంబంధాలను మార్చడం కాదని స్పష్టంచేసింది. 'చండీగఢ్ కోసం కేంద్ర ప్రభుత్వం చట్టాలు చేసే ప్రక్రియను సరళీకరించడానికి ఉద్దేశించే ఈ ప్రతిపాదన చేశాం. అయితే అది పరిశీలన దశలోనే ఉంది. దీనిపై తుది నిర్ణయం తీసుకోలేదు' అని కేంద్ర హోంశాఖ అధికార ప్రతినిధి తెలిపారు. చండీగఢ్ పాలననుగానీ, పరిపాలనా వ్యవస్థనుగానీ మార్చేందుకు ఈ ప్రతిపాదన చేయలేదని వివరించారు.

పార్టీల వ్యతిరేకత: చండీగఢ్ బిల్లుపై పంజాబ్‌లోని పార్టీలు భగ్గుమన్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ మండిపడ్డాయి. పంజాబ్ నుంచి చండీగఢ్‌ను లాక్కోవాలని కేంద్రం చూస్తోందని ఆరోపించాయి.

● పంజాబ్ గుర్తింపు, రాజ్యాంగ హక్కులపై ఇది నేరుగా దాడి చేయడమేనని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అభిప్రాయపడ్డారు. సమాఖ్య నిర్మాణాన్ని దెబ్బతీసే ఇటువంటి ధోరణి.. పంజాబీలను అణగదొక్కడంతోపాటు వారి హక్కులు ప్రమాదంలో పడటానికి దారితీస్తాయని స్పష్టం చేశారు.

● ఈ బిల్లుతో చండీగఢ్‌పై పంజాబ్ హక్కులు కోల్పోతుందని శిరోమణి అకాలీదళ్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. దీనిపై చర్చించడానికి సోమవారం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.

● ఇది సమాఖ్య వ్యవస్థను బలహీనపరిచే దాడి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 240కి సవరణలు చేసే తాజా చర్య.. పంజాబ్, హరియాణాల గుర్తింపుపై దాడి చేయడమేనని అభిప్రాయపడ్డారు.

బయో డీజిల్ కేంద్రంలో ఎగిసిన మంటలు

(మొదటి పేజీ తరువాయి)

డ్రమ్ముల్లో బయో డీజిల్ నిల్వ చేస్తున్నాడు. వీటిని తన లారీలకు వినియోగించేవాడు. ఆదివారం వేకువజామున కోదాడ నుంచి ట్యాంకరు రాగా, సుమారు 3 వేల లీటర్ల డీజిల్‌ను ఇక్కడి డ్రమ్ముల్లో నింపారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక డీజిల్ అన్‌లోడ్ చేసే పైపులకు ఏర్పాటు చేసిన మోటర్ స్విచ్ ఆపేందుకు శివయ్య మేనల్లుడు షేక్ రషీద్ (24) ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు రేగి అతడు కాలిపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రషీద్‌కు ఏడాది క్రితమే వివాహం కాగా.. నెలల బాబు ఉన్నాడు. ప్రమాదంలో అక్కడ పనిచేసే మరో వ్యక్తి గాయాలపాలవడంతో ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారిపై నాలుగేళ్లుగా ఈ దుకాణాన్ని అక్రమంగా నిర్వహిస్తున్నా అధికారులు గుర్తించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

గూగుల్ వచ్చాక.. ఐటీ కంపెనీలు క్యూ కడతాయి

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ కార్యకలాపాల వల్లే వేల మందికి ఉపాధి లభిస్తుంది.

అంతర్జాతీయ కంపెనీలకు బలమైన సంకేతం

గూగుల్ వంటి సంస్థ తమ డేటా సెంటర్ ఏర్పాటుకు దేశం మొత్తం గాలించి చివరకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుందంటేనే ఈ ప్రాంతం అన్నివిధాలా అనుకూలమని అంతర్జాతీయ కంపెనీలకు బలమైన సంకేతం వెళ్లినట్టు. ఆ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఇక్కడికి వస్తాయి. గూగుల్ మొదట డేటా సెంటర్‌గానే ప్రారంభమవుతుంది. భవిష్యత్తులో అదనపు సేవలు, విస్తరణలతో ఒక సమీకృత ఏఐ హబ్‌గా అభివృద్ధి చెందుతుంది.

క్వాంటమ్ కంప్యూటర్ కోసం అమరావతి రావాల్సిందే!

అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటయ్యాక దేశంలోని టాప్ యూనివర్సిటీల్లో చదువుకున్న గ్రాడ్యుయేట్లు అక్కడికి క్యూ కడతారు. క్వాంటమ్ ఆధారిత పరిశోధనలు, అప్లికేషన్లు, సిస్టమ్స్ రూపొందించే కంపెనీలూ అక్కడికి తరలి వస్తాయి.

భవిష్యత్తులో ప్రతి రంగంలోనూ ఏఐ

రాబోయే రోజుల్లో ప్రతి పరిశ్రమా, ప్రతి ఆర్థిక కార్యకలాపం ఎంతో కొంత మేర ఏఐతోనే ముడిపడి ఉంటాయి. ఇప్పటికే ఏఐ చాలా రంగాలపై ప్రభావం చూపుతోంది. కొందరు ఏఐ అంటే చాట్ జీపీటీ వంటి చాట్‌బాట్‌లే అనుకుంటున్నారు. ఏఐతో విస్తృత ప్రయోజనాలున్నాయి. వాతావరణ అంచనాలు, వైద్య పరీక్షల విశ్లేషణ వంటి అంశాలకు సంబంధించి చాలా ఏఐ అప్లికేషన్లు వచ్చాయి. భారత్‌లో ఏఐని విస్తృతంగా వినియోగించుకోదగ్గ రంగాల్లో వ్యవసాయం ఒకటి. వివిధ అంశాలపై రైతులకు సలహాలిచ్చేందుకు చాలా సంస్థలు చాట్‌బాట్‌లు సిద్ధం చేస్తున్నాయి. రైతులు సమాచారం కోసం ఆన్‌లైన్‌లో వెతకడం, ఇతరుల్ని అడగడం వంటివేమీ లేకుండా ఈ చాట్‌బాట్ల ద్వారా సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. సలహాలూ పొందొచ్చు.

ఏఐతో ఉద్యోగాలు పోవు.. కొత్తవి వస్తాయి

ట్రాక్టర్ అందుబాటులోకి వచ్చిన కొత్తలో కొంత మంది వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి ఉండొచ్చు. కానీ ట్రాక్టర్ వల్ల వ్యవసాయంలో ఉత్పాదకత, ఆదాయం బాగా పెరిగాయి. ఆదాయం పెరగడం మరిన్ని ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తుంది. ఏఐకీ అదే వర్తిస్తుంది. స్వల్పకాలంలో ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలకు ఇబ్బంది ఏర్పడవచ్చు. కరెంటు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు కొత్త ఉద్యోగాల కల్పనకు ఎలా దోహదం చేశాయో.. ఏఐ కూడా భవిష్యత్తులో అదే చేస్తుంది.

విప్లవాత్మక మార్పులొస్తాయి

ఏఐ వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తుంది. కరెంట్ కనిపెట్టిన కొత్తలో మొదట బల్బ్ వెలిగించడానికే వాడారు. ఇప్పుడు కరెంట్ లేకుండా ఏ పనీ జరగదు. ఏఐ కూడా అంతే. రాబోయే రోజుల్లో ఏఐ లెక్కలేనన్ని ఆవిష్కరణలకు మార్గాలు ఏర్పరుస్తుంది. ప్రపంచస్థాయి డాక్టర్, ఇంజినీర్ నుంచి మీకు కావలసిన సమాచారాన్ని ఏఐ ద్వారా కేవలం నెలకు రూ.10 ఖర్చుతో తెలుసుకోవచ్చు. కొన్నిసార్లు ఉచితంగానూ దొరుకుతుంది. ఏఐ అప్లికేషన్స్‌తో చాలా అంశాలు చౌకగా, ఎక్కువ మందికి అందుబాటులోకి వస్తాయి. చాట్ జీపీటీని 2022 నవంబరులో లాంచ్ చేశారు. ఇప్పుడు వారానికి 80 కోట్ల మంది దీన్ని ఉపయోగిస్తున్నారు. ప్రపంచ చరిత్రలో అత్యంత వేగంగా ఎడాప్ట్ చేసుకున్న టెక్నాలజీ ఇది.

సొంతిల్లు @ 3.47 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

మంజూరు చేస్తుంది. సొంత స్థలమున్న, స్థలం లేని వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

పక్కాగా లబ్ధిదారుల ఎంపిక: ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా జరిగేలా కేంద్ర ప్రభుత్వం ఆవాస్+ అనే ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. రాష్ట్రంలో అర్హులను గుర్తించే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, గృహనిర్మాణశాఖ ఏఈలకు ప్రభుత్వం అప్పగించింది. వీరు ఇంటింటికీ వెళ్లి అర్హుల్ని గుర్తించాలి. దరఖాస్తుదారు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇల్లు, లొకేషన్ ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. కొత్తగా ఎక్కడ ఇంటి నిర్మాణం చేపడతారో ఆ స్థలాన్నీ ఫొటో తీస్తారు. దరఖాస్తుదారు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ముఖ గుర్తింపును యాప్ క్యాప్చర్ చేసిన వెంటనే ఆధార్ కార్డు ఆటోమేటిక్‌గా డిస్‌ప్లే అవుతుంది. జాబ్ కార్డు వివరాలు తీసుకుంటారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికం..: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా తొలిస్థానంలో ఉంది. అత్యల్పంగా విశాఖ జిల్లా నుంచి దరఖాస్తులొచ్చాయి.

జిల్లాల వారీగా

జిల్లా	దరఖాస్తుదారులు
అల్లూరి సీతారామరాజు	61,343
శ్రీసత్యసాయి	24,877
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	21,064
పల్నాడు	20,330
శ్రీకాకుళం	19,870
పార్వతీపురం మన్యం	18,588
అన్నమయ్య	18,176
చిత్తూరు	15,979
అనంతపురం	15,101
ఏలూరు	13,416
ప్రకాశం	11,752
నంద్యాల	11,421
తిరుపతి	11,209
డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	10,585
విజయనగరం	10,479
తూర్పుగోదావరి	9,966
ఎన్టీఆర్	9,147
కర్నూలు	8,468
కాకినాడ	7,122
అనకాపల్లి	7,126
బాపట్ల	6,596
గుంటూరు	4,485
వైఎస్సార్ కడప	4,252
కృష్ణా	4,160
పశ్చిమగోదావరి	1,975
విశాఖపట్నం	509

లైసెన్సు ఉంటేనే ఇక ప్రచారం!

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు సంబంధించిన విధానాలను రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం కోసం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రతిపాదిస్తోంది. ● నగరాలు, పట్టణాల్లో ఒక పద్ధతి, విధానం లేకుండా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలపై హైకోర్టు ఇటీవల అభ్యంతరం తెలిపింది. అక్రమంగా పెట్టిన వాటిపై తీసుకున్న చర్యలను తెలియజేయాలని ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ చర్యలు చేపట్టింది. ● జీఎస్టీ అమలులోకి వచ్చాక హోర్డింగులపై ప్రకటనల పన్ను వసూళ్లు పలు చోట్ల నిలిచిపోయాయి. జీఎస్టీ చెల్లించాక మళ్లీ స్థానిక సంస్థలు పన్ను వసూలు చేయడంపై అభ్యంతరం తెలుపుతూ హోర్డింగ్‌లు పెట్టే పలు ఏజెన్సీలు కోర్టుకు వెళ్లాయి. ● రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం తీసుకొచ్చే క్రమంలో పాలసీలో పలు సవరణలు తీసుకొస్తున్నారు. అడ్వర్టైజ్‌మెంట్ పన్ను స్థానంలో కొత్తగా 'డిస్‌ప్లే డివైజెస్ ఫీజు' అనే అంశాన్ని చేరుస్తున్నారు. దీని వల్ల జీఎస్టీ చెల్లిస్తున్నందున.. మళ్లీ పన్ను ఏంటన్న ప్రశ్న ఉత్పన్నం కాదని అధికారులు చెబుతున్నారు. ● పట్టణ స్థానిక సంస్థల నుంచి ప్రైవేట్ యాడ్ ఏజెన్సీలు విధిగా లైసెన్సులు తీసుకోవాలి. మూడేళ్లకోసారి లైసెన్సు పునరుద్ధరించుకోవాలి. లైసెన్సు ఉన్న ఏజెన్సీల ఆధ్వర్యంలోనే హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు పెట్టుకునేందుకు అనుమతి ఉంటుంది. వీటి పొడవు, వెడల్పు ఆధారంగా వసూలు చేస్తున్న ఫీజులూ పెరగనున్నాయి. ● దీంతో రాష్ట్రవ్యాప్తంగా హోర్డింగులపై ఇప్పుడు ఏటా వస్తున్న రూ.100-150 కోట్ల ఆదాయం రూ.200 కోట్లకు పైగా పెరుగుతుందని అంచనా. వ్యక్తిగతంగా హోర్డింగులు, ఫ్లెక్సీలు పెట్టాలనుకునే వారికి కూడా పట్టణ స్థానిక సంస్థలు నిర్దేశించిన ఫీజులు వసూలు చేసి తాత్కాలిక అనుమతులు ఇస్తాయి. ● అనుమతులు తీసుకోకుండా పెట్టే హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. హోర్డింగుల ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగినా, ప్రమాదకరమైన ప్రాంతాల్లో పెట్టినా అలాంటి వాటిని గుర్తించి తొలగిస్తారు. నిరభ్యంతర ప్రాంతాల్లోనే వాటి ఏర్పాటుకు అనుమతిస్తారు.

నేడు బంగాళాఖాతంలో వాయుగుండం

విశాఖపట్నం(ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: దక్షిణ అండమాన్ సముద్రంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న దక్షిణ అండమాన్ సముద్రంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత 48 గంటల్లో తుపానుగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం నాటికి నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక ప్రాంతాల్లో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

గ్రహం అనుగ్రహం

24-11-2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం

చవితి: సా.5-55 తదుపరి పంచమి; **పూర్వాషాఢ:** రా.7-36 తదుపరి ఉత్తరాషాఢ **వర్జ్యం:** తె.4-04 నుంచి 5-45 వరకు; **అమృత ఘడియలు:** మ.2-26 నుంచి 4-09 వరకు; **దుర్ముహూర్తం:** మ.12-08 నుంచి 12-53 వరకు తిరిగి 2-22 నుంచి 3-06 వరకు; **రాహుకాలం:** ఉ.7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.6.13; **సూర్యాస్తమయం:** సా.5.20

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	19.4	30.2
విజయనగరం	20.0	30.0
కడప	22.0	28.0
అనంతపురం	22.0	30.5
శ్రీకాకుళం	22.0	31.0
రాజమహేంద్రవరం	22.0	35.0
కర్నూలు	22.8	33.5
నరసాపురం	23.0	33.6
తిరుపతి	23.1	30.3
విశాఖపట్నం	23.6	30.8
విజయవాడ	23.6	32.0
గుంటూరు	25.0	31.0
ఒంగోలు	25.0	32.1
నెల్లూరు	25.2	31.6
తాడేపల్లిగూడెం	27.0	30.0

ఊబకాయానికి భయపడొద్దు

- జీవనశైలి మార్పుతో సత్ఫలితాలు సాధ్యమే
- అవసరమైతే ఆధునిక చికిత్సలూ ఉన్నాయి

'ఈనాడు వెబినార్'లో నిపుణుల సూచనలు

మారిన జీవనశైలి పరిస్థితులు, ఇతర కారణాలతో చాలామంది ఊబకాయం బారిన పడుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నవారే. అయితే ఒబెసిటీ గురించి అవగాహన పెంచుకుని, నిపుణుల సూచనలను పాటిస్తే దీనిని తగ్గించుకోవటం సాధ్యమేనని ప్రముఖ వైద్య నిపుణులు డా.పి.వి.రావు, డా.రాకేశ్ కలపాల, పోషకాహార నిపుణురాలు డా.లతాశశి, యోగా గురు శిరీషలు వివరించారు. ఆదివారం నిర్వహించిన 'ఈనాడు' ప్రత్యేక ఉచిత వెబినార్‌లో పాల్గొని వీరు విలువైన సలహాలు అందించారు.



'ఈనాడు వెబినార్'లో మాట్లాడుతున్న డాక్టర్ పి.వి.రావు, శిరీష, డా.లతాశశి, డా.రాకేశ్ కలపాల

జీవనశైలిలో మార్పుతోనే అదుపులో బరువు

బరువు పెరగడమనేది 'మెటబాలిక్ సిండ్రోమ్'లో ఒక భాగం. బీఎంఐ 23 దాటితే ఊబకాయం బారిన పడుతున్నట్లు భావించాలి. 20 ఏళ్లు దాటినవారిలో కొలెస్ట్రాల్ 200 కన్నా ఎక్కువ ఉండటం, ట్రైగ్లిజరైడ్లు 150 కన్నా అధికంగా ఉండటం ప్రమాదకరం. బీఎంఐ 23 నుంచి 25 మధ్యలో ఉంటే ప్రీ-క్లినికల్ ఒబెసిటీ. దాన్నే అధిక బరువు అంటారు. ఈ సూచీ 25 దాటితే ఊబకాయం వచ్చినట్లే. తల్లిదండ్రుల్లో స్థూలకాయం ఉంటే వారి పిల్లల్లో 25 శాతం మందికి వస్తోంది. 70 శాతం మంది బరువు పెరగడానికి కారణాలు.. మానసిక ఒత్తిళ్లు, నిద్రలేమి, కాలుష్యం వంటివే! చాలా మంది మధుమేహం నియంత్రణకు వాడే మందులనే బరువు తగ్గడానికీ వాడుతున్నారు. అయితే జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా బరువు తగ్గొచ్చు. మరీ పెద్దవాళ్లు (65-70 ఏళ్ల వయసువారు) ఈ మందులు వేసుకోవడం మంచిది కాదు.

– డా. పీవీ రావు, ఎండోక్రైనాలజీ, మెటబాలిజమ్ నిపుణులు, డైరెక్టర్, హైదరాబాద్ డయాబెటిస్ రీసెర్చ్ సెంటర్

మితమే.. హితం!

ప్రధానంగా ఏ ఆహారమైనా రోజువారీ అవసరాలకు మించి తీసుకోవడం, ఎక్కువ క్యాలరీలు తీసుకుంటూ తక్కువ వ్యాయామాలు చేయడం ఊబకాయానికి దారితీస్తాయి. ప్రతి ఒక్కరూ తమ వయసు, శారీరక అవసరాలు, చేసే వ్యాయామాల్ని బట్టి రోజుకు ఎన్ని క్యాలరీలు తీసుకోవాలో నిర్ధారించుకోవాలి. ఆహారంలో కార్బోహైడ్రేట్లు 50-60, ప్రొటీన్లు 12-15, కొవ్వులు 15-25 శాతం చొప్పున ఉండేలా జాగ్రత్తపడాలి. ఊబకాయాన్ని దూరం చేసుకోవాలనుకునే వారు పిండి పదార్థాలను సంక్లిష్ట కార్బోహైడ్రేట్ల రూపంలో తీసుకోవాలి. కొన్ని రకాల నూనెలే అధిక బరువుకు కారణమవుతాయనుకుంటారు. ఇది అపోహే. ఏ నూనె అయినా రోజువారీ అవసరాలకు అనుగుణంగా, మోతాదుకు మించకుండా తీసుకోవడం ఆరోగ్యకరం.

– డాక్టర్ లతాశశి, పోషకాహార నిపుణురాలు

'రూల్ ఆఫ్ 10' పాటిస్తూ తగ్గాలి

ఊబకాయం నియంత్రణకు బేరియాట్రిక్ సర్జరీ, బేరియాట్రిక్ ఎండోస్కోపీ వంటి అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. స్థూలకాయం నివారణకు తొలుత జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి, పోషకాహారం తీసుకోవాలి. అప్పటికీ అదుపులోకి రాకపోతే వైద్యుల సూచనలతో ఔషధాలు తీసుకోవాలి. అదీ కాకపోతే బేరియాట్రిక్ ఎండోస్కోపీ.. దాంతోనూ ఫలితం కనిపించకపోతే వైద్యుల సూచనతో బేరియాట్రిక్ సర్జరీకి వెళ్లడం మంచిది. బీఎంఐ 30 నుంచి 40 ఉన్నవారు బేరియాట్రిక్ ఎండోస్కోపీ చేయించుకోవచ్చు. ఊబకాయం నియంత్రణకు 'రూల్ ఆఫ్ 10' ముఖ్యం. 10 శాతం చొప్పున బరువు తగ్గడమే ఈ విధానం సారాంశం. 90 కిలోల బరువు ఉంటే. . ముందు 9 కిలోలు తగ్గడం మీ లక్ష్యం కావాలి.

– డా. రాకేశ్ కలపాల, సీనియర్ కన్సల్టెంట్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఏఐజీ

'యోగా'.. దశల వారీగా!

అధిక బరువు, ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి ధ్యానం, ఆసనాలు, ప్రాణాయామం అక్కరకు వస్తాయి. కొత్తగా యోగా అలవాటు చేసుకునే వారు చిన్న ఆసనాలతో మొదలుపెట్టాలి. ఒత్తిడిని దూరం చేసే శ్వాస పద్ధతుల్ని సాధన చేస్తూ.. ఒక క్రమ పద్ధతిలో యోగా చేయాలి. ఊబకాయంతో బాధపడే వారికి అష్టాంగ యోగా కూడా ఎంతగానో మేలు చేస్తుంది. వ్యక్తిగత శారీరక అవసరాలు, ఆరోగ్య సమస్యల్ని బట్టి నిపుణుల సలహాతో యోగాసనాల్ని ఎంచుకోవాలి. ఊబకాయుల్లో అధిక బరువు కారణంగా మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పి వేధిస్తుంటాయి. ఇలాంటప్పుడు గోడ, కుర్చీ.. మొదలైన వాటి ఆసరాతో ఆసనాలు వేయడం, సేతుబంధాసనం వంటివి సాధన చేయడం మంచిది.

– బి. శిరీష, యోగా నిపుణురాలు

పూర్తి కథనం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సూర్యకళ.. అవినీతి లీల!

- వివిధ హోదాల్లో అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు

ఈనాడు, విజయనగరం, విశాఖపట్నం: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ఏపీ వైద్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఐడీసీ) జీఎం ఎంవీ సూర్యకళపై ఆది నుంచి అవినీతి ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వంలో ఆమె విశాఖ, విజయనగరం జిల్లాల్లో కీలక పోస్టుల్లో పనిచేశారు. ఆ రెండు చోట్లా భారీగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగాలున్నాయి. ఆమెపై వచ్చిన ఫిర్యాదుల మేరకు హైదరాబాద్, విశాఖ, విజయవాడ, విజయనగరం జిల్లాల్లో అవినీతి నిరోధకశాఖ (అనిశా) రెండు రోజుల కిందట సోదాలు జరిపింది. తనిఖీల్లో రూ.కోట్లలో విలువ చేసే 27 స్థిరాస్తులు బయటపడ్డాయి.

వైకాపా పెద్దలకు కొమ్ముకాసి: 2022 ఆగస్టు నుంచి 2024 సెప్టెంబరు వరకు విజయనగరం ఆర్డీవోగా సూర్యకళ పనిచేశారు. భోగాపురం విమానాశ్రయం, రైల్వే మూడో లైను, విశాఖపట్నం-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి భూసేకరణ చేపట్టారు. ఈ సమయంలో వైకాపా కీలక నేతలకు అనుకూలంగా వ్యవహరించి అక్రమంగా సంపాదించారనే ఆరోపణలు వచ్చాయి. నాటి పెద్దల అండతో ఎసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేయించడం, కొన్ని వారికి దక్కేలా చేయడంలో కీలకంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి.

★ ఎన్నికల ముందు ఆమెను శ్రీకాకుళం ఆర్డీవోగా అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. ఉన్నత స్థాయిలో చక్రం తిప్పి ఆ బదిలీని నిలిపేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నించినా బదిలీ తప్పలేదు. తర్వాత ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. సుమారు 2 నెలల నిరీక్షణ తర్వాత ఓ సీనియర్ ఐఏఎస్ ఆశీస్సులతో ఏపీఎంఐడీసీ జీఎం పోస్టును దక్కించుకున్నారు. అయినా విజయనగరం ఆర్డీవోగా వచ్చేందుకు ఇటీవల తీవ్ర ప్రయత్నాలు చేశారు.

★ సూర్యకళ సింహాచలం ఈవోగా 2021 మార్చి నుంచి 2022 ఆగస్టు వరకు పనిచేశారు. ఆ సమయంలో ఆమె తీరు తీవ్ర వివాదాస్పదమైంది. ఆలయ భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వడంలో వసూళ్లకు పాల్పడటంతో పాటు కొన్ని సెటిల్‌మెంట్లు చేసి బాగా సంపాదించారనే ఆరోపణలున్నాయి. కైలాసపురంలో ఓ భూవివాదానికి సంబంధించి లంచం అడిగారనే ఫిర్యాదు అప్పట్లో దేవాదాయ శాఖకు అందింది. దీనిపై విచారణ కూడా చేపట్టారు. కొందరిని బినామీలుగా పెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఈవోగా పనిచేసిన సమయంలో చందనోత్సవానికి ఓ సంస్థకు పూర్తి బాధ్యతలు అప్పగించడం వెనుక భారీగా అక్రమార్జనకు పాల్పడ్డారనే విమర్శలున్నాయి.

ప్రతి కార్యకర్తకూ అండగా.. జనసేన నాయకత్వం

ఎమ్మెల్సీ కె.నాగబాబు



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు. చిత్రంలో జనసేన నాయకులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: జనసేన పార్టీ ప్రతి కార్యకర్తకు గుండె ధైర్యంగా నిలబడిందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. ప్రమాదవశాత్తూ మృతి చెందిన జనసేన క్రియాశీల కార్యకర్తల కుటుంబాలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆదివారం ఆయన బీమా చెక్కులు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ప్రమాదాల్లో మృతిచెందిన 220 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.11 కోట్ల విలువైన బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ భుజాలపై జెండా మోసే ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉండాలని అధినేత పవన్ కల్యాణ్ ప్రవేశపెట్టిన ప్రమాద బీమా ద్వారా ఇప్పటి వరకు 1,400 మందికి పైగా కార్యకర్తల కుటుంబాలకు రూ.46.73 కోట్లు అందజేసినట్లు తెలిపారు.

నేడు ఏలూరు జిల్లాకు పవన్‌కల్యాణ్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం పర్యటించనున్నారు. సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామికి పూజలు చేసి, అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేయనున్నారు. గ్రామంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించనున్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఏర్పాట్లను పరిశీలించారు.

నెల్లూరు మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధం

నెల్లూరు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. కార్పొరేషన్‌ను కూటమి ప్రభుత్వం చేజిక్కించుకుంటుందన్న అభిప్రాయం బలంగా వినపడుతోంది. ఆదివారం నెల్లూరులోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో సుదీర్ఘంగా చర్చించారు. 40 మంది కార్పొరేటర్లు అవిశ్వాసానికి అనుకూలంగా సంతకాలు చేశారు. ఈ మేరకు అవిశ్వాస తీర్మానం నోటీసును సోమవారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లాకు కార్పొరేటర్లు అందించనున్నారు. నగర మేయర్‌తో కలిపి 54 మంది సభ్యులు ఉండగా.. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ రాజీనామా చేయడంతో ఒక స్థానం ఖాళీ ఏర్పడింది.

తెలుగు అకాడమీ రెండు చోట్లా కొనసాగుతుంది

ఛైర్మన్ శరత్‌చంద్ర వెల్లడి



తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ అధికారికంగా తిరుపతిలో, అనధికారికంగా విజయవాడలో కొనసాగుతుందని తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర వెల్లడించారు. తిరుపతిలోని అకాడమీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'తెలుగు అకాడమీ తిరుపతి కేంద్రంగా ఏర్పాటైంది. తిరుపతిలో ప్రాంతీయ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తోంది. పరిపాలనా సౌలభ్యం కోసం విజయవాడ నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తాం. విజయవాడలో శాశ్వత కార్యాలయం నిర్మాణానికి తీర్మానించాం. వైకాపా ప్రభుత్వంలో అకాడమీకి ఒక్క రూపాయి కూడా నిధులు వెచ్చించలేదు. ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు తెలుగీకరణతో పాటు పునఃముద్రణపై ఆలోచన చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు అకాడమీలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ తిరిగి ప్రారంభిస్తాం' అని శరత్‌చంద్ర వివరించారు.

తెలంగాణలో ఏపీకే ఫైల్స్ అలజడి!

ఒకేరోజు వందల వాట్సప్ గ్రూపులపై దాడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఏపీకే ఫైల్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు అలజడి సృష్టిస్తున్నారు. 'ఆధార్‌తోపాటు ఇతర నో యువర్ కస్టమర్ వివరాలు అప్‌డేట్ చేసుకోని కారణంగా ఈరోజు రాత్రి నుంచి మీ బ్యాంకు ఖాతా బ్లాక్ చేస్తున్నాం. వెంటనే కింద ఉన్న లింకును క్లిక్ చేసి వివరాలు అప్‌లోడ్ చేయండి' అని టీం ఎస్బీఐ పేరుతో ఆదివారం అనేక వాట్సప్ గ్రూపుల్లో సందేశాలు హోరెత్తాయి. ఎస్బీఐ ఖాతాలున్న చాలామంది బ్లాక్ అవుతుందన్న భయంతో లింకుపై క్లిక్ చేశారు. ఆ క్షణం నుంచే వారి ఫోన్లు నేరగాళ్ల అధీనంలోకి వెళ్లాయి. ఆ వెంటనే సదరు ఫోన్లో ఉన్న ఇతర వాట్సప్ గ్రూపుల్లోకి ఈ సందేశాన్ని పంపారు. ఇలా గొలుసుకట్టుగా వేలాది ఫోన్లకు వెళ్లాయి. ఇందులో రాష్ట్ర మంత్రిత్వశాఖల అధికారులు, మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసుకున్న గ్రూపులతోపాటు స్నేహితులు, విద్యార్థుల గ్రూపులు కూడా ఉన్నాయి. ఎస్బీఐ ఖాతా లేని వారు కూడా కొందరు ఈ లింకును క్లిక్ చేయడం గమనార్హం. ఫోన్లలోని సమాచారం సైబర్ నేరగాళ్ల చేరడంతో అనేకమంది భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కొందరి ఖాతాల్లో డబ్బులు ఖాళీ అయినట్లు తెలుస్తోంది. పలువురు స్థానిక పోలీసులతోపాటు 1930కి కూడా ఫిర్యాదు చేస్తున్నారు.

సంపద సృష్టి, పంపిణీకి ప్రధాని సమ ప్రాధాన్యం: ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

గోరంట్ల, న్యూస్‌టుడే: దేశ సంపద సృష్టి, పంపిణీ రెండింటికీ ప్రధాని నరేంద్రమోదీ సమ ప్రాధాన్యం ఇస్తున్నారని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో ఆదివారం జరిగిన బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన ఉపరాష్ట్రపతి గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో ఉన్న నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్, నార్కొటిక్స్)ను సందర్శించారు. శిక్షణ పొందుతున్న ఐఆర్ఎస్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో పరోక్ష పన్ను (జీఎస్టీ) వ్యవస్థను క్రమబద్ధీకరించడం ఒక మైలురాయిగా అభివర్ణించారు. ఉప రాష్ట్రపతి వెంట రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఉన్నారు. నాసిన్ డైరెక్టర్ జనరల్ డా.సుబ్రహ్మణ్యం, అదనపు డైరెక్టర్ జనరళ్లు ఉమాశంకర్, హారతి సక్సేనా, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న ఐఆర్ఎస్ అధికారులతో రాధాకృష్ణన్, లోకేశ్

ఈనాడు

సమష్టి కృషికి జీ20 పిలుపు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అస్తవ్యస్త విధానాలు, దుందుడుకు పోకడలు అంతర్జాతీయ వాణిజ్యవృద్ధికి అశనిపాతాలవుతున్నాయి. వసుధ నాలుగు చెరగులా నెత్తురు పారిస్తున్న సాయుధ ఘర్షణలు, యుద్ధాలు మానవతా దీపాన్ని కొండెక్కిస్తున్నాయి. వాతావరణ మార్పులు మానవాళి భవితవ్యాన్నే ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మొదటిసారి ఆఫ్రికా ఆతిథ్యమిచ్చిన జీ20 సదస్సు- ప్రపంచ ప్రగతికి ప్రతిబంధకాలవుతున్న సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించుకుందామని పిలుపిచ్చింది. అందరి కోసం ఒకరు.. ఒకరి కోసం అందరు అన్న ఐక్యతా స్ఫూర్తిని సుస్థిరపరుస్తూ పరస్పర సంఘీభావం, సమానత్వం, స్థిరత్వం ద్వారా సమ్మిళిత ప్రగతిని సాధించగలమని స్పష్టీకరించింది. ఇలా ఒకరికొకరుగా విశ్వమానవ కల్యాణానికి ప్రోదిచేసే సమష్టి కృషిని కాలదన్నుతున్న ట్రంప్- వాతావరణ మార్పులు బూటకమంటూ పారిస్ ఒప్పందం నుంచి ఇప్పటికే వైదొలిగారు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి రైతులను రాచి రంపాన పెడుతున్నారని ఆరోపిస్తూ జీ20 సభకు డుమ్మాకొట్టారు. జొహానెస్‌బర్గ్ తీర్మానంలో పర్యావరణ అంశాలుండటంపైనా గుర్రుమన్నారు. ట్రంప్ హుంకరింపులను తోసిరాజంటూ పారిస్ ఒప్పంద సమగ్ర అమలుకు జీ20 దేశాలు కట్టుబాటు చాటడం హర్షణీయం. వాతావరణ మార్పుల విపరిణామాలను ఎదుర్కొనేందుకు నిధుల ప్రవాహం పెరగాలన్న జీ20 ఆకాంక్ష వాస్తవరూపం దాల్చడం విశ్వశ్రేయానికి ప్రాణావసరం!

పరాయి దేశాల సమగ్రతను, సార్వభౌమత్వాన్ని తృణీకరించడం, విస్తరణ కాంక్షతో రావణకాష్ఠాలను రాజేయడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. జొహానెస్‌బర్గ్ జీ20 భేటీ సైతం అదే కీలకాంశాన్ని పునరుద్ఘాటించింది. కానీ, వినసొంపైన ఇలాంటి తీర్మానాలన్నీ మాటలకే పరిమితం అవుతుండటం విచారకరం! అభివృద్ధిలో దేశాల మధ్య అసమానతలు తొలగాలంటే ఏఐ వంటి ఆధునిక సాంకేతిక ఫలాలు అందరికీ చేరువ కావాలన్న జీ20 ఉద్ఘాటన అక్షర సత్యమే! అదే సమయంలో వ్యక్తులు సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వాటి దుర్వినియోగాన్ని కట్టడి చేయాల్సిందే. జీ20 సారథిగా గతంలో తాను ముందుకు తెచ్చిన ప్రధాన అంశాలను ఈసారి తీర్మానంలోనూ ప్రతిఫలింపజేయడంలో ఇండియా కృతకృత్యం కావడం... గమనార్హమైన మరో విశేషం. వాటిలోని భద్రతా మండలి సంస్కరణ డిమాండు ప్రతిసారీ ప్రతిపాదనకు పరిమితమవుతుండటమే దురదృష్టకరం!

పరిశీలనల మేరకు 2023తో పోలిస్తే నిరుడు ఉగ్రదాడులు 58 నుంచి 66 దేశాలకు పాకాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ శాంతికి ప్రథమ శత్రువైన ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించబోమని జీ20 దేశాలు ప్రతినబూనాయి. యువతను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాలు ముష్కర మూకలకు కాసులు కురిపిస్తున్నాయి. కాబట్టి, డ్రగ్స్-టెర్రరిస్టుల బంధానికి సమాధి కట్టాలన్న ప్రధాని మోదీ పిలుపు అవశ్యం ఆచరణీయం. పర్యావరణ మార్పుల మూలంగా మరింతగా కోరచాస్తున్న వ్యాధులను సమర్థంగా ఎదుర్కోవాలంటే సరిహద్దులకు అతీతంగా ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రతిస్పందన దళాన్ని సిద్ధం చేసుకోవాల్సిందే. వ్యవసాయం, చేపలవేట, విపత్తు నిర్వహణలో వర్ధమాన రాజ్యాలు మెరుగ్గా రాణించాలంటే- మోదీ సూచించినట్లు జీ20 దేశాలు తమ ఉపగ్రహ సమాచారాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందుబాటులో ఉంచాల్సిందే. ఏది ఏమైనా జీ20 తీర్మానాల్లో ప్రకటితమయ్యే ఘన సంకల్పాలన్నీ క్షేత్రస్థాయిలో సాకారమైనప్పుడే ఆ కూటమి శిఖరాగ్ర సదస్సుల లక్ష్యం నెరవేరుతుంది!

సమృద్ధి సాధనలో సహకారం!

అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలనే భారతదేశ ఆశయ సాఫల్యంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించగలవు. భారత్‌లో 28 రంగాల్లో మొత్తం 8.45 లక్షల సహకార సంఘాలు ఉండగా, వాటిలోని సభ్యుల సంఖ్య 30 కోట్లకన్నా ఎక్కువే. దేశమంతటా అయిదారు అమూల్ తరహా భారీ సహకార సంఘాలను నెలకొల్పాలంటూ ఇటీవల ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును జన భారతం అందిపుచ్చుకోవాలి.

ప్రపంచంలోని 30 లక్షల సహకార సంఘాల్లో వంద కోట్లమందికి పైగా సభ్యులున్నారని అంతర్జాతీయ సహకార సంఘాల కూటమి (ఐసీఏ) తెలిపింది. ప్రపంచ శ్రామికశక్తిలో పది శాతంమంది సహకార సంఘాల సిబ్బందే. 300 అతిపెద్ద సహకార సంఘాలు 2.41 లక్షల కోట్ల డాలర్ల టర్నోవర్ సాధించాయి. ప్రపంచ సహకార సంఘాల మానిటర్-2023 నివేదిక ప్రకారం 300 అగ్రశ్రేణి అంతర్జాతీయ సహకార సంఘాల్లో అత్యధికం అమెరికా, ఐరోపా దేశాల్లోనే ఉన్నాయి. అగ్రశ్రేణి సహకార సంఘాల్లో భారత్‌కు చెందినవి 15 ఉన్నాయి. తలసరి జీడీపీతో పోలిస్తే అత్యధిక టర్నోవర్ సాధించిన మనదేశ-అమూల్, ఇఫ్‌కోలే. వీటితోపాటు క్రిబ్‌కో కూడా అంతర్జాతీయ జాబితాలో ఉంది. రానున్న అయిదేళ్లలో భారత జీడీపీకి సహకార రంగం నుంచి 3-4శాతం వాటా సమకూరవచ్చు. 5.6 కోట్ల స్వయంఉపాధి అవకాశాల సృష్టి జరిగే వీలుంది.



అపూర్వ విజయాలు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మన ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికీ, అందులో కీలకమైన సహకార సంఘాలకూ ప్రాధాన్యం ఇస్తున్నాయి. జాతీయ పాడి అభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ), జాతీయ సహకార అభివృద్ధి సంస్థ, నాఫెడ్ వంటి సంస్థలను స్థాపించి సహకార రంగాన్ని బలోపేతం చేశాయి. ఎన్డీయే సర్కారు 2021లో కేంద్రంలో సహకారశాఖను ఏర్పాటు చేసింది. 2002 నాటి జాతీయ సహకార విధానం స్థానంలో 2025లో కొత్త విధానాన్ని వెలువరించింది. 'సహకార్ సే సమృద్ధి' సాధన ద్వారా 2047కల్లా వికసిత భారతాన్ని అందుకోవాలని లక్షిస్తోంది. నిబద్ధత, నిజాయతీ మూర్తీభవించిన నాయకుల సారథ్యంలో సహకార సంఘాలు అపూర్వ విజయాలు సాధించగలవని అమూల్ ఇప్పటికే నిరూపించింది. పాడి రంగంలో అమూల్ సాధించిన విజయాలను వ్యవసాయం, ఉద్యాన పంటలు, మత్స్య పరిశ్రమ వంటి రంగాల్లోనూ సాధించాలి. తద్వారా గ్రామీణుల ఆదాయాలను పెంచాలి. అమూల్ విప్లవం నందిని, మదర్ డైరీ వంటి సహకార సంఘాలకు దారిదీపమైంది. తెలంగాణలోని ముల్కనూరు డైరీ కోఆపరేటివ్ దేశంలో మహిళల సారథ్యంలోని మొట్టమొదటి పాడి సహకార సంఘంగా రికార్డుల కెక్కింది. తిరుపతిలోని శ్రీజ మహిళా పాడి సహకార సంఘం ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా సంస్థగా ఖ్యాతికెక్కింది. 36వేల భారతీయ సహకార సంఘాల కూటమి అయిన ఇఫ్కో దేశ వ్యాప్తంగా 5.5 కోట్లమంది రైతులకు మేలైన ఉత్పత్తి సాధనాలను అందిస్తూ లాభాలు పండిస్తోంది. నానో యూరియా, నానో డీఏపీలను అందిస్తోంది. మహారాష్ట్రలోని వారానా కోఆపరేటివ్ కాంప్లెక్స్ చక్కెర రంగంతో మొదలుపెట్టి పాడి, విద్య, బ్యాంకింగ్ రంగాలకూ విస్తరించింది.

మహారాష్ట్రలోని చక్కెర సహకార సంఘాలు లక్షలమందికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. అక్కడి జల సహకార సంఘాలు నీటిని పొదుపుగా వాడి ఎక్కువ దిగుబడులు సాధిస్తున్నాయి. పాడి రంగంలో అమూల్ స్థాయిలో ఉద్యాన పంటల రంగంలో మహారాష్ట్రకు చెందిన సహ్యాద్రి ఫామ్స్ విరాజిల్లుతోంది. దీంట్లో సభ్యులైన 30వేలమంది రైతులు 40వేల ఎకరాల్లో పండ్లు,కూరగాయలు పండించి [illegible]. తెలంగాణలో 1956లో ప్రారంభమైన ముల్కనూరు గ్రామీణ రుణ, మార్కెటింగ్ సొసైటీ 14 గ్రామాలకు ఆశాజ్యోతిగా మారింది. ఈ సంఘంలోని ఏడువేల మంది పైచిలుకు రైతుల్లో ఏ ఒక్కరూ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోలేదు. సేవా కోఆపరేటివ్ ఫెడరేషన్ 18 రాష్ట్రాల్లో 32 లక్షల మహిళా కార్మికులను సంఘటితం చేసి వారి భవితను మార్చింది. కేరళలోని ఉరలుంగల్ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ 7500 ప్రాజెక్టులు పూర్తిచేసి, యూఎన్‌డీపీతో ఆదర్శ సంఘంగా గుర్తింపు పొందింది. కేరళ త్రిస్సూరులోని ఇండియా కాఫీ హౌస్ ఛత్రం కింద కార్మికుల సహకార సంఘాలు దేశమంతటా సుమారు 500 రెస్టారెంట్లను నడుపుతున్నాయి. 1959లో ఏడుగురు మహిళలు ముంబయిలో ప్రారంభించిన లిజ్జత్ పాపడ్ నేడు 45వేల మంది స్త్రీలతో అప్పడాలు, పచ్చళ్లు, మసాలాలను తయారు చేయిస్తూ మహిళా సాధికారతను సాధిస్తోంది. కొన్ని సహకార సంఘాలు బడా కంపెనీలకూ పోటీ ఇవ్వగలుగుతున్నాయి. సహకారంతో సమృద్ధి సాధించవచ్చని నిరూపిస్తున్నాయి.

వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు

ప్రభుత్వం గడచిన అయిదేళ్లలో పంచాయతీకి ఒకటి చొప్పున సహకార సంఘాల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలను డిజిటలీకరించింది. దేశంలోని మొట్టమొదటి సహకార ట్యాక్సీ సర్వీసు 'భారత్ ట్యాక్సీ'కి ప్రోత్సాహం కల్పిస్తోంది. ప్రభుత్వ ఈ-మార్కెట్లలో కొనుగోలుదారులుగా సహకార సంఘాలను అనుమతించింది. వ్యవసాయ సరకుల ఎగుమతులను పెంచడానికి 2023లో నెలకొల్పిన జాతీయ సహకార ఎగుమతుల లిమిటెడ్ సంస్థలో 11,034 సంఘాలు సభ్యులుగా ఉన్నాయి. ఈ సంస్థ 28 దేశాలకు రూ.5,403 కోట్ల విలువైన వ్యవసాయ సరకులను ఎగుమతి చేసింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడానికి తోడ్పడుతోంది. తెలంగాణలో 48వేల సహకార సంఘాలు క్రియాశీలంగా ఉండగా, ఏపీలో 12,690 చురుగ్గా పనిచేస్తున్నాయి. తెలంగాణలో పాడి, వ్యవసాయ, రుణ సహకార సంఘాలదే పైచేయి. ఏపీలో ఆక్వా, పాడి, ఆహార శుద్ధి, ఉద్యాన పంటల సంఘాలు క్రియాశీలంగా ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలు వివిధ రంగాల్లో అమూల్ తరహా సహకార సంఘాలను నెలకొల్పాల్సిన అవసరం ఉంది. మహిళలు, యువతకు ప్రాధాన్యమిస్తూ నవీకరణ పథంలో పరుగులు తీయడం ద్వారా భారతీయ సహకార సంఘాలు ప్రపంచస్థాయిలో నిలవాలి.



కొట్నాన రమేష్
సీనియర్ మేనేజర్, సెంటర్ ఫర్ బిజినెస్ ఇన్నోవేషన్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్

ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్‌గేట్స్ శ్రీమంతుల జాబితాలో మొదటి స్థానంలో ఉన్న రోజుల్లో ఓ సమావేశానికి అతిథిగా వెళ్లారు. ఆయన ప్రసంగిస్తూ తనకన్నా ధనవంతుడు మరొకరు ఉన్నారని చెప్పారు. అక్కడి వారంతా ఆశ్చర్యంతో ఎవరూ అని ప్రశ్నించారు. తాను అప్పటికి ప్రముఖుణ్ని కాలేదనీ కాలేజీలో చదువుకుంటున్నాననీ చెబుతూ ఆనాటి తన అనుభవాన్ని వివరించారు. ఆయన విమానాశ్రయంలో ఓ వార్తాపత్రిక తీసుకున్నారు. సమయానికి జేబులో తగినంత చిల్లర లేకపోవడంతో పేపర్ తిరిగి ఆ అబ్బాయికి ఇచ్చేయబోయారు. డబ్బులు లేకపోయినా పర్వాలేదు, పేపరు ఉంచుకోండి అని చెప్పి అతడు వెళ్లిపోయాడు. రెండు మూడు

ఎవరు ధనవంతులు?



నెలల తరవాత యాదృచ్ఛికంగా మళ్లీ అదే ఎయిర్‌పోర్టులో మళ్లీ ఆ అబ్బాయి దగ్గరే పేపరు తీసుకున్నారు. ఈసారి కూడా చిల్లర లేదు. ఆ అబ్బాయి నవ్వుతూ 'పర్వాలేదు, మీకు ఉచితంగా ఇస్తున్నాను, తీసుకోండి' అని ఇచ్చేశాడు.

ఆ తరవాత 19 ఏళ్లకు బిల్‌గేట్స్ బిలియనీర్ అయ్యారు. తనకు పేపర్ ఉచితంగా ఇచ్చిన కుర్రాణ్ని గుర్తు పెట్టుకున్న ఆయన- అతడి గురించి ఆరాతీసి తన దగ్గరికి పిలిపించుకున్నారు. 'నన్ను గుర్తుపట్టావా?' అని అడిగితే 'మీరు బిల్‌గేట్స్ కదా' అంటాడతను. 'నువ్వు నాకు ఒకసారి ఎయిర్‌పోర్టులో పేపర్ ఉచితంగా ఇచ్చావు గుర్తుందా' అని బిల్‌గేట్స్ అడిగితే- 'రెండుసార్లు' అని సమాధానం ఇస్తాడు. ఆ వ్యక్తి జ్ఞాపకశక్తికి ఆశ్చర్యపోతూనే బిల్‌గేట్స్ 'అందుకు కృతజ్ఞతగా ఇప్పుడు ఏం కావాలన్నా ఇస్తాను, నీకేం కావాలో చెప్పు'మంటారు. ఆ వ్యక్తి చిరునవ్వుతో ధన్యవాదాలు చెప్పి 'ఏమీ వద్దు సార్. ఆరోజు నేను చేసింది సాయం కాదు. సాయం చేసే స్థాయిలో లేను. మీకు ఓ పేపర్ ఇవ్వడంతో నాకే నష్టమూ రాలేదు. ఈరోజు మీరు ప్రపంచ కుబేరుడి హోదాలో నాకు సాయం చేస్తానంటున్నారు. కానీ దానికి దీనికి పొంతనెలా కుదురుతుంది? ఆరోజు నా స్థాయి ఏంటి, ఈరోజు మీ స్థాయి ఏంటి?' అని ప్రశ్నించి వెళ్లిపోయాడు. నిరుపేదగా ఉండి అతడు చేసిన సాయం గొప్పదా, కోటీశ్వరుడిగా నేను చేస్తానన్న సాయం గొప్పదా? ఎవరు మా ఇద్దరిలో ధనవంతులు? అని సభలోని వారిని ప్రశ్నించారు బిల్‌గేట్స్.

గేట్స్ పేరిట బాగా ప్రచారంలో ఉన్న ఈ కథలోని నిజానిజాల సంగతి అటుంచితే- దీని వెనకాల మానవ స్వభావానికి సంబంధించి లోతైన విషయమే ఉంది. మనుషులు పైపై పటాటోపానికి ఇచ్చే విలువ నిజమైన నీతి నియమాలకు ఇవ్వరు. వీధిలో బండి మీద కూరగాయలు కొనేటప్పుడు గీసి గీసి బేరాలాడతారు. సూపర్ మార్కెట్‌కి వెళ్లి రెండింతలు చెల్లిస్తారు. పనిమనిషికి వంద రూపాయలు జీతం పెంచడానికి బాధపడతారు. హోటల్‌కి వెళ్లి ఒక్క పూట భోజనానికి వేలకు వేలు ధారబోస్తారు. అమ్మానాన్నల మందులకు ఖర్చయిపోతోందనుకుంటారు. స్నేహితులతో పార్టీలకు ఎంత తగలేస్తున్నదీ లెక్కపెట్టుకోరు. డబ్బున్నంత మాత్రాన ఎవరూ ధనికులు కాలేరు. దాన్ని వాడాల్సిన చోట వాడితేనే సంపన్నులవుతారు.

– ఎం.మణికేశ్వర్



సమకాలీన భారతదేశంలో కులం ఎలా పనిచేస్తోందో అధ్యయనం చేశాను. ప్రజాస్వామ్యం, అభివృద్ధి మాటున అది బలహీనమైపోయిందన్నది అపోహ మాత్రమే. నిజానికి అది మరింత బలంగా పాతుకుని ఎప్పటికప్పుడు తన కోరలకు పదును పెట్టుకుంటోంది.

– అరుంధతీ రాయ్

హేళన... పాపమే!

తమకు నచ్చనివారిని, తమ అభిప్రాయాలతో ఏకీభవించని వారిని అకారణంగా దూషిస్తూ ఎగతాళి చేస్తూ ఆనందిస్తారు కొందరు. అది నిజమైన సంతోషం కాదు, తాత్కాలికమైన వికృతానందం!

శూరసేన దేశానికి రాజు చిత్రకేతువు. ఒక సందర్భంలో నారదుడి ఉపదేశం ప్రకారం అతను ఆహారం మాని సమాధిలో నియమంగా ఉంటూ నారాయణ రూపమైన విద్యను ఆరాధించాడు. ఫలితంగా అతడికి రత్న ఖచితమైన దివ్య విమానం లభించింది. దాంట్లో ముల్లోకాలు తిరగసాగాడు. కృష్ణార్పితమైన మనసుతో చిత్రకేతువు ఎప్పుడూ గోవిందనామాలనే ఉచ్చరించేవాడు. ఎల్లప్పుడూ పద్మాక్షుణ్ని పొగుడుతూ, సేవిస్తూ, కీర్తిస్తూ పరమానందం పొందే అతడు ఒక రోజు కైలాసానికి వెళ్లాడు. బ్రహ్మ, ఇతర దేవతల సమక్షంలో ఆ వెండి కొండమీద సన్నిహితంగా కూర్చున్న శివపార్వతులను చూస్తూ పకపకా నవ్వాడు. అంతటితో ఆగక పార్వతీదేవి వింటూండగా



అంతర్యామి

'లోకానికి గురువైన శివుడు ధర్మసభలో భార్యను పామరుడిలా సిగ్గులేకుండా లాలిస్తున్నా'డని అన్నాడు. తాను ఇంద్రియాలను జయించినవాణ్నీ అన్న అహంకారంతో సత్వరజస్తమోగుణాలకు అతీతుడైన పరమేశ్వరుణ్ని ఆక్షేపించాడు. చిత్రకేతువు మాటలకు శంకరుడు ఏమీ అనకపోయినా భవాని మౌనంగా ఉండలేకపోయింది.

'సకల శుభాలకు మూలమై సాధువులు సేవింపదగిన శ్రీహరి పాదపద్మాలను ఆశ్రయించడానికి ఇతడు ఏమాత్రం అర్హుడు కాడు. పాపాలను సంహరించేవాడు, దయ కురిపిస్తూ లోకులను ధన్యాత్ములుగా చేసే ఈశ్వరుణ్ని నిందించిన పాపాత్ముడు దండింపతగినవాడు' అని చెప్పి చిత్రకేతుణ్ని రాక్షస జాతిలో పుట్టమని శపించింది. చిత్రకేతువు తన తప్పు గ్రహించి వెంటనే విమానం దిగి దేవికి సాష్టాంగపడ్డాడు. తాను చేసిన పనికి సిగ్గుపడుతున్నానని ప్రకటించి, శాంతంగా శాపాన్ని శిరసావహించాడు.

అహంకారంతో మహాత్ములను అవమానించే వారు శిక్షార్హులని ఈ భాగవత కథ చెబుతోంది. కొన్ని సందర్భాల్లో క్షణికావేశంలో ఎదుటివారిని కించపరుస్తాం... హేళన చేస్తాం... ఆవేశం తగ్గి ఆలోచన మొదలయ్యేసరికి జరగకూడని నష్టం జరిగిపోతుంది. పరువు ప్రతిష్ఠలు మంటగలుస్తాయి. ఆవేశపరుల్లో యుక్తాయుక్త విచక్షణ నశిస్తుంది. ఇతరులను నిష్కారణంగా అవమానించడం, ఆత్మీయులను అనుమానించడం అవలక్షణాలని తెలుసుకున్నవాడే వివేకి. వృద్ధుల అశక్తతను చూసి హేళన చేసే యువకులు తాము కూడా కాలగమనంలో అదే స్థితికి చేరుకుంటామని గ్రహించాలి. పెద్దలను అవమానించేవారు అపవిత్రులని... గర్వానికి, లోభానికి వశులై గౌరవింపదగినవారిని పరిహసించే వారు నరకానికి వెళ్తారని మహాభారతం చెబుతోంది.

స్త్రీలు అత్యంత సౌభాగ్యశాలినులు. ఇంటికి శోభ కలిగించేవారని విదురుడు చెప్పాడు. స్త్రీలందరూ జగన్మాత అంశలే కాబట్టి వారిని తల్లుల మాదిరి భావించాలన్నారు శ్రీరామకృష్ణ పరమహంస. అటువంటి స్త్రీలపై నిందలు వేసి హేళన చేసేవారు తప్పక శిక్షార్హులే. శ్రీహరిని స్తుతించే నాలుకే సార్థకమైన నాలుక అని బోధించింది భాగవతం. సదా సద్భావనలతో అందరినీ ప్రేమతో పలకరించగలిగినవారు అజాత శత్రువులై సంఘంలో గౌరవాన్ని పొందుతారు. మనశ్శాంతితో మనుగడ సాగించగలుగుతారు.

– ఇంద్రగంటి నరసింహ మూర్తి



బ్రాండెడ్ హవా!

మెరుగైన, వినూత్నమైన వస్తువులపై భారతీయ వినియోగదారుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ క్రమంలో బ్రాండెడ్ వస్తువుల మార్కెట్ జోరందుకుంటోంది. వినియోగదారుల అవసరాలు, ఆకాంక్షలను గ్రహించి ఆధునిక (న్యూ ఏజ్) సంస్థలు తమ ఉత్పత్తులను మార్కెట్లలోకి తెస్తున్నాయి. ఇలాంటి బ్రాండ్ల మార్కెట్ నిరుడు దేశీయంగా 1,000 కోట్ల డాలర్ల దాకా ఉంది. 2030 నాటికి అది అంతకు నాలుగు రెట్లకు పెరగవచ్చు. 2030 నాటికి ఇండియాలో సంప్రదాయ, ఆధునిక బ్రాండ్ల మొత్తం చిల్లర విపణి వాటా 45 శాతానికి చేరుతుందని అంచనా. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో ఆ రెండింటి విపణి వాటా విలువ ఎంత ఉండవచ్చంటే...

(వేల కోట్ల డాలర్లలో)



(ఆధారం: ఫైర్‌సైడ్ వెంచర్స్ నివేదిక-2025)

యాప్‌లకు అన్నీ చెప్పేస్తున్నారా?

ఇటీవలి కాలంలో ఆర్థికం, ఆధ్యాత్మికం మొదలు ఆరోగ్యం, వ్యాయామాల దాకా యాప్‌లపై ఆధార పడటం పెరుగుతోంది. ఇదే అదనుగా యూజర్ల వ్యక్తిగత డేటా దుర్వినియోగమూ ఎక్కువవుతోంది. సామాజిక మాధ్యమాలు, యాప్‌ల్లో డేటాకు రక్షణ కొరవడుతోందనే భయాందోళనలు పెరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలను పంచుకునేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ కుమార్తె వయసు పదమూడేళ్లు. కొన్నాళ్ల క్రితం ఆన్‌లైన్ గేమ్ ఆడుతుండగా, అపరిచిత వ్యక్తి తనతో స్నేహం పెంచుకున్నాడు. మంచి వ్యక్తిగా నమ్మించాడు. కొద్దిరోజులకు నగ్నచిత్రాలు పంపాలని కోరాడు. ఈ విషయాలన్నింటినీ స్వయంగా అక్షయ్ కుమార్ ఇటీవల ఓ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ కార్యక్రమంలో వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం ఒక డేటింగ్ యాప్‌లో డేటా చోరీ జరిగింది. వేలకొద్దీ ఫొటోలు, ఐడీలు, సెల్ఫీలు లీకయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రైవేట్ చాటింగ్‌లూ బయటికి పొక్కాయి. ఇలాంటి ఉదంతాలు సామాజిక మాధ్యమాల్లో సురక్షితంగా వ్యవహరించాలన్న హెచ్చరికలను అందిస్తున్నాయి. చాలామందికి సరైన అవగాహన లేక సమాచారాన్ని అతిగా షేర్ చేయడం, అపరిచితులకూ బయోలు పంపడం, అందరికీ అన్ని వివరాల్నీ ఇచ్చేస్తుండటం సమస్యగా మారుతోంది. ఆన్‌లైన్ గేమ్‌లు, యాప్‌లు, పేమెంట్ గేట్‌వేలు, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అందించే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే ఆన్‌లైన్ మోసాలు, బెదిరింపులు, సైబర్ వేధింపుల బారినపడే ప్రమాదం పొంచి ఉంది.



సమాచారానికి రెక్కలు

ఇటీవలి కాలంలో వైద్యం, ఆరోగ్యం, వ్యాయామం, మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేకించిన యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇవి వ్యక్తిగత వివరాలను దండిగా సేకరిస్తాయి. వీటిలో వ్యక్తిగత సమాచారమంతా నమోదు చేయాల్సి వస్తోంది. అలాంటి వివరాలు లీకయ్యే ముప్పు కూడా ఎక్కువగానే ఉంటోంది. పీరియడ్స్ ట్రాకింగ్ యాప్స్‌లో మహిళలకు సంబంధించిన వ్యక్తిగత ఆరోగ్య, శారీరక వివరాలన్నీ నమోదు చేయాల్సి వస్తుంది. ఆ సమాచారాన్ని వాణిజ్య కంపెనీలు చేజిక్కించుకుంటున్నాయి. కొన్నిసార్లు డేటా హ్యాకర్ల చేతుల్లోకీ వెళ్తోంది. ఇలాంటి యాప్‌లు వ్యాయామం, డైట్ మొదలు లైంగిక అభిరుచులు, హార్మోన్లకు వాడే మందులు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి సమస్త సమాచారాన్నీ సేకరిస్తున్నట్లు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం అధ్యయనంలో వెల్లడైంది. ఈ సమాచారానికి ఆర్థికపరమైన విలువ చాలా ఎక్కువన్న సంగతి యూజర్లకు తెలియడం లేదు. దాంతో అన్ని వివరాలను ఇచ్చేస్తున్నారని పరిశోధకులు చెబుతున్నారు. ఇలాంటి డేటా తప్పుడు వ్యక్తుల చేతుల్లో పడితే ఉద్యోగావకాశాలు, ఆఫీసులు, ఆరోగ్య బీమా తదితర విషయాల్లో ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

మహిళల ఆరోగ్య సంబంధ డిజిటల్ ఉత్పత్తులు అందించే ఫిమ్‌టెక్ పరిశ్రమ అంతకంతకూ పెరిగిపోతోందని, దీనిపై సరైన నియంత్రణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పరిశ్రమ విలువ 2027 నాటికి 60 బిలియన్ డాలర్లను దాటిపోతుందని అంచనా. మహిళల ఆరోగ్య, ఫెర్టిలిటీ యాప్‌లకు ప్రైవసీ, సెక్యూరిటీ విధానాలు పటిష్ఠంగా లేవని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. చాలా యాప్‌లు యూజర్ల వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని ప్రకటనకర్తలకు, డేటా బ్రోకర్లకు అమ్ముకుంటున్నట్లు తేలింది. ఫిమ్‌టెక్ యాప్స్‌లో భద్రత లోపాలు, డేటా రక్షణ చర్యలు బలహీనంగా ఉండటంతో ఉల్లంఘనలు తేలికవుతున్నాయి.

ముందు జాగ్రత్తలు మేలు


పటిష్ఠమైన సెక్యూరిటీ ప్రమాణాలు ఉండటంతోపాటు, మన డేటా భద్రంగా ఉంటుందన్న నమ్మకం ఉన్న యాప్‌లనే వాడాలి. సామాజిక మాధ్యమాల ప్రైవసీ పాలసీలను ముందుగానే తెలుసుకోవాలి. సైబర్ దాడులు, వేధింపులకు గురైతే వెంటనే అటునుంచి వచ్చే సందేశాలకు ప్రతిస్పందించడాన్ని ఆపేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పాస్‌వర్డ్ మార్చేసి, సంబంధిత వర్గాలకు ఫిర్యాదు చేయాలి. యాప్‌లే కాకుండా సామాజిక మాధ్యమాల్లో ఖాతా తెరవడానికి, నిర్వహణకు అవసరమైన తప్పనిసరి సమాచారాన్ని మాత్రమే షేర్ చేయాలి. ప్రైవసీ, సెక్యూరిటీ సెట్టింగ్స్‌ను తరచూ పరిశీలిస్తూ, అప్‌డేట్ చేస్తుండాలి. ఫాలోవర్లుగా తెలిసిన వారికే పరిమితమవ్వాలి. సామాజిక మాధ్యమాల కోసం ప్రత్యేక ఈమెయిల్ అకౌంట్ ఉండటం మేలు. ఫస్ట్ టైం వచ్చాయంటూ డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పే చెక్‌ల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దు. ఈ విషయంలో ఆతృతను అదుపులో పెట్టుకుంటేనే మేలు. హ్యాకర్ల నుంచి కాపాడే తొలి రక్షణ గోడలు పాస్‌వర్డ్‌లే. వాటిని వీలైనంత బలంగా నిర్మించాలి. ప్రతి ఖాతాకీ వేర్వేరు పాస్‌వర్డ్‌లు ఉండాలి. డివైజెస్‌ను భద్రంగా ఉంచుకుంటే, ఖాతా కూడా సురక్షితం. సెక్యూరిటీ అలర్ట్ సందేశాలను నిర్లక్ష్యం చేయొద్దు. పూర్తి పేరు, పుట్టినతేదీ, స్కూలు, ఆఫీసు ఇల్లు తదితర కీలక వ్యక్తిగత వివరాలు ఊరికే ఎక్కడా ఇవ్వకూడదు. బ్యాంకు ఖాతాలు, చెల్లింపు వివరాలు, ఫోన్ నంబర్, స్నేహితులు, కొలీగ్స్ ఫొటోలు, వివరాలు షేర్ చేయకూడదన్న సంగతినీ అందరూ గుర్తుపెట్టుకోవాలి.

– డి.శ్రీనివాస్

సరైన చోటు..!

సిరి అమ్మానాన్నలతో జూకి వెళ్లింది. మూడో తరగతి చదువుతున్న సిరి అసలే ప్రశ్నల పుట్ట. ఏది కొత్తగా కనిపించినా దాని గురించి ప్రశ్నలు అడిగేస్తూనే ఉంటుంది. ఆరోజు కూడా అలాగే అన్నీ అడిగి తెలుసుకుంటోంది. చెట్టుకింద పడుకున్న ఒంటె సిరిని బాగా ఆకట్టుకుంది. ఒంటెకి పైన అలా ఎత్తుగా ఉన్న భాగాన్ని ఏమంటారు? అని నాన్నని అడిగితే దాన్ని మూపురం అంటారని చెప్పారు. ఆ వెంటనే ఒంటె కాళ్లు అంత పొడుగెందుకు ఉన్నాయని అడిగింది. ఎడారి ఇసుకలో కూరుకుపోకుండా నడవాలంటే కాళ్లు పొడుగ్గా బలంగా ఉండాలని చెప్పాడు నాన్న.

ఒంటెని అలాగే పరిశీలనగా చూస్తున్న సిరికి నల్లగా పొడుగ్గా ఉన్న దాని కనురెప్పల వెంట్రుకలు అందంగా కన్పించాయి. తన కనురెప్పలు ముట్టుకుని చూసుకుంది.



అవి చాలా చిన్నగా ఉన్నాయి. వెంటనే ఆ మాటా అడిగేసింది పక్కనే ఉన్న అమ్మను. 'ఎడారుల్లో ఎక్కువగా ఇసుక తుపాన్లు వస్తాయి. ఆ ఇసుక కళ్లలో పడకుండా వాటి కళ్లకు పొడవాటి వెంట్రుకలు అడ్డుగా ఉంటాయన్నమాట' చెప్పింది అమ్మ.

'కానీ అమ్మా... ఒంటె ఎడారిలో ఉంటే అవన్నీ ఉపయోగపడతాయి కదా! ఇక్కడ జూలో ఉన్నప్పుడు ఎందుకు?' పెద్ద సందేహాన్నే వెలిబుచ్చింది సిరి. సాధారణంగా ఒంటెలు ఎడారుల్లోనే ఉంటాయి. అయితే మీలాంటి పిల్లలకు చూపించడానికి ఇలా జూలో ఉంచుతారన్నమాట.

హాయ్! బుజ్జీ!!

ఇప్పుడీ ఒంటె నీకో మంచి పాఠం చెబుతోంది. 'అవునా ఏంటమ్మా..' అంటూ ఆసక్తిగా అంది సిరి. అదేంటంటే- మనకి ఎన్ని సామర్థ్యాలు, నైపుణ్యాలు ఉన్నా మనం సరైన చోట ఉన్నప్పుడు మాత్రమే అవి ఉపయోగపడతాయి. లేకపోతే వ్యర్థమే' అని వివరంగా చెప్పిన అమ్మ మాటలు అర్థమైనట్లు తలూపింది సిరి. అలా సరదాగా జూ అంతా చుట్టేసింది తను.

★

మన సామెతలు!

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయగలరా?

1. అదిగో ☐☐ అంటే ఇదిగో ☐☐ అన్నట్లు.
2. కూర్చొని ☐☐ కొండలైనా -☐☐☐☐.
3. ☐☐ చాలదని ☐☐ పూడ్చినట్లు.

[illegible]

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
సోమవారం నవంబరు 24, 2025

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నేడు

కానూరు పి.వి.పి. సిద్ధార్థ ప్రాంగణంలో నిర్వహణ



ఈనాడు, అమరావతి: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు ఈ మెగా సైన్స్ ఫెయిర్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు ప్రారంభిస్తారు. విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పాల్గొంటున్నారు. సుమారు 100 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు. విద్యార్థులను వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించడం 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' ముఖ్య ఉద్దేశం.

ఏకపీఠంపై శివపార్వతులు...



కృష్ణా జిల్లా మంటపాలలోని ప్రాచీన బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి దేవాలయం ఎంతో ప్రత్యేకమైనది. ఇక్కడ జలధీశ్వరస్వామి పూజలందుకుంటున్న శివలింగం పక్కనే పార్వతీదేవి ఏకపీఠంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. సాధారణంగా శివాలయాల్లో శివుడు ఒకవైపు ఉంటే అమ్మవారు మరోవైపు ఉంటారు. ఈ క్షేత్రంలో మాత్రం ఆది దంపతులు (శివపార్వతులు) ఏకపీఠంపై భక్తులను ఆశీర్వదిస్తారు. అగస్త్య మహాముని, ఆయన భార్య లోపాముద్ర కలిసి ఈ జలధీశ్వరస్వామిని, పార్వతీదేవిని ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతోంది. స్వామిని దర్శిస్తే సాక్షాత్తు కైలాసంలో ఆదిదంపతుల కల్యాణ దర్శనం చేసుకున్నంత భాగ్యం కలుగుతుందని ప్రతీతి. ఆలయ ప్రాంగణంలో 1400 ఏళ్ల కిందటి పాళీ భాషలో శాసనం ఇప్పటికీ కనిపిస్తుంది. దీని పక్కనే తెలుగు అనువాదాన్ని సైతం భక్తులు అర్థమయ్యేలా ఏర్పాటు చేశారు.

- ఈనాడు, కృష్ణా

ఇసుక దందా.. కనబడుతోందా!



ఈనాడు, అమరావతి

- నదిలో ఫెర్రీ సహా చుట్టుపక్కల భారీగా డ్రెడ్జింగ్
- వందల ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్న అక్రమార్కులు

కృష్ణా నదిలో ఇబ్రహీంపట్నం ఫెర్రీ సహా పరిసర ప్రాంతాల్లో భారీగా ఇసుక దందా సాగుతోంది. తాజా వరదలకు ఫెర్రీ సమీపంలోని లంకలు, చుట్టుపక్కల ప్రాంతాల్లోకి వేల టన్నుల ఇసుక కొట్టుకొచ్చింది. దీనిపై ఇసుకాసురుల కన్ను పడింది. కళ్ల ముందు రూ.కోట్ల విలువైన ఇసుక కనిపించడంతో కొత్త పడవలు, జేసీబీలతో రంగంలోకి దిగిపోయారు. విచ్చలవిడిగా నది మధ్యలో యంత్రాలతో డ్రెడ్జింగ్ చేస్తూ పడవల ద్వారా తీసుకొచ్చి నింపి తరలించుకుపోతున్నారు. ఫెర్రీ కేంద్రంగానే రోజుకు 400-500 ట్రాక్టర్ల ఇసుకను ఎత్తుకుపోయి స్టాక్ పాయింట్లు పెట్టుకుని అమ్ముకుంటున్నారు. అక్రమార్కులు బరితెగించేసి ఇసుకను తోడేస్తున్నా ఒక్క అధికారీ ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.



ఫెర్రీ వద్ద ట్రాక్టర్లలోకి క్రేన్‌తో ఇసుక ఎత్తుతూ..

ఇబ్రహీంపట్నంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిపోతుంటే గుంటుపల్లిలోని ఇసుకాసురులు మరో అడుగు ముందుకు వేసి టిప్పర్లు, లారీల ద్వారా భారీగా తరలించేస్తున్నారు. ఉదయమంతా నదిలోని ఇసుకను యంత్రాలతో తోడేసి తీసుకొచ్చి ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. దానిని రాత్రి వేళ లారీలు, టిప్పర్లకు ఎత్తి సరిహద్దులు దాటించేస్తున్నారు.

కేజీలు ఉండగా దందా సాగిస్తున్నారు. నదిలో తోడి ఒడ్డుకు తీసుకొచ్చినందుకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.700 వసూలు చేస్తున్నారు. ఈ ఇసుకను ఇబ్రహీంపట్నంలో అమ్మితే ట్రాక్టర్ రూ.1200, అదే కొండపల్లి వెళితే రూ.1500 చొప్పున వసూలు చేస్తున్నారు. లారీలు, టిప్పర్లలో దూరప్రాంతాలకు తరలిస్తున్నారు. పురపాలిక పరిధిలోని గుత్తేదారు వేలంపాట పాడుకుని ఇసుక ట్రాక్టర్ నుంచి రూ.100 ఆశీలు వసూలు చేస్తున్నారు.

ఎద్దుల బండ్లకు కూలి చెల్లించి..

ఎద్దుల బండ్లతో ఎవరైనా నేరుగా రేవుల్లోకి వచ్చి ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో దీనిని కూడా కొందరు అక్రమార్కులు అవకాశంగా మార్చుకుంటున్నారు. ఎండ్ల బండ్లు నడిపేవాళ్లకు కూలి చెల్లించి ఇసుక తరలిస్తున్నారు.

సిండికేటుగా మారి దందా

అధికారులు ఉన్నారా.. లేరా?

ఫెర్రీలో ఇసుక దందా భారీగా జరుగుతుండడంపై తీవ్ర విమర్శలు రావడంతో 20 రోజుల కిందట అధికారులు హడావుడి చేశారు. కానీ వాళ్లు వచ్చేసరికే ఫెర్రీ మొత్తం ఖాళీ చేసి అక్రమార్కులు పరారయ్యారు. ఓ ఐదు రోజుల తర్వాత నుంచి మళ్లీ దందా సాగిస్తున్నారు



ప్యాకేజీ-4 ...ఇక పరుగులు

ఈనాడు, అమరావతి

కురగల్లులో తొలగించిన రోడ్డు పునర్నిర్మాణానికి ఎన్వోసీ

పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-4 పనులు పరుగులు పెడుతున్నాయి. కురగల్లులో కొండవీటి వాగు వరదల సమయంలో తొలగించిన రహదారి పునర్నిర్మాణం పనులు పట్టాలెక్కుతున్నాయి. ఆగస్టులో కొండవీటి వాగుకు వరద పోటెత్తిన వేళ నష్ట నివారణకు మంగళగిరి మండలం కురగల్లులో 40 మీటర్ల మేర రహదారిని ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) తొలగించింది. ప్రస్తుతం పరిస్థితులు కుదుట పడడంతో రహదారి పునర్నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని రాతపూర్వకంగా ఎన్వోసీ ఇవ్వాలని ఏడీసీఎల్‌కి ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. తాజాగా దానికి సంబంధించిన ఎన్వోసీ ఎన్‌హెచ్ అధికారులకు అందింది. అన్నీ కుదిరితే సోమవారం నుంచి పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టి నెల రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఇప్పటికే ప్యాకేజీ-3 పనులు దాదాపు కొలిక్కి రావడంతో విజయవాడ రాకుండా చినఅవుటపల్లి నుంచి గొల్లపూడి మీదుగా హైదరాబాద్- వైజాగ్ వెళ్లేందుకు రాకపోకలు మొదలయ్యాయి. నున్న విద్యుత్తు టవర్ల వివాదంపై సోమవారం కోర్టు తీర్పు రానున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో స్పష్టత రానుంది. మొత్తం మీద సంక్రాంతి నాటికి ప్యాకేజీ-3, 4 పనులు కొలిక్కి వచ్చి బైపాస్‌పై వాహనాల రాకపోకలు మొదలవనున్నాయి.




కురగల్లు దగ్గర ఏడీసీఎల్ రహదారిని తొలగించిన ప్రాంతం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

పాయకాపురం, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వృక్షం.. ఆరాధ్య దైవం





నాట్య క్షేత్రమైన కూచిపూడిలో 300 ఏళ్ల నుంచి ఉన్న రావివృక్షాన్ని (గంటలమ్మ) నాట్య కుటుంబాలు ఆరాధ్య దైవంగా కొలుస్తున్నాయి. కూచిపూడి భాగవతులు దేశంలోని పలు ప్రాంతాల్లో నాట్య ప్రదర్శనలు ఇచ్చేందుకు వెళ్లే ముందు కూచిపూడి అగ్రహారంలో ఉన్న రావి వృక్షానికి మొక్కేవారు. తాను తిరిగి వచ్చే వరకు భార్యాబిడ్డలను కాపాడమని ఆ చెట్టుకు గంట కట్టి మోగించి వెళ్లేవారు. ఆ వృక్షానికి ఉన్న గంటలు నిత్యం గాలికి ఊగుతూ మోగుతూ ఉండటంతో దాన్ని గంటలమ్మ చెట్టుగా పిలుస్తుంటారు. భాగవతులు తర్వాత ఆయన వంశీయులు ఆ చెట్టును కొలుస్తున్నారు.

- కూచిపూడి, న్యూస్‌టుడే

వందనమమ్మా.. మంతెన బామ్మ!

కంకిపాడు, న్యూస్‌టుడే



ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న బాలబాలికలు

ఏడు పదుల వయసులోనూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటూ సామాజిక సేవలో తరిస్తున్నారు.. కంకిపాడు మండలం మంతెనకు చెందిన పెండ్యాల విజయలక్ష్మి. ఆమె భర్త రామారావు ఏలూరులోని ఓ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. వీరి కుమార్తె, కుమారుడు ఉన్నత విద్యనభ్యసించి అమెరికాలో స్థిరపడ్డారు. విజయలక్ష్మి పదేళ్లుగా సామాజిక సేవతో పాటు గ్రామ ప్రగతికి కృషిచేస్తున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం, ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలు, చిన్న వయసులోనే రక్తపోటు, మధుమేహం, కీళ్ల సమస్యలపై బాలలు, మహిళల్లో అవగాహన కల్పించేందుకు బాలసేన, మహిళా మండలి ఏర్పాటు చేయించారు. స్వచ్ఛ సుందర మంతెనకు శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, వ్యాపారులు, గ్రామస్థులకు నార సంచులు, స్టీల్, గాజుగ్లాసుల పంపిణీ, బాలలకు పోటీలు నిర్వహించి బహుమతుల అందజేత, పండగలు, పర్వదినాలను పురస్కరించుకుని మహిళా మండలి సభ్యులంతా స్వయంగా సేంద్రియ పదార్థాలతో చేసిన తినుబండారాలను చిన్నారులకు పంపిణీ చేస్తున్నారు.

- వేసవి శిక్షణ శిబిరాలకు తనే స్వయంగా విద్యార్థులను తీసుకెళుతుంటారు. బాలలు, మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణ, పాఠశాల ప్రాంగణాల్లో సేంద్రియ విధానంలో కూరగాయల ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు, గో ఆధారిత ఎరువులు ఇస్తున్నారు. బంధువులకు చెందిన 40 సెంట్ల స్థలంలో ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలను ఇంటింటికీ అందజేస్తున్నారు. విజయలక్ష్మిని గ్రామంలోని బాలలు, విద్యార్థులు అమ్మమ్మ అని ఆప్యాయంగా పిలుస్తుంటారు. 'నా కుటుంబానికి అన్నీ ఇచ్చిన గ్రామం.. రుణం తీర్చుకునే బాధ్యత నాపై ఉందని భావించి, సేవచేస్తున్నాను' అని పెండ్యాల విజయలక్ష్మి తెలిపారు.



పెండ్యాల విజయలక్ష్మి

త్రివర్ణ వీచిక.. నిలువెత్తు స్ఫూర్తిగా..



ఆంధ్రప్రదేశ్- తెలంగాణ సరిహద్దులోని జగ్గయ్యపేటలో జాతీయ రహదారి సమీపంలో 150 అడుగుల ఎత్తున ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకం తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో నిత్యం రెపరెపలాడుతూ జాతీయ స్ఫూర్తిని చాటుతోంది. 2024 ఫిబ్రవరిలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ స్వహస్తాలతో ఆవిష్కరించిన పతాకం ఈ ప్రాంతానికి ఒక విశిష్టతను సంతరింపజేసింది. ఆ ప్రాంతాన్ని ఒక దేశభక్తి ప్రబోధకమైన సందర్శన స్థలంగా మార్చడం కోసం జగ్గయ్యపేట పురపాలక సంఘం వారు అక్కడ ఒక తిరంగ్ ఉద్యానవనం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆ పార్క్ దశల వారీగా రూపుదిద్దుకుంటూ ఉంది.

- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

స్వగృహం ప్రాప్తిరస్తు!

అర్హుల ఎంపికకు పీఎం ఆవాస్ యోజన 2.0 సర్వే

ఈనాడు, అమరావతి

జిల్లా	దరఖాస్తులు	సర్వే చేసినవి
ఎన్టీఆర్	15,994	9190
కృష్ణా	6,707	4,069
మొత్తం	22,701	13,259



ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

నీడ లేని పల్లె ప్రజలకు సొంత గూడు కల సాకారం చేసేందుకు కూటమి సర్కారు నడుం కట్టింది. దీని కోసం పీఎం ఆవాస్ యోజన 2.0 ద్వారా లబ్ధి అందించనున్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతలు నిర్ణయించేందుకు సర్వే చేస్తున్నారు.

నవంబరు-30 నాటికి కొలిక్కి..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 22,701 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిని హౌసింగ్, సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో కలిసి ఇంటి నిర్మాణం చేపట్టాలనుకుంటున్న స్థలాన్ని పరిశీలిస్తున్నారు. వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 13,259 మందిని సర్వే చేశారు. నవంబరు 30వ తేదీలోగా సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. నెల రోజుల తర్వాత కేంద్రం అర్హుల జాబితా ప్రకటించి ఇళ్ల మంజూరుపై దృష్టి సారిస్తుంది.

గృహ నిర్మాణానికి కూటమి చొరవ

- వైకాపా పాలనలో మొదలుపెట్టి అసంపూర్తిగా నిలిపేసిన గృహాల్లో 11,008 గృహాలు తాజాగా కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది.
- సామూహిక గృహప్రవేశాల రోజే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,449 ఇళ్లు మంజూరు చేసింది.
- ఇందులో ఎన్టీఆర్‌లో 1,257, కృష్ణాలో 1,192 గృహాలున్నాయి. వీటికి ఉమ్మడి జిల్లాకు రూ.70.8 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.
- ప్రస్తుతం పీఎం గ్రామీణ ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు సర్వే చేస్తున్నారు.
- ఈ సర్వేలో అర్హులను బట్టి వచ్చే రెండేళ్లలో కూటమి సర్కారు గృహాలు మంజూరు చేయనుంది.
- ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం రూ.1.5లక్షలు, రాష్ట్రం రూ.లక్ష చొప్పున రూ.2.5లక్షలు అందుతాయి. అదనంగా ఉపాధి హామీ పథకం ద్వారా 90 పని రోజులకు రూ.27వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు మంజూరు చేస్తారు.
- మొత్తంగా ఒక్కో లబ్ధిదారుడికి రూ.2.89లక్షలు చెల్లిస్తారు.

ఖాతాలు నావే.. పోస్టులు నావి కాదు!

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

రెండో రోజూ పోలీసుల కస్టడీకి సహకరించని విజయ్‌భాస్కర్‌రెడ్డి

'సామాజిక మాధ్యమాల ఖాతాలు నావే.. అందులో అసభ్యకర పోస్టులు.. మార్ఫింగ్ ఫొటోలు, కంటెంట్ నాది కాదు' అని రెండో రోజు పోలీసుల కస్టడీలో వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డి సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, న్యాయమూర్తులపై అత్యంత అసభ్యకర పదజాలంతో కంటెంట్ రాస్తూ.. పోస్టులు పెట్టడం వెనుక కారణాలేంటని విచారణాధికారి వెంకటరమణ అడిగిన ప్రశ్నలకు తెలియదు.. సంబంధం లేదంటూ నిందితుడు పొడిపొడిగా సమాధానాలు చెప్పాడు. నెల్లూరు జిల్లా వెంకటాచలం ఠాణాలో రెండో రోజు ఆదివారం పోలీసుల కస్టడీలో విజయ్‌భాస్కర్‌రెడ్డి సహకరించలేదు. 5 గంటల పాటు సుమారు 16 ప్రశ్నలు అడగ్గా నిందితుడు డొంకతిరుగుడు సమాధానాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. విచారణ అనంతరం వైద్య పరీక్షలు చేయించి నెలూరు జైల్లో నిందితుడిని అప్పగించారు.

విచారణ సాగిందిలా..

- ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ వారి కుటుంబ సభ్యులపై పోస్టులు పెట్టారు కదా.. వారు ఎవరో తెలుసా?
  విజయ్‌భాస్కర్‌రెడ్డి: తెలుసు
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణపై అసభ్యకర పోస్టులు పెట్టారు. ఆయన ఎవరో తెలుసా?
  విజయ్‌భాస్కర్‌రెడ్డి: జస్టిస్ ఎన్.వి.రమణ ఎవరో నాకు తెలియదు.
- ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, మహిళలపై అసభ్యకర పోస్టులు పెట్టడం వెనుక ప్రధాన ఉద్దేశమేంటి?
  విజయ్‌భాస్కర్‌రెడ్డి: నాకు తెలియదు.. సంబంధం లేదు.
- సామాజిక మాధ్యమాల్లో మీరు పెట్టిన పోస్టులు తీవ్ర అసభ్యంగా ఉన్నాయని అనిపించలేదా?
  విజయ్‌భాస్కర్‌రెడ్డి: నాకు తెలియదు.
- మీ ఫేస్‌బుక్ ఖాతాలో మహిళల ఫొటోలు మార్ఫింగ్, అనుచిత వ్యాఖ్యలతో కంటెంట్ రాయమని చెప్పిందెవరు? మీతో పాటు ఇంకా ఎవరెవరు పాత్రధారులు ఉన్నారు?
  విజయ్‌భాస్కర్‌రెడ్డి: ఆ ఖాతాలు నావే. అందులోని కంటెంట్ నాది కాదు.
- మీ విదేశీ మొబైల్ నంబర్‌తో ఉన్న కోర్‌కమిటీ వాట్సప్ గ్రూప్, కోర్‌కమిటీలోని సభ్యులు ఎవరెవరు? వారు అసభ్య పోస్టులు ఎవరెవరికి పంపేవారు. మీకు ఎలాంటి సూచనలు చేసేవారు?
  విజయ్‌భాస్కర్‌రెడ్డి: వారెవరో నాకు తెలియదు.

డ్రగ్స్ కేసులో.. కీలక మలుపు

ఈనాడు, అమరావతి

- మ్యాడీ, లోహిత్ వాంగ్మూలాలతో కదిలిన డొంక
- వైకాపా నేత కొండారెడ్డి పాత్రపై మరిన్ని ఆధారాలు

ఎటువంటి పురోగతి లేకుండా ఉన్న ఎండీఎంఏ కేసు మ్యాడీ అరెస్టుతో కీలక మలుపు తిరిగింది. అతని విచారణ ఆధారంగా మరికొందరి పేర్లు వచ్చాయి. వీరిలో వైకాపా విద్యార్థి నేత పులగం కొండారెడ్డి పేరు ఒకటి. దీంతో అతడిని ఈ కేసులో నిందితుడిగా చేర్చారు. లోహిత్ యాదవ్ విచారణలో పలు ముఖ్యమైన విషయాలు బయటకొచ్చాయి.

వైకాపా ర్యాలీల్లో హల్‌చల్

17న నెల్లూరు కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లోని లోహిత్‌ను మాచవరం పోలీసులు విచారించగా పలు విషయాలు వెల్లడించాడు. విశాఖ నగరంలోని ప్రభుత్వ మహిళా కాలేజీ ప్రాంతానికి చెందిన లోహిత్ హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతూ చెడు వ్యసనాలకు బానిసై చివరి ఏడాది మానేశాడు. ఇంటికి సమీపంలోని శ్రీవాత్సవ్ (ఏ1) ద్వారా 2020 నుంచి కొండారెడ్డితో పరిచయం ఏర్పడింది. మత్తు బంధం ప్రాణ స్నేహితులుగా మార్చింది. కొండారెడ్డి వైకాపాలో విద్యార్థి నేతగా ఎదుగుతుండడంతో వైకాపా ర్యాలీల్లో అతనితో కలిసే తిరిగేవాడు. లోహిత్ కాల్‌డేటా పరిశీలిస్తే గతేడాది మే 30 నుంచి ఈ ఏడాది ఆగస్టు 30 వరకు 15 నెలల్లో 1,467 కాల్స్ ఉన్నాయి. దీనిపై ప్రశ్నిస్తే ఇద్దరం తరచూ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీతో తీసుకునేవారమని, పార్టీల గురించి ఫోన్‌లో మాట్లాడుకునేవారమని చెప్పాడు.



కొండారెడ్డి

ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ అమ్మకాలు

ఎండీఎంఏతో పాటు బెంగళూరు నుంచి ఎల్ఎస్‌డీ (లైసర్జిక్ యాసిడ్ డైఇథైలామైడ్) తెప్పించి విశాఖపట్నంలో కొండారెడ్డి విక్రయించేవాడు. ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్‌ను నాలుక కింద పెట్టుకుని చప్పరిస్తే మత్తు ఎక్కుతుంది. విశాఖ జిల్లాలో పలువురు వైకాపా కీలక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలున్నాయి. తెలిసినవారికి నేరుగా, పరిచయం లేనివారికి డ్రాపింగ్ పాయింట్ల ద్వారా అందజేసేవారు. వచ్చిన సొమ్మును శ్రీవాత్సవ్, హర్షవర్ధన్‌నాయుడు, స్వరూప్‌రాజ్ ద్వారా కొండారెడ్డికి చేర్చేవారు.

శ్రీవాత్సవ్, హవీలా పట్టుబడిన రోజు..

బెంగళూరులో 20 గ్రాముల ఎండీఎంఏ కొని విశాఖ తీసుకెళ్తుండగా 3నెలల కిందట విజయవాడలో పట్టుబడ్డారు. ఆరోజు పట్టుబడిన ఇద్దరి ఫోన్లు స్విచాఫ్ రావడంతో కొండారెడ్డి, లోహిత్‌లు గాభరా పడ్డారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య చాలా కాల్స్ ఉన్నాయి. తర్వాత వీరిద్దరూ ఒకచోట కలుసుకున్నారు. పోలీసులకు ఏమైనా దొరికారా? ఒకవేళ దొరికితే తమ పేర్లు ఏమైనా చెప్పారా? అన్న కంగారు పెరిగింది. దీంతో వాట్సప్ ద్వారా మ్యాడీకి కొండారెడ్డి ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు.

సంక్రాంతికి సీటు దొరుకుతుందా..!

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

వచ్చే ఏడాది సంక్రాంతి పండుగకు రైళ్లలో దాదాపు బెర్తులన్నీ ఫుల్ అయ్యాయి. రెండు నెలల ముందుగానే రైల్వే రిజర్వేషన్ టికెట్ల బుకింగ్‌లు ప్రారంభమవ్వడంతో అన్ని ప్రధాన రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్ బెర్తులు నిండి వెయిటింగ్ లిస్టుతో పాటు కొన్ని రైళ్లలో నోరూమ్‌లు దర్శనమిస్తున్నాయి.

★ ఏటా సంక్రాంతి పండగ రద్దీ దృష్టిలో పెట్టుకొని రైల్వే శాఖ భారీగా ప్రత్యేక రైళ్లు నడుపుతుంది. ఈ ఏడాది కూడా పెద్ద సంఖ్యలో సర్వీసులు ఉన్నాయి. సాధారణ రైళ్లలో రిజర్వేషన్ టికెట్లు ఫుల్ అవడంతో ఇక ప్రత్యేక రైళ్లు, తత్కాల్ టికెట్లపైనే ప్రయాణికులు ఆశలు పెట్టుకున్నారు.

★ హౌరా మార్గంలోని రైళ్లలో ఎక్కువ డిమాండ్ ఉంది. తర్వాత సికింద్రాబాద్, బెంగళూరు ఉన్నాయి. రాజధాని ప్రాంతంలో పనులు చేసేందుకు వందల సంఖ్యలో ఉత్తరాంధ్ర నుంచి కార్మికులు వచ్చారు. వారు పండగకు తిరిగి వెళ్లేందుకు ముందుగానే రిజర్వేషన్లు చేయించుకోవడంతో విజయవాడ, హౌరా మార్గంలోని రైళ్లలో ఎక్కువ వెయిటింగ్ లిస్ట్ ఉన్నాయి.

★ బెంగళూరు నుంచి ఐటీ ఉద్యోగులు తన సొంత గ్రామాలకు రానుండడంతో బెంగళూరు మార్గంలో డిమాండ్ ఏర్పడింది. జనవరి 13, 14, 15 తేదీల్లో చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్టు 100 దాటింది. మరికొన్నింటిలో బుకింగ్‌లు పూర్తి అయ్యి 'రిగ్రెట్' అని వస్తుంది.

★ పండగ ముందు, తర్వాత రోజుల్లో తత్కాల్ టికెట్లకు భారీ డిమాండ్ ఉంటుంది. బుకింగ్ ప్రారంభించిన నిముషాల్లోనే టికెట్లు వెయిటింగ్ లిస్టుకు చేరుకుంటాయి. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో రైల్వే శాఖ సంక్రాంతి పండగకు విజయవాడ మీదుగా ఎక్కువ సంఖ్యలో ప్రత్యేక రైళ్లు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతూ జెండా ఊపి సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న డీసీపీ సరిత.. చిత్రంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, సీపీ రాజశేఖరబాబు, ఈగల్ చీఫ్ ఐజీ రవికృష్ణ తదితరులు

అమరావతి రూపకల్పనలో భాగస్వాములు అవ్వండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి రూపకల్పనలో ఏపీ సీఆర్డీఏ ప్రజలను భాగస్వాములను చేస్తోంది. భవిష్యత్తు తరాలకు ఉత్తమ, సుస్థిరమైన, ఆధునిక మౌలిక వసతులతో కూడిన రాజధాని నగరాన్ని నిర్మించేందుకు అమరావతి విజన్ 2047 రూపకల్పనలో ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను సీఆర్డీఏ స్వీకరిస్తుంది. ప్రజా సంఘాలు, వివిధ రంగాల నిపుణులు నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తోంది. వివరాలను తెలుగు, ఆంగ్లంలో అందించే అవకాశాన్ని కల్పించారు. సీఆర్డీఏ అధికారిక వెబ్‌సైట్ 'సీఆర్‌డీఏ.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా ఈ సర్వేలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రజలు సూచనలు, సలహాలు పంపటానికి ఈ నెల 30 చివరి తేదీగా నిర్ణయించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్ తరాలకు అత్యుత్తమ రాజధాని నగరాన్ని నిర్మించేందుకు ప్రజలందరూ ఈ సర్వేలో పాల్గొనాలని ఏపీ సీఆర్డీఏ విజ్ఞప్తి చేస్తుంది.

ఎయిర్ కార్గో... లక్ష్యం నీరుగారుతోంది!

ఈనాడు, అమరావతి

విజయవాడ విమానాశ్రయంలో ఎయిర్ కార్గో సేవల లక్ష్యం నెరవేరడం లేదు. రోజుకు 10 నుంచి 15 టన్నుల వరకూ సరకు తీసుకెళ్లే సామర్థ్యం ఉన్నా సగం కూడా వెళ్లడం లేదు. 2019కి ముందు కార్గో సేవలు ఆరంభించిన కొద్ది కాలంలోనే నెలకు 250 టన్నులకు పైగా సరకు ఎగుమతి, దిగుమతి అయ్యే స్థాయికి చేరింది. ప్రత్యేకంగా కార్గో సర్వీసులను ఆరంభించే ప్రయత్నాలూ జరిగాయి. గత వైకాపా హయాంలో ఏడాదిన్నరకు పైగా కార్గో సేవలు నిలిచిపోయాయి. తిరిగి 2024 జులై 1 నుంచి సేవలు ఆరంభమైనా.. సరకు రవాణా అరకొరగానే జరుగుతోంది.

మత్స్య ఉత్పత్తులకు అవకాశాలున్నా..

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, మత్స్య ఉత్పత్తులు.. నిత్యం దిల్లీ, బెంగళూరు సహా అన్ని నగరాలకు రోడ్డు మార్గంలో వెళ్తున్నాయి. మత్స్య ఉత్పత్తులకు దిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. గన్నవరం నుంచి నేరుగా రెండు మూడు గంటల్లో దిల్లీ సహా ఆయా ప్రాంతాలకు సరకు చేర్చే అవకాశముంది.

ప్రస్తుతం ఏడు నగరాలకే..

ప్రస్తుతం హైదరాబాద్, ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నై, విశాఖ, తిరుపతి.. ఏడు నగరాలకు మాత్రమే ఇక్కడి నుంచి దేశీయ సర్వీసులు నడుస్తున్నాయి. ఈ నగరాలకు రోజుకు ఒకటిన్నర టన్ను వరకూ సరకు ఇటునుంచి వెళుతోంది. అటు నుంచి 4-5టన్నులు వస్తోంది.

★ దిల్లీ, ముంబయికి నడుస్తున్న.. ఐదు ఎయిర్‌బస్ 320 సర్వీసుల్లో ప్రయాణికులతో పాటు రెండున్నర నుంచి మూడు టన్నుల వరకూ సరకును తీసుకెళ్లే సామర్థ్యం ఉంది. ఏటీఆర్-72 సర్వీసుల్లో టన్ను వరకూ తీసుకెళ్లొచ్చు.

అవగాహన, నమ్మకం కలిగించకే.. కార్గో సేవలను విస్తరించేందుకు.. ఉత్పత్తిదారులందరితో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలి. నేరుగా ఇక్కడి నుంచే సరకు పంపిస్తే కలిగే ప్రయోజనాలను తెలియజేయాలి. గత ఆరేళ్లుగా ఏ ప్రయత్నమూ చేయలేదు. దీంతో సరకును రోడ్డు మార్గంలోనే ఎక్కువ మంది ఇప్పటికీ పంపిస్తున్నారు.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

★ యువ ప్లేయర్లకు అవకాశం
★ ఈఎస్‌ఎల్ దరఖాస్తుల ప్రక్రియ షురూ

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్‌ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. డిసెంబరు 12న ప్రారంభమయ్యే ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్‌ఎల్ క్రికెట్ టోర్నీకి దరఖాస్తు ప్రక్రియ మొదలైంది.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్‌ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

- రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.
- మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు.

దరఖాస్తులకు తుది గడువు డిసెంబరు 8

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు

ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.


మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

రామరత్నం దాతృత్వం చిరస్మరణీయం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: రామరత్నం దాతృత్వం చిరస్మరణీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. నగరంలోని చిలకలపూడి అన్నపూర్ణ వృద్ధుల సేవా ఆశ్రమ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం గుత్తికొండ రామరత్నం వర్ధంతి సభ నిర్వహించారు.



పురస్కారాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు తదితరులు

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'రామరత్నంలో దాతృత్వంతో పాటు భక్తితత్వం కూడా ఎక్కువగా ఉండేది. ఆమె పలు వ్యాపారసంస్థల ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించారు. సాహితీ కార్యక్రమాలకు ఎంతగానో చేయూత అందించేవారు. ఆమె పేరిట ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున సేవాకార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం' అని పేర్కొన్నారు. సాహితీవేత్త డా.పూర్ణచంద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. గుత్తికొండ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని వివరించడంతో పాటు రామరత్నం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా సామాజిక, సాహితీవేత్త ఎంసీదాస్(విజయవాడ), సరసభారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్(ఉయ్యూరు), స్త్రీవాద కవయిత్రి మందరపు హైమావతి(విజయవాడ), ప్రసంగ ప్రజ్ఞానిధి, విమర్శకులు, డా.గుమ్మా సాంబశివరావు(విజయవాడ), నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షులు తేళ్ల అరుణ(ఒంగోలు), విద్యావేత్త దామెర్ల నరసింహారావు(మైలవరం), భావతరంగిణి సంస్థ నిర్వాహకులు, భవిష్య(మచిలీపట్నం)లకు గుత్తికొండ రామరత్నం ఛారిటబుల్ ట్రస్ట్ జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు సుశీల, వివిధ సంస్థల ప్రతినిధులు పోతురాజు, గురజాడ రాజరాజేశ్వరి, గుత్తికొండ చినసుబ్బారావు, వెంకటరాములు, అంజనీకుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించగా వివిధ ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు పాల్గొన్నారు.

శబరిమల వెళ్లే భక్తులకు జాగ్రత్తలు తప్పనిసరి

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లా నుంచి శబరిమల బయలుదేరి వెళ్లే అయ్యప్ప భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పంబానది, చుట్టు పక్కల సరస్సుల్లో జలాశయాల్లో స్నానము ఆచరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. నిరంతరం చేతులు శుభ్రం చేసుకోవాలని, కాచిన నీటిని తాగాలని పేర్కొన్నారు.

అధిక లాభాలు.. విచ్చలవిడి చెల్లింపులు..

నకిలీ మద్యం వ్యవహారంలో అద్దేపల్లి సోదరుల తీరు

ఈనాడు, అమరావతి

నకిలీ మద్యం అమ్మకాల ద్వారా ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుండడంతో అద్దేపల్లి జనార్దనరావు.. ముడి సరకు, ఇతర వస్తువుల కోసం అధిక మొత్తాలు వెచ్చించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సీసాలు, మూతలు, లేబుల్స్, స్పిరిట్, అన్నింటికీ రెట్టింపు, మూడు రెట్లు ధరలు చెల్లించారు. జనార్దనరావు, అతని సోదరుడు జగన్మోహన్‌రావుల ఆర్థిక లావాదేవీలను పరిశీలించిన సిట్, ఎక్సైజ్ అధికారులకు భారీగా నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఎక్కడా తమ అక్రమ వ్యాపారానికి ఇబ్బంది లేకుండా చూసేందుకు అవతలి వ్యక్తులను అధిక ధరలతో ప్రలోభపెట్టినట్లు విచారణలో తెలిపారు.

పెద్ద మొత్తంలో విత్‌డ్రాయల్స్, నగదు బదిలీలు

నకిలీ మద్యం కేసులో నిందితుల మధ్య భారీగా లావాదేవీలు నడిచాయి. శనివారంతో ఇద్దరు నిందితుల కస్టడీ ముగిసింది. నాలుగు రోజుల విచారణలో వారి బ్యాంకు స్టేట్‌మెంట్లను తీసుకుని లావాదేవీల గురించి ప్రశ్నించి వివరాలు రాబట్టారు. నిందితుల మధ్య పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగాయి. బెంగళూరుకు చెందిన బాలాజీతో ఎక్కువ జరిగాయి. గోవా నుంచి స్పిరిట్ తీసుకొచ్చి ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో అందించేవాడు. బాలాజీతో పాటు అతని కుమారుడు సుదర్శన్‌కు దాదాపు రూ.1.50 కోట్ల వరకు ఇచ్చినట్లు తేలింది. పలుసార్లు ములకలచెరువులో అందజేశారు.

- లేబుళ్ల డిజైన్, ప్రింటింగ్ కోసం రవి ద్వారా హైదరాబాద్‌లోని పలువురికి రూ.20లక్షల వరకు చెల్లింపులు జరిగాయి. ఎక్కువగా యూపీఐ ద్వారా బదిలీ జరిగాయి. కోయంబత్తూరుకు చెందిన వ్యాపారికి ఓల్డ్ అడ్మిరల్ బ్రాండీ సీసాలను తయారు చేసి పంపించినందుకు ఒక్కొక్క సీసాకు రూ. 4.50 చెల్లించాడు. ఈ బ్రాండ్ సీసాలకు మూడు రెట్లు ఎక్కువగా చెల్లించాడు.
- సీసాల కోసం సూరంపల్లిలో శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పరిశ్రమలో తయారు చేశారు. వీటికి కూడా రెట్టింపు ధరను జగన్మోహన్‌రావు చెల్లించాడు. మూతల సరఫరా విషయంలోనూ ఇదే విధంగా అధిక ధరలు చెల్లించాడు. వీటిని సరఫరా చేసిన మనోజ్‌కుమార్ జైన్, ధారబోయిన ప్రసాద్‌లకు సాధారణంగా రేట్ల కంటే ఎక్కువ మొత్తమే చెల్లించినట్లు లావాదేవీల ఆధారంగా గుర్తించారు.

వికసిత్ భారత్‌కు సత్యసాయి విలువలు మార్గదర్శకం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : భగవాన్ సత్యసాయి చూపిన విలువల మార్గం.. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు మార్గదర్శకమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, జిల్లా అధికార యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సహకారంతో ఆదివారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీవో కావూరి చైతన్య, వివిధ శాఖల అధికారులు, సత్యసాయి సేవా సమితుల సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విశ్వశాంతి, సౌభాగ్యం, మానవాళి సుఖ సంతోషాల కోసం పరితపించిన సత్యసాయి సేవలు ఆదర్శనీయం అన్నారు. 'అందరినీ ప్రేమించు- అందరినీ సేవించు' అనే సత్యసాయి సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. శ్రీసత్యసాయి సేవా సమితి సారథ్యంలో ఆధ్యాత్మిక సేవా విద్యా విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను విజయవాడ సమితి కన్వీనర్ ఎన్.వి.ఎల్.నరసింహారావు వివరించారు. కాగా ఇదే వేదికపై జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాకారుల నృత్య, అభినయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు సి.హెచ్.సాయిగీత, ఝాన్సీ, విజయలక్ష్మి, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు



కళాకారిణుల నృత్య ప్రదర్శన

ఉన్నత చదువుకు వెళ్లి తిరిగి రాని లోకాలకు..

నందిగామ, న్యూస్‌టుడే : అమెరికాలో ఉన్నత చదువులకు వెళ్లిన కుమారుడు ప్రయోజకుడైన తిరిగి వస్తాడని భావించిన తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. అక్కడే అనారోగ్యంతో మృతి చెందటంతో బోరున విలపిస్తున్నారు. నందిగామ శివారు హనుమంతుపాలేనికి చెందిన గాడిపర్తి రాధాకృష్ణ, రాధ దంపతులకు నవీన్‌కుమార్, కిరణ్ సంతానం. కష్టపడి వ్యవసాయం చేస్తూ ఇద్దరు కుమారులను చదివించారు. ఇద్దరు అమెరికాలో ఎంఎస్ చేసేందుకు వెళ్లారు. పెద్ద కుమారుడు నవీన్‌కుమార్ టెక్సాస్‌లో ఉద్యోగాన్వేషణలో ఉండగా.. తీవ్ర అనారోగ్యానికి గురై శుక్రవారం అమెరికాలోని బూస్టన్ వైద్యశాలలో మృతి చెందాడు. ఎంపీ కేశినేని శివనాథ్, విప్ సౌమ్య, తానా సభ్యుల సహకారంతో మృతదేహాన్ని తీసుకుని సోదరుడు కిరణ్ ఆదివారం హైదరాబాద్‌లోని విమానాశ్రయానికి వచ్చాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నవారు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, రాటకొండ వెంకట్రావు తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అంత్యక్రియలు చేశారు.



నవీన్‌కుమార్ (పాత చిత్రం)

బూదవాడలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

25 మందిపై కేసు నమోదు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకున్న ఇరువర్గాల ఘర్షణల విషయమై పోలీసులు 25 మందిపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తెలిపిన సమాచారం మేరకు. . ఇరువర్గాల్లోని అనుమానితులపై ఐపీసీ 307 పాటు పలు సెక్షన్లు నమోదు చేసినట్లు తెలిపారు. పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో ఒక వర్గంలోని 14 మందిపై, మరో వర్గంలోని 11 మందిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. అరెస్టుల పర్వం పూర్తికాగానే గ్రామంలో వివాదాల్లో పాల్గొన్నవారు, ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలుగా గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయి ఘర్షణలు చెలరేగి. . అవి పలుమార్లు పునరావృతం కావడంతో పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటు చేయడమే కాక ఇరువర్గాలకు తీవ్ర హెచ్చరికలు చేసి రాజీ చేశారు. పాతకక్షలను పురస్కరించుకొని శనివారం రాత్రి గ్రామ శివార్లలో మొదలైన వివాదం.. చివరికి కర్రలు, రాళ్లు, సుత్తులు, కడ్డీలతో దాడి వరకూ వెళ్లడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు గ్రామంలో తీవ్రత రీత్యా తొలుత పరిస్థితిని అదుపులోకి తెచ్చి అనంతరం పికెట్ కొనసాగించారు. గాయాలపాలైన ఏడుగురిలో ఐదుగురు స్థానికంగా చికిత్స పొందుతుండగా.. మరో ఇద్దరు విజయవాడలో చికిత్స పొందుతున్నారు. ఘర్షణల్లో గాయపడిన సరిహద్దు తెలంగాణ గ్రామమైన రామాపురం వాసి ఆ రాష్ట్రంలో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఇది అంతర్రాష్ట్ర వివాదంగా పరిణమించింది. ఈ నేపథ్యంలో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనసాగుతున్న బందోబస్తును డీసీపీ, ఏసీపీలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి గ్రామంలో కొనసాగుతున్న పికెటింగ్‌తో ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో ఇటువంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



గ్రామంలో పోలీసుల పహారా

గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలంలోని రావికంపాడు సమీపంలో గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. పొలాల మధ్య పంట కాలువలో మహిళ మృతదేహం ఉందని ఆదివారం ఉదయం స్థానికులు ఫిర్యాదు చేయడంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. 30 ఏళ్ల లోపు మహిళ సగం వస్త్రాలతో మొహంపై గాయాలతో చేతిపై ప్రణయ్ అనే టాటూ ఉండడాన్ని గుర్తించారు. మృతదేహం లభ్యమైన తీరును బట్టి హత్యగా నిర్ధారించారు. ఏ గ్రామానికి చెందిన మహిళో తెలుసుకునేందుకు ఆనవాళ్లను పోలీస్ సిబ్బందికి పంపారు. జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన మహిళై ఉంటుందన్న అంచనాలతో ఆరా తీస్తున్నారు. ఎవరు చంపి ఉంటారనే అంశంపై స్పష్టత కోసం పలు కోణాల్లో పరిశోధిస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండు రోజుల్లో కేసులోని మిస్టరీని ఛేదిస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రపంచకప్ గెలుపు దేశానికి గర్వకారణం

ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అంధ మహిళల టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో నేపాల్‌పై భారత మహిళా జట్టు సాధించిన విజయం దేశానికి గర్వకారణమని ఆంధ్రా క్రికెట్ సంఘ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. భారత మహిళల అంధ క్రికెట్ జట్టుకు ఏసీఏ తరఫున అభినందనలు తెలిపారు. కొలంబోలో ఆదివారం ముగిసిన ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత జట్టు ప్రదర్శన అంతర్జాతీయ వేదికపై దేశ గౌరవాన్ని మరోసారి నిలబెట్టిందని పేర్కొన్నారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన తెలుగు తేజం పి.కరుణకుమారికి ఆయన అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయం దేశంలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. శరీర ప్రతిబంధకాలను పక్కనబెట్టి అసాధారణ పోరాట స్ఫూర్తి, కృషి, సంకల్ప బలం ప్రదర్శించి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకున్న భారత మహిళల అంధ క్రికెట్ జట్టు నిజంగా స్ఫూర్తిదాయకమన్నారు. ఈ విజయం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో నింపిందని ఆయన పేర్కొన్నారు.

'ఎన్‌కౌంటర్‌లపై న్యాయమూర్తితో విచారణ జరపాలి'

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : బూటకపు ఎన్‌కౌంటర్‌లను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. చర్చలకు సిద్ధమని, ఆయుధాలు పక్కన పెడతామని మావోయిస్టులు వెల్లడించినా.. వారిని కాల్చి చంపడం యుద్ధనీతికి వ్యతిరేకమన్నారు. ప్రభుత్వం మావోయిస్టుల మధ్య జరుగుతున్న హింస, ప్రతిహింసల్లో అత్యధికంగా ఆదివాసీలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు చట్టానికి లోబడి పనిచేయాలని సూచించారు. చర్చలతోనే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.




మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్. వేదికపై శంకర్, శోభనాద్రీశ్వరరావు తదితరులు

చంపే అధికారం ఎవరు ఇచ్చారు: వడ్డే

వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి పాలకులు ఎంచుకున్న ఈ విధానం సరైంది కాదన్నారు. మావోయిస్టులను కోర్టులో హాజరుపరచకుండా చంపే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. వాళ్లు నేరస్థులా? కాదా? అనే విషయాన్ని న్యాయ వ్యవస్థ తేల్చాలి తప్ప. పోలీసులు కాదన్నారు. సీపీఐ నాయకుడు జె.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్‌కౌంటర్లతో మావోయిజాన్ని అంతం చేయాలనుకోవడం పాలకుల భ్రమ అన్నారు. మోదీ ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలకు ఇవి నిదర్శనమని దుయ్యబట్టారు. సీపీఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ. . మోదీ ప్రభుత్వ కగార్ ఆపరేషన్‌కు మద్దతుతో ఆగకుండా.. ఆపరేషన్ సంభవ్ నిర్వహణలోనూ చంద్రబాబు ప్రభుత్వం భాగస్వామిగా మారిందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి, ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ తదితరులు మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, న్యూడెమోక్రసీ నేత వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పౌర హక్కుల సంఘం నాయకులు చిలుకా చంద్రశేఖర్, డి.హరినాథ్, వెంకట్‌రెడ్డి, లలిత, రామకృష్ణ, జానకి రాములు, ప్రసాద్ బాబు, దుర్గారావు, పోలారి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ₹ రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -108 రిటైల్ ధర 130 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215. ఆమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

వెంచరు వివాదం..

ప్రాణహాని ఉందని బాధితుడి ఆవేదన

చిట్టినగర్, న్యూస్‌టుడే: వెంచరు వివాదం నేపథ్యంలో దాడికి పాల్పడి నానా బీభత్సం సృష్టించి భయభ్రాంతులకు గురి చేశారని పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళ్తే.. బెంజిసర్కిల్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీలో మాధవరపు శ్రీనివాసరావు నివసిస్తున్నారు. ఎం.ఎస్.ఆర్ డెవలపర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. విజయవాడ గ్రామీణ ప్రాంతం అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలో వెంచరు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 22న నగరానికి చెందిన అమరేంద్రనాథ్, ఎం.కొండారెడ్డి, దేవిరెడ్డి శంకరరావు కలిసి వారికి వారి అనుచరులు 10 మందితో వెంచరులోకి వచ్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. రియల్ ఎస్టేట్ కార్యాలయం, ప్రధాన ద్వారం గేటు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి.. కార్యాలయంలో పని చేసే రత్నకుమార్‌పై దాడి చేసి తీవ్రంగా కొట్టి.. చంపుతామని బెదిరించారు. జేసీబీతో కార్యాలయం గది ధ్వంసం చేశారు. అక్కడే పని చేస్తున్న టి.రాధాకృష్ణ, వి.గోపాలకృష్ణ, ఎస్.ప్రసాద్‌లను భయభ్రాంతులు గురి చేశారు. శంకరరావు, కొండారెడ్డి అరుస్తూ మీ యజమానిని చంపేస్తామని హెచ్చరించారు. విద్యుత్తు స్తంభాల తీగలు తొలగించి హంగామా సృష్టించి వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు శ్రీనివాసరావు సుమారు రూ.6 లక్షలు విలువైన ప్రాపర్టీ నష్టం చేశారని, తనకు తన కుటుంబానికి వారి నుంచి ప్రాణహాని ఉందని కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చిన కొండలరావు తెలిపారు.

కోర్టులో స్థల వివాదం.. అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంచరు ఇరువర్గాలు భాగస్వాములని, వారి మధ్యనే వివాదం తలెత్తడంతో ఆ విషయమై కోర్టులో నడుస్తుందని బాధితుడు పేర్కొన్నారు. పోలీసులు కూడా సహకరించడం లేదని వాపోయాడు. తనకు తెదేపా నాయకుడు ఎరుబోతు రమణ, శంకరరావు వల్ల ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. పోలీసులు మాత్రం వెంచరుకు సంబంధించిన డాక్యుమెంట్లు చూపాలని అడిగామని చెబుతున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

రాష్ట్ర స్థాయి సైక్లింగ్‌లో హవా

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : నున్నలోని జడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 14, 17, 19 బాలు, బాలికల అంతర్ జిల్లాల సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జిల్లా బృందం ట్రాక్ ఈవెంట్‌లో 48 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు ఛాంపియన్‌షిప్ కార్య నిర్వాహక కార్యదర్శి టి.శ్రీలత తెలిపారు. రోడ్డు ఈవెంట్‌లో గుంటూరు బృందం 63 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి శాప్ స్పోర్ట్స్ కోచ్ ఎ.వినోద్‌కుమార్, పీడీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ.సునీల్, ఉమ్మడి కృష్ణా జిల్లా సైక్లింగ్ సంఘ కార్యదర్శి కె.సుగుణరావు అతిథులుగా హాజరై ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీలు, వ్యక్తిగత విభాగంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన సైక్లిస్టులకు పసిడి, రజత, కాంస్య పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి జి.రాంబాబు, వ్యాయామ సంచాలకుడు టి.విజయవర్ధన్, పీఈటీలు ఎండీ.ప్రసాద్, కె.పురుషోత్తం, ఎం.రామాంజి, ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పనులు ప్రారంభం

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరం నుంచి నూజివీడు వెళ్లే మధ్యలో ఉన్న వెల్వడం, చంద్రాల దాటాలంటే ప్రయాణికులకు అవస్థలే. దాంతో ఆ మార్గం ఒకటున్నదన్న విషయాన్నే కొన్నాళ్లుగా ప్రజలు మర్చిపోయారు. అధ్వాన్న పరిస్థితిపై ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు స్పందించిన అధికారులు ఎట్టకేలకు పనులు ప్రారంభించారు. ఆర్నెల్ల కిందట మైలవరం నుంచి వెల్వడం అడ్డరోడ్డు వరకు వెట్‌మిక్స్ వేసినా, వర్షాలకు మరింత గోతులు పడటంతో, అవస్థలు పడుతున్న నేపథ్యంలో గోతుల రోడ్డుపై మందంగా వెట్‌మిక్స్ వేస్తూ చదును చేసే పనులు జరిగాయి.


యంత్రంతో చదును చేయిస్తూ..

మేముంన్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



తిరువూరు 4వ వార్డులోని డ్రైనేజీలో మట్టి, బురద పేరుకుని మురుగు పారడంలేదు ఆటంకంగా మారిందని స్థానికుడైన కిరణ్‌కుమార్ 'ఈనాడు' 'మేముంన్నాం...మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు సంతోష్ తమ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

★ నడపూరు గ్రామ పంచాయతీ ఉప్పర బజారులో గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు 'మేముంన్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తెచ్చారు. ఈవో జె.స్వాతి స్పందించి దాతల సహకారంతో ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తోలించి పూడ్చి వేయించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

? కొండపల్లి ఆరో వార్డులో పంపు వద్ద డ్రైనేజీలో చెత్త పేరుకుపోయి మురుగు పారడం లేదు. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తోంది. **- శ్యామలరావు, స్థానికుడు**

✓ సిబ్బందిని పంపి అక్కడి చెత్తను తొలగిస్తాం. **- వెంకటరత్నం, పారిశుద్ధ్య పనుల ఇన్‌ఛార్జి - న్యూస్‌టుడే, కొండపల్లి**

? తిరువూరు 9వ వార్డులోని నివాసాల మధ్యనున్న ఖాళీ స్థలాల్లో మురుగు నిలుస్తోంది. **- వెంకట్రావు, స్థానికుడు**

✓ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. **- మున్సిపల్ శానిటరీ అధికారి - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

నేడు రెండు గ్రామాల్లో రైతన్నా.. మీకోసం

ఎ.కొండూరు, తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఎ.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శుద్ధ జలాల సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు కోతులపాడు, 5.30 గంటలకు మల్లేలలో రైతన్నా... మీకోసం కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం.. రైతుల్లో కలవరం

జి.కొండూరు, న్యూస్‌టుడే

ఈ ఏడాది కురిసిన వర్షాలకు పులివాగు సప్లయ్ ఛానల్ మీదుగా జి.కొండూరు పోలీస్ స్టేషన్ సమీపంలోని పంట చెరువుకు నీరు పుష్కలంగా చేరడంతో నిండు కుండలా దర్శనమిస్తోంది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో సైతం పంటను పండించుకునే అవకాశం ఏర్పడింది. కానీ ప్రస్తుతం చెరువు పొంగే ప్రమాదం పొంచి ఉందని కర్షకుల్లో ఆందోళన మొదలైంది. ఆకాశం మబ్బులు కమ్మితే చాలు ఆయకట్టు రైతుల్లో భయాందోళన నెలకొంటుంది. దీనికి కారణం చెరువు నిండితే నీరు బయటకు వెళ్లేందుకు కళింగ లేకపోవడమేనని వాపోతున్నారు.

వర్షాలు పడినప్పుడు..

దాదాపు 41.76 ఎకరాల పంట చెరువు కింద రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. వర్షాలు పడినప్పుడు గడ్డమణుగు మోటారు గడ్డ సమీపంలోని పులివాగు సప్లయ్ ఛానెల్ నుంచి చెరువులోకి నీరు చేరుతోంది. ఇటీవల మొంథా తుపాన్ సమయంలో పులివాగు సప్లయ్ ఛానెల్ మూసి వేయడంతో ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో చెరువు నిండితే రెండు వైపులా అలుగు పారేందుకు వీలు ఉండటంతో పంటలు పండించుకునేవారు. చెరువుకు అధికంగా నీరు చేరితే తూర్పు వైపునున్న అలుగు నుంచి ఆత్కూరు పంట చెరువుకు, మరో పక్క పడమరగా ఉన్న అలుగు పారి నీరు పులివాగులో కలుస్తోంది. ఈ రెండు పూర్తిగా ఆక్రమణకు గురై చెరువు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పంట చెరువు పడమర దిక్కున ఆక్రమణకు గురైన అలుగు

చర్యలు తీసుకున్నాం

పులివాగు సప్లయ్ ఛానెల్ నుంచి నీరు చెరువుకు చేరకుండా చర్యలు తీసుకున్నాం. రైతులు విజ్ఞప్తి మేరకు వర్షం వచ్చి చెరువు నిండినప్పుడు అదనపు నీరు బయటకు వెళ్లేందుకు పోలీస్ స్టేషన్ వెనుక నుంచి పూడిపోయిన అలుగును తాత్కాలికంగా ఎన్నెస్పీ మైనర్‌కు అనుసంధానం చేశాం.

- రాజేష్, నీటి పారుదల శాఖ సహాయక ఇంజినీర్

100 మందికి కంటి వైద్య పరీక్షలు


నేత్ర పరీక్షలు చేస్తున్న లక్ష్మీకుమారి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రుద్రవరం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 100 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు సంఘ అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామ ఉప సర్పంచి బి.కృష్ణారెడ్డి, ఎం.వాసుల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కంటి వైద్య నిపుణురాలు పి.లక్ష్మీకుమారి వైద్య సేవలు అందించారు. గ్రామ సర్పంచి జె.చాంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్సు పోటీల్లో ప్రతిభ

తిరువూరు టౌన్, విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక నాగార్జున పాఠశాలకు చెందిన విద్యార్థులు విస్సన్నపేటలోని వికాస్ టెక్నో స్కూల్ వేదికగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్సు సంబరాల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానం సాధించారు. బి.గ్రీష్మ, డి.చరిత్ర రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వి.మురళీ మోహన్, కార్యదర్శి గంగాధర్‌రావు, వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ నరెడ్ల సర్వారెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఎన్‌సీసీతో సమాజ సేవకు అవకాశం

మైలవరం, న్యూస్‌టుడే : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థి దశ నుంచే సమాజ సేవ చేసుకునే అవకాశం కలుగుతుందని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇల్లా రవి పేర్కొన్నారు. కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించి క్యాడెట్లు గౌరవ వందనం చేశారు. ఎన్‌సీసీతో కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జడ్.నాగిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి జె.రాముడు తదితరులు పాల్గొన్నారు.


గౌరవ వందనం చేస్తున్న క్యాడెట్లు

ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌కు అభినందన

కొండపల్లి, న్యూస్‌టుడే : ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన మొహమ్మద్ ఫారూక్ షుబ్లీని సున్నీ మత గురువులు అల్తాఫ్ రజా అభినందనలు తెలిపారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను ముస్లిం మతపెద్దలు విజయవాడలో ఆదివారం కలిసి శాలువాతో సత్కరించారు. ఉర్దూ భాషాభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. షేక్ మహబూబ్ సుభాని, తబ్రేజ్, కుమార్, షేక్ బాషా, షేక్ అబ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్య సాయిబాబా జయంతి వేడుకలు


సత్యాలపాడులో పౌరాణిక కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు


పెనుగొలనులో పల్లకీ సేవ

సత్యాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : పద్యనాటక రంగానికి పూర్వ వైభవం తీసుకురావాల్సిన బాధ్యత నేటి తరం ప్రజలపై ఉందని ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ డైరెక్టర్, బళ్లారి రాఘవ కళాపీఠం అధ్యక్షుడు బెల్లపు పాటి గోపాలకృష్ణప్రసాద్ అన్నారు. పుట్టపర్తి సత్య సాయిబాబా శత జయంత్యుత్సవ సందర్భంగా మండలంలోని సత్యాలపాడులో తెలుగు కళాకారులు సేవాసంస్థ, ఉషోదయం ఫౌండేషన్ నిర్వాహకులు యూపీ.రత్నం, డి.ఉపారాణి, విశ్రాంత తహసీల్దార్ టి.రామచంద్రరాజు సంయుక్త ఆధ్వర్యంలో పౌరాణిక పద్యనాటక ఏకపాత్రాభినయం, పద్య సమ్మేళనం, జానపద పాటలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోపాలకృష్ణ సాయి, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి డి.వెంకయ్య నిర్వాహకులతో కలిసి కళాకారులను సత్కరించారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : భగవాన్ శ్రీసత్య సాయిబాబా జయంతి వేడుకలను ఆదివారం రెడ్డిగూడెంలోని శ్రీసత్య సాయి ధ్యాన మందిరంలో నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పలువురికి దుప్పట్లు పంపిణీ చేశారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలో శ్రీసత్య సాయిబాబా జయంతి వేడుకలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున సాయి మందిరంలో పూజలు చేశారు.

పెనుగొలను(గంపలగూడెం) : మండలంలోని పెనుగొలనులో సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సత్య సాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం చేశారు.

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో విస్సన్నపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శివాలయం ప్రాంగణంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మేలు

అమ్మిరెడ్డిగూడెం, గోనవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని అమ్మిరెడ్డిగూడెం, గోనవీడు గ్రామాల పరిధిలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు వి.రాజకుమారి ఆదివారం తనిఖీ చేసి ఆరబెట్టిన ధాన్యం పరిశీలించారు. ధాన్యం ఆరుదల పూర్తవ్వగానే సాగుదారులు పీపీసీ కేంద్రాల్లో పంటను విక్రయిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందవచ్చన్నారు. పలుపూర్ అధికారులు ఆమె వెంట ఉన్నారు.


అమ్మిరెడ్డిగూడెం: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజకుమారి

భక్తిశ్రద్ధలతో ఇరుముడుల కార్యక్రమం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : నాగులూరు గ్రామంలో అయ్యప్ప స్వామి దీక్షాధారుల ఇరుముడుల కార్యక్రమం ఆదివారం జరిగింది. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీవీ. సత్యనారాయణ(విజయబాబు), కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.


నాగులూరు రామాలయంలో అయ్యప్ప స్వామి దీక్షాధారులు

స్పందించండి.. వెతలు తీర్చండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం నుంచి దాములూరు గ్రామీణ రహదారిలో జూపూడి, మూలపాడు గ్రామాల వద్ద ఇబ్బడి వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో డొంక రోడ్డుగా ఉన్న దీన్ని జాతీయ రహదారికి సమాంతరంగా నదీ తీర గ్రామాలను కలుపుతూ ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం కింద అభివృద్ధి చేశారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్లి వచ్చేందుకు ఇది ఒక్కటే మార్గం. గ్రామాల ఎగువ నుంచి వచ్చి కృష్ణా నదిలో కలిసే వాగులను దాటేందుకు రహదారిపై లోలెవల్ వంతెన నిర్మించారు. ఇటీవల జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఎక్కువ కావడంతో ఆయా గ్రామాలకు చెందిన అన్నదాతలతో పాటు ఇతరులు వివిధ పనులకు వెళ్లిరావడానికి ఈ రహదారినే వినియోగిస్తారు. వర్షాకాలంలో వాగులు పొంగి లోలెవల్ వంతెనలపై మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తుంది. లో లెవల్ వంతెనకు ఇరువైపుల రెయిలింగ్ లేకపోవడంతో ఇటీవల వరదలకు ద్విచక్ర వాహన చోదకుడు అదుపు తప్పి కింద పడి వాగు ప్రవాహంలో కొట్టుకు పోతుండగా సమీపంలోని రైతులు యువకుడిని రక్షించారు. రెయిలింగ్ లేకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను అధికమించడంలో కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. రానున్న వర్షాకాలం నాటికి వంతెనకు ఇరుపక్కల రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


జూపూడి వద్ద ఇబ్బడివాగుపై రెయిలింగ్ లేని వంతెన

మోక్షం కలగక.. ప్రమాదాలు ఆగక

మండలంలోని కొత్తగూడెం నుంచి చిలుకూరివారి గూడెం వెళ్లే మార్గంలో బుడమేరు వాగుపై ఉన్న వంతెన శిథిలమై మూడేళ్లవుతున్నా అభివృద్ధికి మోక్షం కలగడం లేదు. వైకాపా హయాంలో కింద ఉన్న పిల్లర్లు, పక్కనున్న రోడ్డు కుంగింది. ఈ నేపథ్యంలో రూ.45 లక్షలతో అంచనాలు రూపొందించినట్లు అప్పట్లోనే అధికారులు ప్రకటించినా ఆమోదం రాలేదు. దాంతో ప్రస్తుతం మరింత పగిలి రాకపోకలు ప్రమాదకరంగా మారినా, పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, మైలవరం



యథేచ్ఛగా మద్యం.. గంజాయి అమ్మకాలు!

విస్సన్నపేట, న్యూస్‌టుడే

మండల కేంద్రం విస్సన్నపేటలోని పలు ప్రాంతాల్లో అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా సరఫరా జరుగుతున్నట్లు నివాసితులు తెలుపుతున్నారు. దీంతో మహిళలు, వృద్ధులు, బాలికలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్టాండు, బీజేఆర్ నగర్, ఏ.కొండూరు రోడ్డు, పుట్రేల రహదారి, పోలీసు స్టేషన్ వెనుక ప్రాంతం, ఎంపీడీవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా మద్యం, గంజాయి, జూదం, వ్యభిచారం యథేచ్ఛగా నడుస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా వెనుక కొంతమంది రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల హస్తం ఉన్నట్లు సమాచారం. యువత, మహిళలు, విద్యార్థులే లక్ష్యంగా ఈ వ్యవహారం జరుగుతున్నట్లు తెలిసింది. వ్యసనానికి బానిసైన ఓ మహిళ ఇటీవల ఫూటుగా మద్యం తాగి, గంజాయి సేవించి మండల కేంద్రం గాంధీ విగ్రహం ముందు స్పృహ తప్పి పడిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మద్యం, గంజాయి, జూద క్రీడలను అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


విస్సన్నపేట సెంటర్‌లో స్పృహ తప్పి పడిపోయిన ఓ మహిళ

క్రమబద్ధీకరణకు మరో అవకాశం

ఇబ్రహీంపట్నం గ్రామీణం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణ రాయితీ కోసం వినియోగదారులకు మరో అవకాశం కల్పించింది. విద్యుత్తు సర్వీసులకు అధిక విద్యుత్తు వినియోగిస్తుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ 30 వరకు 50 శాతం రాయితీతో అదనపు లోడును క్రమబద్ధీకరించుకునే అవకాశం ఇచ్చింది. మళ్లీ మరో అవకాశంగా డిసెంబరు నెలాఖరు వరకు పొడిగించింది. మీ సేవా కేంద్రాల్లో, విద్యుత్తు సరఫరా సంస్థ వెబ్‌సైట్‌లో కావాల్సిన కిలో వాట్‌కు తగిన సొమ్ము చెల్లించి అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవచ్చు. వినియోగదారులు ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు క్రమబద్ధీకరించుకోవచ్చని అధిక లోడు వాడకంపై జరిమానాల బారిన పడకుండా చూసుకోవాలని ఇబ్రహీంపట్నం సహాయక ఇంజినీరు వెంకన్న తెలిపారు.

భోజన పథకానికి ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలి

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం, ఆయాల సంఘం మండల సమావేశాన్ని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం.త్యాగరాజు, ఎస్‌కే.నాగుల్‌మీరా ఆధ్వర్యంలో గంపలగూడెంలో ఆదివారం నిర్వహించారు. భోజన పథకానికి గ్యాస్ ఉచితంగా సరఫరా చేయాలని, విద్యార్థికి రూ.20 చొప్పున మెనూ ధర చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. కార్మికులకు ఏకరూప దుస్తులు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



నినాదాలు చేస్తున్న వంట ఏజెన్సీ సభ్యులు, ఆయాలు, ఏఐటీయూసీ నాయకులు

లేబర్ కోడ్ల రద్దుకు డిమాండ్

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కార్మికుల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను విస్సన్నపేట బస్టాండ్ సెంటర్‌లో దగ్ధం చేస్తూ సీఐటీయూ శ్రేణులు నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు జ్ఞాన రత్నం, నాయకులు రాము, నాగేశ్వరరావు, సుబ్బారావు, కన్నయ్య పాల్గొన్నారు.


విస్సన్నపేటలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ శ్రేణులు

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

చందర్లపాడు: తోటరావులపాడు, ఏటూరు మధ్య రోడ్డు అభివృద్ధి పనులను చింతలపాడులో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆదివారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించేందుకు రహదారి ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు.

పంటల నష్టంపై నివేదిక

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఈ నెల మొదటి వారంలో వచ్చిన మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో జరిగిన పంట నష్టాన్ని అధికారులు అంచనా వేశారు. ఈ- పంట నమోదు ఆధారంగా వరి, పత్తి నష్టాన్ని అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి వి.హరీష్ కుమార్ తెలిపారు. పత్తి, వరి రైతులకు రూ.6.29 కోట్ల వరకు పంట నష్టం వాటిల్లిందని నివేదిక పంపించారు. ప్రభుత్వం పరిహారం విడుదల చేస్తే బాధిత కర్షకులకు ఎకరాకు రూ.6,800 చొప్పున చెల్లిస్తారు.

మార్గంలో ఇలా.. రాకపోకలు ఎలా?

విజయవాడ- విస్సన్నపేట మార్గంలో పిచ్చిపొదలు పెరిగి తారురోడ్డుపైకి చొచ్చుకొస్తున్నాయి. దీంతో కళాశాలల బస్సులు, చిన్న వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలువురు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. అసలే గుంతలమయంగా తయారైన రోడ్డులో రాకపోకలు సాగించలేక పోతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఈ రహదారిలో పడిన గోతులకు మరమ్మతులు, రోడ్డుకు ఇరువైపుల పెరిగిన పొదలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**



ప్రజలకు అండగా ఉంటా

గొల్లపూడి, న్యూస్‌టుడే : ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు పేర్కొన్నారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని గొల్లపూడిలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కేకు కోసి సందడి చేశారు.


మహిళకు మూడు చక్రాల వాహనం అందిస్తున్న సుబ్బారావు

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. వేకువ జాము నుంచి ఆలయ క్యూలైన్లు రద్దీగా మారాయి. ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ మార్గాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి.

కన్నారావుకు తెదేపా శ్రేణుల నివాళి

మైలవరం, న్యూస్‌టుడే : అనారోగ్యంతో శనివారం మృతి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి కన్నారావు మృతదేహానికి తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆదివారం నివాళులర్పించారు. నాయకులు లితీష్, బాలకృష్ణ, వెంకట నారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో చోదకుడి మృతి

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న చోదకుడు గరిడేపల్లి చిన్నపుల్లయ్య(42) మృతి చెందాడు. గ్రామానికి చెందిన కె.కొండలరావుకు చెందిన ట్రాక్టర్‌కు చిన్నపుల్లయ్య డ్రైవర్‌గా ఉన్నాడు. మధ్యాహ్నం ట్రాక్టర్ నడుపుతుండగానే ప్రమాదవశాత్తు సీటు నుంచి జారి టైర్ల కింద పడిపోయి అక్కడికక్కడే చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గంపలగూడెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


చిన్నపుల్లయ్య మృతదేహం

ఆదమరిస్తే అంతే ఇక

గొల్లపూడి వన్‌సెంటర్ రోడ్డులోని గొయ్యి ప్రమాదకరంగా మారింది. తాగునీటి పైప్‌లైన్ వాల్వ్ కోసం కొన్ని రోజుల కిందట పంచాయతీ సిబ్బంది దాన్ని తవ్వారు. ఆ తర్వాత పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా తయారైంది. నిత్యం ఈ మార్గంలో వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పాఠశాల విద్యార్థులు, చిన్నారులు అటుగానే వెళ్తున్నారు. కొంత మంది అందులో పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దాన్ని పూడ్చించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**



గొలుసు దుకాణాలను నిర్మూలించండి

తిరువూరు టౌన్: తిరువూరు పట్టణ, మండల పరిధిలో గొలుసు దుకాణాల్లో 24 గంటలు మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలోనే ఇవి ఎక్కువగా ఉన్నాయి. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందజేసిన సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు, అబ్కారీ శాఖ అధికారులు స్పందించి గొలుసు దుకాణాలను పూర్తిగా నిర్మూలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

గోపాలపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని గోపాలపురం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై జి.మహాలక్ష్మణుడు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.4,810 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్కడైన జూదాలు, కోడి పందేలు నిర్వహిస్తుంటే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వీధి కుక్కలకు ఆహార తొట్టెలు



నగరాల్లో వీధికుక్కల బెడద తీవ్రమవుతుండటంతో వాటికి వీధుల్లో ఎక్కడపడితే అక్కడ ఆహారం పెట్టకుండా కట్టడి చేయాలని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఈ దిశగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వీధికుక్కలకు ఆహారం అందించేందుకు నగరంలో దాదాపు 60 ప్రాంతాల్లో కుండీలను ఏర్పాటు చేసింది. ఆహారం వేసేందుకు వెడల్పు, నీటి కోసం చిన్నపాటి కుండీలను ఏర్పాటు చేసింది. స్థానికులు వీధికుక్కలకు ఆహారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా.. ఈ కుండీల్లో ఉంచితే క్రమంగా అలవాటు పడతాయి. తద్వారా వీధుల్లో వాటి సంచారం కాస్త తగ్గనుంది. – ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే-విజయవాడ నగరపాలక సంస్థ

వాడని ఖాతా... బతికిందిలే!

బ్యాంకు పొదుపు ఖాతాల్లో లావాదేవీలు పదేళ్లుగా నిలిచిపోయాయా.. వాడుకలోలేని ఖాతాగా బ్యాంకు నిర్ణయించి అందులోని మొత్తాలు ఆర్బీఐకి బదిలీ చేసిందా.. డబ్బు వెనక్కి రాలేదని, అది ఎలా వస్తాయని చింతిస్తున్నారా.. అలాంటి ఖాతాల కోసం ఆర్బీఐ కొత్తగా ఓ పథకాన్ని ప్రకటించింది. దీంతో నిలిచిపోయిన ఖాతాతోపాటు అందులోని డబ్బు కూడా వెనక్కి వచ్చేస్తుంది.

దేశంలో 2025 జూన్ నాటికి భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.67,000 కోట్లకు పైగా క్లెయిమ్ చేయని మొత్తాలు పొదుపు ఖాతాల్లో ఉన్నట్లుగా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల ప్రకటించింది. పదేళ్లకు పైగా నిరుపయోగంగా ఉన్న ఖాతాల్లోని మొత్తాన్ని బ్యాంకులు ఆర్బీఐకు బదిలీచేస్తాయి. ఈ డిపాజిట్ల చెల్లింపులను సులభతరం చేసేందుకు ఆర్బీఐ ఈ ఏడాది అక్టోబరు 1న కొత్త పథకాన్ని ప్రారంభించింది. 2026 సెప్టెంబరు 30 వరకు ఇది అమలులో ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో పెద్దసంఖ్యలో నిరుపయోగంగా ఉన్న బ్యాంకు ఖాతాలను తెరిచి వాటిలో మొత్తాలు తిరిగి పొందేందుకు ప్రజలకు ఇది చక్కని అవకాశం. వ్యక్తిగతంగా, సంస్థల పేర్లతో ఉన్న ఖాతాలు తిరిగి తెరవొచ్చు.



మీ ధనం మీ హక్కు..

అవగాహన లేక దీర్ఘకాలం నుంచి క్లెయిమ్ చేయని బీమా పాలసీలు, బ్యాంకు డిపాజిట్లు, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ రాబడులతో సహా గడువు ముగిసిన ఖాతాల్లోని మొత్తాన్ని తిరిగి పొందేలా కేంద్రం ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'మీ ధనం మీ హక్కు' పేరుతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించిన ఈ అవగాహన కార్యక్రమం మూడు నెలలు (అక్టోబరు నుంచి డిసెంబరు) దాకా కొనసాగుతుంది.

- లావాదేవీలు నిలిచిపోయిన పొదుపు ఖాతాలను నిర్దేశించిన కాల వ్యవధి తరువాత బ్యాంకులు పక్కన పెట్టి వాటిలో మొత్తాలను ఆర్బీఐకి పంపుతాయి.
- ఇలాంటి మొత్తాలు ఆర్బీఐ ఆధ్వర్యంలోని డిపాజిట్ ఎడ్యుకేషన్, అవేర్‌నెస్ (డీఈఏ) నిధిలో జమవుతాయి.
- ఖాతాల నిర్వహణ, ఇతర అనేక అంశాలపై ఖాతాదారుల్లో అవగాహన కల్పించేందుకు నిధులు ఖర్చు చేస్తారు.
- దేశవ్యాప్తంగా క్లెయిమ్ చేయని ఇలాంటి మొత్తాలు ఆర్బీఐ వద్ద రూ.వేల కోట్లకు చేరుకోవడంతో సులభతర విధానంలో ఖాతాదారులు తిరిగి పొందేలా ఏర్పాట్లు చేశారు.

పోర్టల్‌లో వివరాలు తెలుసుకోవచ్చు...

- లావాదేవీలు నిలిచిపోయిన పొదుపు ఖాతాల వివరాలు ఖాతాదారులు కూడా తెలుసుకునేందుకు ఉద్గం (యూడీజీఏఎం) పేరుతో ఆర్బీఐ పోర్టల్ ప్రారంభించింది.
- ఖాతాదారులు https://udgam.rbi.org.in పోర్టల్‌లోవారి పేరు, మొబైల్ నంబరుతో రిజిస్టర్ అవ్వాలి. తదుపరి మరిన్ని వివరాలు అప్‌లోడ్ చేసి పలు బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని మొత్తాల వివరాలు తెలుసుకోవచ్చు.
- 2024 మార్చి 4 నాటికి 30 బ్యాంకుల వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.
- ఖాతాల వివరాలు తెలుసుకోవడానికే పోర్టల్ ఉపయోగపడుతుంది.
- ఖాతా తిరిగి వినియోగంలోకి వచ్చి, అందులోని మొత్తాలు తిరిగి తీసుకోవాలంటే సంబంధిత బ్యాంకు బ్రాంచికి వెళ్లాల్సిందే.

బ్యాంకులకూ ప్రోత్సాహకాలు

4-10 ఏళ్లుగా వాడుకలోని పొదుపు ఖాతాలు తిరిగి తెరిపించేందుకు కృషి చేసే బ్యాంకులకు ఆర్బీఐ ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఖాతాల నిరుపయోగ కాల పరిమితిని బట్టి ప్రోత్సాహక రుసుం కూడా మారనుంది. బ్యాంకు సిబ్బంది తమ పరిధిలోని ఖాతాలను గుర్తించి సంబంధిత చిరునామాకు వెళ్లి ఖాతాదారులు, వారి వారసుల నుంచి అవసరమైన వివరాలు, పత్రాలు సేకరించి ఖాతాలు తిరిగి తెరవాలి. - ఈనాడు, అమరావతి



'ఆటో బ్యూటీ' వీడియోకు 10 కోట్ల వ్యూస్!

ఓ యువతి ఆటోలో కూర్చొని తీసుకున్న రెండు సెకన్ల వీడియో ఇప్పుడు 'ఎక్స్'లో 10 కోట్లకు పైగా వ్యూస్‌తో దేశం మొత్తాన్ని ఆకర్షిస్తోంది. 'బజ్ వైజర్' పేరిట ఖాతా ఉన్న యువతి నవంబరు 2న 'ఆటోలో మేకప్ చాలా బాగా వచ్చింది' అనే వ్యాఖ్యతో ఆ వీడియో పోస్టు చేసింది. 100 మిలియన్లకు పైగా వ్యూస్, 1.25 లక్షల లైకులతో వీడియో ఇంకా దూసుకుపోతోంది. దీంతో పలు మీడియా సంస్థలు ఆరా తీయగా ఆమె పేరు ప్రియాంగా అని తెలిసింది. తన వీడియో ఇంత వైరల్ కావడాన్ని ఆమే నమ్మలేకపోతోంది. ఈ ఆదరణతో ప్రియాంగా మామూలు యూజర్ నుంచి వెరిఫైడ్ యూజర్‌గా మారిపోయింది. 'ఎక్స్' ఖాతాకు బ్లూటిక్ కూడా లభించడంతో "ఆమెకు వచ్చే ఆదాయం భారత ఆర్థికవ్యవస్థకు డాలర్లను సమకూర్చి పెడుతుంది" అని ఓ నెటిజను వ్యాఖ్యానించారు. –ఇంటర్నెట్ డెస్క్



ఇది డైనోసార్‌ల కాలం నాటి మొక్క

డైనోసార్‌లు జీవించినప్పటి నుంచి భూమండలంపై ఉన్న మొక్క ఇది. అవి అంతరించినా ఈ మొక్క మాత్రం నేటికీ తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. పదేళ్ల క్రితం అటవీ శాఖ అధికారులు శేషాచలం అడవుల్లో దీన్ని కనుగొన్నారు. ఎర్రచందనం మాదిరిగానే.. శేషాచలం అడవుల్లో మాత్రమే పెరిగే అరుదైన పుష్పించని జాతి మొక్క ఇది. అందుకే దానికి సైకస్ శేషాచలమెన్సిస్ అని నామకరణం చేశారు. ఈ మొక్క విత్తనాలు వాటి పత్రాల్లో వజ్రాల్లా మెరుస్తూ తయారవుతాయి. ఈ తరహా మొక్కల సంతతిని వృద్ధి చేయడానికి వైఎస్సార్ కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయ బొటానికల్ గార్డెన్ బాధ్యులు డా.మధుసూదన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. చిత్తూరు జిల్లా శేషాచలం కొండలు, చామలశ్రేణి, భాకరాపేట అటవీ ప్రాంతంలోని మయూర సరోవరం వద్ద విత్తనాలు సేకరించారు. ప్రస్తుతం వర్సిటీలోని బొటానికల్ గార్డెన్‌లో వీటిని పెంచుతున్నారు. అరుదైన మొక్కలను అందరికీ అందించేలా విత్తన బ్యాంకు సృష్టిస్తున్నట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. – ఈనాడు, కడప

వయసు 83.. పతకాలు 122



ఆయన వయసు 83. మాస్టర్ అథ్లెటిక్స్‌లో హ్యామర్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. ఇప్పటి వరకు వివిధ స్థాయుల్లో 122 పతకాలు సాధించారు. గుంటూరుకు చెందిన వేసపోగు దివాకర్‌ది తెనాలి సమీపంలోని చదలవాడ గ్రామం. చిన్నప్పటి నుంచే కబడ్డీ అంటే ఇష్టం. 9వ తరగతి చదువుతున్నప్పుడు ప్రమాదవశాత్తు కంటి చూపు పాక్షికంగా దెబ్బతింది. దీంతో చదువుకు, క్రీడలకు స్వస్తి చెప్పి గుంటూరులోని ఆఫీసర్స్ క్లబ్‌లో అటెండర్‌గా చేరారు. తొలుత కుమారుడు, 2018లో భార్య మృతి చెందడంతో ఒంటరి వారయ్యారు. క్రీడల్లో రాణించాలనే పట్టుదలతో కోచ్ శివాజీని సంప్రదించి రోజూ 2-3 గంటలు సాధన చేసి అథ్లెటిక్స్‌లో పట్టు సాధించి పతకాలు కొల్లగొడుతున్నారు. -న్యూస్‌టుడే, గుంటూరు

దివ్యాంగులకు కాళ్లూ చేతులై..



కాలు లేక దివ్యాంగుడు పడుతున్న అవస్థలు చూసిన యువకుడు అలాంటి వారికి తన వంతు సహాయం అందించాలని సంకల్పించారు. ఓ స్వచ్ఛంద సంస్థలో చేరి కృత్రిమ అవయవాల తయారీలో నైపుణ్యం సాధించారు. సేవా దృక్పథంతో లాభాపేక్ష లేకుండా కృత్రిమ అవయవాలు తయారు చేస్తున్నారు. నిర్మల్ జిల్లా తానూరు మండలం కోలూరు గ్రామానికి చెందిన పాంచాల్ శ్యాం చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి లక్ష్మి కాయకష్టం చేసి కుమారుడు, కుమార్తెను ఏ లోటు లేకుండా పెంచారు. ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన శ్యాం దివ్యాంగుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలో నెలకు రూ.300 వేతనంతో చేరారు. ఆయన ఆసక్తి గుర్తించిన సంస్థ చెన్నైలోని ముక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల తయారీపై శిక్షణ ఇప్పించింది. శ్యాం ప్రతిభను గుర్తించిన ట్రస్ట్ అవయవాల తయారీలో నూతన విధానాలు, ఆకృతులపై అధ్యయనానికి దక్షిణాఫ్రికా, శ్రీలంక దేశాలకు పంపించింది. అనంతరం



ఇంటికి చేరుకున్న ఆయన దాదాపు పదేళ్లుగా లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్ వారు నిర్వహించే శిబిరాలకు వెళ్లి పక్షవాతం, పోలియో, ప్రమాదాల్లో కాళ్లు, చేతులు కోల్పోయిన బాధితులకు డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాల మేరకు తక్కువ బరువు గల హెచ్‌డీపీఈ కృత్రిమ అవయవాలు అమరుస్తున్నారు. తయారీకయ్యే ఖర్చులు మాత్రమే తీసుకుంటున్నారు. సాధారణంగా బయట కొనుగోలు చేస్తే రూ.30,000-రూ.40,000 ఖర్చు ఉంటుంది. కానీ ఆయన కేవలం రూ.4-6 వేల లోపే తీసుకుంటున్నారు. ఇలా ఇప్పటి వరకు దాదాపు 5 వేల మందికి అమర్చారు. పేదలకు ఉచితంగానే ఇస్తున్నారు. ఉచితంగా వెయ్యి మందికి కృత్రియ అవయవాలు అమర్చారు. –న్యూస్‌టుడే, భైంసా

భలే.. భలే.. బ్లాక్ క్యారెట్



సాధారణంగా అందరూ నారింజ రంగు గల క్యారెట్లనే అధికంగా తింటూ ఉంటారు. కానీ, వీటిలో మరో రకం నల్ల రంగు క్యారెట్ గురించి చాలా తక్కువ మందికి తెలుసు. ఉత్తర భారతదేశంలో ఎక్కువగా పండించే వీటి సాగుకు తమిళనాడులోని నీలగిరి జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు కూడా శ్రీకారం చుట్టారు. దిల్లీ నుంచి విత్తనాలు తెచ్చి, కున్నూర్‌లోని సిమ్స్ పార్కు నర్సరీలో పైలట్ ప్రాజెక్టుగా సాగు చేపట్టారు. ఈ పంట మూడు నుంచి మూడున్నర నెలల్లో చేతికొస్తుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో వీటిని కేకుల తయారీకి ఉపయోగిస్తుంటారు. దీనిపై ఉద్యానవన శాఖ అధికారులు మాట్లాడుతూ.. బ్లాక్ క్యారెట్ రోగ నిరోధక శక్తిని పెంచుతుందని చెప్పారు. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుందని, జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి సహాయపడుతుందని తెలిపారు. – న్యూస్‌టుడే, చెన్నై

సాహసం మా పథం... అడవిలో అద్భుతం!



పిల్లల నుంచి పెద్దల వరకు సకుటుంబ సపరివార సమేతంగా విహరించేలా.. పెద్దపులుల అభయారణ్యాల్లోని జంగిల్ సఫారీలు చలికాలంలో రమ్మంటూ ఆకర్షిస్తున్నాయి. తెలుగురాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా ఈ సఫారీలున్నాయి. ఇవి పర్యాటక ప్రదేశాలు మాత్రమే కాదు.. పిల్లలకు ప్రకృతిని దగ్గరగా చూసే అవకాశం, పెద్దలకు ప్రశాంతత, కుటుంబానికి అద్భుత అనుభవాన్ని అందిస్తున్నాయి. జూలు విదిల్చే సింహాలు, గర్జించే పెద్దపులులు, రైనోలు విహరించే మైదానాల నడుమ సఫారీ అనుభూతులు జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకాలవుతాయి. కుటుంబమంతా కలిసి జీప్‌లో అభయారణ్యాల్లో అడుగుపెడితే- గాలి వాసన కూడా కథ చెబుతుంది. పుస్తకాల్లో అడవులు, జంతువుల గురించి నేర్చుకున్న పిల్లలు తమ కళ్లతో ప్రకృతిని చదవడం నేర్చుకుంటారు.

రణథంబోర్ రాజసం

రాజస్థాన్‌లోని ఆరావళి, వింధ్య పర్వతాల మధ్యలో ఉన్న ఈ టైగర్ రిజర్వ్.. కుటుంబంతో సఫారీకి అద్భుత గమ్యస్థానం. రాజసం ఉట్టిపడే రాయల్ బెంగాల్ టైగర్లు, చిరుతలు, ఎలుగుబంట్లు, మూడొందలకి పైగా పక్షి జాతులకు నెలవిది. టైగర్ సఫారీ, రణథంబోర్ రాజుల కోట, పక్షుల వీక్షణ ప్రధాన ఆకర్షణలు.

ఉత్తమ సమయం: నవంబరు-జూన్

జిమ్ కార్బెట్‌లో...

ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ జాతీయ ఉద్యానవనం దేశంలోనే మొట్టమొదటిది. ఇందులో ఏడు సఫారీ జోన్లు ఉన్నాయి. ఇక్కడ పెద్దపులులు, ఏనుగులు, వందల పక్షులు కనిపిస్తాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సఫారీ బాగుంటుంది.

ఉత్తమ సమయం: నవంబరు-జూన్

కజిరంగా... అన్నీ ఒకేచోట!

అస్సాంలోని బ్రహ్మపుత్ర నది పరీవాహక ప్రాంతంలో ఉన్న ఈ అడవి ప్రకృతి ప్రేమికుల స్వర్గం. ఏనుగు సఫారీ, ఖడ్గమృగాలకు ప్రత్యేకమిది. ఏనుగులపై ఎక్కి అడవిలో తిరుగుతూ- వన్యప్రాణులు, పక్షులను చూడొచ్చు. ఏనుగులు, ఖడ్గమృగాలు, పెద్దపులులు, చిరుతలు.. ఇలా అనేక రకాల వన్యప్రాణులు ఒకేచోట కనిపిస్తాయి.

ఉత్తమ సమయం: నవంబరు-ఏప్రిల్

ఆకట్టుకునే... కన్హా, పన్నా

మధ్యప్రదేశ్‌లోని కన్హా అభయారణ్యం 'ది జంగిల్ బుక్'కు స్ఫూర్తినిచ్చింది. పెద్దపులులు, జింకలు, చిరుతలు, సాల చెట్ల అడవులతో దృశ్యాలు అద్భుతంగా ఉంటాయి. ట్రెక్కింగ్ కూడా ఉంటుంది. రాష్ట్రంలోని మరో అభయారణ్యం పన్నా టైగర్ రిజర్వు. ప్రస్తుతం ఇక్కడ 80కి పైగా పెద్దపులులున్నాయి. జలపాతాలు, గుహలు, పచ్చని లోయలు, పెద్దపులులతో సందర్శకుల్ని ఆకర్షిస్తోంది.

ఉత్తమ సమయం: నవంబరు-మే

బాంధవ్‌గఢ్.. అడుగుకో పులి

పులి దర్శనం పక్కాగా కావాలంటే మధ్యప్రదేశ్‌లోని ఈ టైగర్ రిజర్వుకు వెళ్లొచ్చు. అత్యధిక పులులున్నట్లు ప్రసిద్ధి చెందిన ఈ ఉద్యానవనంలో కెమెరా పట్టుకుంటే.. పక్షులు, వృక్షజాలం..ఇలా ప్రతి ఫ్రేమ్‌లో అద్భుత దృశ్యాలను బంధించొచ్చు.

ఉత్తమ సమయం: అక్టోబరు-జూన్

గిర్.. సింహాల రాజ్యం

దేశంలో సింహాల రాజ్యం గుజరాత్‌లోని గిర్‌లో ఉంది. ఆసియా సింహాలు స్వేచ్ఛగా సంచరించే ఏకైక ప్రదేశమిది. దగ్గరలో పట్టణాలు, గ్రామాలు కూడా ఉన్నాయి. చిరుతలు, జింకలు, పక్షులు ఉండే ఈ అభయారణ్యం కుటుంబ సఫారీకి సురక్షితమైన ప్రదేశం.

ఉత్తమ సమయం: డిసెంబరు-మార్చి

పేంచ్.. మంచి గమ్యస్థానం

మధ్యప్రదేశ్ పేంచ్ నది తీరంలో విస్తరించిన ఈ అభయారణ్యంలో పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, 250 పక్షి జాతులతో కుటుంబ పర్యటనకు మంచి గమ్యస్థానం.

ఉత్తమ సమయం: ఫిబ్రవరి-మే

తాడోబా.. తెలంగాణకు వలస

మహారాష్ట్రలో పురాతన, విస్తారమైన అభయారణ్యమిది. పెద్దపులులు, చిరుతలు, బైసన్‌లు, పక్షులు.. ప్రకృతి ఫొటోగ్రాఫర్లు పండగ చేసుకునే ప్రాంతమిది. పెద్దసంఖ్యలో పులులుంటాయి. ఇక్కడి నుంచి తెలంగాణకు పులులు వలస వస్తుంటాయి.

ఉత్తమ సమయం: నవంబరు-మే

అమ్రాబాద్.. పులులు, లోయలు..

తెలంగాణ నల్లమల అడవుల్లో భాగమైన అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద టైగర్ రిజర్వ్‌లలో ఒకటి. ఈ అడవిలో పెద్దపులులు, చిరుతలు, అడవి పందులు, నీల్గాయిలు, 300కి పైగా పక్షి జాతులు కనిపిస్తాయి. చెరువులు, లోయలు, ఎత్తయిన కొండలతో కూడిన ఈ అడవిలో కుటుంబ సఫారీ ప్రశాంతమైన, సాహసభరితమైన అనుభవం. అడవిలో టైగర్ ట్రాకింగ్, నేచర్ ట్రయల్ వాక్స్ ఉంటాయి.

ఉత్తమ సమయం: నవంబరు-మే

ఆకట్టుకునే శ్రీశైలం

ఆంధ్రప్రదేశ్ నల్లమల అడవుల్లోని శ్రీశైలం టైగర్ రిజర్వ్.. పెద్దపులులు, చిరుతలు, సాంబర్ జింకలు, అడవి పందులు, పక్షులు సమృద్ధిగా కనిపించే ప్రదేశం. దేశంలోనే విస్తీర్ణం ఎక్కువగా ఉన్న టైగర్ రిజర్వ్‌లలో ఒకటి. శ్రీశైలం ఆలయం, జీప్ సఫారీ, కృష్ణా నది వీక్షణ, వన్యప్రాణి ఫొటోగ్రఫీ మంచి అనుభవాన్నిస్తాయి.

ఉత్తమ సమయం: అక్టోబరు-మే

ప్రణాళిక ముఖ్యం...

- సఫారీకి బుకింగ్ ముందుగానే చేసుకోవాలి. అప్పటికప్పుడు దొరకడం కష్టం అవుతుంది.
- ప్రతి టైగర్ రిజర్వుకు ఓ వెబ్‌సైట్ ఉంది.
- అక్కడకు వెళ్లేవారు పెర్‌ఫ్యూమ్‌లు వాడొద్దు. జంతువులు ఆ వాసనలకు దగ్గరికి వచ్చే ప్రమాదం ఉంటుంది.
- పిల్లలకు జంతు ప్రపంచం గురించి వివరించాలి. మంచి కెమెరాను తీసుకెళ్లాలి.

- ఈనాడు, హైదరాబాద్

మంథనిలో పాల తాత



ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొంది.. 81 ఏళ్ల వయసులో ఆసుపత్రిలో రోగులకు నిత్యం ఉచితంగా పాలు అందిస్తూ పెద్దమనసు చాటుకుంటున్నారు పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన వసంత శర్మ. తెలుగు ఉపాధ్యాయుడిగా 2002లో ఉద్యోగ విరమణ పొందిన ఆయన... తన ఇంటికి సమీపంలోనే ఉన్న మంథని సామాజిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులు, వారి బంధువులకు నిత్యం ఉచితంగా పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఆయన ఈ సేవ కొనసాగిస్తున్నారు. – న్యూస్‌టుడే, మంథని



అందాల తాటిపూడి.. వెళ్లొద్దాం ఓసారి

చుట్టూ పచ్చని కొండలు.. వాటిని తాకుతూ వెళ్లే మేఘాలు.. మధ్యలో వాగుల నుంచి వచ్చే నీరు.. ఓ వైపు స్పిల్‌వే.. మరోవైపు ఫ్లోటింగ్ జెట్టీ.. అరకు, బొర్రాగుహలకు ముఖద్వారంగా అందాలతో దోబూచులాడే ఆహ్లాదకర కేంద్రంగా రూపుదిద్దుకుంది విజయనగరం జిల్లాలోని తాటిపూడి జలాశయం. 3.17 టీఎంసీల నీటిమట్టంతో ఉన్న ఈ ప్రాజెక్టులో బోటు షికారు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వారాంతాలు, సెలవు రోజుల్లో పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. – ఈనాడు, విజయనగరం

3 యుగాల మందిరం మూడు ముళ్లకు ప్రసిద్ధం



జీవితంలో కీలక ఘట్టమైన వివాహాన్ని ప్రత్యేకంగా, కలకాలం గుర్తుండేలా జరుపుకోవాలని చాలామంది కలలు కంటారు. ఇలాంటివారికి ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో గల త్రియుగీ నారాయణ మందిరం విశిష్టమైన వివాహ వేదికగా మారుతోంది. మూడు యుగాలకు సాక్షిగా భావించే ఈ పుణ్యక్షేత్రంలో శివపార్వతుల కల్యాణం జరిగినట్లుగా స్థలపురాణం చెబుతారు. విష్ణుమూర్తి కొలువైన ఈ ఆలయం ముందున్న అఖండ ధుని (హవన కుండం) నిత్యం వెలుగుతూనే ఉంటుంది. ఇక్కడికి వచ్చే భక్తులు దీనికి కలపను సమర్పిస్తుంటారు. ఆలయం ఎదురుగా బ్రహ్మశిల, చుట్టూ నాలుగు స్నానఘట్టాలు ఉన్నాయి. ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇక్కడ పెద్దసంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతాయి. ఈ మందిరం అద్భుతమైన 'వెడ్డింగ్ డెస్టినేషన్' అని స్వయానా ప్రధాని మోదీ రెండేళ్ల కిందట చెప్పిన మాటలతో ఇక్కడ పెళ్లి వేడుకలు జరుపుకోడానికి యూపీ, హరియాణా, దిల్లీ తదితర ప్రాంతాల నుంచి ఎక్కువమంది వస్తున్నారు. దీంతో స్థానికులకు ఉపాధి లభిస్తోందని తీర్థ పురోహిత్ సమితి ఛైర్మన్ సచ్చిదానంద పంచపురి తెలిపారు. కేదార్‌నాథ్ యాత్ర మార్గంలోని సోన్‌ప్రయాగ్ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. –ఈటీవీ భారత్

స్టాక్ మార్కెట్‌ను జూదంలా చూడొద్దు



స్టాక్ మార్కెట్‌ను జూదంలా భావించేవారు తమ షేర్లకు కొంత లాభం కనపడగానే అమ్మేస్తుంటారు. అలాంటివారు సంపన్నులు కాలేరు. కానీ స్టాక్ మార్కెట్‌ను పెట్టుబడి సాధనంగా చూసేవారు దీర్ఘకాలిక ప్రణాళికతో కొన్నేళ్ల పాటు తమ షేర్లను కొనసాగిస్తారు. అలాంటివారే పెద్ద మొత్తంలో సంపదను సొంతం చేసుకుంటారు. – జాన్ హెన్రీ, ఇన్వెస్టర్

ఊరంతా పందిరి సాగే!





రెండు దశాబ్దాల క్రితం కొంతమంది రైతులకు వచ్చిన ఆలోచన ప్రస్తుతం ఆ గ్రామ స్వరూపాన్నే మార్చేసింది. పందిరి విధానంలో కూరగాయలు సాగు చేస్తూ వారి ఆర్థిక స్వయం సమృద్ధికి బాటలు వేసింది. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పి.గుడిపాడులో గతంలో ఎక్కువ మంది వాణిజ్య పంటలు సాగు చేసేవారు. వస్తే అధిక లాభాలు.. లేదంటే తీవ్ర నష్టాలతో సతమతమయ్యేవారు. స్థిరమైన ఆదాయం కోసం వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించగా పందిరి విధానంలో కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. దీంతో కొందరు కర్షకులు పందిరి సాగులో ప్రసిద్ధి చెందిన నారాకోడూరు వెళ్లి పరిశీలించారు. అనంతరం పి.గుడిపాడులో తొలుత 20 ఎకరాల్లో కర్ర పందిరితో దొండ, కాకర సాగు చేశారు. వాటిలో లాభాలు రావడంతో మిగిలినవారూ దీనివైపు మొగ్గు చూపారు. 2014లో తెదేపా ప్రభుత్వం రాళ్లతో కూడిన శాశ్వత పందిళ్లకు రాయితీ అందించింది. ప్రస్తుతం గ్రామంలో 550కు పైగా ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తుండగా అందులో 480 ఎకరాల్లో పందిరి సాగు చేస్తున్నారు. దీని ద్వారా దొండ, కాకర, సొర, బీర పండిస్తున్నారు. – న్యూస్‌టుడే, మేదరమెట్ల

వసుంధర

vasundhara@eenadu.in

అమ్మానాన్న ఉద్యోగులు కావడంతో పది వరకూ అమ్మమ్మ దగ్గరే చదివా. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నా. చదువుమీద ఏమాత్రం శ్రద్ధ చూపలేక పోతున్నా. కారణం అమ్మానాన్నలే. అస్తమానం గొడవలే. వాళ్ల దగ్గర పెరగక పోవడం వల్లేమో ప్రేమగా పలకరించడం, మాట్లాడటం వంటివే ఉండవు. ఈ వాతావరణంలో నేను ఉండలేను. ఈ విషయం గురించి వాళ్లతో ఎలా మాట్లాడాలి? - ఓ సోదరి

అమ్మానాన్నల దగ్గర ఉండలేను!

అమ్మానాన్నలు బిజీగా ఉన్నా... నీకు కనీసం అమ్మమ్మ తోడు దొరికింది. ఆవిడ మీ అవసరాలు చూస్తూ నిన్ను ప్రేమగా పెంచారు. ఇప్పుడిక చదువు కోసమని అమ్మానాన్నల దగ్గరికి వచ్చావు. నువ్వూ పెద్దయ్యావు కదా! అందుకే నీ తల్లిదండ్రులూ నీకేం కావాలో నువ్వు చూసుకోగలవు అని భావిస్తుండొచ్చు. కానీ ఆ వాతావరణం నిన్ను ఆనందానికి దూరం చేస్తోంది. అమ్మానాన్నల నిర్లక్ష్యం, వాళ్ల మధ్య సఖ్యత లేకపోవడం, తరచూ పోట్లాటలు... పిల్లల మీద తప్పక ప్రభావం చూపుతాయి. అయితే... నువ్వూ ఇప్పుడు కాస్త పెద్దమ్మాయివే! కాబట్టి, అమ్మానాన్నలతో విడివిడిగా మాట్లాడు. వాళ్ల నుంచి ఏం ఆశిస్తున్నావో, ఏం కోల్పోతున్నావో, చదువు మీద ఎలా దృష్టిపెట్టలేక పోతున్నావో చర్చించు. నువ్వు చెప్పగానే వాళ్లు అర్థం చేసుకుంటారనీ ఆశించొద్దు. తిరిగి కొప్పడొచ్చు కూడా. అయినా ప్రయత్నించు. అవసరమైతే అమ్మమ్మ సాయం తీసుకో. అప్పటికీ ప్రయత్నాలు విఫలమైతే... పరిస్థితులన్నీ మనకు అనుకూలంగా ఉండవని అర్థం చేసుకుని, నిన్ను నువ్వు మార్చుకునే ప్రయత్నం చెయ్యి. లక్ష్యాలు, వ్యాపకాలకు ప్రాధాన్యమిస్తూ... ఇంట్లో వాతావరణ ప్రభావం నీపై పడకుండా చూసుకో. లక్ష్యాలను చిన్నగా విభజించుకో! వాటిని సాధిస్తుంటే నీకూ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అది చూసి మీ అమ్మానాన్నలూ మారొచ్చు. నిన్ను అర్థం చేసుకునే ప్రయత్నమూ జరగొచ్చు. అప్పటివరకూ సహనం, పట్టుదలతో నచ్చింది చెయ్యి. నిరాశతో ఏదీ సాధించలేం. ముందు దాన్ని తరిమెయ్యి.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

మహిళలు వృత్తి, ఉద్యోగాల్లో ఎంత ఉన్నత స్థాయికి వెళ్లినా... ఇంట్లో కొన్ని బాధ్యతలు వాళ్లకు సవాలుగా నిలుస్తుంటాయి. జూనియర్ స్థాయిలో ఉద్యోగినులు మానేయకుండా, కొన్ని చర్యలు చేపడుతూ వాళ్లను ఉన్నత స్థానాలకు చేర్చేందుకు సంస్థలో ఎన్నో మార్పులు తెస్తున్నాం.



– నైరికా హోల్కర్
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,
గోద్రెజ్ అండ్ బాయ్స్



అది 'ట్రావెల్ డిస్మోర్ఫియా'నే..!

ఒత్తిడి, బర్నవుట్, ఆందోళన... వీటన్నింటికీ పరిష్కారం ఏంటంటే? 'ఓ మంచి ట్రిప్పు' అని ఠక్కున చెప్పేస్తున్నారు ఇప్పటితరం అమ్మాయిలు. అందుకే వారాంతాల్లో, ఖాళీ దొరికినప్పుడే కాకుండా... జీవనశైలిలో ఏ కాస్త ఇబ్బంది కలిగినా ప్రయాణాలు చేయడానికి ఇష్టపడుతున్నారు. దీన్నో ట్రెండ్‌గానూ ఫాలో అయిపోతున్నారు. కానీ తిరిగొచ్చాక నిస్సత్తువ ఆవరిస్తోంది. చుట్టూ ఉన్న వ్యక్తులు నచ్చడం లేదు. ప్రయాణంలో దొరికే సౌలభ్యాలకి అలవాటు పడి... ఇంటి, ఆఫీస్ వాతావరణం బోరింగ్‌గా అనిపిస్తుంది. మళ్లీ ఓ ట్రిప్ వేసే వరకూ ఇవే భావనలు కొనసాగుతున్నాయి. మీకూ అలానే అనిపిస్తుందా... అయితే అది 'ట్రావెల్ డిస్మోర్ఫియా'నే అంటున్నారు నిపుణులు. వాస్తవాల్ని వక్రీకరించడమే ఇందుకు కారణం. ప్రయాణాల్లో అక్కడి అందాలు, సౌకర్యాలు, పరిస్థితులు, వ్యక్తులు, కొత్త సంప్రదాయాలు తెలుసుకోవడం వల్ల కొత్త ఉత్తేజం వస్తుంది. ఈ సమయంలో డోపమైన్‌ల విడుదల కూడా ఎక్కువే. కానీ సాధారణ జీవనశైలిలో ఇవేవీ ఉండవు. దాంతో వాటిని తలుచుకుంటూ నిస్సత్తువ, నిరాశ ఎక్కువవుతుందట. ఇటీవల జరిగిన ఓ అధ్యయనంలో వెల్లడైన విషయమిది. అయితే, ఇదేమీ మానసిక రుగ్మత కాదు. కానీ, దీనివల్ల రోజువారీ జీవనశైలికి అంతరాయం ఏర్పడుతుంది. అందుకే మనం చేసే పనులేవైనా ఉన్న సమస్యల్ని పరిష్కరించేవిగా ఉండేలా కానీ... కొత్తవి తెచ్చి పెట్టుకునేలా ఉండకూడదు అంటున్నారు నిపుణులు. జీవితంలో దేనికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత దానికి ఇస్తే... ఈ సమస్యలేవీ రావంటున్నారు. నిజమేగా మరి!

క్రికెట్‌లో భారతీయ అమ్మాయిలు అదరగొడుతున్నారు. వన్డే ప్రపంచ కప్ గెలిచి నెల తిరగకముందే మరో ప్రపంచకప్ మన సొంతమైంది. ఈసారి అంధ మహిళలు టీ20 ప్రపంచకప్ విజేతలుగా నిలిచారు. ఈ విభాగంలో ఇదే మొట్టమొదటి ప్రపంచకప్. భారత జట్టులో ఇద్దరు తెలుగమ్మాయిలు ఉన్నారు. వారిలో ఒకరు కెప్టెన్ దీపిక కాగా, మరొకరు కరుణ కుమారి.



దీపిక

అమ్మాయిలు మళ్లీ అదరగొట్టారు!

సెమీస్‌లో అదుర్స్!



ఆంధ్ర- కర్ణాటక సరిహద్దులోని తంబాలహట్టికి చెందిన వ్యవసాయ కూలీలు చిక్కతిమ్మప్ప, చిత్తమ్మ దంపతుల సంతానం దీపిక. తమ జీవితాల్లో వచ్చిన వెలుగుగా భావించి ఆమెకా పేరు పెట్టారు. కానీ వాళ్ల ఆనందం నెలలైనా నిలవలేదు. చేతి వేలు గోరు తగలడంతో అయిదు నెలల ప్రాయంలోనే దీపికకు ఒక కంటి చూపు పోయింది. కొన్నాళ్లు బాధపడ్డా, తర్వాత నుంచి పాపకు మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం ఎంత కష్టమైనా పడాలని నిర్ణయించుకున్నారు. తంబాలహట్టి సత్యసాయి జిల్లా, అమరాపురం మండలం పరిధిలోకి వస్తుంది. సరిహద్దు గ్రామం కావడంతో కర్ణాటకలో విద్యాభ్యాసాన్ని సాగించింది దీపిక. నాలుగో తరగతి వరకు ఓ సాధారణ పాఠశాలలో చదువుకుంది. అంధురాలంటూ అందరూ ఏడిపించడంతో తల్లిదండ్రులతో చెప్పి బాధపడేది. దీపిక భవిష్యత్తు గురించి తల్లిదండ్రులకు ఆందోళనగా ఉండేది. తన కాళ్ల మీద తాను నిలిచేందుకు అన్ని విధాలా సాయపడాలనుకున్నారు. మైసూరు అంధుల పాఠశాలలో చేర్పించి... కూలి పనులు చేస్తూ ఆర్థికంగా అండనిచ్చారు. ఎనిమిదో తరగతి తర్వాత నుంచి క్రికెట్‌లోనూ శిక్షణ తీసుకుంది దీపిక. పదో తరగతిలో ఉండగా అంధుల రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సెంచరీ చేసింది. 2019లో జాతీయ అంధుల మహిళల జట్టు ప్రారంభమైంది. అదే సమయంలో కర్ణాటక జట్టు కెప్టెన్‌గా ఎంపికైంది. ఆపై భారత జట్టులో చోటు సంపాదించింది. 2023లో ఇంగ్లండ్‌లో ప్రపంచ అంధుల మహిళల క్రికెట్ టీ-20 వరల్డ్ గేమ్స్(ఐబీఎస్‌ఏ)లో పాల్గొని అద్భుత ఆటతీరు కనబర్చింది. దాంతో క్రికెట్ కోటాలో ముంబయిలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఉద్యోగం వచ్చింది. తాజా ప్రపంచకప్‌లో కెప్టెన్‌గా, బ్యాటర్‌గా రాణించి జట్టు గెలుపులో కీలకంగా మారింది. లీగ్ దశలో పాకిస్థాన్‌పై 45 పరుగులు చేసింది. సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాపై 58 బంతుల్లో 91పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్‌ను గెలిపించింది.

– ఆర్.రాజగోపాల్, మడకశిర

రోజూ గాయాలే..!

ఊహ తెలిసినప్పట్నుంచీ... వైకల్యం ప్రతిభకు అడ్డంకి కాదని నిరూపించాలనే తపనతో పెరిగింది పంగి కరుణ కుమారి. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలంలోని వంట్ల మామిడి గ్రామం ఈమెది. నాన్న రాంబాబు, అమ్మ సంధ్య. చిన్నప్పటి నుంచి ఈమెకి క్రికెట్ అంటే ఇష్టం. కానీ, ఆడటానికి వెళ్లిన ప్రతిసారీ దెబ్బలు తగిలేవట. ఏడో తరగతి వరకూ స్థానిక పాఠశాలలోనే చదువుకుంది. బోర్డు, పాఠ్య పుస్తకాల్లోని అక్షరాల్ని గుర్తించలేక ఇబ్బందులు పడేదట. దాంతో మధ్యలోనే చదువు ఆపేసింది. తన లాంటి పిల్లలకి విశాఖలో పాఠశాల ఉందని తెలుసుకుని... అక్కడకు వెళ్లి చదువుకోవాలనుకుంది. కానీ, తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. 'ఇంటికి దూరంగా వసతి గృహంలోనే ఉండి చదువుకోవాలి. అసలే రోజులు బాలేవు' అని భయపడ్డారట. అయినా ఆమె వెనకడుగు వేయలేదు. వాళ్లని ఒప్పించి విశాఖపట్నంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ విజువల్లీ ఛాలెంజ్డ్ (బాలికల)లో చేరింది. అక్కడే కోచ్ రవికుమార్ తనకు పరిచయమైంది. క్రికెట్ మీద తనకున్న ఇష్టాన్ని ఆయనకు వివరించింది. 'ప్రత్యేక శిక్షణ తీసుకుంటే క్రికెట్ ఆడొచ్చని చెప్పారు కోచ్. ఆ రోజు నా ఆనందానికి అవధుల్లేవు. ఎలాగైనా ఆటలో రాణించాలనుకున్నా. కానీ నాది బీ1(80శాతం అంధత్వం) విభాగం. కేవలం శబ్దంతో మాత్రమే బంతి రాకను గుర్తించాలి. అలా గుర్తించలేక రోజూ దెబ్బలతోనే గ్రౌండ్ నుంచి బయటకు వచ్చేదాన్ని' అనే కరుణ తక్కువ సమయంలోనే నైపుణ్యాల్ని అందిపుచ్చుకుంది. హైదరాబాద్, బెంగళూరు, దిల్లీల్లో పలు మ్యాచ్‌లు ఆడి గెలుపొందింది. ఆ విజయాలే ఆమెకు భారత జట్టులో అవకాశాన్ని తెచ్చిపెట్టాయి. బెంగళూరులో ప్రపంచకప్ సెలక్షన్‌కు వెళ్లినప్పుడు 70 బంతుల్లో 114 పరుగులు చేసి తన ప్రతిభను నిరూపించుకుంది. అవకాశం వచ్చాకా... ఆర్థిక కష్టాలు వెంటాడాయి. దాంతో తన పరిస్థితిని వివరిస్తూ పలువురు దాతల్ని సంప్రదించింది. వాళ్ల సహాయంతో వెళ్లి భారత్ తరఫున టీ20 ప్రపంచకప్‌లో మెరిసింది.



కరుణ

ఒకప్పుడు నవాబుల మహల్స్‌లో అంగరంగ వైభవంగా మెరిసిన లఖ్‌నవీ గరారాల్ని వెండి-బంగారు తీగలతో నేసేవారట. రాచరికపు ఆడంబరానికీ, సంస్కృతికీ చిహ్నంగా రూపొందించిన ఇవి... నేటి నవ వధువుల కలల దుస్తులుగా మారాయి అంటే అతిశయోక్తి కాదేమో! వీటి ప్రత్యేకత గురించి తెలుసుకుందామా?



లఖ్‌నవీ గరారా... అందాల షరారా!

పెళ్లిళ్ల సీజన్ మొదలైందంటే లఖ్‌నవూ వీధులన్నీ రంగు రంగుల గరారాలతో సందడి చేస్తాయి. స్థానికులు వీటిని కేవలం దుస్తులుగా మాత్రమే కాదు... అవధ్ సంస్కృతికి ప్రాణంగా భావిస్తారు. గత వైభవాన్ని చాటుతూనే నేటితరం ఫ్యాషన్‌గా మారిన వీటిని చూసి తెగ సంతోషపడిపోతారు. గరారా... నవాబ్ నసీరుద్దీన్ హైదర్ (1814-1837) కాలం నాటిదట. ఆంగ్లేయ స్త్రీలు ధరించే గౌనుల స్ఫూర్తితో రాణుల కోసం ఒక కొత్త రకం రాజ దుస్తులను రూపొందించాలనుకున్నారు ఈ నవాబ్. అందులో భాగంగానే ఫ్లేర్డ్ ప్యాంటు, పొడవాటి కుర్తా (పేష్వా), దుపట్టాతో దీన్ని తీర్చిదిద్దారు. గరారా గ్రాండ్‌గా కనిపించడానికి బోలెడన్ని ప్యానెల్స్ వచ్చేలా కుట్టారు. ఈ డ్రెస్ సౌకర్యంగానూ, సంప్రదాయంగానూ ఉండటంతో అన్ని వర్గాలనూ మెప్పించింది. సామాన్య ప్రజలకూ చేరువైంది. అంతర్జాతీయ వేదికలపైనా తళుక్కుమంటోంది. అయితే, బ్రిటిష్ పాలన తర్వాత పరిస్థితుల ప్రభావంతో గరారా పరిమాణం తగ్గింది. ఇది షరారా పుట్టుకకు దారితీసింది.

ఈటీవీ భారత్

ఎంత బరువో...

లఖ్‌నవీ గరారాకు హాల్ మార్క్... దాని ఎంబ్రాయిడరీనే. చికన్‌కారీ, జర్దోసీ, గోటా వర్క్, కోరా, నక్షి, టిక్కీ, ఆరి... వంటి పనితనాలన్నీ దీనిపై ప్రతిబింబిస్తాయి. ఒకప్పుడు స్వచ్ఛమైన వెండి-బంగారు తీగలతో జర్దోసీ వర్క్ చేసేవారు. దాంతో ఒక్కో డ్రెస్ 10 కిలోల వరకూ బరువుండేది. అందులో 8 కిలోల వరకూ బరువు లోహపు తీగలదే కావడం విశేషం. ప్రస్తుతం పరిస్థితి మారింది. పెరిగిన ధరల వల్ల బంగారం, వెండికి బదులుగా ఇత్తడి తీగల్ని ఉపయోగిస్తున్నారు. దీనివల్ల మెరుపులో తేడా ఏమీ లేదు. కాలక్రమంలో ఈ గరారా లఖ్‌నవూ నుంచి రాంపూర్, భోపాల్, బనారస్, ఇండోర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకూ చేరుకుంది. ఆ తర్వాత ప్రతి ప్రాంతం దాని సొంత శైలినీ, సృజననూ చేర్చి బ్రాండింగ్ చేసుకున్నాయి. అమ్మాయిల మనసు దోచుకుంటోంది. ముఖ్యంగా పెళ్లిళ్లలో హల్దీ, మెహందీ, రిసెప్షన్... అంటూ ప్రతి వేడుకలోనూ కొత్త పెళ్లికూతురుకు నేస్తమైంది. అన్నట్లు ఇది మీకూ ఫేవరెట్టేనా?

సువాసనల నిమ్మ... తురిమితే ఎంతో రుచి!

నిమ్మకాయలతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలుసు..! మరి రసం పిండాక ఆ తొక్కల్నేం చేస్తారు. ఏముంది పారేయడమే అంటారా? అయితే, ఒక్కక్షణం... వీటినీ పలు రకాల ఇంటి సమస్యలకు పరిష్కారంగా వాడుకోవచ్చు. అవేంటో తెలుసా?



- నిమ్మతొక్కల్ని ఎండబెట్టి పొడిచేసి, చిన్న సంచుల్లో వేసి వార్డ్‌రోబ్ లేదా షూ ర్యాక్, గది మూలల్లో పెట్టండి. సువాసనలు వెదజల్లుతాయి.
- ఫ్రిజ్‌లో వాసనలు ఇబ్బంది పెడుతుంటే నిమ్మ తొక్కల్ని ముక్కలుగా కోసి లోపల పెట్టండి. వీటికి యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉండటం వల్ల బ్యాక్టీరియా కూడా దరిచేరదు.
- నిమ్మతొక్కల్ని ఓ గాజు సీసాలో వేసి అవి మునిగేలా వినెగర్ వేసి రెండు వారాలు నాననివ్వండి. తర్వాత వడకట్టి స్ప్రే బాటిల్‌లో పోసి ఉపయోగించండి. కిచెన్ కౌంటర్, సింక్, గాజు సామాను శుభ్రపరచడానికి ఉపయోగపడుతుంది. అయితే, ఇందులో కాస్త బేకింగ్ సోడా కలిపితే పాత్రలు, స్టవ్ కొత్తవాటిలా మెరిసిపోతాయి.
- నిమ్మతొక్కల్ని వంటల్లోనూ ఉపయోగించొచ్చని తెలుసా? వీటిని ఎండబెట్టి పొడి చేసి టీ, కూరలు, సలాడ్స్‌లో వేస్తే రుచి రెట్టింపు అవుతుంది. డెజర్ట్స్, కేక్స్‌లో దీన్ని తురిమి వేయొచ్చు.
- కూరగాయలు కోసేందుకు ఉపయోగించే కటింగ్ బోర్డులను శుభ్రం చేయడానికీ నిమ్మతొక్కలను ఉపయోగించవచ్చు. ఇది సహజ యాంటీసెప్టిక్‌గా పనిచేస్తుంది.
- నెలకోసారి నిమ్మతొక్కల్ని తురిమి... గులాబీ మొక్క మొదట్లో వేస్తే సరి. పూలు బాగా వస్తాయి.



- ఇంట్లో ఘాటైన వాసనలు ఎక్కువైతే... నిమ్మ తొక్కల్ని నీళ్లల్లో వేసి మరిగించి ఆ ఆవిరి ఇంట్లో వ్యాపించేలా చేయండి. తాజాగా అనిపిస్తుంది.
- సెరామిక్ సింకులను శుభ్రం చేయడానికి నిమ్మతొక్కపై కాస్త సర్ఫ్ లిక్విడ్ వేసి రుద్దండి. రంగు మారినవి తిరిగి కొత్తవాటిలా మెరిసిపోతాయి.
- ఈ మధ్యకాలంలో అవెన్‌ల వాడకం పెరిగింది. ఆహారపదార్థాల వ్యర్థాలు... లోపల పేరుకుని మురికిగా మారుతుంది. వీటిని త్వరగా వదిలించాలంటే... ఓ గిన్నెలో నీళ్లు పోసి నాలుగు నిమ్మతొక్కలు వేసి అందులో వేడి చేయండి. ఆ ఆవిరి అంతటా వ్యాపిస్తుంది. దాంతో శుభ్రం చేయడం సులువవుతుంది.

సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా, ఈ ఘనత సాధించిన తొలి దళిత మహిళగా చరిత్ర సృష్టించిన టీనా దాబి గుర్తున్నారు కదా! వ్యక్తిగత విషయాల్లోనే కాదు... ఐఏఎస్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచీ తాను చేపట్టిన కార్యక్రమాలతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. తాజాగా వర్షపు నీటి సంరక్షణలో అత్యుత్తమ పనితీరు కనబరిచి జల్ సంచయ్–జన్‌భాగీదారి(జేఎస్‌జేబీ) అవార్డుని అందుకున్నారు.



టీనా

జల సంరక్షణకే ఈ అవార్డు!

ఐఏఎస్ అధికారిణి టీనా దాబి తన కెరియర్‌లో మరో అద్భుత విజయాన్ని నమోదు చేసుకున్నారు. తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జల్‌సంచయ్-జన్ భాగీదారీ(జన భాగస్వామ్యంతో జల సంరక్షణ)అవార్డు, రూ.2 కోట్ల నగదు బహుమతినీ అందుకున్నారు. రాజస్థాన్‌లోని బాడ్మేర్ జిల్లా కలెక్టర్‌గా 'క్యాచ్ ది రెయిన్ వేర్ ఇట్ ఫాల్స్... వెన్ ఇట్ ఫాల్స్' అంటూ తన బృందంతో కలిసి జల సంరక్షణకు నడుం కట్టారు. ఇందులో భాగంగానే నీళ్ల ట్యాంకులు, చెరువులు, దిగుడు బావులు... వంటివాటిని పునరుద్ధరించారు. వర్షపు చినుకుల్ని ఒడిసిపట్టారు. ఈ పనిలో ప్రజల్నీ పెద్ద ఎత్తున భాగస్వాముల్నీ చేయగలిగారు. ఫలితంగా వర్షపు నీరు ఆదా అవ్వడమే కాదు... భూగర్భజలాలూ పెరిగాయి. చెరువులు, కుంటలు, సరస్సులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. ఇలా పొదుపు చేసిన జలాన్ని ప్రజలు తాగు నీటి అవసరాలకోసం ఉపయోగించగలుగుతున్నారు.

మహిళలకోసం...

గ్రామాల స్వయం సమృద్ధి, మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తారు టీనా. రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలిపోస్టింగ్. ఆపై భిల్వాడా జిల్లా సబ్ డివిజన్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో కొవిడ్ కట్టడి చర్యలతో వార్తల్లో నిలిచారీమె. జైపుర్ జాయింట్ సెక్రటరీగా పనిచేసిన టీనా జైసన్ శక్తి(లేడీస్ ఫస్ట్) పేరుతో బాలికలు-మహిళలు ఆరోగ్యం, రక్షణ, చదువులపై దృష్టిపెట్టారు. అందరి దృష్టినీ ఆకర్షించారు. గతేడాది బాడ్మేర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక 'మరు ఉడాన్' పేరుతో మరో కార్యక్రమానికి రూపకల్పన చేశారు. పరిసరాల స్వచ్ఛతే లక్ష్యంగా 'నవో బాడ్మేర్' ప్రోగ్రామ్‌ని నడిపించారు.



అప్పటికి 22 ఏళ్లే...

టీనా దాబి భోపాల్‌లో పుట్టిపెరిగారు. ఈమె తండ్రి జస్వంత్ దాబి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి. తల్లి హిమాలీ ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ మాజీ అధికారిణి... తన ఇద్దరు పిల్లల్ని పెంచడానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. చెల్లి రియా కూడా అక్కబాటలోనే నడిచి ఐఏఎస్ అధికారిణిగా పనిచేస్తోంది. టీనా భోపాల్‌లోని కార్మెల్ కాన్వెంట్‌లో విద్యాభ్యాసం పూర్తిచేశారు. దిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో డిగ్రీ చదివారు. ఆపై 2015లో సివిల్‌సర్వీసెస్ పరీక్షలు రాశారు. టీనా తొలి ప్రయత్నంలోనే ఐఏఎస్ టాపర్‌గా నిలిచారు. అప్పటికి ఆమె వయసు 22 ఏళ్లే. అంతేకాదు, ఈ ఘనత సాధించిన తొలి దళిత మహిళగానూ గుర్తింపు పొందారు. టీనా దాబీకి సోషల్ మీడియా ఫాలోయింగ్ కూడా ఎక్కువే. 1.5 మిలియన్లకు పైగానే ఫాలోయర్లు ఉన్నారు.

కళ్లపైన దృష్టి పెట్టండి!

రక్ష

ఆత్మరక్షణ నైపుణ్యం బయటకు వెళ్లేటప్పుడు మనల్నే కాదు, మన కుటుంబాన్ని రక్షించుకోవడానికీ ఉపయోగపడుతుంది. ఈ నైపుణ్యాలు దాడిని నివారించడానికీ, దాడి నుంచి తప్పించుకోవడానికీ సహకరిస్తాయి. అన్నివేళలా వీటిని ప్రయోగించాల్సిన అవసరం లేకపోయినా, నేర్చుకొని ఉంటే ఆ ఆత్మవిశ్వాసమే వేరుగా ఉంటుంది. అందుకే ఇప్పుడు స్కూళ్లు, కాలేజీలూ, ఆఫీసుల్లోనూ వీటిని నేర్పిస్తున్నారు. పిల్లల్లో ఈ నైపుణ్యాలు క్రమశిక్షణనూ పెంపొందిస్తాయి. ఎవరైనా ఆటపట్టించినా, ఏడిపించినా వాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలరు. ఆత్మరక్షణ నైపుణ్యాల్లో శిక్షణ, ప్రాక్టీసు, అమలు... ఈ మూడూ ముఖ్యమే. వీటి సాధనతో శారీరక ఆరోగ్యం, ఏకాగ్రత మెరుగవుతాయి.




1 పంచ్ అయితే ఎంత శక్తి మేరకు ప్రయోగిస్తామో, అంతే తీవ్రంగా, వేగంగా కళ్లలోకి వేళ్లను పంపాలి. దీనికోసం ఫొటోలో చూపినట్లు చూపుడు, మధ్య వేళ్లను ఉపయోగించాలి.



2 మోచేత్తో మెడమీద బలంగా, వేగంగా కిక్ ఇస్తే దాడిచేసే వ్యక్తికి తీవ్రస్థాయిలో నొప్పి కలుగుతుంది. ఆ ప్రభావం ఆరు నెలలవరకూ ఉంటుంది.

– ప్రతిభ తక్కడపల్లి,
మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

ఈ ఓడ... రైలు అన్నీ తేమను నింపేవే..!





పెదాల పగుళ్లు, చర్మం పొడిబారడం, దగ్గు, జలుబు, అలర్జీలు... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ ఎన్ని అనారోగ్య సమస్యల్ని తెచ్చిపెడుతుందో శీతకాలం. వీటన్నింటినీ ఎదుర్కోవడానికి ఆహారం, సీజనల్ పండ్లు, ఇంటి చిట్కాలతో తయారుగా ఉంటారు అమ్మలు. అయితే ఇవన్నీ శరీరానికి లోపల నుంచి పోషణను ఇస్తాయి. మరి బయటి సంగతేంటి? అందుకు ఉపయోగపడేవే హ్యూమిడిఫయర్లు. కాసిని నీళ్లను పోస్తే చాలు. రోజంతా తేమను నింపుతాయి. ఒకటి రెండు చుక్కల ఎసెన్షియల్ నూనెలను కలిపితే సువాసననూ వెదజల్లుతాయి. మరి ఇన్ని ఉపయోగాలున్న హ్యూమిడిఫయర్లు... ఏదో ఒక రకమైన ఆకారానికే పరిమితం అయితే ఎలా అనుకున్నారో ఏమో తయారీదారులు... ఓడ, రైలు, బస్సు, డాల్ఫిన్లు, షార్క్... వంటి అన్ని ఆకారాల్లోనూ తీసుకువస్తున్నారు. అంటే అందం, అలంకరణ, ఆరోగ్యం మూడూ ఒకేదానిలో సాధ్యం అన్నమాట. అంతేనా, జలపాతాలు, మబ్బుల నుంచి నేలకు జాలువారుతున్న వర్షపు చుక్కలు వంటి థీమ్‌లతోనూ వీటిని తయారు చేస్తున్నారు. మెలటోనిన్ ఉత్పత్తి అయ్యేందుకు వీలుగా ఉండే లైటింగ్, లైట్ మ్యూజిక్, అలారమ్ లాంటి ఫీచర్లనూ వీటికి అమర్చుతున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో అందుబాటులో ఉన్నాయి. ఇంతకీ వీటిలో మీ ఎంపిక ఏది!












స్వీట్ హోమ్





ఛాంపియన్

151.1 దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో ఆడిన ఓవర్లు. 2016 తర్వాత భారత్ ఓ ఇన్నింగ్స్‌లో 150కి పైగా ఓవర్లు బౌలింగ్ చేయడం ఇది నాలుగోసారి మాత్రమే.



పంత్, బుమ్రా

247/6.. తొలి రోజు దక్షిణాఫ్రికా స్కోరిది. తీయాల్సింది చివరి నాలుగు వికెట్లే కావడంతో మహా అయితే ప్రత్యర్థి జట్టు 300, అంతకంటే కాస్త ఎక్కువ స్కోరు చేస్తుందని అనుకున్నారంతా! పిచ్ బ్యాటింగ్‌కు సహకరిస్తున్నప్పటికీ తొలి రోజు స్పిన్నర్ల జోరు చూశాక తొలి సెషన్లోనే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగుస్తుందనే అంచనా! కానీ అనూహ్యం.. రెండో రోజు సఫారీ జట్టు.. భారత్ బ్యాటింగ్ చేయడానికి మిగిల్చిన ఓవర్లు కేవలం 6.1. ప్రధాన బ్యాటర్లలో ఎవ్వరూ అర్ధశతకం దాటనివ్వని బౌలర్లు.. రెండో రోజు మాత్రం ఒక బౌలింగ్ ఆల్‌రౌండర్‌కు సెంచరీ చేయించారు. ఒక టెయిలెండర్‌ను 93 పరుగులు చేయనిచ్చారు. ఏకంగా 489 పరుగుల భారీ స్కోరు సాధించిన సఫారీ జట్టు గట్టు మీద నిలబడింది. స్పిన్నర్ కుల్‌దీప్ అన్నట్టు గువాహటి పిచ్ రోడ్డులా ఉన్నప్పటికీ.. భారత్ కూడా భారీ స్కోరు చేసి మ్యాచ్‌ను డ్రా వైపు మళ్లించాలి. అది జరుగుతుందా?

రెండో రోజు తేలిపోయిన భారత బౌలర్లు

వదిలేశారు..

సెనురాన్ శతకం.. ● యాన్సెన్ 93 ● దక్షిణాఫ్రికా భారీ స్కోరు

గువాహటి

దక్షిణాఫ్రికాతో సిరీస్‌ను సమం చేసే దిశగా రెండో టెస్టు తొలి రోజు ఆశలు రేకెత్తించిన భారత్.. రెండో రోజు తేలిపోయింది. శనివారం సత్తా చాటిన బౌలర్లు.. ఆదివారం పూర్తిగా నిరాశపరచడంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత సంతతికి చెందిన బౌలింగ్ ఆల్‌రౌండర్ సెనురాన్ ముత్తుసామి (109; 206 బంతుల్లో 10×4, 2×6) అద్భుత శతకం సాధించగా.. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్ చేసిన మార్కో యాన్సెన్ (93; 91 బంతుల్లో 6×4, 7×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కైల్ వెరీన్ (45; 122 బంతుల్లో 5×4)తో ఏడో వికెట్‌కు 88 పరుగులు జోడించిన సెనురాన్.. యాన్సెన్‌తో ఎనిమిదో వికెట్‌కు 97 పరుగులు జత చేశాడు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్.. ఆట చివరికి 9/0తో నిలిచింది. యశస్వి జైస్వాల్ (7), కేఎల్ రాహుల్ (2) క్రీజులో ఉన్నారు.

ఏదో అనుకుంటే..: తొలి రోజు ఆట సాగిన తీరు చూశాక.. దక్షిణాఫ్రికా దాదాపు రెండో రోజంతా బ్యాటింగ్ చేస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. అయితే తొలి రోజు పిచ్‌పై ఉన్న తడి రెండో రోజు ఆవిరైపోయి పిచ్ పొడిబారి బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలంగా మారగా.. భారత బౌలర్లు కూడా మొదటి రోజంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేయకపోవడంతో సఫారీ జట్టు ఊహించని స్కోరు సాధించింది. 25 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన బౌలింగ్ ఆల్‌రౌండర్ సెనురాన్.. ఒక స్పెషలిస్టు బ్యాటర్‌లా సాధికారికంగా బ్యాటింగ్ చేసి భారత్‌కు పెద్ద షాకే ఇచ్చాడు. మరో ఎండ్‌లో కైల్ వెరీన్ (ఓవర్ నైట్ 1) కూడా ఆత్మవిశ్వాసంతో ఆడడంతో ఉదయం భారత బౌలర్లకు ఇబ్బందులు తప్పలేదు. స్కోరును 300 దాటించిన ఈ జోడీ.. తర్వాత కూడా నిలకడగా బ్యాటింగ్ చేసింది. లంచ్‌కు స్కోరు 316/6. విరామం తర్వాత అర్ధ శతకం దిశగా సాగుతున్న కైల్ వెరీన్.. జడేజా బౌలింగ్‌లో స్టంపౌట్ కావడంతో రెండో రోజు భారత్‌కు తొలి వికెట్ దక్కింది. ఇక చకచకా వికెట్లు పడిపోతాయని ఆశిస్తే.. అలాంటిదేమీ జరగలేదు. యాన్సెన్ అండతో సెనురాన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఇద్దరూ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. వెరీన్ ఔటయ్యే సమయానికి 160 బంతుల్లో 67 పరుగులు చేసిన సెనురాన్.. తర్వాత 47 బంతుల్లోనే 43 పరుగులు చేయడం విశేషం. ఈ క్రమంలో కెరీర్లో తొలి శతకాన్ని అందుకున్నాడతను. మరో ఎండ్‌లో యాన్సెన్ సిక్సర్ల మోత మోగించాడు. మరో వికెట్ కోల్పోకుండా సెషన్‌ను ముగించిన దక్షిణాఫ్రికా.. టీకి 428/7తో తిరుగులేని స్థితిలో నిలిచింది. టీ తర్వాత వెంటనే సెనురాన్ ఔటైనా.. యాన్సెన్ జోరు కొనసాగించడంతో దక్షిణాఫ్రికా 500కు చేరువైంది. సెంచరీ చేసేలా కనిపించిన యాన్సెన్‌ను కుల్‌దీప్ బౌల్డ్ చేయడంతో ఆ జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. తొలి రోజు లాగే వెలుతురు మందగించడంతో రెండో రోజు కూడా ఆటను త్వరగానే ముగించాల్సి వచ్చింది. రెండు రోజుల్లో కలిపి 22.4 ఓవర్లు తక్కువ పడ్డాయి. రెండో రోజు ఎప్పటిలానే ఆటగాళ్లు మొదట లంచ్.. ఆ తర్వాత టీ విరామానికి వెళ్లారు.



సెనురాన్ ముత్తుసామి 109

పోయినచోటే వెతుక్కున్నాడు..

ఈనాడు క్రీడావిభాగం

సెనురాన్ ముత్తుస్వామి.. ఈ పేరును టీమ్‌ఇండియా అంత సులువుగా మరిచిపోలేదు. గువాహటిలో జరుగుతున్న రెండో టెస్టులో గెలిచి సిరీస్‌ను సమం చేయాలన్న భారత్ ఆశలపై ఈ దక్షిణాఫ్రికా బౌలింగ్ ఆల్‌రౌండర్ నీళ్లు చల్లాడు. తన పేరు చూస్తే అతడికి భారత మూలాలున్నాయని అర్థమైపోతుంది. అతడి తల్లిదండ్రుల స్వస్థలం తమిళనాడులోని నాగపట్నం. అయితే సెనురాన్ పుట్టకముందే అతడి కుటుంబం దక్షిణాఫ్రికాలో స్థిరపడింది. తండ్రి అతణ్ని క్రికెట్లోకి తీసుకొచ్చాడు. చిన్న వయసులోనే సెనురాన్ ఆటలో నైపుణ్యం సంపాదించాడు. తన 11వ ఏటనే తండ్రిని కోల్పోయినప్పటికీ.. తాను అంతర్జాతీయ క్రికెటర్ కావాలన్న ఆయన సంకల్పాన్ని మాత్రం సెనురాన్ విడిచిపెట్టలేదు. టీనేజీలోనే రోజూ అయిదారు గంటలకు తక్కువ కాకుండా క్రికెట్ సాధన చేసేవాడు. రోజూ యోగా చేయడం, తరచుగా గుడికి వెళ్లడం అతడికి ఇష్టమైన వ్యాపకాలు. తల్లి వాణి అతడికి ప్రతి దశలోనూ అండగా నిలిచింది. 2019లో అతను భారత పర్యటనలోనే టెస్టు అరంగేట్రం చేశాడు. దక్షిణాఫ్రికా 0-2తో చిత్తయిన ఆ సిరీస్‌లో సెనురాన్ రెండు టెస్టుల్లో కలిపి రెండు వికెట్లే తీయగలిగాడు. దీంతో మూడున్నరేళ్ల పాటు మళ్లీ టెస్టు జట్టులో అతడికి చోటు దక్కలేదు. అయితే గత ఏడాది నుంచి అతను నిలకడగా రాణిస్తున్నాడు. ఇటీవల పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌లో బ్యాటుతో, బంతితో ఆకట్టుకున్నాడు. 2019 నాటి చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ ఇప్పుడు భారత గడ్డలో మేటి ఇన్నింగ్స్ ఆడాడు.

డ్రా చేసుకుంటే గొప్ప..

రెండు రోజుల ఆట అయిపోయింది. భారత్ ఇంకా 480 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌లో దక్షిణాఫ్రికాకు దీటుగా భారత్ స్పందించినా.. ప్రత్యర్థి స్కోరును అధిగమించి ఆధిక్యంలోకి రావడానికి ఒకటిన్నర రోజుకు పైగానే పడుతుంది. అంతసేపు తర్వాత మిగిలిన ఆటలో ప్రత్యర్థికి లక్ష్యాన్ని నిర్దేశించి గెలవడం అన్నది దాదాపు అసాధ్యం! ఇప్పటిదాకా భారత్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇంత భారీ స్కోరు చేసిన ఏ జట్టూ ఓడింది లేదు. కాబట్టి భారత్ సిరీస్‌ను కాపాడుకుంటే అద్భుతమే. ఇక భారత్ చేయగలిగింది డ్రా కోసం ప్రయత్నించడమే. ఆధిక్యం సాధించినా, ప్రత్యర్థిని స్కోరును అందుకోగలిగినా, లేదా దగ్గరగా వెళ్లినా మ్యాచ్ డ్రా అవుతుంది. 100కి మించి ఆధిక్యం ఇస్తే మాత్రం ఓటమి ముప్పు తప్పదు.

7 యాన్సెన్ సిక్సర్లు. టెస్టుల్లో తొమ్మిదో నంబర్ బ్యాటర్ ఓ ఇన్నింగ్స్‌లో బాదిన అత్యధిక సిక్స్‌లు ఇవే. ఆండీ బ్లిగ్నాట్ (జింబాబ్వే), టిమ్ సౌథీ ఆరేసి సిక్సర్లతో నెలకొల్పిన రికార్డు బద్దలైంది. భారత్‌లో ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో విదేశీ బ్యాటర్ కొట్టిన అత్యధిక సిక్సర్ల రికార్డు (2006లో అఫ్రిది)ను సైతం యాన్సెన్ సమం చేశాడు.

"కోల్‌కతా వికెట్ వేరు. ఇది రోడ్డులా ఉంది. ఇక్కడ బౌలింగ్ చేయడం సవాలుగా మారింది. అందుకే దీన్ని టెస్టు క్రికెట్ అంటారు. ప్రతిసారీ ప్రత్యర్థిపై ఆధిపత్యం చలాయించడమే కాదు. కొన్నిసార్లు బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై ఎదురీదాల్సిన పరిస్థితులూ తలెత్తుతాయి. ఇది బౌలర్లకు సవాలు విసిరే వికెట్. ఇక్కడ మాకు పెద్దగా సహకారం అందలేదు. కానీ దీని గురించి ఎక్కువ ఆలోచించకూడదు"

– కుల్‌దీప్

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బి) బుమ్రా 38; రికిల్‌టన్ (సి) పంత్ (బి) కుల్‌దీప్ 35; స్టబ్స్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 49; బవుమా (సి) యశస్వి (బి) జడేజా 41; టోనీ డి జోర్జి (సి) పంత్ (బి) సిరాజ్ 28; ముల్డర్ (సి) యశస్వి (బి) కుల్‌దీప్ 13; సెనురాన్ (సి) యశస్వి (బి) సిరాజ్ 109; వెరీన్ (స్టంప్డ్) పంత్ (బి) జడేజా 45; యాన్సెన్ (బి) కుల్‌దీప్ 93; హార్మర్ (బి) బుమ్రా 5; కేశవ్ నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 21 **మొత్తం:** (151.1 ఓవర్లలో ఆలౌట్) **489; వికెట్ల పతనం:** 1-82, 2-82, 3-166, 4-187, 5-201, 6-246, 7-334, 8-431, 9-462; **బౌలింగ్:** బుమ్రా 32-10-75-2; సిరాజ్ 30-5-106-2; నితీశ్ 6-0-25-0; సుందర్ 26-5-58-0; కుల్‌దీప్ 29.1-4-115-4; జడేజా 28-2-94-2

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి బ్యాటింగ్ 7; రాహుల్ బ్యాటింగ్ 2; ఎక్స్‌ట్రాలు 0 **మొత్తం:** (6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) **9**; **బౌలింగ్:** యాన్సెన్ 3.1-1-9-0; ముల్డర్ 3-3-0-0



ట్రోఫీతో భారత జట్టు

అంధుల టీ20 ప్రపంచకప్ భారత్ సొంతం

● ఫైనల్లో నేపాల్‌పై గెలుపు ● జట్టులో తెలుగమ్మాయిలు దీపిక, కరుణ



కరుణ కుమారి

విశాఖపట్నం (గ్రామీణ భీమిలి), న్యూస్‌టుడే: కొన్ని వారాల క్రితమే దక్షిణాఫ్రికాను ఓడించి భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే ప్రపంచకప్‌ను చేజిక్కించుకుంది. ఆ స్ఫూర్తితో మరో భారత మహిళల జట్టు ప్రపంచకప్ గెలిచింది. ఈ కప్ నెగ్గింది అంధుల క్రికెట్లో. మహిళల కోసం నిర్వహించిన తొలి అంధుల టీ20 ప్రపంచకప్‌లో దీపిక సారథ్యంలోని భారత్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో 7 వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. మొదట నేపాల్ 5 వికెట్లకు 114 పరుగులు చేసింది. సరిత (35) టాప్ స్కోరర్. క్రమశిక్షణతో బౌలింగ్ చేసిన జట్టు.. కేవలం ఒక్క బౌండరీ మాత్రమే ఇవ్వడం విశేషం. లక్ష్యాన్ని భారత్ 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అందుకుంది. పౌలా సారెన్ (44 నాటౌట్), పాంగి కరుణ కుమారి (42 పరుగులు) కీలక ఇన్నింగ్స్ ఆడారు. అంతకుముందు సెమీస్‌లో ఆస్ట్రేలియాను భారత్ ఓడించగా.. పాకిస్థాన్‌పై నేపాల్ నెగ్గింది. ఆరు దేశాలు తలపడిన ఈ టోర్నీలో దీపిక బృందం ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా కప్ గెలిచింది.

మనోళ్లు ఇద్దరు: భారత జట్టులో ఇద్దరు తెలుగమ్మాయిలు ఉన్నారు. టీసీ.దీపిక, మరొకరు పాంగి కరుణ కుమారి. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లాకు చెందిన దీపిక భారత జట్టుకు కెప్టెన్. ఆమె విద్యాభ్యాసం మొత్తం సరిహద్దు రాష్ట్రం కర్ణాటకలోనే సాగింది. కరుణ కుమారి స్వస్థలం ఏపీలోని అల్లూరి జిల్లా పాడేరు మండలం వంట్లమామిడి. ఆమె ప్రస్తుతం విశాఖలోని ఎండాడ ప్రభుత్వ అంధ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది.



రాహుల్

కెప్టెన్‌గా రాహుల్

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు భారత జట్టు ఎంపిక

దిల్లీ: దక్షిణాఫ్రికాతో ఈ నెల 30న మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌లో కేఎల్ రాహుల్ టీమ్‌ఇండియాను నడిపించనున్నాడు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయంతో దూరం కావడంతో అతడు సారథిగా నియమితుడయ్యాడు. 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఆదివారం ప్రకటించారు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఎనిమిది నెలల విరామం తర్వాత వన్డే జట్టులోకి పునరాగమనం చేశాడు. "ప్రస్తుత అవసరాల కోసమే రాహుల్‌కు కెప్టెన్సీ ఇచ్చారు. పంత్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. గత ఏడాదిలో పంత్ ఒక్క వన్డే మ్యాచ్ మాత్రమే ఆడాడు. జనవరి కల్లా గిల్ మెడ గాయం నుంచి పూర్తిగా కోలుకుంటాడని సెలక్టర్లు ఆశిస్తున్నారు" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు.

ఆ ముగ్గురికి విశ్రాంతి: అక్షర్ పటేల్, బుమ్రా, సిరాజ్‌లకు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చారు. 31 ఏళ్ల అక్షర్ ఇటీవల ఆస్ట్రేలియాలో వన్డే, టీ20 సిరీస్‌లో ఆడాడు. ఇక బుమ్రా వన్డే పునరాగమనం మరింత ఆలస్యం కానుంది. అతడు చివరగా ఆడిన వన్డే.. 2023 ప్రపంచకప్ ఫైనల్. ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో ఆడుతున్న అతడికి.. పనిభార నిర్వహణలో భాగంగా విశ్రాంతి కల్పించారు. మరోవైపు భారత్-ఎ తరఫున దక్షిణాఫ్రికా-ఎపై మెరుగైన ప్రదర్శన చేసిన రుతురాజ్ గైక్వాడ్.. వన్డే జట్టులోకి తిరిగొచ్చాడు. అతడు ఇప్పటివరకు ఆరు వన్డేలు ఆడాడు.

భారత వన్డే జట్టు: రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, కోహ్లి, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్ (కెప్టెన్), పంత్, వాషింగ్టన్ సుందర్, జడేజా, కుల్‌దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్, ధ్రువ్ జురెల్.

విజేత లక్ష్యసేన్



లక్ష్యసేన్

సిడ్నీ: భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ అదరగొట్టాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతగా నిలిచాడు. ఆదివారం పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 21-15, 21-11తో యుషి తనక (జపాన్)పై విజయం సాధించాడు. 38 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేసిన లక్ష్యసేన్.. ఈ ఏడాది తొలి అంతర్జాతీయ టైటిల్ గెలుచుకున్నాడు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన లక్ష్యసేన్.. చివరిసారిగా నిరుడు లఖ్‌నవూలో సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 టైటిల్ సాధించాడు. ఈ ఏడాది సెప్టెంబరులో హాంకాంగ్ సూపర్ 500 టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్‌కు టైటిల్ త్రుటిలో చేజారింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తాజా విజయంతో ఈ ఏడాది టైటిల్ కరవుకు అతను తెరదించాడు.

తొలి రౌండ్ నుంచి ఆత్మవిశ్వాసంతో ఆడుతున్న లక్ష్యసేన్ తుదిపోరులోనూ సత్తాచాటాడు. షటిల్‌పై పూర్తి నియంత్రణ.. మంచి ప్లేస్‌మెంట్స్.. పదునైన స్మాష్‌లతో చెలరేగాడు. ఆరంభంలోనే తనక లయ తప్పడంతో లక్ష్యసేన్ 6-3తో శుభారంభం చేశాడు. సుదీర్ఘ ర్యాలీలు.. క్రాస్‌కోర్ట్ స్మాష్‌లతో ప్రత్యర్థిని బోల్తాకొట్టించి 11-8తో ముందంజ వేశాడు. ప్రేక్షకుల మద్దతు, కేరింతల నడుమ లక్ష్యసేన్ మరింతగా రెచ్చిపోయాడు. వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 17-13తో ఆధిక్యం సంపాదించాడు. ఈ సమయంలో తనక అనవసర తప్పిదాలు చేయడంతో లక్ష్యసేన్ 21-15తో మొదటి గేమ్‌కు తెరదించాడు. భారత ఆటగాడి జోరుతో రెండో గేమ్ పూర్తిగా ఏకపక్షమైంది. దూకుడుగా ఆడిన లక్ష్యసేన్ చూస్తుండగానే 10-5తో పైచేయి సాధించాడు. కచ్చితత్వంతో కూడిన షాట్లు ఆడుతూ 13-6తో ఆధిక్యాన్ని మరింతగా పెంచుకున్నాడు. అద్భుతమైన స్మాష్‌తో అలరించిన లక్ష్యసేన్ 19-8తో మ్యాచ్‌కు చేరువయ్యాడు. కొద్దిసేపటికే 21-11తో రెండో గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకుని లాంఛనం పూర్తిచేశాడు.

స్మృతి పెళ్లి వాయిదా

సాంగ్లీ: భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన వివాహం నిరవధికంగా వాయిదా పడింది. స్మృతి తండ్రి అనారోగ్యానికి గురికావడమే అందుకు కారణం. స్మృతి, సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్‌ల పెళ్లి ఆదివారం జరగాల్సింది. కానీ వివాహ ఏర్పాట్లు జరుగుతుండగా స్మృతి తండ్రి శ్రీనివాస్‌కు గుండెపోటు వచ్చింది. "ఆదివారం ఉదయం అల్పాహారం చేస్తుండగా శ్రీనివాస్ ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. కోలుకుంటాడేమోనని కాసేపు నిరీక్షించాం. కానీ పరిస్థితి మెరుగుపడకపోవడంతో అంబులెన్స్‌ను పిలిచి ఆయనను ఆస్పత్రికి తరలించాం. ఆయన ఇప్పుడు వైద్యుల పరిశీలనలో ఉన్నారు" అని స్మృతి మేనేజర్ తుహిన్ మిశ్రా చెప్పారు. "తండ్రితో స్మృతికి సాన్నిహిత్యం ఎక్కువ. ఆయన కోలుకునేంత వరకు వివాహాన్ని వాయిదా వేయాలని ఆమె నిర్ణయించుకుంది" అని తెలిపారు.

అభినవ్‌కు స్వర్ణం

టోక్యో: డెఫ్లింపిక్స్‌లో మరో భారత షూటర్ మెరిశాడు. పురుషుల 25 మీటర్ల పిస్టల్‌లో అభినవ్ దేశ్‌వాల్ స్వర్ణం గెలుచుకున్నాడు. ఫైనల్లో 44 పాయింట్లతో అతడు అగ్రస్థానంలో నిలిచాడు. సెంగ్ లీ (43, కొరియా), ఫోర్‌మిన్ (42, ఉక్రెయిన్) వరుసగా రజతం, కాంస్యం నెగ్గారు. క్వాలిఫికేషన్లో అభినవ్ 575 పాయింట్లతో ప్రపంచ రికార్డును సమం చేస్తూ అగ్రస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ చేతన్ హన్మంత్ (573) క్వాలిఫికేషన్లో రెండో స్థానాన్ని దక్కించుకున్నా ఫైనల్లో రాణించలేకపోయాడు. 27 పాయింట్లతో అయిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.



అభినవ్

బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్

మీర్పూర్ (బంగ్లాదేశ్): ఐర్లాండ్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం ముగిసిన రెండో టెస్టులో బంగ్లా 217 పరుగుల తేడాతో నెగ్గింది. 509 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ 291 పరుగులకే ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 176/6తో అయిదో రోజు ఉదయం ఆట కొనసాగించిన ఐర్లాండ్‌ను బంగ్లా బౌలర్లు తైజుల్ ఇస్లాం (4/104), హసన్ మురాద్ (4/44) హడలెత్తించారు. ఆ జట్టులో కర్టిస్ క్యాంఫర్ (71 నాటౌట్; 259 బంతుల్లో 4×4, 2×6) ఒంటరి పోరాటం చేశాడు. తన కెరీర్‌లో వందో టెస్టును సెంచరీతో చిరస్మరణీయం చేసుకున్న ముష్ఫికర్ రహీం (106; 214 బంతుల్లో 5×4)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. తొలి ఇన్నింగ్స్‌ల్లో బంగ్లా 476.. ఐర్లాండ్ 265 పరుగులకు ఆలౌటయ్యాయి. బంగ్లా రెండో ఇన్నింగ్స్‌ను 297/4 వద్ద డిక్లేర్ చేసింది.



వెర్‌స్టాపెన్

వెర్‌స్టాపెన్‌దే లాస్ వెగాస్ గ్రాండ్‌ప్రి

లాస్ వెగాస్: లాస్ వెగాస్ గ్రాండ్ ప్రి ఫార్ములావన్ టైటిల్‌ను మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) చేజిక్కించుకున్నాడు. 50 ల్యాప్‌ల ఈ ఫైనల్ రేసులో వెర్‌స్టాపెన్ గంట 21 నిమిషాల 8 సెకన్లలో లక్ష్యాన్ని చేరి టైటిల్ ఎగరేసుకుపోయాడు. రసెల్ (మెర్సిడెజ్, గంట 23 నిమిషాల 54 సెకన్లు) రెండు, ఆంటోనెల్ (మెర్సిడెజ్, గంట 20 నిమిషాల 48 సెకన్లు) మూడో స్థానాలు దక్కించుకున్నారు. వెర్‌స్టాపెన్‌కు కెరీర్‌లో ఇది 69వ టైటిల్. క్వాలిఫికేషన్లో పోల్ పొజిషన్ సాధించిన లాండో నోరిస్ (మెక్‌లారెన్)కు షాక్ తగిలింది. అతడి కారు ఎఫ్-1 నిబంధనలకు లోబడి లేకపోవడంతో అనర్హత వేటు పడింది. ఇదే కారణంతో మరో మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి కూడా ఫైనల్ రేసుకు దూరమయ్యాడు.

భారత్ శుభారంభం

కొరియాపై విజయం ● అజ్లాన్ షా కప్ హాకీ



మహ్మద్ రాహీల్

ఇపో (మలేసియా): అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్లో భారత జట్టు శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 1-0తో మూడుసార్లు ఛాంపియన్ దక్షిణ కొరియాపై విజయం సాధించింది. ఆరేళ్ల విరామం తర్వాత ఈ టోర్నీలో ఆడుతున్న భారత్.. 15వ నిమిషంలో మహ్మద్ రాహీల్ చేసిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. చివరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకుని మ్యాచ్‌లో పైచేయి సాధించింది. భారత్ ద్వితీయశ్రేణి జట్టుతో ఈ టోర్నీలో ఆడుతోంది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో సోమవారం బెల్జియంను ఢీకొంటుంది. టోర్నీలో రౌండ్ రాబిన్ ఫార్మాట్లో ప్రతి జట్టు మిగతా అయిదు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గెలిచిన జట్టుకు మూడు పాయింట్లు లభిస్తాయి. డ్రాకు ఒక పాయింట్ వస్తుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

సయ్యద్ మోదీ టోర్నీకి స్టార్ షట్లర్లు

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇండియా ఇంటర్నేషనల్ ప్రపంచ టూర్ సూపర్ 300 టోర్నీలో అగ్రశ్రేణి క్రీడాకారులు బరిలో దిగనున్నారు. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో మాజీ ఛాంపియన్ కిదాంబి శ్రీకాంత్.. ఒలింపియన్లు నొజోమి ఒకుహర (జపాన్), హెచ్.ఎస్.ప్రణయ్ తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. మహిళల డబుల్స్ డిఫెండింగ్ ఛాంపియన్స్ గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ.. యువ క్రీడాకారులు ప్రియాన్షు రజావత్, తన్వి శర్మ, అన్మోల్, ఉన్నతి హుడా టోర్నీలో పాల్గొంటున్నారు.

భద్రతా మండలి సంస్కరణలు తప్పనిసరి

- జీ20 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

జొహాన్నెస్‌బర్గ్: ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావడం ఇక ఎంతమాత్రం ఐచ్ఛికం (ఆప్షన్) కాదని, అది తప్పనిసరి అని భారత ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. కృత్రిమ మేధ సహా అధునాతన సాంకేతికతలు, నవ్యావిష్కరణలు ఆయా దేశాలకే పరిమితం కావడం సబబుకాదని.. అవి ప్రపంచ మానవాళికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్‌లో ఆదివారం జరిగిన జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో చర్చలు జరిపారు. భారత్-బ్రెజిల్- దక్షిణాఫ్రికా (ఐబీఎస్ఏ) నేతల శిఖరాగ్ర సదస్సునుద్దేశించి మాట్లాడారు. ఈ మూడింటిలో వివిధ అంశాలను ప్రస్తావించారు. మూడు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడానికి జాతీయ భద్రతా సలహాదారుల (ఎన్ఎస్ఏ) స్థాయి సమావేశాన్ని వ్యవస్థాగతం చేయాలని చెప్పారు.

మనది హృదయపూర్వక బంధం

"ఉగ్రవాదంపై పోరాటంలో సమన్వయంతో ముందుకు సాగాలి. దీనిలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు. మనిషి కేంద్రంగా జరిగే అభివృద్ధిలో సాంకేతికతకు కీలక పాత్ర ఉంది. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా మధ్య యూపీఐ, కొవిన్ వంటి సాంకేతిక చొరవలను, సైబర్ భద్రతను పంచుకోవడానికి ఏర్పాటు చేయాలి. వాతావరణ మార్పుల్ని తట్టుకుని నిలిచే వ్యవసాయానికి కూడా ఐబీఎస్ఏ సహాయ హస్తం అందించాలి. ఐబీఎస్ఏ అనేది కేవలం మూడు దేశాల కూటమి కాదు.. మూడు ఖండాలను కలుపుతున్న ముఖ్యమైన వేదిక. ప్రజలు కేంద్రంగా నిలిచేలా విశ్వసనీయ, సురక్షిత ఏఐ నిబంధనల రూపకల్పనకు ఈ కూటమి తనవంతు చేయూత అందించగలదు. దక్షిణార్ధగోళ దేశాల గొంతును, ఆకాంక్షల్ని బలోపేతం చేయడానికి మనం హృదయపూర్వకంగా కట్టుబడి ఉన్నాం" అని మోదీ చెప్పారు. ఏఐ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని, డీప్‌ఫేక్, ఉగ్రచర్యలకు దానిని వాడుకోవడాన్ని నిలువరించాలని పిలుపునిచ్చారు. ఏఐని నేటి ఉద్యోగాలుగా కాకుండా రేపటి సామర్థ్యాలుగా చూడాలన్నారు.

ఇంత కష్టమంటే మేం పారిపోయేవాళ్లం!

భారత్- దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆహార భద్రత, ఏఐ వంటి రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై మోదీ-రమఫోసా చర్చించారు. అంకుర పరిశ్రమల్లో పెట్టుబడులను సులభతరం చేసేందుకు ఇరువురు అంగీకారానికి వచ్చారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు రమఫోసాకు మోదీ అభినందనలు తెలిపారు. సదస్సు నిర్వహణ ఇంత కష్టమని మోదీ చెప్పిఉంటే తాము బహుశా పారిపోయి ఉండేవాళ్లమని రమఫోసా చమత్కరించారు. దాంతో అక్కడున్నవారంతా నవ్వుల్లో మునిగిపోయారు. "జీ20 నిర్వహణ గురించి మీ నుంచి మేమెంతో నేర్చుకున్నాం. గతంలో మీకు అవకాశం వచ్చినప్పుడు (దిల్లీలో) ఎంతో భారీగా చేశారు. మేం చిన్నగా సరిపెట్టాం" అని చెప్పారు. 'చిన్నదే ఎప్పుడూ అందంగా ఉంటుంది' అని మోదీ బదులిచ్చారు.

పగ్గాలు తీసుకోని అమెరికా

జీ20 తదుపరి సారథ్య పగ్గాలను అమెరికాకు అప్పగించాల్సి ఉండగా ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఈ సదస్సులో తాము భాగం పంచుకోవడం లేదని ముందుగానే చెప్పేసి, గైర్హాజరయ్యారు. దీంతో దక్షిణాఫ్రికా 'అంతర్జాతీయ సంబంధాలు-సహకార శాఖ' కార్యాలయానికి సోమవారం లాంఛనంగా ఈ బాధ్యతల్ని అప్పగించనున్నారు.

దేశాధినేతలతో చర్చలు

జపాన్ ప్రధాని సనాయె తకాయిచి, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, జమైకా ప్రధాని ఆండ్రూ హెల్నెస్, నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కూఫ్‌లతో మోదీ చర్చలు జరిపారు. రక్షణ రంగంలో సహకార విస్తృతి గురించి కార్నేతో చర్చించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. భారత్‌కు రావాల్సిందిగా ఆహ్వానించినట్లు చెప్పారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలీనా జార్జీవాతోనూ ఆయన సమావేశమయ్యారు. ఆదివారం రాత్రి దిల్లీకి బయల్దేరారు.



జొహాన్నెస్‌బర్గ్‌లో ఐబీఎస్ఏ నేతల సమావేశం సందర్భంగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాలతో ప్రధాని మోదీ



కుటుంబ సభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ తదితరులు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా, తితిదే అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డ్రగ్స్ వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు

- నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలి
- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా పిలుపు



సైకిల్ ర్యాలీలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, సీపీ రాజశేఖరబాబు, ఈగల్ చీఫ్ రవికృష్ణ, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, తదితరులు

విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్), న్యూస్‌టుడే: మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్ నుంచి నున్న వరకు ఈగల్ విభాగం ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కు బ్రో' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. డీజీపీ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ఈగల్ వ్యవస్థను ఏర్పాటుచేసి, గంజాయి సాగును నియంత్రణలోకి తెచ్చిందని పేర్కొన్నారు. డ్రగ్స్‌పై ఏదైనా సమాచారం ఉంటే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈగల్ ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ ఆపరేషన్ చైతన్య, గరుడ, సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమాల ద్వారా గంజాయి, డ్రగ్స్‌ను అణిచివేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 869 హాట్‌స్పాట్లను గుర్తించి, నిఘా పెంచినట్లు వివరించారు. 10 కి.మీ. సాగిన ఈ ర్యాలీలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు, కలెక్టర్ లక్ష్మీశ, డీసీపీ సరిత, రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వాహనం

నలుగురు మృతి, ఆరుగురికి గాయాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎత్తురాళ్లపాడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని వెనక నుంచి కారు ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఆరుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం.. మధ్యప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన 9 మంది బంధువులు (డ్రైవర్ సహా 10 మంది) వైద్యనాథుని దర్శనానంతరం ఒడిశాలోని పూరీ జగన్నాథుని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం వెళుతుండగా.. ఎత్తురాళ్లపాడు వద్ద ప్రమాదం జరిగింది. ఘటనలో విజయసింగ్ తోమర్ (65), భురేసింగ్ పవార్ (60), ఖసియాల్‌సింగ్ (65), సంతోషిభాయ్ (60) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ సునీల్‌సింగ్ పటేల్, శకుంతల తోమర్, షీరాభాయ్‌పటేల్, సంతోషిభాయ్, సావిత్రిభాయ్, సుమన్‌భాయ్ గాయపడ్డారు. క్షతగాత్రులను నరసన్నపేట ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు.



ప్రమాదంలో నుజ్జయిన వాహనం

కొబ్బరి పంటపై ఉప్పద్రవం!

- సముద్ర జలాలతో మోడువారిన 2 లక్షలకు పైగా కొబ్బరి చెట్లు
- రాజోలు నియోజకవర్గంలో 2,000 ఎకరాల్లో తీవ్ర నష్టం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భరోసాపై రైతుల ఆశలు



మలికిపురం మండలం కేశనపల్లి వద్ద సముద్ర జలాల ప్రభావంతో నాశనమైన కొబ్బరి చెట్లు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం పరిధిలో సముద్ర జలాల ప్రభావంతో వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు తుడిచిపెట్టుకుపోతున్నాయి. లక్షల చెట్లు మోడువారగా.. సుమారు 1,200 మంది రైతు కుటుంబాలు నష్టపోయాయి. లవణ జలాల తీవ్రత ఇదేస్థాయిలో కొనసాగితే భవిష్యత్తులో 30 గ్రామాల వరకు కనుమరుగవుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 26న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్న నేపథ్యంలో ఆయన భరోసా కోసం రైతులంతా ఎదురు చూస్తున్నారు.

ఉప్పు నీటి వ్యాప్తి సమస్యకు సుమారు 22.5 కి.మీ. పొడవున ప్రవహించే శంకరగుప్తం డ్రెయిన్ ప్రధాన కారణం. రాజోలు, మామిడికుదురు, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లోని మురుగు డ్రెయిన్లలో పారే జలాలతో పాటు వర్షపునీరు శంకరగుప్తం డ్రెయిన్‌లోకి చేరి, కేశవదాసుపాలెం, కరవాక వద్ద వైనతేయ గోదావరి నుంచి సముద్రంలో కలుస్తాయి. డ్రెయిన్‌లో కేశనపల్లి-కరవాక మధ్యలో దాదాపు 8.5 కి.మీ. మేర 2017-20 మధ్యలో డ్రెడ్జింగ్ చేసి, మిగతా ప్రాంతాన్ని వదిలేశారు. పూడిక తీసిన ప్రాంతంలో 15 అడుగుల లోతుంటే, మిగతాచోట్ల 5 అడుగుల వరకు మాత్రమే ఉందని స్థానికులు చెబుతున్నారు. దీంతో సముద్ర పాటు, పోటు సమయంలో నెలలో దాదాపు 10 రోజులు ఉప్పునీటి జలాలు శంకరగుప్తం డ్రెయిన్ నుంచి పొంగి కొబ్బరి తోటలు, గ్రామాల్లోకి పోటెత్తుతున్నాయి. దీంతో కరవాక, గుబ్బలపాలెం, శంకరగుప్తం, కేశనపల్లి, తూర్పుపాలెం, పడమటిపాలెం, గోగన్నమఠం, గూడపల్లి పల్లిపాలెం, అడవిపాలెం, చింతలమోరి తదితర 12 గ్రామాలకు చెందిన దాదాపు 2,000 ఎకరాల్లో లక్షన్నర నుంచి రెండు లక్షల కొబ్బరి చెట్లు నాశనమయ్యాయని రైతులు వాపోతున్నారు.

పరిష్కారం ఇలా..

శంకరగుప్తం డ్రెయిన్‌లో 9.5 కి.మీ. మేర డ్రెడ్జింగ్ చేసి, ఇరువైపులా సుమారు 30 కి.మీ. మేర గట్లు నిర్మించాలి. దీనిపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ ప్రాంతంలో పర్యటించి, అధికారులతో సమీక్షించారు. డ్రెడ్జింగ్, గట్ల ఏర్పాటుకు రూ.21 కోట్ల అంచనా వ్యయంతో దస్త్రాన్ని ఆర్థిక శాఖకు పంపారు. డ్రెడ్జింగ్‌తో సమస్య తాత్కాలికంగా పరిష్కారమవుతుంది. దీంతోపాటు మొదువారిన చెట్లను తొలగించి కొత్తవి నాటేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే కొబ్బరి రైతులు నిలదొక్కుకుంటారు. గతంలో ఈ ప్రాంతం నుంచి వారానికి 2 లక్షల కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తే.. ఇప్పుడు నెలకు లక్ష కాయలు ఎగుమతి చేయడం కష్టంగా మారింది. తోటల్లోకి సముద్ర జలాలు చేరడంతో లవణ సాంద్రతకు తొలుత చెట్ల ఆకులు పసుపు రంగులోకి మారి, నాశనమవుతున్నట్లు గుర్తించామని అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డి.ముత్యాలనాయుడు తెలిపారు.

జలాశయాల్లో మృత్యు సుడులు

- వివిధ ఘటనల్లో నీట మునిగి ఇద్దరి మృతి
- 9 మంది గల్లంతు



జీవన్‌కుమార్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

న్యూస్‌టుడే బృందం: సెలవు రోజైన ఆదివారం సరదాగా గడుపుదామని పర్యాటక ప్రదేశాలకు వెళ్లిన పలువురిని జలాశయాలే మృత్యుసుడులుగా మారి ముంచేశాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఘటనల్లో నీట మునిగి ఇద్దరు మృతి చెందగా, 9 మంది గల్లంతయ్యారు. ఆయా ప్రాంతాల పోలీసులు, బాధితుల బంధువులు తెలిపిన ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం సివిని గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు ఆదివారం జంఝావతి రబ్బరు డ్యామ్ వద్దకు సరదాగా గడుపుదామని వెళ్లారు. ఈ క్రమంలో రాయగడ శరత్ కుమార్ (17) నీటిలో మునిగిపోగా అతడిని కాపాడేందుకు అరసాడ ప్రతాప్(29), గ్రామానికే చెందిన గోవిందనాయుడు(35) వరుసగా జలాశయంలోకి దిగారు. ఈ ముగ్గురూ బయటకు రాలేక గల్లంతయ్యారు.

✦ అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు శివారు కల్యాణపులోవ జలాశయంలో స్నానానికి దిగి కొత్తకోటకు చెందిన మానసిక దివ్యాంగుడు గుమ్ముడు శ్రీనివాస్ (29) గల్లంతయ్యాడు. తోటి కూలీలతో కలిసి వెళ్లగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

✦ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రైవాడ జలాశయంలో నలుగురు గిరిజన యువకులు ప్రయాణిస్తున్న బోటు మునిగిపోయింది. ఓ పడవలో కలపను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీశాఖలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న గాలి అప్పలరాజు (25) తన స్నేహితులు నలుగురితో కలిసి బోటుపై దేవరాపల్లి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జలాశయం వద్దకు వచ్చేసరికి బోటులోకి నీరు రావడంతో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో జీనబాడుకు చెందిన జి.జీవన్‌కుమార్ (18) మృతదేహం లభ్యం కాగా దెబరి రమేష్ (18), అప్పలరాజు గల్లంతయ్యారు. మరో స్నేహితుడు జాలాడ ప్రసాదు ప్రాణాలతో బయటపడ్డాడు.

✦ ఇదే జిల్లాలో జరిగిన మరో ఘటనలో స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చిన యువకుడు దుర్మరణం పాలయ్యాడు. విజయవాడకు చెందిన 15 మంది మారేడుమిల్లి వచ్చి తిరుగు ప్రయాణంలో చింతూరు మండలం సోకులేరులో దిగారు. ప్రమాదవశాత్తు సందీప్ (30) నీటిలో మునిగిపోతుండగా తోటి స్నేహితులు ఒడ్డుకు తీసుకువచ్చి హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు చెప్పారు.



సందీప్ మృతదేహం

✦ అనకాపల్లి జిల్లా తుమ్మపాల సమీపాన శారదానదిలో బాలుడు గల్లంతయ్యాడు. అతడిని విశాఖ నగరం గోపాలపట్నానికి చెందిన సాయి తనుష్ (17)గా గుర్తించారు. స్నేహితులతో కలిసి సరదాగా స్నానం చేయడానికి వెళ్లగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనల్లో గల్లంతైన వారికోసం సహాయక చర్యలు ఆదివారం రాత్రి నిలిచిపోగా సోమవారం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

రీల్స్ చేస్తూ సుడుల్లో చిక్కుకుని...

రీల్స్ తీసుకునే క్రమంలో ఇద్దరు గల్లంతైన ఘటన కడపలో చోటుచేసుకుంది. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న కె.నరేష్ (18), పి.రోహిత్‌కుమార్(16)లు తమ స్నేహితులతో కలిసి నగర పరిధి వాటర్ గండి సమీపంలోని పెన్నానది వద్దకు వెళ్లారు. నదిలో దిగి రీల్స్ తీసుకుంటుండగా ఇద్దరూ సుడిగుండాల్లో చిక్కుకుని గల్లంతయ్యారు.

లైంగిక పటుత్వం పెంచుతానని.. మూత్రపిండాలు దెబ్బతీశాడు!

టెకీతో రూ.48 లక్షలు ఖర్చుపెట్టించిన నకిలీ వైద్యుడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: లైంగిక సమస్యను నయం చేస్తానంటూ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను నమ్మించి రూ.48 లక్షలు మోసగించాడో నకిలీ వైద్యుడు. లైంగిక సామర్థ్యం పెంచే మందుల వినియోగంతో మూత్రపిండాల సమస్య తలెత్తడంతో బాధితుడు చివరికి పోలీసులను ఆశ్రయించాడు. కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బెంగళూరులో పని చేస్తున్నాడు. లైంగిక సమస్య కారణంగా తన వైవాహిక బంధం సంతృప్తిగా లేదని భావించిన ఆయన కెంగేరిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. ఫలితం లేకపోవడంతో మే 3న ఓ ఆయుర్వేద వైద్యుడిగా చెప్పుకొంటున్న విజయ్‌గురూజీ వద్దకు వెళ్లాడు. ఆ గురూజీ సూచనలతో యశ్వంతపుర లోని ఓ ఆయుర్వేద దుకాణంలో బాధితుడు తొలుత రూ.1.60 లక్షలు పెట్టి ఔషధం కొన్నాడు. దీన్ని హరిద్వార్ నుంచి తెప్పించామని విజయ్‌గురూజీ నమ్మబలికాడు. తర్వాత ఆ ఇంజినీర్ ఒక గ్రాము రూ.76 వేల చొప్పున విలువచేసే 18 గ్రాముల మందులు కొన్నాడు. ఇందుకోసం రూ.20 లక్షలు బ్యాంకులో రుణం తీసుకొన్నాడు. మందుల కోసం మొత్తంగా రూ.48 లక్షలు వెచ్చించాడు. అయినా సమస్య పరిష్కారం కాకపోగా అనారోగ్యం బారిన పడ్డాడు. చివరకు ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా.. మూత్రపిండాలు దెబ్బతింటున్నట్లు వైద్యులు తెలిపారు. గురూజీ ఇచ్చిన ఔషధాలే తన ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపినట్లు గ్రహించిన బాధితుడు.. విజయ్‌గురూజీ, ఆయుర్వేద దుకాణంపై జ్ఞానభారతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం ఆగని పోరు

- అధిష్ఠానమే పరిష్కరిస్తుందన్న ఖర్గే
- కాంగ్రెస్ అధ్యక్షుడిని కలవని డీకే వర్గం



మల్లికార్జున ఖర్గే

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో అధికార పంపిణీ కోసం మొదలైన పోరు మరిన్ని రోజులు కొనసాగేలా కనిపిస్తోంది. మిగిలిన రెండున్నరేళ్ల నాయకత్వం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు పట్టుబట్టగా అధిష్ఠానం జోక్యం అనివార్యమైంది. శుక్రవారమే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బెంగళూరుకు చేరుకున్నారు. శనివారం రాత్రి ముఖ్యమంత్రితో, ఆదివారం పలువురు మంత్రులతో ఆయన చర్చించారు. చివరకు ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వలేకపోయారు. తన నివాసం వద్దకు వచ్చిన మీడియా ప్రతినిధులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ 'మీకు చెప్పేందుకు నా వద్ద ఏ విషయమూ లేదు. మూడు రోజులుగా నా ఇంటి వద్ద పడిగాపులు పడుతున్న మిమ్మల్ని చూస్తుంటే నాకు బాధ అనిపించింది. పార్టీలోనూ ఇలాంటి పరిణామాలు మంచివి కాదు. ఎలాంటి సమస్యలున్నా అధిష్ఠానం పరిష్కరిస్తుంది' అని చెప్పారు. బెంగళూరులో మూడు రోజులున్నా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన మద్దతుదారులెవరూ మల్లికార్జున ఖర్గేతో భేటీ కాకపోవడం గమనార్హం. అయితే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మద్దతుదారులు, మంత్రులు హెచ్.సి.మహదేవప్ప, కె.వెంకటేశ్, ఈశ్వర ఖండ్రే తదితరులంతా ఖర్గేతో చర్చించారు.

తెరపైకి దళిత సీఎం?

గత నాలుగైదు రోజులుగా సిద్ధరామయ్య, శివకుమార్ మధ్యే నాయకత్వ పోరు కనిపించినా.. ఆదివారం అనూహ్యంగా సీనియర్ నేతలు తెరపైకి వచ్చారు. వీరంతా ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు కావడం విశేషం. అనివార్యంగా సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తప్పించాల్సి వస్తే ఆ అవకాశాన్ని ఈసారి ఎస్సీలకు ఇవ్వాలన్న డిమాండ్ వినిపించింది. ఆదివారం హోంమంత్రి డా.జి.పరమేశ్వర్ తానూ సీఎం రేసులో ఉన్నానని ప్రకటించారు. '2013లో నా నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లి గెలుపొందాం. కానీ నేను ఆ ఎన్నికల్లో ఓడిపోయాను. గెలిచి ఉంటే ఏమయ్యేదో? కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షుడికి (అప్పటికి పీసీసీ అధ్యక్షుడు ఈయనే) సీఎంగా అవకాశమిచ్చే సంప్రదాయం ఉంది. అలాగని అన్నిసార్లూ ఈ అవకాశాలు రావు. ఎన్నికలు అనగానే పార్టీలో అందరి కృషీ ఉంటుంది. ఒక్కరి వల్లే విజయం సాధించడం ఉండదు' అని వ్యాఖ్యానించారు. తద్వారా తన వల్లే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందంటూ డీకే శివకుమార్ నిత్యం చేస్తున్న వాదనను పరమేశ్వర్ తోసిపుచ్చే ప్రయత్నం చేశారు. మరోవైపు మంత్రి మహదేవప్ప కూడా మల్లికార్జున ఖర్గేతో చర్చల సందర్భంగా దళితులకు అవకాశమిచ్చే విషయం గురించే ప్రతిపాదించినట్లు సమాచారం. ఖర్గే, పరమేశ్వర్, మహదేవప్ప.. ముగ్గురూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. గిరిజన సముదాయానికి చెందిన మంత్రి సతీశ్ జార్ఖిహొళి కూడా ఇదే తరహా డిమాండ్ చేస్తున్నారు. రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఒప్పందం కుదిరితే ఆ అవకాశం అగ్రవర్ణాలకు కాకుండా కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న అహింద (అల్పసంఖ్యాక, బీసీ, దళిత)లకు ఇవ్వాలన్న డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అహింద నేతగా ఇదే సముదాయాలకు చెందిన వారికి అవకాశం కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామం ముఖ్యమంత్రి కావాలన్న శివకుమార్ ఆశలకు గండికొట్టవచ్చన్న మాట వినిపిస్తోంది.

సందర్భమేదైనా.. రప్పా రప్పానే!

- జగన్ అనంత పర్యటనలో వైకాపా శ్రేణుల వీరంగం
- తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడి కుమార్తె వివాహానికి హాజరు



జాతీయ రహదారిపై జగన్ కాన్వాయ్ వెంట రప్పా.. రప్పా అంటూ ప్లకార్డు పట్టుకొని వీరంగం సృష్టిస్తున్న వైకాపా కార్యకర్తలు

ఈనాడు, అనంతపురం, రాప్తాడు, న్యూస్‌టుడే: సమయం, సందర్భంతో సంబంధం లేకుండా మాజీ సీఎం జగన్ పర్యటనల్లో వైకాపా నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. జగన్ హెలికాప్టర్ దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు వీరంగం సృష్టిస్తున్నారు. ఆదివారం అనంతపురం పర్యటనలోనూ అదే కొనసాగించారు. ప్రజలకు అసౌకర్యం కలుగుతుందన్న స్పృహ లేకుండా హైవే పైకి చేరి 'సీఎం సీఎం, రప్పా రప్పా' అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. జగన్ కాన్వాయ్ ముందు పరుగులు తీస్తూ ఈలలు, కేకలు, డ్యాన్సులతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

✦ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు జగన్ ఆదివారం అనంతపురం వచ్చారు. రాప్తాడు సమీపంలో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని వివాహ వేదిక ఏర్పాటు చేశారు. ఉదయం 11:40కి జగన్ హెలికాప్టర్‌లో అనంతపురం చేరుకున్నారు. స్థానిక వైకాపా నాయకులు ఉదయం 9 గంటల నుంచే కార్యకర్తలను హెలిప్యాడ్ వద్దకు తరలించారు. హైవేపై జగన్ కాన్వాయ్ వెంట వందల మంది కేరింతలు, నినాదాలు చేస్తూ ముందుకు సాగడంతో ఒక్కసారిగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అవేమీ పట్టించుకోకుండా జగన్ నిదానంగా వివాహ వేదికకు చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న వేదికకు చేరుకోవడానికి అర గంటకు పైగా పట్టింది. జగన్ తిరిగి వెళ్లే సమయంలోనూ వైకాపా శ్రేణులు హంగామా చేశాయి.

28న కేంద్ర ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులకు శంకుస్థాపన

- ముఖ్యఅతిథిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాక

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని అమరావతిని ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ నెల 28న అమరావతిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా 25 ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యాలయాలు, సంస్థలకు శంకుస్థాపన జరగనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు, అధికారులు హాజరవుతారు. 28న ఉదయం 11.10 గంటల నుంచి 12.25 మధ్య సీఆర్డీఏ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన పురపాలక శాఖకు చెందిన భవనం వేదికగా వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, వెలగపూడి, నేలపాడు, ఐనవోలు పరిధిలో ఆయా సంస్థలు, బ్యాంకులు ఏర్పాటు కానున్నాయి. ఈ కార్యక్రమం గత నెలలోనే జరగాల్సి ఉన్నా మొంథా తుపాను కారణంగా వాయిదా పడింది. ఈ కార్యాలయాలన్నీ అందుబాటులోకి వస్తే అమరావతి పెద్ద ఆర్థిక కేంద్రంగా మారుతుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



ఉద్దండరాయునిపాలెం ఎదుట రేకులతో ఫెన్సింగ్, బోర్డు ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ

✦ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ, ఎల్ఐసీ, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, ఇన్‌కమ్ ట్యాక్స్, కెనరా బ్యాంక్, ఏపీ కోపరేటివ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, నేషనల్ బ్యాంక్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కోస్టల్ ఏరియా బ్యాంక్, ఐడీబీఐ, ఏపీ కోపరేటివ్ బ్యాంకులు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నాయి.

248 తాబేళ్లు పట్టివేత

మోతుగూడెం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా తులసిపాక చెక్‌పోస్టు వద్ద ఆదివారం మధ్యాహ్నం అక్రమంగా తరలిస్తున్న 248 తాబేళ్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం నుంచి ఒడిశాకు ట్రాలీ ఆటోలో తరలిస్తున్నట్లు ఎఫ్ఎస్‌వో విజయ్‌కుమార్ తెలిపారు. వాటిలో 18 తాబేళ్లు చనిపోయాయన్నారు. ఈ కేసులో రావులపాలేనికి చెందిన నెల్లూరి విశాఖను అరెస్టు చేసి, తాబేళ్లను తులసిపాక వద్ద సోకులేరు వాగులో విడిచిపెట్టినట్లు పేర్కొన్నారు.



ఆటోలో తరలిస్తున్న తాబేళ్లు

బాలుడి కంటిరెప్పకు గుచ్చుకున్న గాలం ముల్లు

శస్త్రచికిత్స చేసి తొలగించిన వైద్యులు



బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా మరుప్రోలువారిపాలేనికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి నక్కల సందీప్ స్నేహితులతో కలిసి ఆదివారం చేపల వేటకు వెళ్లాడు. ఓ మిత్రుడు నీటిలోకి గాలం విసురుతుండగా ప్రమాదవశాత్తూ ముల్లు సందీప్ కంటిరెప్పకు గుచ్చుకుంది. కుటుంబ సభ్యులు బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ సిద్ధార్థ శస్త్రచికిత్స చేసి గాలం ముల్లు తొలగించారు.

నా పిల్లలు.. నా వారేనా?

- ఉగాండాలో ఉలిక్కిపడుతున్న పురుషులు
- భారీగా పెరుగుతున్న పితృత్వ పరీక్షలు

కంపాలా: ప్రాణంగా చూసుకుంటున్న పిల్లలు తనకు పుట్టిన వారు కారని తెలిస్తే.. ఆ తండ్రి పరిస్థితి ఎలా ఉంటుంది? తన సంతానంలో చాలామందికి అతడి పోలికలు కాకుండా ఇతరులవి వస్తే.. అతడి వేదనను వర్ణించగలమా? ఆఫ్రికాలోని ఉగాండాలో చాలామంది పురుషుల పరిస్థితి ఇప్పుడు ఇలానే ఉంది. పిల్లలు నిజంగా తమకు పుట్టినవారేనా అన్న అనుమానంతో చాలామంది పురుషులు పితృత్వ పరీక్షలకు మొగ్గుచూపుతుండడంతో.. దేశంలో ఇటీవల కాలంలో డీఎన్ఏ పరీక్షలు గణనీయంగా పెరిగాయి. ఇలా పరీక్షలకు వెళుతున్న పురుషుల్లో 98 శాతానికి పైగా పిల్లలు తమకు పుట్టినవారు కారని ఫలితాలు వస్తున్నాయి. ఈ చేదు వాస్తవం వారి కుటుంబాల్ని కకావికలం చేస్తోంది. గొడవలు తీవ్రమవుతున్నాయి. కాపురాలు కుప్పకూలుతున్నాయి. 'మీ గుండె దృఢంగా ఉంటే తప్ప.. ఈ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రాకండి' అంటూ స్వయంగా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి సూచనలిస్తున్నారంటేనే.. పరిస్థితి ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు.



ఎలా మొదలైంది?

ఇటీవల ఓ ప్రముఖ కేసులో కోర్టు ఆదేశించిన డీఎన్ఏ పరీక్షలో కంపాలాలోని ఒక సంపన్న విద్యావేత్త తన ముగ్గురు పిల్లల్లో ఒకరికి తండ్రి కాదని తేలింది. ఈ కేసును స్థానిక పత్రికలు విస్తృతంగా కవర్ చేశాయి. దీంతో చాలామందికి వారి సంతానం మీద అనుమానాలు మొదలయ్యాయి. ఆఫ్రికా సంప్రదాయం ప్రకారం.. మహిళ తన భర్తకు సంతానాన్ని కని ఇవ్వకపోతే.. విడాకులు ఇవ్వడం లేదా ఆమెను ఇంటి నుంచి బయటకు పంపడం చేసేవారు. చాలా కేసుల్లో పురుషుల్లోనే సంతాన సమస్యలున్నా.. శిక్ష మాత్రం తమకు పడుతుండడంతో చాలామంది మహిళలు ఇతరులతో కలిసి పిల్లలను కంటున్నారని అధికారి ఒకరు తెలిపారు.

ప్రకటనల వెల్లువ

తాజా పరిణామంతో ఉగాండా అంతటా డీఎన్ఏ పరీక్షా కేంద్రాలు వెలిశాయి. రేడియో, బహిరంగ ప్రదేశాలలో క్లినికల్ ల్యాబ్‌ల ద్వారా అనేక ప్రకటనలు వెలువడుతున్నాయి. ఉగాండా రాజధాని కంపాలాలో కొన్ని ప్రయాణ ట్యాక్సీలు సైతం.. డీఎన్ఏ పరీక్షను అందించే సౌకర్యాల కోసం ప్రకటనలతో స్టిక్కర్లను అంటించుకున్నాయి.

ప్రయత్నాలు విఫలం

గ్రామీణ ప్రాంతాల్లో డీఎన్ఏ పరీక్షల ఖర్చు ఎక్కువగా ఉండడంతో ప్రజలు పెద్ద పెద్ద నాయకులు, మత గురువుల వద్దకు వెళ్లి సలహాలు కోరుతున్నారు. అయితే చాలా మంది పాస్టర్లు, తెగ పెద్దలు.. ఈ కుటుంబాలను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. 'పిల్లలు ఎలా పుట్టినా.. వారు ఈ ఇంటి వారే. వారిని తిరస్కరించడం పాపం. ఇదే సంప్రదాయం ఒకప్పుడు కుటుంబాలను నిలిపింది' అంటూ నచ్చచెబుతున్నారు. చర్చిలు కూడా డీఎన్ఏ పరీక్షలపై మనసు పెట్టొద్దని సూచిస్తున్నాయి. అయితే ఇప్పుడు చాలా మంది వీటిని పట్టించుకోవడం లేదు.



నిరసనకారుడిని నేలకేసి అదిమిపట్టి..

దిల్లీలో వాయు కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ స్థానికులు ఆదివారం ఇండియా గేట్ సమీపంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ నిరసనకారుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో అతడి తలను నేలకేసి బలంగా అదిమిపట్టుకున్న ఓ పోలీసు

ప్రభుత్వ వ్యతిరేక తీర్పులే స్వతంత్రతకు రుజువు కాదు

- ఏ ప్రభుత్వ పదవీ చేపట్టను
- కొలీజియంలో భిన్నాభిప్రాయాలు కొత్తేం కాదు
- జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: ప్రభుత్వ వ్యతిరేక తీర్పులిస్తేనే న్యాయమూర్తులు తమ స్వతంత్రతను నిరూపించుకున్నట్లని ప్రచారంలో ఉన్న అభిప్రాయం తప్పని, అలా వెళ్లాలనుకోవడమూ సరైనది కాదని ఆదివారంతో పదవీకాలం ముగిసిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ అభిప్రాయపడ్డారు. 'న్యాయ వ్యవస్థ స్వతంత్రత గురించి నిరంతరం మాట్లాడుతున్నాం. ప్రజలకు ఈ వ్యవస్థపై పూర్తి విశ్వాసం కలగాలంటే దాని స్వతంత్రతను కాపాడాల్సిందే. అయితే న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకుంటున్నారని కొలీజియం వ్యవస్థపై కొన్ని విమర్శలున్నాయి. ఈ నియామకాల విషయంలో మేం వ్యక్తుల అభిప్రాయాలనూ పరిశీలిస్తాం. నిఘావర్గాల నివేదికలు, న్యాయశాఖ అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకుంటాం' అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ విపుల్ పంచోలి ఎంపికపై కొలీజియం సభ్యురాలు జస్టిస్ బీవీ నాగరత్న వ్యక్తం చేసిన భిన్నాభిప్రాయంలో మెరిట్ ఉండి ఉంటే మిగతా నలుగురు కొలీజియం సభ్యులు ఏకీభవించేవారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆవరణలో ఆదివారం జస్టిస్ గవాయ్ మీడియాతో ముచ్చటించారు. తన హయాంలో సుప్రీం కోర్టుకు మహిళా న్యాయమూర్తిని ఒకరినైనా ఎంపిక చేయలేకపోవడంపట్ల విచారం వ్యక్తం చేశారు. పదవీ విరమణ తర్వాత తాను ఎలాంటి ప్రభుత్వ బాధ్యతలూ చేపట్టబోనని స్పష్టం చేశారు. సొంత జిల్లా అమరావతిలో గిరిజన సంక్షేమం కోసం తన సమయాన్ని కేటాయించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఓ న్యాయవాది తనపై పాదరక్షను విసిరేందుకు యత్నించిన ఘటనపై స్పందిస్తూ.. అతణ్ని క్షమించాలన్న నిర్ణయం ఆ క్షణంలో తీసుకున్నట్లు చెప్పారు.

న్యాయ వ్యవస్థలో బంధుప్రీతి అరుదు

న్యాయ వ్యవస్థలో బంధు ప్రీతి ఉందన్న భావన తప్పని, ఒకవేళ ఉన్నా అలాంటివి 10-20 %కి మించి జరిగి ఉండవని పేర్కొన్నారు. న్యాయమూర్తుల బంధువుల్లో ప్రతిభావంతులుంటే వారిని విస్మరించడం భావ్యమేనా అని ప్రశ్నించారు. అలాంటి వారి ఎంపిక సమయంలో కొలీజియం మిగతావారి కంటే మరిన్ని ఉన్నత ప్రమాణాలు పాటిస్తుందని పేర్కొన్నారు. తన



హయాంలో మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో హైకోర్టు ధర్మాసనం ఏర్పాటు చేయడం అత్యంత సంతృప్తినిచ్చినట్లు చెప్పారు. 'మీ తండ్రి గతంలో గవర్నర్‌గా పని చేసినందున మీరు భవిష్యత్తులో ఆ పదవిని స్వీకరిస్తారా' అన్న ప్రశ్నకు.. లేదని సమాధానమిచ్చారు. తన హయాంలో హైకోర్టులు, సుప్రీం కోర్టుకు 107 మంది న్యాయమూర్తులను నియమించానని తెలిపారు.

సామాజిక మాధ్యమాలను కట్టడి చేయాలి

సామాజిక మాధ్యమాల తీరుపట్ల జస్టిస్ గవాయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోర్టులో జరిగే న్యాయ ప్రక్రియను తప్పుగా చిత్రీకరించడంతోపాటు, న్యాయమూర్తులు ఎన్నడూ అనని మాటలను వారికి ఆపాదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్వేష ప్రసంగాల నియంత్రణకు చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గవర్నర్లు, రాష్ట్రపతికి న్యాయస్థానాలు గడువులు విధించడంపై సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమర్థించారు. అయితే శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్లు నిరవధికంగా పెండింగులో పెట్టకూడదని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో కోర్టుల నుంచి రాష్ట్రాలు న్యాయం కోరవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలు చేయాలని తాను ఇచ్చిన తీర్పుపై నిర్ణయం తీసుకోవడం కార్యనిర్వాహక వ్యవస్థపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఆ తీర్పు వెనుక కారణం ఉందని, అణగారిన వర్గాలను అందరితో సమానంగా పైకి తేవడమే రిజర్వేషన్ల ఉద్దేశమని పేర్కొన్నారు. ఎన్నో ఎస్సీ కుటుంబాలు తరతరాలుగా రిజర్వేషన్లు పొందుతూ వస్తున్నదీ చూశామని, ఇలాంటి పరిస్థితుల్లో క్రీమీలేయర్ విధానాన్ని అమలు చేస్తే అవసరమైన వారికి రిజర్వేషన్ల ఫలాలు దక్కుతాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమారుడు, గ్రామంలోని భూమిలేని రైతు కుమారుడు పోటీ పడాలంటే ఎలా అని ప్రశ్నించారు. అది సమాన వేదిక ఎలా అవుతుందన్నారు. తన పదవీ కాలంలో ఏ సందర్భంలోనూ కార్యనిర్వాహక వ్యవస్థ నుంచి ఒత్తిడిని ఎదుర్కోలేదని చెప్పారు.



ఉదయాన్నే ఈ తప్పులు చేయొద్దు

- ✦ నిద్ర లేచిన వెంటనే ఫోన్ చూడటం.
- ✦ నీళ్లు తాగకపోవటం.
- ✦ బయట ఎండలో నిల్చోకుండా పడక గదిలోనే ఉండటం.
- ✦ ప్రతికూల ప్రభావం చూపే వార్తలు చదవడం.
- ✦ వ్యాయామం/ధ్యానం చేయకపోవడం.
- ✦ బ్రేక్‌ఫాస్ట్ మానేసి కాఫీ మాత్రమే తాగడం.

– విక్టోరియా రెపా, లీడర్‌షిప్ కోచ్

ఉగ్రవాదం

ఏ రూపంలో ఉన్నా ఉపేక్షించం

- ఏఐ ముప్పును ఉమ్మడిగా ఎదుర్కొందాం
- జీ20 సదస్సు తీర్మానాలు

G20 SOUTH AFRICA 2025

జొహన్నెస్‌బర్గ్: ఉగ్రవాదంపై పోరు విషయంలో భారత్ వాణిని ప్రతిబింబించేలా జీ20 శిఖరాగ్ర సదస్సు తీర్మానం చేసింది. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదని, అది ఏ రూపంలో ఉన్నా తెగనాడాల్సిందేనని స్పష్టంచేసింది. జొహన్నెస్‌బర్గ్‌లో జీ20 సదస్సు ఆదివారం రాత్రి ముగిసింది. సదస్సుకు ఆతిథ్యమిస్తున్న దక్షిణాఫ్రికా, జీ20 కూటమి తరఫున ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేసింది. కూటమి దేశాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంపై దృష్టి పెడతామని పేర్కొంది. ఏఐ సాంకేతికతలను అందిపుచ్చుకునే విషయంలో కలిసికట్టుగా పనిచేస్తామని, ఏఐతో తలెత్తే ముప్పును తగ్గించే చర్యలను సైతం ఐక్యంగానే చేపడతామని తెలిపింది. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు కలిసి పనిచేస్తే సాంకేతిక రంగంలో యావత్ ప్రపంచానికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది. సాంకేతికత ఫలాలు అందరికీ సమంగా అందాలని పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకూ ఐరాస వంటి అంతర్జాతీయ వేదికల్లో సముచిత స్థానం దక్కాలని డిమాండ్ చేసింది.

భారత్ చూపిన బాటలో..

"2023లో భారత్ ఏర్పాటుచేసిన 'విపత్తు ముప్పు తగ్గించే కార్యాచరణ'ను మళ్లీ అమల్లోకి తెస్తాం. కలిసికట్టుగా పనిచేస్తాం. విపత్తులతో ముడిపడిన బీమా, రిస్క్, సహాయక ప్యాకేజీలు, విపత్తు బాండ్లు, బీమా హామీ పథకాల అమలు విషయంలో జీ20 దేశాలు ఐక్యంగా ఉంటాయి. ఆహార భద్రత విషయంలో గతంలో భారత్ ప్రతిపాదించిన అత్యున్నత స్థాయి సూత్రాలను కూటమి అనుసరిస్తుంది. యుద్ధ సమయాల్లో శత్రుదేశాలకు ఆహార సరఫరాను అడ్డుకునే దుష్ట సంస్కృతిని మేం సమర్థించం" అని జీ20 సదస్సు తెలిపింది.

కిడ్నాపర్ల నుంచి తప్పించుకున్న 50 మంది నైజీరియా విద్యార్థులు

ఇంకా నిర్బంధంలోనే 265 మంది

అబూజా: నైజీరియాలోని నైగర్ రాష్ట్ర సెయింట్ మేరీ కేథలిక్ స్కూలు నుంచి అపహరణకు గురైన 303 మంది విద్యార్థుల్లో 50 మంది కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకున్నారు. పది నుంచి పద్దెనిమిదేళ్లలోపు వయసున్న వీరు తమంతట తాము సురక్షితంగా బయటపడి కుటుంబాలను కలుసుకున్నారు. 253 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులు ఇంకా నిర్బంధంలోనే ఉన్నట్లు స్కూలు యాజమాన్యం ఆదివారం వెల్లడించింది. సాయుధులైన కొంత మంది దుండగులు గత శుక్రవారం పాఠశాలపై దాడి చేసి ఈ అపహరణలకు పాల్పడ్డారు. దీనికి బాధ్యులుగా ఇప్పటివరకు ఏ వర్గం నుంచి కూడా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. విద్యార్థులను కాపాడేందుకు అధికారులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. నైజీరియా మారుమూల ప్రాంతాల్లో డజన్లకొద్దీ తిరుగుతున్న సాయుధ దళాలు డబ్బు కోసం తరచూ ఇలా కిడ్నాపులకు పాల్పడుతుంటాయి. వ్యూహాత్మకంగా స్కూళ్లను వీరు తమ లక్ష్యంగా చేసుకొంటూ ఉంటారు.

EENADU Vol: 52, Issue: 104 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మ్యాజిక్‌పిన్‌తో ర్యాపిడో జట్టు!



దిల్లీ: ఆహార పదార్థాల డెలివరీ విభాగంలో అగ్రగామిగా ఉన్న జొమాటో, స్విగ్గీలకు పోటీ ఇచ్చేందుకు ర్యాపిడో, మ్యాజిక్‌పిన్‌ సంస్థలు భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. తద్వారా మ్యాజిక్‌పిన్‌కు దేశవ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్‌ నెట్‌వర్క్‌ను ర్యాపిడోకు చెందిన ఓన్లీ ప్లాట్‌ఫామ్‌కు అనుసంధానం చేయనున్నట్లు తెలుస్తోంది. ఓన్లీ యాప్‌ను ఆగస్టులో ర్యాపిడో అందుబాటులోకి తెచ్చింది. తొలుత బెంగళూరుకే దీని సేవలు పరిమితం కాగా.. దీనిని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు ఈ ఒప్పందం ర్యాపిడోకి ఉపయోగపడనుంది. అలాగే కొన్ని ప్రాంతాల్లో ర్యాపిడోకు చెందిన డెలివరీ వాహనాల సేవలను ఉపయోగించుకునే వీలు మ్యాజిక్‌పిన్‌కు కలుగుతుంది.



అమెరికా కొత్త ఆంక్షలతో రష్యా చమురు దిగుమతులపై భారం



దిల్లీ: సమీప భవిష్యత్‌లో రష్యా నుంచి మన దేశ చమురు దిగుమతులు గణనీయంగా తగ్గొచ్చని, అయితే పూర్తిగా ఆగిపోవని విశ్లేషకులు అంటున్నారు. రష్యా చమురు సంస్థలపై అమెరికా కొత్త ఆంక్షలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయని తెలిపారు. రష్యా సంస్థలు రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌.. వాటి అనుబంధ సంస్థలపై అమెరికా ఆంక్షలు నవంబరు 21 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ఈ సంస్థలతో అనుబంధం కలిగిన కంపెనీలపైనా ప్రభావం పడింది. ఈ ఏడాది రష్యా నుంచి మన దేశ ముడి చమురు దిగుమతులు రోజుకు సగటున 1.7 మిలియన్‌ బ్యారెళ్లుగా ఉన్నాయి. రిఫైనరీ సంస్థలు రాయితీ కొనుగోళ్లను అధికం చేయడంతో గత నెలలో ఇవి రోజుకు 1.8- 1.9 మిలియన్‌ బ్యారెళ్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే డిసెంబరు, జనవరిలో మాత్రం దిగుమతులు గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమీపకాలంలో రోజుకు 4 లక్షల బ్యారెళ్లకు పైగా పరిమితం కావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ముడిచమురు కోసం మన దేశం ఎక్కువగా పశ్చిమాసియాపై ఆధారపడుతుంది. అయితే 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభమైన తర్వాత, రష్యాపై అమెరికా, ఐరోపా దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో రాయితీ ధరలకే చమురును అందిస్తున్న కారణంగా తక్కువ సమయంలోనే రష్యా నుంచి మన చమురు దిగుమతులు 1 శాతం నుంచి 40 శాతానికి పెరిగాయి. నవంబరులోనూ భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా కొనసాగుతోంది.

● అమెరికా ఆంక్షల కారణంగా రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌, హెచ్‌పీసీఎల్‌-మిత్తల్‌ ఎనర్జీ, మంగళూరు రిఫైనరీ అండ్‌ పెట్రోకెమికల్స్‌లు రష్యా దిగుమతులను నిలిపివేశాయి. రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారా ఎనర్జీ మాత్రం రష్యా చమురుపైనే ఆధారపడుతోంది.

● డిసెంబరు, జనవరిలో భారత్‌కు రష్యా చమురు దిగుమతులు గణనీయంగా తగ్గనున్నాయి. అక్టోబరు 21 నుంచే లోడింగ్‌లు నెమ్మదించాయి. ముందుగానే కుదుర్చుకున్న ఒప్పందాల కారణంగా గత నెలలో దిగుమతులు అదే స్థాయిలో ఉన్నాయి అని కెప్లర్‌ లీడ్‌ రీసెర్చ్‌ అనలిస్ట్‌ (రిఫైనింగ్‌, మోడలింగ్‌) సుమిత్‌ రిటోలియా పేర్కొన్నారు.

5% పెరగనున్న పీవీల అమ్మకాలు

2025-26పై టాటా మోటార్స్‌ ఎండీ

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రయాణికుల వాహనాల (పీవీ) అమ్మకాలు సుమారుగా 5 శాతం పెరిగే అవకాశం ఉందని టాటా మోటార్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) శైలేష్‌ చంద్ర తెలిపారు. పండగ సీజన్‌ తర్వాత కూడా గిరాకీకి సానుకూలతలు కొనసాగుతుండటంతో రెండో అర్ధభాగంలోనూ అమ్మకాల్లో రెండంకెల వృద్ధి ఉండొచ్చని ఆయన అంచనా వేశారు. ఏడాదిక్రితంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌- సెప్టెంబరులో ప్రయాణికుల వాహనాల విక్రయాలు 1.6 శాతం తగ్గాయని వెల్లడించారు. మళ్లీ విక్రయాలు పుంజుకోవడానికి పండగ సీజనే దోహదపడిందని చెప్పుకొచ్చారు.

టీసీఎస్‌కు అమెరికా కోర్టులో ఎదురుదెబ్బ

దిల్లీ: కంప్యూటర్‌ సైన్సెస్‌ కార్పొరేషన్‌ (సీఎస్‌సీ)తో వాణిజ్య రహస్యాల ఒప్పందానికి సంబంధించిన కేసులో అమెరికా కోర్ట్‌ ఆఫ్‌ అప్పీల్స్‌ 'ప్రతికూల తీర్పు' వెలువరించిందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ (టీసీఎస్‌) వెల్లడించింది. ఈ కంపెనీ ప్రస్తుతం డీఎక్స్‌సీ టెక్నాలజీతో విలీనమైంది. ఈ కేసులో 194 మిలియన్‌ డాలర్లు (రూ.1700 కోట్లు) చెల్లించాల్సిందిగా డిస్ట్రిక్ట్‌ కోర్టు ఇచ్చిన తీర్పును అమెరికా కోర్ట్‌ ఆఫ్‌ అప్పీల్స్‌ సమర్థించింది.

మళ్లీ తెరపైకి ప్రభుత్వ బీమా కంపెనీల విలీనం!



దిల్లీ: మూడు ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలను విలీనం చేసి ఒకే సంస్థగా ఏర్పాటు చేయాలన్న పాత ప్రతిపాదనను ఆర్థిక శాఖ మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. ఈ మూడు సంస్థల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తోంది. తద్వారా వాటి సామర్థ్యాలను పెంచడంతో పాటు స్థాయిని పెంచాలని చూస్తోంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటకు తెచ్చేందుకు 2019-20 నుంచి 2021-22 మధ్య మూడు ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలు- ఓరియెంటల్‌ ఇన్సూరెన్స్‌, నేషనల్‌ ఇన్సూరెన్స్‌, యునైటెడ్‌ ఇండియా ఇన్సూరెన్స్‌ల్లో ప్రభుత్వం రూ.17,450 కోట్ల పెట్టుబడులు పెట్టింది. 2018-19 బడ్జెట్‌లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్‌ జైట్లీ, ఈ మూడు కంపెనీలను విలీనం చేసి, ఒకే బీమా సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అయితే 2020 జులైలో ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. అదే సమయంలో మూడు కంపెనీలకు రూ.12,450 కోట్ల మూలధనాన్ని అందించేందుకు కేంద్ర కేబినెట్‌ ఆమోదం తెలిపింది. తాజాగా సంస్థల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో, మళ్లీ ఈ సంస్థల విలీనానికి ఆర్థిక శాఖ ప్రాథమికంగా మదింపు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఒక సాధారణ బీమా కంపెనీని ప్రైవేటీకరించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నామని, పలు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని, ఇంకా ఏదీ ఖరారు కాలేదని వెల్లడించాయి.


● 2021-22 బడ్జెట్‌లో రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఒక సాధారణ బీమా కంపెనీని ప్రైవేటీకరించే ఆలోచన ఉందని ప్రకటించారు. అనంతరం ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీల ప్రైవేటీకరణను అనుమతించే జనరల్‌ ఇన్సూరెన్స్‌ బిజినెస్‌ (జాతీయీకరణ) సవరణ చట్టం, 2021ని అదే ఏడాది ఆగస్టులో పార్లమెంట్‌ ఆమోదించింది.

● సవరించిన చట్టం ప్రకారం.. బీమా సంస్థ ఈక్విటీ మూలధనంలో కనీసం 51 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం కలిగి ఉండాలనే నిబంధనను తొలగించారు. ప్రభుత్వ రంగ బీమా కంపెనీల్లో ప్రైవేట్‌ భాగస్వామ్యాన్ని అనుమతించడం, బీమా వ్యాప్తిని పెంచడం వంటి వాటికి అడ్డంకులు తొలగించింది.

● బీమా ఉత్పత్తులకు పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా ఈ రంగంలో మరిన్ని విదేశీ సంస్థలు వచ్చేందుకు, రాబోయే పార్లమెంట్‌ శీతాకాల సమావేశాల్లో ఎఫ్‌డీఐ పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచే బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌ అమలుకు మార్గదర్శకాలు

ఈ వారంలోనే విడుదల కావచ్చు: మంత్రి గోయల్‌



జెరూసలేం: పరిశ్రమకు ప్రయోజనాలు అందించేందుకు రూ.25,060 కోట్ల ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌ (ఈపీఎం) అమలు కోసం మార్గదర్శకాలు ఈ వారంలో విడుదలయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్‌ గోయల్‌ వెల్లడించారు. అమెరికా విధించిన అధిక సుంకాలను ఎదుర్కొనేందుకు ఎగుమతిదార్లకు సాయం అందించడానికి, 2025-26 నుంచి ప్రారంభమయ్యే 6 ఆర్థిక సంవత్సరాలకు రూ.25,060 కోట్లతో ఈపీఎంను ప్రభుత్వం నవంబరు 12న ఆమోదించిన సంగతి విదితమే. ఈ మిషన్‌ నిర్యత్‌ ప్రోత్సాహన్‌ (రూ.10,401 కోట్లు), నిర్యత్‌ దిశ (రూ.14,659 కోట్లు) అనే రెండు ఉప పథకాల ద్వారా అమలు కానుంది. 'ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌ కోసం మార్గదర్శకాలు త్వరలో విడుదలవుతాయి. పరిశ్రమ వాటితో ఎలా ప్రయోజనం పొందగలదో ఆ వివరాలు వచ్చే వారం విడుదల అవుతాయని నేను భావిస్తున్నాను' అని మంత్రి వెల్లడించారు. ఈ మిషన్‌ కింద అధిక సుంకాలతో ప్రభావితమైన వస్త్రాలు, తోలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్‌ వస్తువులు, సముద్ర ఉత్పత్తులు వంటి రంగాలకు ప్రాధాన్యత మద్దతు ఉంటుంది. ఈ రంగాలు అమెరికా మార్కెట్లో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అధిక సుంకాల కారణంగా, అక్టోబరులో అమెరికాకు భారత్‌ నుంచి ఎగుమతులు 8.58 శాతం తగ్గి 6.3 బిలియన్‌ డాలర్ల (సుమారు రూ.56,000 కోట్ల)కు చేరాయి.

● భారత్‌- ఇజ్రాయెల్‌ల మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలు రెండు దశల్లో పూర్తి చేయాలనుకుంటున్నట్లు పీయూష్‌ గోయల్‌ వెల్లడించారు. ఈ ఒప్పందం కోసం అధికారికంగా చర్చలు ప్రారంభించడానికి భారత్‌, ఇజ్రాయెల్‌ గురువారం టర్మ్‌ ఆఫ్‌ రిఫరెన్స్‌ (టీఓఆర్‌)పై సంతకాలు చేశాయి. టారిఫ్‌, నాన్‌-టారిఫ్‌ అడ్డంకులను తొలగించి వస్తువులకు మార్కెట్‌ యాక్సెస్‌ కల్పించడం, సులభతర పెట్టుబడి, కస్టమ్స్‌ విధానాల సరళీకరణ, ఆవిష్కరణ, సాంకేతిక బదిలీకి సహకారాన్ని పెంపొందించడం, సేవల్లో వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి నిబంధనలను సడలించడం వంటివి టీఓఆర్‌లో ఉన్నాయి. అలాగే ఇజ్రాయెల్‌ ప్రెసిడెంట్‌ ఇసాక్‌ హెర్జోగ్‌తోనూ సమావేశమై వాణిజ్య ఒప్పందం, పెట్టుబడుల లాంటి అంశాలపై గోయల్‌ చర్చించారు.

● అమెరికా విధించిన అధిక సుంకాల నేపథ్యంలో, మన దేశ ఎగుమతులను పెంచే వ్యూహాలను చర్చించడానికి మంత్రి పీయూష్‌ గోయల్‌ అధ్యక్షతన మంగళవారం బోర్డు ఆఫ్‌ ట్రేడ్‌ (బీఓటీ) సమావేశం కానుంది. మంత్రి నేతృత్వంలోని ఈ బోర్డులో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ప్రభుత్వ-ప్రైవేటు రంగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారు.

స్థిరాస్తి విక్రయ బుకింగ్‌లు రూ.92,437 కోట్లు

● ఏప్రిల్‌-సెప్టెంబరులో 28 నమోదిత సంస్థలకొచ్చాయ్‌

● అత్యధికం ప్రెస్టీజ్‌ ఎస్టేట్స్‌కే



దిల్లీ: దేశీయంగా 28 దిగ్గజ నమోదిత స్థిరాస్తి సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి అర్ధ భాగం (ఏప్రిల్‌-సెప్టెంబరు)లో రూ.92,437 కోట్ల విలువైన స్థిరాస్తులను విక్రయించాయి. బెంగళూరుకు చెందిన ప్రెస్టీజ్‌ ఎస్టేట్స్‌ రూ.18,143.7 కోట్ల అత్యధిక విక్రయాల బుకింగ్‌లను నమోదు చేసింది. మార్కెట్‌ విలువ పరంగా దేశంలోనే అతి పెద్ద స్థిరాస్తి సంస్థ అయిన డీఎల్‌ఎఫ్‌ రూ.15,757 కోట్ల ప్రీ-సేల్స్‌తో రెండో స్థానంలో నిలిచింది. ముంబయికి చెందిన గోద్రేజ్‌ ప్రోపర్టీస్‌ రూ.15,587 కోట్ల బుకింగ్‌లతో మూడో స్థానం దక్కించుకుంది. లోధా డెవలపర్స్‌ రూ.9,020 కోట్లతో 4వ స్థానంలో, దిల్లీ-ఎన్‌సీఆర్‌కు చెందిన సిగ్నేచర్‌ గ్లోబల్‌ రూ.4,650 కోట్ల విక్రయాల బుకింగ్‌లతో 5వ స్థానంలో నిలిచాయి. టాప్‌-5 కంపెనీలే రూ.63,000 కోట్లకు పైగా (70 శాతం) విక్రయాలు నమోదు చేశాయి.

● బెంగళూరుకు చెందిన శోభ లిమిటెడ్‌ రూ.3,981.4 కోట్లు, బ్రిగేడ్‌ ఎంటర్‌ప్రైజెస్‌ రూ.3,152 కోట్లు, ఒబెరాయ్‌ రియాల్టీ రూ.2,937.74 కోట్లు, కల్పతరు లిమిటెడ్‌ రూ.2,577 కోట్లు విలువైన విక్రయాల బుకింగ్‌లను నమోదు చేశాయి.

● పూర్వాంకర రూ.2,455 కోట్లు, కీస్టోన్‌ రియల్టర్స్‌ రూ.1,839 కోట్లు, సన్‌టెక్‌ రియాల్టీ రూ.1,359 కోట్లు, ఆదిత్య బిర్లా రియల్‌ ఎస్టేట్‌ రూ.1,312 కోట్లు, కోల్టే-పాటిల్‌ డెవలపర్స్‌ రూ.1,286 కోట్లు, మహీంద్రా లైఫ్‌స్పేస్‌ డెవలపర్స్‌ రూ.1,200 కోట్లు, శ్రీరామ్‌ ప్రోపర్టీస్‌ రూ.1,126 కోట్ల విక్రయాలను నమోదు చేశాయి.

● రూ.1,000 కోట్లలోపు విక్రయాలు నమోదు చేసిన కంపెనీల్లో అజ్మీరా రియాల్టీ అండ్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ (రూ.828 కోట్లు), రేమండ్‌ రియాల్టీ (రూ.760 కోట్లు), ఆషియానా హౌసింగ్‌ (రూ.734.4 కోట్లు), ఎంబసీ డెవలప్‌మెంట్స్‌ (రూ.607 కోట్లు), అర్వింద్‌ స్మార్ట్‌స్పేసెస్‌ (రూ.607 కోట్లు), టార్క్‌ (రూ.565 కోట్లు), అరిహంట్‌ సూపర్‌స్ట్రక్చర్స్‌ (రూ.386.4 కోట్లు), మ్యాక్స్‌ ఎస్టేట్స్‌ (రూ.373 కోట్లు), అర్కేడ్‌ డెవలపర్స్‌ (రూ.331 కోట్లు), శ్రీలోటస్‌ డెవలపర్స్‌ (రూ.319 కోట్లు), ఎల్డెకో హౌసింగ్‌ అండ్‌ ఇండస్ట్రీస్‌ (రూ.309.2 కోట్లు), సూరజ్‌ ఎస్టేట్‌ డెవలపర్స్‌ (రూ.234 కోట్లు) ఉన్నాయి.

● 2024-25 ఆర్థిక సంవత్సరంలో 26 దిగ్గజ నమోదిత స్థిరాస్తి సంస్థలు రూ.1.62 లక్షల కోట్ల స్థిరాస్తులను విక్రయించాయి. గత ఆర్థిక సంవత్సరంలో గోద్రేజ్‌ ప్రోపర్టీస్‌ రూ.30,000 కోట్ల విక్రయాలతో అగ్రస్థానంలో నిలిచింది.

మొబైల్‌ సేవల కోసం 6 గిగాహెర్ట్జ్‌ స్పెక్ట్రమ్‌ను కేటాయించొద్దు

భారత టెల్కోల డిమాండును వ్యతిరేకిస్తున్న అమెరికా టెక్‌ దిగ్గజాలు

దిల్లీ: మొబైల్‌ సేవల కోసం 6 గిగాహెర్ట్జ్‌ బ్యాండ్‌లో స్పెక్ట్రమ్‌ను కేటాయించాలన్న రిలయన్స్‌ జియో, వొడాఫోన్‌ ఐడియా డిమాండ్‌ను అమెరికా టెక్‌ దిగ్గజాలు యాపిల్‌, అమెజాన్‌, సిస్కో, మెటా, హెచ్‌పీ, ఇంటెల్‌ కార్పొరేషన్‌ సంయుక్తంగా వ్యతిరేకించాయి. ఈ బ్యాండ్‌ను వైఫై సేవలకు కేటాయించాలని కోరాయి. తదుపరి విడత స్పెక్ట్రమ్‌ వేలం కోసం టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్‌ సంప్రదింపుల పత్రానికి ప్రతిస్పందనగా, మొబైల్‌ సేవలకు 6 గిగాహెర్ట్జ్‌ బ్యాండ్‌లో సాంకేతిక, వాణిజ్య సంసిద్ధత ఏర్పాటు కాలేదని టెక్‌ దిగ్గజాలు పేర్కొన్నాయి. ట్రాయ్‌, టెలికాం విభాగం కలిసి 6 గిగాహెర్ట్జ్‌ బ్యాండ్‌ స్పెక్ట్రమ్‌ కేటాయింపుపై సమీక్షించాలని కోరాయి. రిలయన్స్‌ జియో మాత్రం మొత్తం 6 గిగాహెర్ట్జ్‌లో అందుబాటులో ఉన్న 1200 మెగాహెర్ట్జ్‌ స్పెక్ట్రమ్‌ను తదుపరి విడత వేలంలో ఉంచాలని కోరుతోంది. అమ్మకానికి అందుబాటులో ఉన్న 400 మెగాహెర్ట్జ్‌ స్పెక్ట్రమ్‌ను ఇదే వేలంలో ఉంచాలని వొడాఫోన్‌ ఐడియా డిమాండ్‌ చేస్తోంది. నెట్‌వర్క్‌ పరికరాల అభివృద్ధి, ప్రపంచ సమన్వయం పరంగా బ్యాండ్‌ను పర్యావరణ వ్యవస్థ సంసిద్ధత సాధించాల్సి ఉన్నందున, ఎయిర్‌టెల్‌ 6 గిగాహెర్ట్జ్‌ బ్యాండ్‌ స్పెక్ట్రమ్‌ వేలాన్ని వాయిదా వేయాలని కోరుతోంది. అమెరికాకు చెందిన చిప్‌సెట్‌ తయారీ సంస్థ క్వాల్‌కామ్‌ కూడా ఎయిర్‌టెల్‌ తరహాలోనే స్పందించింది.

కోడి గుడ్డు

24న ఫారం వద్ద అమ్మకం ధరలు (నెక్‌) (100కు రూపాయల్లో)

హైదరాబాద్‌	650	తూ/గో.గోదావరి	645
వరంగల్‌	652	విశాఖపట్నం	635
విజయవాడ	660	చిత్తూరు	673

పసిడి సానుకూలమే!

కమొడిటీస్‌ ఈ వారం

పసిడి




పసిడి డిసెంబరు కాంట్రాక్టు ఈవారం కూడా సానుకూలంగానే కనిపిస్తోంది. అయితే రూ.1,25,568 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,26,941; రూ.1,29,344 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.1,21,792 కంటే కిందకు వస్తే రూ.1,19,389; రూ.1,18,016 వరకు దిద్దుబాటు కావచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.1,59,885 కంటే పైన చలించకుంటే ప్రతికూల ధోరణికి అవకాశం ఉంటుంది. అయితే రూ.1,53,502 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,49,272; రూ.1,44,948 వరకు దిగిరావచ్చు. అదేవిధంగా రూ.1,62,056 కంటే పైకి వెళితే రూ.1,66,380; రూ.1,70,611 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

ప్రాథమిక లోహాలు



● రాగి డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,014.70 కంటే ఎగువన కదలాడకుంటే ఈవారమూ దిద్దుబాటు కొనసాగే అవకాశం ఉంది.

● సీసం డిసెంబరు కాంట్రాక్టుకు ఈవారం రూ.181.75 కంటే ఎగువన కదలాడకుంటే మరింతగా కిందకు రావొచ్చు. రూ.179.25 వద్ద మద్దతు స్థాయిని కోల్పోతే రూ.177.45; రూ.174.55 వరకు దిద్దుబాటు అవుతుందని భావించవచ్చు.

● జింక్‌ డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.301.60 ఎగువన కదలాడకుంటే ఈ స్థాయి వద్దే స్టాప్‌లాస్‌ పెట్టుకొని షార్ట్‌ సెల్‌ పొజిషన్లను కొనసాగించడం మంచిదే.

● అల్యూమినియం డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.273 కంటే పైన చలించకుంటే రూ.266.25; రూ.265.15 వరకు షార్ట్‌ సెల్‌ పొజిషన్లను కొనసాగించడం మంచి వ్యూహమే అవుతుంది.

ఇంధన రంగం



● ముడి చమురు డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.5,225 కంటే పైన కదలాడకుంటే అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉంది. అయితే రూ.5,098 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.4,999; రూ.4,853 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.5,434 కంటే పైన కదలాడితే రూ.5,489; రూ.5,588 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు.

● సహజవాయువు డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.407 కంటే పైన నిలదొక్కుకుంటే కొత్తగా లాంగ్‌ పొజిషన్లను జతచేసుకోవడం మంచిదే. సమీపకాలంలో రూ.443.90; రూ.518.20 వరకు పెరిగే అవకాశం ఉండటమే ఇందుకు కారణం.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.13,577 కంటే కిందకు వస్తే రూ.13,131; రూ.12,449 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.14,705 కంటే ఎగువన కదలాడితే రూ.15,390; రూ.15,833 వరకు వెళ్లే అవకాశం ఉంటుంది.

● జీలకర్ర డిసెంబరు కాంట్రాక్టు ఈవారం సానుకూల ధోరణిలో చలిస్తే రూ.22,350 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.22,870; రూ.23,895 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. అదేవిధంగా రూ.20,805 కంటే కిందకు వస్తే రూ.19,780; రూ.19,260 వరకు దిగిరావచ్చు.

– అర్‌ఎల్‌పీ కమొడిటీ అండ్‌ డెరివేటివ్స్‌

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (డిసెంబరు)	1,23,114	1,24,195	0.88
వెండి (మార్చి)	1,58,695	1,57,733	(0.61)
రాగి (డిసెంబరు)	1,014.65	1,011.80	(0.28)
సీసం (డిసెంబరు)	184.95	181	(2.14)
జింక్‌ (డిసెంబరు)	298.75	298.25	(0.17)
అల్యూమినియం (డిసెంబరు)	273.40	268.90	(1.65)
ముడి చమురు (డిసెంబరు)	5,293	5,197	(1.81)
సహజ వాయువు (డిసెంబరు)	416.20	429.10	3.10
పసుపు (డిసెంబరు)	14,300	14,020	(1.96)
జీలకర్ర (డిసెంబరు)	20,375	21,830	7.14

రికార్డు గరిష్ఠాలకు సూచీలు!

స్టాక్‌ మార్కెట్‌ ఈ వారం

● బలహీనతలూ లేకపోలేదు ● అంతర్జాతీయ పరిణామాలు కీలకం

● ఎఫ్‌ఎమ్‌సీజీ, లోహ షేర్లకు ప్రతికూలతలు

విశ్లేషకుల అంచనాలు



భారత స్టాక్‌ మార్కెట్లు ఈ వారమూ రాణించే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. సూచీలు రికార్డు గరిష్ఠాలకు చేరొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే స్వల్ప కాలంలో బలహీనతలకూ అవకాశం ఉందంటున్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ బాగా పడిపోవడం ప్రభావం చూపొచ్చని కొందరు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూలతలు మన మార్కెట్‌నూ ప్రభావితం చేయొచ్చని అంటున్నారు. నిఫ్టీ-50 లాభాలు కొనసాగొచ్చని కొంత మంది సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తుండగా, ఒకవేళ కిందకు దిగితే 25,920- 25,900 వద్ద మద్దతు లభించొచ్చని మరికొందరు అంటున్నారు. 26,166 పాయింట్ల పైన కొనసాగితే మరింత ముందుకు వెళ్లడానికి అవకాశం ఉందని చెబుతున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● **లోహ** కంపెనీల షేర్లు ప్రతికూల ధోరణిలో కదలాడవచ్చు. లోహ సూచీకి 10,000 వద్ద మద్దతు, 10,400 వద్ద తక్షణ నిరోధం కనిపిస్తోంది.

● **టెలికాం** షేర్లలో భారతీ ఎయిర్‌టెల్‌పై సెంటిమెంటు సానుకూలంగా ఉంది. వొడాఫోన్‌ ఐడియా స్వల్ప కాలంలో ఒత్తిడికి గురి కావొచ్చు. త్వరలోనే ప్రభుత్వం ఏజీఆర్‌ బకాయిలపై ఉపశమన ప్యాకేజీ ప్రకటించే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ఇది సానుకూలత తీసుకురావొచ్చు.

● **ఫార్మా** కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి ప్రతికూలంగా చలించొచ్చు. సూచీ జులై తర్వాత అత్యధిక స్థాయికి చేరడంతో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఇందుకు కారణం.

● **చమురు-గ్యాస్‌** కంపెనీల షేర్లు స్వల్పకాలంలో మిశ్రమ ధోరణిని ప్రదర్శించవచ్చు. ఈ రంగ సూచీ తక్షణ నిరోధం 12,300 వద్ద ఉంది. 12,501 స్థాయి పైకి వెళితే కనక తాజా సానుకూలతలు చూడొచ్చు. మద్దతు 12,000 వద్ద కనిపిస్తోంది.

● **వాహన** కంపెనీల షేర్లు స్వల్ప కాలంలో సానుకూల ధోరణిలో కదలాడవచ్చు. వచ్చే నెలల్లో విక్రయాలు, ఆదాయాలు బాగా పెరిగే అవకాశం ఉండటం ఇందుకు నేపథ్యం. నిఫ్టీ ఆటో సూచీ 27,750 పైకి వెళితే తాజా సానుకూలతలు కనిపిస్తాయి.

● **ఎఫ్‌ఎమ్‌సీజీ** కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. సెప్టెంబరు త్రైమాసికంలో బలహీన గిరాకీ, జీఎస్‌టీ రేట్ల కోత ఈ రంగంపై ప్రభావం చూపాయి. నిఫ్టీ ఎఫ్‌ఎమ్‌సీజీకి 55,800 వద్ద నిరోధం, 55,200 వద్ద మద్దతు లభించనుంది.

● **ఐటీ** షేర్లు ప్రతికూల ధోరణిలో కదలాడవచ్చు. అంతర్జాతీయ ఐటీ షేర్లలో అమ్మకాల నేపథ్యంలో ఈ రంగంపై మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. నిఫ్టీ ఐటీ సూచీకి 37,050 వద్ద మద్దతు, 38,050 వద్ద నిరోధం ఎదురుకావచ్చు.

● **యంత్రపరికరాల** షేర్లతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవాల్సి ఉండటంతో పాటు వచ్చే త్రైమాసికాల్లో ప్రభుత్వం మూలధన వ్యయాలు తగ్గించే అవకాశం ఉండటంతో.. ఆర్డర్ల రాకలో మందగమనం కంపెనీలకు సమస్యగా మారొచ్చు.

● ఎలాంటి వార్తలూ లేనందున **సిమెంటు** షేర్లు ఒక పరిమిత శ్రేణికి లోబడి చలించొచ్చు. సెప్టెంబరు త్రైమాసికంలో గిరాకీ స్తబ్దుగా ఉన్నా, ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై వ్యయాలు పెంచడంతో సెప్టెంబరు తర్వాత నుంచి గిరాకీ పెరగడం కలిసి రావొచ్చు. పెట్‌కోక్‌ వ్యయాలు పెరగడం ప్రభావం చూపొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్‌ లేలాండ్‌	144.69	148.10	142.10
బజాజ్‌ ఆటో	8892.00	8999.30	8808.30
ఐషర్‌ మోటార్స్‌	7,134.50	7,259.20	7,026.20
హీరో మోటోకార్ప్‌	6,002.50	6,079.80	5918.80
ఎం అండ్‌ ఎం	3,749.60	3,804.50	3698.50
మారుతీ	15,977.00	16,367.70	15541.70
టీవీఎస్‌ మోటార్‌	3,441.90	3,507.90	3,396.10

ఎఫ్‌ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్‌	5,813.00	5,901.30	5,720.30
కోల్గేట్‌ పామోలివ్‌	2,180.60	2,208.60	2,153.40
డాబర్‌ ఇండియా	515.65	529.10	507.60
ఇమామీ	513.30	526.30	505.50
హిందుస్థాన్‌ యునిలీవర్‌	2,433.70	2,460.20	2,399.80
ఐటీసీ	407.85	410.80	403.20
మారికో	739.90	748.60	728.60

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్‌	282.50	287.00	279.10
సీజీ పవర్‌	710.20	731.70	696.70
ఎల్‌ అండ్‌ టీ	4,024.90	4,074.20	3990.60
సీమెన్స్‌	3,173.50	3,247.00	3,109.20
థెర్మాక్స్‌	2,886.70	2,999.30	2,823.70

బ్యాంకింగ్‌	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌	998.05	1,012.70	989.20
ఐసీఐసీఐ బ్యాంక్‌	1,369.50	1,381.40	1,358.60
ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌ బ్యాంక్‌	78.33	79.70	77.40
ఇండస్‌ఇండ్‌ బ్యాంక్‌	846.55	870.90	818.40
కోటక్‌ మహీంద్రా బ్యాంక్‌	2,087.80	2,125.60	2,059.60
పీఎన్‌బీ	122.37	124.60	120.90
ఎస్‌బీఐ	972.60	984.30	965.20

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1830.10	1867.20	1805.80
అంబుజా సిమెంట్స్‌	547.55	560.60	538.50
ఇండియా సిమెంట్స్‌	403.70	414.90	394.70
శ్రీ సిమెంట్‌	26480.00	26880.00	26220.00
అల్ట్రాటెక్‌ సిమెంట్‌	11729.00	11833.00	11639.00

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	777.70	791.10	769.60
హిందుస్థాన్‌ జింక్‌	458.30	475.50	448.10
ఎన్‌ఎమ్‌డీసీ	73.51	74.60	72.70
సెయిల్‌	134.08	141.20	129.20
టాటా స్టీల్‌	168.00	173.40	165.00
వేదాంతా	496.40	517.10	484.20

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్‌ టెక్‌	1,608.00	1,656.70	1,581.70
ఇన్ఫోసిస్‌	1545.00	1,566.10	1,515.70
పర్సిస్టెంట్‌ సిస్టమ్స్‌	6,296.50	6,417.20	6,202.20
టీసీఎస్‌	3,150.60	3,186.70	3,117.10
టెక్‌ మహీంద్రా	1,461.50	1,485.80	1,427.80
విప్రో	244.49	248.80	241.50

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1205.90	1228.40	1186.80
బయోకాన్‌	396.85	404.80	391.00
సిప్లా	1511.80	1534.80	1496.20
డాక్టర్‌ రెడ్డీస్‌	1243.90	1257.50	1230.30
గ్లెన్‌మార్క్‌ ఫార్మా	1844.20	1933.40	1793.40
నాట్కో ఫార్మా	846.80	880.80	849.00

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌	1546.60	1565.90	1530.50
బీపీసీఎల్‌	364.55	369.70	360.80
హెచ్‌పీసీఎల్‌	471.90	481.20	465.50
ఐఓసీఎల్‌	167.35	169.80	165.00
ఓఎన్‌జీసీ	246.95	249.30	245.10
ఆయిల్‌ ఇండియా	425.05	436.60	417.80

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్‌	2,162.70	2,187.80	2,136.00
ఎమ్‌టీఎన్‌ఎల్‌	39.03	40.30	38.40
టాటా కమ్యూనికేషన్స్‌	1,920.90	1973.80	1869.60
వొడాఫోన్‌ ఐడియా	9.97	10.40	9.70

ఈనాడు సినిమా

మొదలైంది... 'స్పిరిట్'



సందీప్‌రెడ్డి వంగా, చిరంజీవి, భూషణ్‌కుమార్, త్రిప్తి దిమ్రీ

ఆసక్తికరమైన కలయికలో రూపొందుతున్న చిత్రం 'స్పిరిట్'. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తుండగా, సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ కథానాయిక. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టి.సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. భూషణ్‌కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా, క్రిషన్ కుమార్ నిర్మాతలు. యాక్షన్ థ్రిల్లర్ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర కథానాయకుడు చిరంజీవి క్లాప్‌నిచ్చారు. "ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా, భారీ హంగులతో రూపొందుతున్న చిత్రమిది. ప్రభాస్ - త్రిప్తి జోడీ సరికొత్త ఉత్సాహంతో తెరపై సందడి చేయనుంది. ఈ సినిమా స్థాయి, కథనానికి తోడు యాక్షన్ హంగులు ఈ చిత్రాన్ని మరింత ప్రత్యేకంగా మార్చనున్నాయి. తొమ్మిది భాషల్లో విడుదల చేస్తామ"ని సినీ వర్గాలు తెలిపాయి.

రెబల్‌సాబ్ సందడి



ప్రభాస్

ప్రభాస్ తన అభిమానుల్ని అలరించడం కోసమే 'ది రాజాసాబ్' పాటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చేశారన్నారు మారుతి. పన్నెండేళ్లుగా ప్రభాస్‌ని ఎలాంటి పాటల్లో చూడాలని ఆశ పడుతున్నామో, అలాంటి పాటలే ఇందులో ఉంటాయని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ది రాజాసాబ్'. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సంగీత ప్రచార కార్యక్రమాలు షురూ అయ్యాయి. ఆదివారం రాత్రి ఈ చిత్రంలోని రెబల్ సాబ్... అంటూ సాగే పాటని విడుదల చేశారు. తమన్ స్వరకల్పనలోని ఈ గీతాన్ని రామజోగయ్య శాస్త్రి రచించగా, సంజిత్ హెగ్డే, బ్లేజ్ ఆలపించారు. వేడుకని ఉద్దేశించి మారుతి మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇప్పుడు ఏం చెప్పినా ఆ కటౌట్ ముందు చిన్న మాటలు అయిపోతాయి. ప్రభాస్ ఫొటోని జేబులో పెట్టుకుని ఈ సినిమాని చేశా. ఆయన ఫొటో జేబులో ఉంటే ఎలాంటివాడైనా టాప్ దర్శకుడు అవుతాడు. కల్మషం లేని మనస్తత్వం, ప్రేమతోనే దగ్గరకు చేర్చుకుంటాడు. విడుదల రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయం. అందుకు నాదీ హామీ. అభిమానుల కోసమే ఈ సినిమాని ఎలాగైనా పండగకి తీసుకు రావాలని కృషి చేశారు నిర్మాత టి.జి.విశ్వప్రసాద్. ప్రభాస్ అభిమానులు మాపై పెట్టుకున్న నమ్మకానికి మించి సినిమా ఉండేలా కష్టపడ్డాం" అన్నారు. దాదాపు వెయ్యిమంది గ్రూప్ డ్యాన్సర్ల నేపథ్యంలో తెరకెక్కించిన రెబల్‌సాబ్ పాట అందరినీ అలరిస్తుందని, కచ్చితంగా ఈ సినిమా జనవరి 9న వస్తుందని, సందేహాలేమీ అవసరం లేదన్నారు నిర్మాత టి.జి.విశ్వప్రసాద్. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఎస్.కె.ఎన్, మైత్రీ శశి తదితరులు పాల్గొన్నారు.



బాలకృష్ణ, యోగి ఆదిత్యనాథ్, బోయపాటి శ్రీను

'అఖండ' సన్నివేశాలు చూసిన యోగి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసింది 'అఖండ2: తాండవం' చిత్రబృందం. ఈ సందర్భంగా కథా నేపథ్యం గురించి ఆయనకు వివరించడంతోపాటు, సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాల్ని చూపించారు దర్శకుడు. అనంతరం సినిమాలో కథానాయకుడు చేతపట్టిన త్రిశూలాన్ని యోగి ఆదిత్యనాథ్‌కు అందజేశారు. భక్తి, ధర్మం ప్రధానంగా చిత్రాన్ని రూపొందించడంపై యోగి అభినందనలు తెలిపినట్టు చిత్రవర్గాలు తెలిపాయి. బాలకృష్ణ కథానాయకుడిగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబరు 5న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్రబృందం వివిధ రాష్ట్రాల్లో ప్రచార కార్యక్రమాల్ని నిర్వహిస్తోంది.



రజనీకాంత్, మోహన్‌బాబు, జాకీ ష్రాఫ్

ఘనంగా 'ఎంబీ50' వేడుక

ప్రముఖ నటుడు మోహన్‌బాబు సినీ ప్రయాణం యాభయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఎంబీ50' పేరుతో ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వేడుకని నిర్వహించారు. సినీ, రాజకీయ ప్రముఖులు హాజరైన ఈ వేడుక ఘనంగా జరిగింది. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో పాటు సినీ ప్రముఖులు రజనీకాంత్, బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ సహా, పలు భాషలకు చెందిన సినీ, రాజకీయ ప్రముఖులు ఈ వేడుకకి హాజరై మోహన్‌బాబుకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ వేడుకలోనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ప్రముఖ నటుడు బ్రహ్మానందంను ఫొటో తీసుకుందామని అడగ్గా ఆయన తిరస్కరిస్తూ వెళుతున్న వీడియో వైరల్ అయ్యింది. దీనిపై బ్రహ్మానందం వివరణ ఇస్తూ మరో వీడియోను పంచుకున్నారు. ముప్పయ్యేళ్లుగా దయాకర్‌రావుతో ఉన్న అనుబంధం, చనువుతోనే నేను ఫొటో వద్దంటూ వెళ్లిపోయానని, అందులో అపార్థాలకు తావు లేదని స్పష్టతను ఇచ్చారు బ్రహ్మానందం.

పుట్టినరోజు కానుక



అనిల్ రావిపూడి

దర్శకుడు అనిల్ రావిపూడి పుట్టినరోజును పురస్కరించుకుని అగ్ర కథానాయకుడు చిరంజీవి చేతి గడియారాన్ని కానుకగా అందజేశారు. ఈ ఇద్దరి కలయికలో 'మన శంకరవరప్రసాద్‌గారు' రూపొందుతున్న సంగతి తెలిసిందే. దర్శకులకూ, సాంకేతిక నిపుణులకూ అప్పుడప్పుడూ కానుకల్ని అందజేస్తూ ప్రోత్సహిస్తుంటారు చిరంజీవి. అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం తన ఇంటికి ఆహ్వానించి గడియారాన్ని బహుమానంగా అందజేశారు. ఆహ్లాదం, ఆనందకరమైన మీ పనితీరుతో సెట్‌లో ప్రతి క్షణాన్నీ ప్రత్యేకంగా మార్చేశాయంటూ సామాజిక మాధ్యమాల్లో అనిల్ రావిపూడిని అభినందిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు చిరంజీవి. 'మన శంకరవరప్రసాద్' చిత్రం సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.

తమన్నా సాహసాలు వచ్చే ఏడాది



తమన్నా

వైవిధ్యమైన పాత్రలతో అలరిస్తూనే.. ప్రత్యేక గీతాల్లో ఆడిపాడుతూ కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది అందాల తార తమన్నా. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె.. బాలీవుడ్ హీరో అజయ్ దేవగణ్‌తో కలిసి 'రేంజర్' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి జగన్ శక్తి దర్శకుడు. ఇప్పుడీ సినిమా గురించి ఓ ఆసక్తికర విషయం నెట్టింట్లో సందడి చేస్తుంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది డిసెంబరు 4న థియేటర్లలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. "ఈ ప్రాజెక్టు గురించి చిత్ర బృందం చాలా ఉత్సాహంగా ఉంది. ఇందులో అజయ్ అటవీ అధికారిగా కనిపించనున్నారు. అడవిలో సాహసాలు చేసే మహిళగా తమన్నా పాత్ర ఉండనుంది. త్వరలో సినిమాకు సంబంధించిన వివరాల్ని అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



నాగచైతన్య

నాగచైతన్య చిత్రం వృషకర్మ

నాగచైతన్య హీరోగా తెరకెక్కుతున్న చిత్రానికి 'వృషకర్మ' అనే పేరుని ఖరారు చేశారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఫస్ట్‌లుక్ విడుదలైంది. ప్రముఖ కథానాయకుడు మహేశ్‌బాబు సామాజిక మాధ్యమాల వేదికగా ఈ సినిమాలోని నాగచైతన్య లుక్‌ని పంచుకున్నారు. అందులోనే సినిమా పేరునీ పొందుపరిచింది చిత్రబృందం. మిథికల్ థ్రిల్లర్ కథతో, కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. మీనాక్షి చౌదరి కథానాయిక. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, సుకుమార్.బి నిర్మాతలు. బాపినీడు సమర్పకులు. 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం కోసం నాగచైతన్య శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమై నటిస్తున్నారు. ఆయనొక నిధి అన్వేషకుడిగా, గాఢతతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. "విజయవంతమైన 'విరూపాక్ష' తర్వాత దర్శకుడు కార్తీక్ దండు పురాణాల్ని, చరిత్రని మేళవించి భారీ హంగులతో రూపొందిస్తున్న చిత్రమిది. నాగచైతన్య ఇంతకుముందు ఎప్పుడూ లేని రీతిలో ఓ కొత్త రకమైన లుక్‌లో కనిపించనున్నార"ని తెలిపాయి సినీ వర్గాలు. ఈ చిత్రానికి సంగీతం: అజనీశ్ బి.లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: రాగుల్ డి.హెచియన్, ప్రొడక్షన్ డిజైన్: శ్రీనాగేంద్ర తంగాల, కూర్పు: నవీన్‌నూలి.

గోదారి గట్టుపైన చూడు...



నిధి, సుమంత్

ప్రేమను రంగులతో నింపేసిన మా బాణీ హృదయాల్ని నాట్యం చేయిస్తుందని చెబుతున్నాడు సుమంత్ ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గోదారి గట్టుపైన'. నిధి ప్రదీప్ కథానాయిక. సుభాశ్ చంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. అభినవ్ రావు నిర్మాత. జగపతిబాబు ముఖ్యభూమిక పోషిస్తున్నారు. ఈ సినిమా ప్రచారం ఆదివారం విడుదలైన 'చూడు చూడు...' పాటతో ఆరంభమైంది. నాగవంశీ కృష్ణ స్వరపరిచిన ఈ పాటని హరిచరణ్ ఆలపించగా, దినేశ్ కాకర్ల సాహిత్యం అందించారు. "అందమైన ప్రేమ గీతమిది. నదీ తీరాల సువాసనని మోసుకొచ్చిన ఈదురుగాలిలా ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జోడీ ఈ పాటలో మరింత ఉత్సాహంగా కనిపిస్తుంద"ని సినీ వర్గాలు చెప్పాయి. రాజీవ్ కనకాల, లైలా, దేవిప్రసాద్, సుదర్శన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సాయిసంతోశ్.


హిందీ 'దృశ్యం 3'కి సన్నాహాలు



అజయ్ దేవగణ్

'దృశ్యం'.. ఈ సినిమా మాతృక మలయాళంలోనే కాదు.. విడుదలైన ప్రతి భాషలోనూ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మూడో భాగంగా 'దృశ్యం 3' వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మలయాళంలో మోహన్‌లాల్ చిత్రీకరణ ప్రారంభించారు. తాజాగా హిందీలో కూడా ఈ మూడో భాగాన్ని పట్టాలెక్కించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో అజయ్ దేవగణ్ హీరోగా నటిస్తున్నారు. "అక్టోబరులో సెట్స్‌పైకి వెళ్లాల్సిన ఈ సినిమా కొన్ని కారణాలతో ఆగిపోయింది. ఇప్పుడు వచ్చే నెల 12న ముంబయిలోని యశ్‌రాజ్ స్టూడియోలో షూటింగ్‌ను మొదలెట్టాలని నిర్ణయించుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయ"ని అజయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

దేశాన్ని రక్షిస్తున్న సైనికులే సూపర్ హీరోలు



షారుక్ ఖాన్

"ధీరులైన సైనికులను కన్న తల్లులకు నా సెల్యూట్. జవాన్లు ఉండగా భారతదేశాన్ని ఎవరూ ఏమీ చేయలేర"ని అన్నారు షారుక్ ఖాన్. తాజాగా ముంబయిలో నిర్వహించిన గ్లోబల్ పీస్ హానర్స్ 2025 వేడుకలో ఈయన ప్రసంగించారు. పహల్గామ్ ఉగ్రదాడుల్లో, ఇటీవలే దిల్లీ బాంబు పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించారు. "దేశాన్ని రక్షిస్తున్న సైనికులే మన సూపర్ హీరోలు. దేశంలోని ధైర్య సైనికులు, జవాన్ల కోసం నాలుగు లైన్లు చెప్పమని నన్ను అడిగారు. ఎవరైనా మిమ్మల్ని ఏమి చేస్తారని అడిగితే.. నేను దేశాన్ని రక్షిస్తానని చెప్పండి. మీ సంపాదన ఎంతంటే..? నేను 140 కోట్ల మంది ప్రజల ఆశీర్వాదాలను పొందుతున్నానని నవ్వుతూ చెప్పండి. అమర వీరుల కుటుంబాలకు యావత్ దేశం తరపున సంతాపం తెలియజేస్తున్నా. భారతదేశం ఎప్పుడూ తలవంచదని మన దేశం గురించి చెబుతుంటారు. ప్రత్యర్థులు శాంతిని మన నుంచి లాక్కోలేకపోయారు. ఎందుకంటే ఈ దేశంలో సూపర్ హీరోలు మనుషులుగా ఉన్నంత కాలం దేశం నుంచి శాంతి, ప్రశాంతతను దూరం చేయడం కష్టం మాత్రమే కాదు అసాధ్యం" అని అన్నారు.



రకుల్ ప్రీత్ సింగ్

దే దే ప్యార్ దే 2'తో అజయ్ దేవగణ్‌తో కలిసి ఇటీవలే తెరపై సందడి చేసింది అందాల తార రకుల్ ప్రీత్ సింగ్. ఇందులో ఆయేషా పాత్రలో కనిపించి సినీప్రియుల్ని ఆకర్షించింది. ఈ సందర్భంగా రకుల్ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్టును పంచుకుంది. "నా మనసు చాలా సంతోషంతో నిండిపోయింది. మీరు ఆయేషా పట్ల చూపిన ప్రేమ, ప్రశంసల గురించి నేను మాటల్లో వర్ణించలేను. నా కెరీర్‌లో ఈ పాత్ర చాలా ప్రత్యేక స్థానంలో ఉంటుంది. మా అద్భుతమైన బృందం లేకుండా ఇదంతా సాధ్యం కాదు. నన్ను ప్రోత్సహించిన మా టీమ్‌కు ధన్యవాదాల"ని అంది. బాలీవుడ్ నటీమణులు సామాజిక ఒత్తిడి లేకుండా కెరీర్‌ను, వ్యక్తిగత జీవితాన్ని ఎలా సమానంగా ముందుకు తీసుకెళ్తున్నారో వివరించింది. 'వివాహం అయిన వెంటనే తల్లి కావాలనే మూస ధోరణి పద్ధతులను ఎవరు సృష్టించారో నాకు తెలియదు కానీ.. మా ఇంట్లో మాత్రం ఎవరు ఇలా చేయలేదు.

మీ ప్రేమను మాటల్లో వర్ణించలేను

కానీ దీన్ని చాలా మంది నటీమణులు అధిగమించి తల్లిగా బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే.. కెరీర్‌లో అగ్రస్థానంలో ఉన్నారు. అద్భుతమైన నటి అలియా భట్.. ఒక తల్లి. దీపిక, కియారా, కాజోల్.. ఇలా తల్లి అయినా కూడా వీరందరూ పనిచేస్తున్నారు. మహిళలు సరిహద్దుల్ని దాటారని అనుకుంటున్నా" అని చెప్పుకొచ్చింది రకుల్.

ఆలస్యమైనా.. ఆగిపోదు ఈ సినిమా



ఫర్హాన్ అక్తర్

'120 బహాదుర్' సినిమాతో ఇటీవలే సైనికుడి పాత్రలో తెరపై కనిపించి అలరించారు బాలీవుడ్ దర్శకుడు, నటుడు ఫర్హాన్ అక్తర్. ఆయన దర్శకత్వంలో 'జీ లే జరా' అనే చిత్రం రాబోతున్నట్లు కొన్నేళ్ల క్రితమే ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రియాంక చోప్రా, కత్రినా కైఫ్, అలియా భట్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. రోడ్ ట్రిప్ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ సినిమా చిత్రీకరణ కొన్ని కారణాలతో ప్రారంభం కాలేదు. దీంతో ఈ సినిమా ఆగిపోయిందంటూ ప్రేక్షకుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఫర్హాన్ వీటిపై స్పందిస్తూ ఆలస్యమైనా.. ఈ చిత్రం ఆగిపోదని చెప్పారు. "ఈ సినిమా విషయంలో నిరంతరం జరుగుతున్న జాప్యాలు నన్ను మానసికంగా ప్రభావితం చేస్తున్నాయి. నేను దర్శకత్వం వహించి దాదాపు 11ఏళ్లకు పైగా గడుస్తున్నందువల్ల ఇకపై నేను దర్శకత్వం వహించలేనని ప్రేక్షకులు అనుకుంటారని బాధపడుతున్నా. కానీ చాలా కాలంగా ఎదురుచూస్తున్నప్పటికీ 'జీ లే జరా'ను వాయిదా వేయను. త్వరలో కచ్చితంగా పట్టాలెక్కిస్తా. ప్రీ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. స్క్రిప్ట్ చాలా బాగుంది. అందుకే ఈ ప్రాజెక్టును వదిలేయాలనుకోవట్లేద"ని తెలిపారు.

కృతి, ప్రదీప్‌ల ప్రేమపాట



కృతి శెట్టి

'డ్యూడ్'గా ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు హీరో ప్రదీప్ రంగనాథన్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎల్ఐకే'. విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించారు. కృతి శెట్టి కథానాయికగా నటించింది. భారీ బడ్జెట్‌తో టైమ్ ట్రావెల్ నేపథ్యంలో తీర్చిదిద్దిన చిత్రమిది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన మొదటి గీతం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. తాజాగా మరో పాటను ఈ నెల 27న తీసుకురాబోతున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది చిత్ర బృందం. ఇందులో కృతి, ప్రదీప్‌ల మధ్య కెమిస్ట్రీ, ప్రేమ ఆకట్టుకునేలా ఉంటుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఎస్‌జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. డిసెంబరు 18న థియేటర్లలోకి రాబోతుంది సినిమా.

చదువు

15 ■e-mail: edc@eenadu.in

సోమవారం నవంబరు 24, 2025 ఈనాడు

ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టులు..

ఇండియన్ ఆర్మీ.. స్పోర్ట్స్ కోటా ఎంట్రీ ద్వారా హవల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. **క్రీడా విభాగాలు:** అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, కబడ్డీ.. మొదలైనవి. **అర్హత:** పదో తరగతితో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు అవసరం. అంతర్జాతీయ/ జూనియర్ లేదా సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్/ ఖేలో ఇండియా గేమ్స్/ యూత్ గేమ్స్‌లో పాల్గొన్న అభ్యర్థులు క్రీడాకారులై ఉండాలి. **వయసు:** 31.03.2001 - 01.04.2008 మధ్య జన్మించి ఉండాలి. **ఎంపిక:** స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌తో. పోస్టు ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి **తేదీ:** 15-12-2025. **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ పీటీ అండ్ స్పోర్ట్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెక్యూ (ఆర్మీ), రూమ్ నెం. 747, 'ఎ' వింగ్, సేనా భవన్, న్యూదిల్లీ.
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

ఎయిమ్స్ గువహటిలో సీనియర్ రెసిడెంట్లు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, గువహటి.. మూడేళ్ల వ్యవధికి ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో 177 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ అండ్ వీనస్, కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ/హెమటాలజీ, మైక్రోబయాలజీ, నియోనేటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, ఓబీజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, ఫిజియాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, రేడియో ఆంకాలజీ, రేడియాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, ట్రామా అండ్ ఎమర్జెన్సీ మెడిసిన్, యూరాలజీ. **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/ఎంసీహెచ్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: నవంబరు 17 నాటికి 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది. **మూల వేతనం:** నెలకు రూ.67,700.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.1,000. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 8. **ఎంపిక:** పరీక్ష/ ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://aiimsguwahati.ac.in/page//seniorresidents

ఈఎస్ఐసీలో..

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, పట్నా ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● **సీనియర్ రెసిడెంట్: 36**

విభాగాలు: అనాటమీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఎఫ్ఎంటీ, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, టీబీ అండ్ చెస్ట్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఓబీజీవై, అనస్థీషియాలజీ, రేడియో డయాగ్నోసిస్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీతో పాటు పని అనుభవం ఉండాలి. **గరిష్ఠ వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి 45 ఏళ్లు మించకూడదు. **మూల వేతనం:** నెలకు రూ.67,700. **ఎంపిక:** ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** డిసెంబరు 12. **వేదిక:** కాలేజ్ కౌన్సిల్ రూమ్, కాలేజ్ బిల్డింగ్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, పట్నా-801103.
వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments



ఏఎఫ్‌క్యాట్‌తో అవకాశం

మేటి భవిష్యత్తుకు మార్గం చూపే వాటిలో రక్షణ రంగ కొలువులు ముందుంటున్నాయి. వీటిలోనూ వాయుసేనలో ఉద్యోగాలు అధిక ప్రాధాన్యం పొందుతున్నాయి. సాధారణ డిగ్రీతోనే అత్యున్నత హోదా, ఆకర్షణీయ వేతనం దక్కడం ఎయిర్ ఫోర్స్ ప్రత్యేకత. ఇందులో మేటి కొలువులన్నిటికీ ఒకే పరీక్షతో పోటీ పడే అవకాశం ఇప్పుడొచ్చింది. ఎంపికైనవారు పైలట్లుగానూ, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లోనూ సేవలందించవచ్చు. ఇటీవలే వెలువడిన ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్టు(ఏఎఫ్‌క్యాట్-2026(I)) వివరాలు..

వాయు సేనలో.. విశిష్ట ఉద్యోగాలు

సన్నద్ధత

- ఏఎఫ్ క్యాట్ నియామక ప్రకటనలోని సిలబస్ వివరాలు క్షుణ్ణంగా గమనించాలి. విభాగాలవారీ అందులో పేర్కొన్న ఒక్కో అంశాన్నీ చదవాలి. అనంతరం వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.
- ఎక్కువ ప్రశ్నలు ప్రాథమికాంశాల నుంచే అడుగుతారు. వీటిపై అవగాహన కోసం 8,9,10 తరగతుల పాఠ్యపుస్తకాల్లోని ముఖ్యాంశాలు బాగా అధ్యయనం చేయాలి.
- ఏఎఫ్‌క్యాట్ వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నపత్రాలూ, సమాధానాలూ ఉన్నాయి. వాటిని గమనించాలి. అలాగే పాత ప్రశ్నపత్రాలనూ అధ్యయనం చేయాలి. ప్రతి విభాగంలోనూ అంశాల వారీ పరీక్షలో దక్కుతోన్న ప్రాధాన్యం, ప్రశ్నల సరళి గ్రహించి, సన్నద్ధత మెరుగుపరచుకోవాలి.
- పరీక్షకు ముందు వెబ్‌సైట్‌లో మాక్ టెస్టు అందుబాటులో ఉంచుతారు. అది రాయాలి. అలాగే కనీసం పది మాక్ టెస్టులు రాసి, పరీక్షల వారీ ఫలితాలు సమీక్షించుకోవాలి. తప్పులు చేస్తోన్న, వెనుకబడుతోన్న విభాగాలకు ప్రాధాన్యమివ్వాలి.
- రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియని ప్రశ్నలు వదిలేస్తేనే మేలు.
- యూపీఎస్సీ నిర్వహిస్తోన్న సీడీఎస్ఈ, ఎన్‌డీఏ, సీఏపీఎఫ్ ఏసీ పాత ప్రశ్నపత్రాల అధ్యయనమూ ప్రయోజనం చేకూరుస్తుంది.

ప్రతి ఆరు నెలలకూ ఒకసారి ఏఎఫ్‌క్యాట్ ప్రకటన వెలువడుతోంది. అందువల్ల దీన్ని లక్ష్యం చేసుకున్నవారు నిబద్ధతతో శ్రమిస్తే విజయం సాధించగలరు. ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించినవారికి స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. పైలట్ ఉద్యోగానికి అదనంగా.. కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టం (సీపీఎస్ఎస్)లోనూ అర్హత పొందాలి. ఇవన్నీ దాటినవారికి, వైద్య పరీక్షలు నిర్వహించి, శిక్షణకు పిలుస్తారు. విభాగాన్ని బట్టి ఇది ఏడాది నుంచి 18 నెలలు ఉంటుంది. ఆ తర్వాత శాశ్వత, 14 ఏళ్ల తాత్కాలిక ప్రాతిపదికన విధుల్లోకి తీసుకుంటారు. ఇలా అవకాశం వచ్చినవారు సీటీసీ రూపంలో ఏడాదికి సుమారు రూ.18 లక్షల వేతనం అందుకోవచ్చు. తక్కువ వ్యవధుల్లోనే పదోన్నతులూ పొందుతారు.

పరీక్ష: ఆన్‌లైన్‌లో 300 మార్కులకు రెండు గంటల వ్యవధితో నిర్వహిస్తారు. వంద ప్రశ్నలు. సరైన జవాబుకు మూడు మార్కులు. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, మిలటరీ ఆప్టిట్యూడ్‌లో ప్రశ్నలుంటాయి. న్యూమరికల్ ఎబిలిటీ ప్రశ్నలు పదో తరగతి స్థాయిని మించవు. మిగిలినవి సాధారణ డిగ్రీ స్థాయిలో ఉంటాయి. గ్రౌండ్ డ్యూటీలో టెక్నికల్ బ్రాంచ్ పోస్టులకు అదనంగా ఇంజినీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ (ఈకేటీ) రాయాలి. వ్యవధి 45 నిమిషాలు. 50 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకీ 3 చొప్పున వీటికి 150 మార్కులు.

స్టేజ్ 1, 2 ఇలా...

రాత పరీక్షలో ఉత్తీర్ణులను స్టేజ్ 1, 2 పరీక్షలకు పిలుస్తారు. వీటిని ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డు (ఏఎఫ్ఎస్‌బీ) నిర్వహిస్తుంది. స్టేజ్-1 స్క్రీనింగ్ టెస్టు. ఇందులో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్టు, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్కషన్ టెస్టు ఉంటాయి. అసైన్‌మెంట్లు, పజిల్స్ ద్వారా అభ్యర్థి మేధను పరీక్షిస్తారు. ఏదైనా చిత్రాన్ని చూపించి, విశ్లేషించమంటారు. స్టేజ్-1లో అర్హత సాధించినవారే స్టేజ్-2కి వెళ్తారు. స్టేజ్-2లో సైకాలజిస్టు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం ఇండోర్, అవుట్ డోర్ ఇంటరాక్టివ్ గ్రూపు టెస్టులు ఉంటాయి. వీటి ద్వారా మానసిక, శారీరక సామర్థ్యాన్ని గమనిస్తారు. ఆ తర్వాత ముఖాముఖి ఉంటుంది. ఈ దశలన్నీ దాటినవారికి వైద్య పరీక్షలు జరుపుతారు. అందులోనూ విజయవంతమైతే శిక్షణకు పిలుస్తారు.

శిక్షణ..

జనవరి, 2027 నుంచి మొదలవుతుంది. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ విభాగాల్లో 74 వారాలు, గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ విభాగాలకు 52 వారాలు వైమానిక దళ శిక్షణ కేంద్రాల్లో కొనసాగుతుంది. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికైతే ముందుగా ఆరు నెలలు ప్రాథమిక శిక్షణ ఉంటుంది. అనంతరం అభ్యర్థుల ప్రతిభ ప్రకారం.. ఫైటర్ పైలట్, ట్రాన్స్‌పోర్ట్ పైలట్, హెలికాప్టర్ పైలట్లుగా విడదీసి రెండు దశల్లో శిక్షణ నిర్వహిస్తారు. ఒక్కో దశలో 6 నెలలు చొప్పున దుండిగల్, హకీంపేట, బీదర్, ఎలహంకల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 చొప్పున స్టైపెండ్ ఇస్తారు.

ముఖ్య వివరాలు

ఖాళీలు: 340. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పోస్టులు వీటికి అదనం. **ఫ్లయింగ్ బ్రాంచ్:** 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ, ఇంటర్/ప్లస్ 2లో మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి. **వయసు:** జనవరి 1, 2027 నాటికి 20 నుంచి 24 ఏళ్లలోపు ఉండాలి. జనవరి 2, 2003 - జనవరి 1, 2007 మధ్య జన్మించినవాళ్లు అర్హులు. కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉంటే మరో రెండేళ్లు మినహాయింపు. ఎత్తు కనీసం 162 సెం.మీ. ఉండాలి. **గ్రౌండ్ డ్యూటీ – టెక్నికల్ బ్రాంచ్:** ఇందులో ఏరోనాటికల్ ఇంజినీర్ (ఎలక్ట్రానిక్స్/ మెకానికల్) పోస్టులు ఉన్నాయి. సంబంధిత/అనుబంధ బ్రాంచీల్లో 60 శాతం మార్కులతో బీటెక్/బీఈ ఉండాలి. ఇంటర్‌లో ఫిజిక్స్, మ్యాథ్స్‌ల్లో 60 శాతం మార్కులు పొందాలి. **గ్రౌండ్ డ్యూటీ – నాన్ టెక్నికల్ బ్రాంచ్:** ఇందులో.. వెపన్ సిస్టం, అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్, అకౌంట్స్, ఎడ్యుకేషన్, మీటీయొరాలజీ విభాగాల్లో పోస్టులు ఉన్నాయి. వెపన్ సిస్టం ఖాళీలకు ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్‌లతో 50 శాతం మార్కులతోపాటు ఏదైనా డిగ్రీలో 60 శాతం ఉండాలి. అడ్మినిస్ట్రేషన్, లాజిస్టిక్స్ పోస్టులకు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. అకౌంట్స్ పోస్టులకు 60 శాతం మార్కులతో బీకాం/ బీబీఏ/ సీఏ/ సీఎంఏ/ సీఎస్/ సీఎఫ్ఏ/ బీఎస్సీ (ఫైనాన్స్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎడ్యుకేషన్ ఖాళీలకు ఏదైనా పీజీలో 50, యూజీలో 60 శాతం ఉండాలి. మీటీయొరాలజీ విభాగానికి బీఎస్సీ ఫిజిక్స్, మ్యాథ్స్‌లతో 60 శాతం మార్కులు లేదా నిర్దేశిత బ్రాంచీల్లో 60 శాతం మార్కులతో బీటెక్/బీఈ అవసరం. అన్ని విభాగాలకూ ఇంటర్మీడియట్/ప్లస్2 తప్పనిసరి. **వయసు:** గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టులకు జనవరి 1, 2027 నాటికి 20 నుంచి 26 ఏళ్లలోపు ఉండాలి. జనవరి 2, 2001 - జనవరి 1, 2007 మధ్య జన్మించినవారు అర్హులు. ఈ రెండు పోస్టులకు పురుషులు 157.5, మహిళలు 152 సెం.మీ.ఎత్తు ఉండాలి. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పోస్టులకు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ సి సర్టిఫికెట్ ఉండాలి. వీరికి పరీక్ష మినహాయించారు. **ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు:** డిసెంబరు 14 **ఫీజు:** రూ.550+ జీఎస్‌టీ. **పరీక్ష తేదీ:** జనవరి 31 **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి.
వెబ్‌సైట్: https://afcat.cdac.in/AFCAT/





సాఫ్ట్ స్కిల్స్

కార్పొరేట్ సంస్థల్లో విడిగా కాకుండా కలివిడిగా పూర్తిచేయాల్సిన బాధ్యతలే ఎక్కువగా ఉంటాయి. గడువులోగా, ఒడుదొడుకులు లేకుండా లక్ష్యాలు పూర్తిచేయడంలో సమష్టితత్వమే ప్రధాన పాత్ర పోషిస్తుంది. అందువల్ల ఉద్యోగ వేటలో అకడమిక్ పరిజ్ఞానం ఒక్కటే సరిపోదు. అంతకు మించిన ప్రాధాన్యాలు ఎన్నో ఉంటాయి. వాటిలో ముఖ్యమైనది బృందంతో మమేకం కాగలగడం. అభ్యర్థి ఎంత వరకు నలుగురితో కలివిడిగా ఉండగలడనే విషయాన్నిఉద్యోగ నియామక సంస్థలు ప్రత్యేకంగా పరిశీలిస్తున్నాయి.

కలివిడితో.. కొలువు జయం!

శరత్‌కు సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా మెరుగ్గా ఉన్నాయి. క్యాంపస్ సెలక్షన్లో అతడికి కొలువు ఖాయమని అంతా అనుకున్నారు. రాత పరీక్షలో టాప్‌లో నిలిచాడు. ఆ తర్వాత గ్రూప్ డిస్కషన్ (జీడీ), ఇంటర్వ్యూల్లోనూ రాణించాడు. అయితే ఎంపిక జాబితాలో మాత్రం అతని పేరు లేదు. ఎందుకంటే.. గ్రూప్ డిస్కషన్ (జీడీ) రౌండ్లో అతడి వ్యవహార శైలి హెచ్.ఆర్. బృందానికి నచ్చలేదు. అందులో తను మాత్రమే మాట్లాడాడు. ఇతరులకు అవకాశం ఇవ్వలేదు. వాళ్లు చెప్పేది వినేందుకూ ఆసక్తి చూపించలేదు. పైగా తన బృంద సభ్యులను ఏకాభిప్రాయానికి తీసుకురాలేకపోయాడు. తను చెప్పిందే సరైంది అన్న పంథాలో వాదనకు దిగాడు. దీంతో ఇంటర్వ్యూ నిర్వాహకులు తమ సంస్థలో పని వాతావరణానికి శరత్ సరికాడని నిర్ధారించారు. సహోద్యోగులతో కలిసి పనిచేయలేడనే కారణంతో తిరస్కరించారు.

ఎందుకంత ప్రాధాన్యం?

ఒకే లక్ష్యం కోసం సమూహంగా పనిచేయడమే టీమ్ వర్క్. ఒకరి బలాన్ని మరొకరు నమ్ముతూ.. ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ.. వ్యక్తిగత ప్రతిభలను సమూహ శక్తిగా మార్చే ప్రక్రియను బృందంగా కలిసి పనిచేయడమంటారు. నేటి కార్పొరేట్ ప్రపంచంలో ప్రాజెక్టులు, టార్గెట్లు, కస్టమర్ సర్వీసులు.. బృందంగా కలిసి పనిచేసే సామర్థ్యంపైనే ఆధారపడి ఉంటున్నాయి. అందుకే టీమ్ వర్క్‌ని కంపెనీలు బాగా విశ్వసిస్తున్నాయి.

బృందంగా కలిసి పనిచేసే చోట భావవ్యక్తీకరణ సామర్థ్యం మెరుగుపడుతుందని, సృజనాత్మకత పెరుగుతుందని, సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని, ఉద్యోగుల్లో సంతృప్తి కూడా పెరుగుతోందని సంస్థలు భావిస్తున్నాయి. అంతేకాకుండా ఎవరైనా చిన్న పొరపాట్లు చేసినప్పటికీ.. మిగిలిన సభ్యులు వాటిని సరిదిద్దగలుగుతారని నమ్ముతున్నాయి. అందుకే కార్పొరేట్ ప్రపంచంలో ప్రతి సంస్థా ఈ బృంద సంస్కృతి వైపు దృష్టి సారిస్తోంది.

నాస్కామ్ కూడా తన అధ్యయనాల్లో బృంద ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పింది. కొన్ని నివేదికల ప్రకారం.. సమర్థమైన బృందం కారణంగా సంస్థల ఉత్పాదకతలో 30 శాతం వృద్ధి నమోదు అయిందని వెల్లడైంది. వివిధ నేపథ్యాలు, నైపుణ్యాలు కలిగిన బృందం, ఒకే లక్ష్యం కోసం పనిచేస్తున్నప్పుడు సృజనాత్మకత పెరగడంతోపాటు సమస్యల పరిష్కారం కూడా సులువుతుందని పేర్కొంది. చక్కని బృంద సంస్కృతి ఆ సంస్థలో ఉన్న ఉద్యోగులు ఎక్కువ కాలం పనిచేసేలా చేస్తుందని వివరించింది.

గమనిస్తున్నాయిలా..

ప్రసిద్ధ బహుళజాతి సంస్థలు.. ఉద్యోగార్థుల్లో బృందంగా కలిసిమెలిసి పనిచేసే నైపుణ్యాన్ని తెలుసుకునేందుకు నియామక దశలో బృంద చర్చ (గ్రూప్ డిస్కషన్) రౌండ్‌ను తప్పనిసరిగా పెడుతున్నాయి. అలాగే మరికొన్ని పెద్ద సంస్థలు తమ క్యాంపస్ సెలక్షన్స్‌లో 'రోల్ ప్లే', 'టీమ్ సిమ్యులేషన్' లాంటి రౌండ్స్‌ను ప్రారంభించాయి. ఇంటర్వ్యూల్లో 'మీరు ఎప్పుడైనా ఒక బృందంగా పనిచేశారా? అలా పనిచేసినప్పుడు మీ బృందం విజయం సాధించడానికి మీరు ఏ విధంగా సాయపడ్డారు?' లాంటి ప్రశ్నలను అడుగుతున్నారు.


సమన్వయం లోపిస్తే..

ఇంటర్వ్యూల్లో సంస్థలు సాంకేతిక నైపుణ్యాలే కాకుండా వ్యక్తి ప్రవర్తనా విధానాలు, నడవడికను కూడా పరీక్షిస్తున్నాయి. అందులో బృందంతో సమన్వయం (టీమ్ కొలాబరేషన్) అనేది మొదటి స్థానంలో ఉంది.

- నాస్కామ్, డెలాయిట్ ట్యాలెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం 82 శాతం రిక్రూటర్లు ఎక్కువగా టీమ్ వర్కింగుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఒక అభ్యర్థికి బృందంలో కలిసిపోయే సామర్థ్యం లేకపోతే, సాంకేతిక పరిజ్ఞానం ఎంత ఉన్నా ఉద్యోగానికి ఎంపిక చేయడం లేదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.
- నాస్కామ్ ఫ్యూచర్ వర్క్ ఫోర్స్ 2025 ప్రకారం.. రానున్న కాలంలో 91 శాతం సంస్థలు 'కొలాబరేటివ్ స్కిల్'ను ఉద్యోగుల ప్రాథమిక నైపుణ్యంగా పరిగణిస్తాయని పేర్కొంది. 77 శాతం సంస్థలు ఇప్పటికే తమ ఉద్యోగులకు టీమ్ కమ్యూనికేషన్, సహానుభూతి (ఎంపతీ) మీద శిక్షణలు అందిస్తున్నాయని చెప్పింది. అంతేకాకుండా పని వాతావరణంలో ఉద్యోగుల వైఫల్యానికి 68 శాతం కారణం బృందం మధ్య భావవ్యక్తీకరణ లోపమేనని నివేదిక స్పష్టం చేసింది.

బృంద నైపుణ్యానికి..

- **చురుగ్గా ఉండాలి:** కాలేజీ స్థాయిలో నిర్వహించే గ్రూప్ అసెస్‌మెంట్లు, క్లబ్ కార్యకలాపాలు, స్పోర్ట్స్ టీమ్, ప్రాజెక్టు వర్క్ లాంటి వాటిల్లో బృందాలుగా పనిచేసే వీలుంటుంది. కాబట్టి వాటిల్లో చురుగ్గా పాల్గొనాలి. ఇది బృందంగా కలిసిమెలిసి పనిచేసే సామర్థ్యాన్ని సానబెడుతుంది.
- **వినాలి:** ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా వినాలి. ఇతరుల అభిప్రాయాలను గౌరవించాలి. వారి ఆలోచనలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. వారి కష్టాన్ని గుర్తించాలి. ఆ తర్వాతే మీరు చెప్పాలనుకున్నది చెప్పాలి.
- **సహానుభూతి:** బృందంలోని సవాళ్లను గుర్తించాలి. సభ్యుల వ్యక్తిగత ఇబ్బందులను తెలుసుకోవాలి. లక్ష్య సాధనలో అడ్డంకులను అర్థం చేసుకుని వారికి సాయం చేయాలి. ఇతరుల దృక్కోణంలో మీరు ఆలోచించాలి. ఈ దృక్పథం బృంద బలాన్ని కూడా పెంచుతుంది.
- **భావవ్యక్తీకరణ:** బృందంలో ఉన్నప్పుడు స్పష్టత చాలా అవసరం. ఎవరి అభిప్రాయం ఏమిటో స్పష్టంగా తెలుసుకోవాలి. అస్పష్టత ఉంటే అది ఘర్షణలకు దారితీస్తుంది. ముందుగా మీరు స్పష్టంగా మాట్లాడటం నేర్చుకోవాలి. ప్రతికూలమైనవాటిని సున్నితంగా చెప్పడం అలవర్చుకోవాలి. ఇతరుల పట్ల సానుకూలంగా ప్రతిస్పందించాలి. ఇది బృందంలో మీ స్థానాన్ని పదిలపరుస్తుంది.
- **బాధ్యత:** బృంద సభ్యులందరూ బాధ్యతగా వ్యవహరించాలి. మంచి జరిగినా, చెడు జరిగినా సమాన బాధ్యత తీసుకోవాలి. బృందంలో మీ పనులకు మీరే జవాబుదారీగా ఉండాలి. ఏదైనా పొరపాటు జరిగితే ఒప్పుకోవాలి. అందుకు భయపడకూడదు. అప్పుడే నేర్చుకునేందుకు వీలవుతుంది.
- **ఫీడ్ బ్యాక్:** ఇతరులను విమర్శించకుండా, వారి పనిని మెరుగుపరచడానికి సహాయపడే రీతిలో ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి. అలాగే ఇతరుల నుంచి మీ పనిపై కూడా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. దాన్ని వ్యక్తిగతంగా భావించకుండా, మీతో పాటు మీ సంస్థ అభివృద్ధి కోసం అవకాశంగా చూడటం నేర్చుకోవాలి.
- **విశ్వసనీయత:** ఇది ప్రతి సభ్యుడూ పాటించాల్సిన నియమం. తద్వారా మీతోపాటూ బృందానికీ, సంస్థకూ మంచి పేరు వస్తుంది. ఒకరి విషయాలు మరొకరి వద్ద మాట్లాడకూడదు. ఎవరైనా మిమ్మల్ని నమ్మి ఏవైనా అభిప్రాయాలు మీ దగ్గర చెబితే, వాటిని బహిర్గతం చేయకూడదు. ఇలా ఉండటం వల్ల బృందంలో నమ్మకం పెరుగుతుంది. స్నేహ భావం కూడా పెంపొందుతుంది.



- గంపా నాగేశ్వర్‌రావు
సైకాలజిస్ట్, ఇంపాక్ట్ వ్యవస్థాపకులు

ఇస్రోలో చేరేదెలా?

బీటెక్ (సీఎస్ఈ డేటాసైన్స్) మూడో సెమిస్టర్‌లో ఉన్నాను. అంతరిక్ష రంగం అంటే ఆసక్తి. ఇస్రోలో ఉద్యోగం కోసం ఎలా సన్నద్ధం కావాలి? **- వి.జ్ఞాన శశాంక్**

■ భారత అంతరిక్ష పరిశోధనలో ఇస్రో చూపిన ప్రగతి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతోంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో పనిచేయడం చాలా మంది ఇంజినీరింగ్ విద్యార్థుల ఆశయం. కంప్యూటర్ సైన్స్ నేపథ్యంతో ఇస్రోలో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయి. మీరు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సంసిద్ధమైతే ఈ సంస్థలో ఉద్యోగం పొందడం కష్టమేమీ కాదు. ఇందుకోసం మీరు చదువుతున్న కంప్యూటర్ సైన్స్‌లో ప్రాథమికాంశాలపై గట్టి పట్టు తప్పనిసరి. ఈ సంస్థలోని కంప్యూటర్ సైన్స్ నిపుణులు ప్రధానంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, డేటా విశ్లేషణ, రాకెట్ నియంత్రణ వ్యవస్థలు, ఉపగ్రహ డేటా ప్రాసెసింగ్ వంటి విభాగాల్లో సేవలందిస్తారు. ఇందుకోసం జావా, పైతాన్, సీ వంటి భాషలు ఎక్కువగా ఉపయోగపడతాయి. ఉపగ్రహాల కార్యకలాపాలను సమన్వయం చేయడానికి వినియోగించే ఆపరేటింగ్ సిస్టంపై పూర్తి అవగాహన ఉండాలి.

ఇస్రో రాత పరీక్షలో.. డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్, కంప్యూటర్ నెట్‌వర్క్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, డిజిటల్ లాజిక్, కంప్యూటర్ నెట్‌వర్క్స్ వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. వీటిపై పట్టు ఉంటే ఏ పోటీ పరీక్షలోనైనా మంచి మార్కులు పొందగలరు. ఇందులో ఉద్యోగానికి ఇంజినీరింగ్‌లో కనీసం 65 శాతం మార్కులు లేదా 6.84 సీజీపీఏ పొందాలి. ప్రాథమిక స్క్రీనింగ్ తర్వాత అర్హులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మెరుగైన ప్రతిభ చూపినవారు ఇంటర్వ్యూకు అర్హత సాధిస్తారు. ఇస్రోలో కొన్ని ఉద్యోగాలకు మాత్రం గేట్‌లో మంచి స్కోరు సాధిస్తే, నేరుగా ఇంటర్వ్యూకు అవకాశం కల్పిస్తారు. ఇంటర్వ్యూలో మీరు చేసిన ప్రాజెక్టులు, కోడింగ్ సామర్థ్యం, లాజికల్ థింకింగ్, సమస్య పరిష్కార నైపుణ్యం వంటి విషయాలను పరిశీలిస్తారు. కాబట్టి కాలేజీ రోజుల్లోనే చిన్న సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు చేయడం తప్పనిసరి. ఇప్పటి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తూ, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటే, ఇస్రోలో ఉద్యోగం సాధించాలన్న మీ కలను నెరవేర్చుకోవచ్చు.

– ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

రిలేషన్‌షిప్ మేనేజర్

సంస్థ: బడ్డింగ్ మారినర్స్ నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్, క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం), డేటా అనాలిసిస్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ షీట్స్, ఎంఎస్-ఎక్సెల్, టీమ్ మేనేజ్‌మెంట్, టీమ్‌వర్క్, టైమ్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.1,500-2,000 దరఖాస్తు గడువు: డిసెంబరు 19 ☛ https://shorturl.at/NwigY

యూఎక్స్/యూఐ డిజైన్

సంస్థ: అప్‌మెంటర్-ఎక్స్ నైపుణ్యం: ఫిగ్మా స్టైపెండ్: రూ.5,000-15,000 దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://shorturl.at/y5Rlf

సోషల్‌మీడియా మార్కెటింగ్

సంస్థ: మెగామర్ ఫుడ్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.15,000-18,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://shorturl.at/cDgfI

టెలికాలింగ్

సంస్థ: రైడ్‌యు లాజిస్టిక్స్ యూజీ
నైపుణ్యం: ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://shorturl.at/y4yzE

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: టెక్‌కేన్వాస్ నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://shorturl.at/beuP7

కోడ్‌క్రాఫ్ట్ ఐటీ సొల్యూషన్స్‌లో బ్రాండ్ మార్కెటింగ్

నైపుణ్యాలు: రిసెర్చ్ అండ్ అనలిటిక్స్, సోషల్‌మీడియా మార్కెటింగ్ స్టైపెండ్: రూ.1,000-1,500 దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://shorturl.at/T4LS0

ఆన్‌లైన్ అడ్వర్‌టైజింగ్

నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, గూగుల్ యాడ్‌వర్డ్స్ స్టైపెండ్: రూ.2,000 దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://shorturl.at/DJHKf




సమాజం మనుగడకు మౌలికమైన ఆధారం కుటుంబం. దానికి మూలం వివాహం. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడే వ్యక్తిగత బంధం మాత్రమే కాదు. మానవ సమాజానికి పునాదిగా నిలిచే అత్యంత సార్వత్రికమైన, ప్రాథమికమైన సామాజిక అనుబంధం. సాంఘికంగా అంగీకారం పొందిన చట్టబద్ధమైన సంబంధం. అది లైంగిక బంధాలను, సంతానం, సంపద వారసత్వం, సామాజిక పాత్రల విభజన మొదలైన అంశాలను నియంత్రిస్తుంది. సమాజ నిర్మాణం, దాని పనితీరుపై వివాహం ప్రభావాన్ని తెలుసుకుంటే, కుటుంబం అనే ప్రాథమిక సమూహం ఏర్పడే తీరును, తద్వారా జరిగే సామాజీకరణ ప్రక్రియను అర్థం చేసుకోవచ్చు. సామాజిక స్థిరత్వంలో సర్వామోదం పొందిన ఆ వివాహవ్యవస్థ గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సంబంధిత నియమాలు, లక్షణాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.

సామాజిక విలువలకు సర్వామోద రూపం!

వివాహం

కుటుంబం అనే సంస్థకు మూలాధారం వివాహం. ఇది స్త్రీ, పురుషుల సహజీవన బంధం మాత్రమే కాదు, రెండు కుటుంబాల కలయిక కూడా. వివాహం ఆధారంగానే కుటుంబాలు ఏర్పడతాయి, అభివృద్ధి చెందుతాయి. వివాహం, కుటుంబ వ్యవస్థ రెండూ భార్యాభర్తల సంబంధం, సంతానం, ఆర్థిక సహకారం మొదలైన వాటిపై ఆధారపడి ఉంటాయి. అన్ని సమాజాల్లోనూ దాంపత్య సంబంధాలను క్రమబద్ధం చేస్తూ కొన్నిరకాల ఆంక్షలు ఉంటాయి. వాటికి ప్రతిరూపమే వివాహం అని చెప్పవచ్చు. ఇప్పటి వరకు సమాజాలన్నింటిలోనూ వైవాహిక పరిధిలో జరిగే మిథున సంబంధాలకే సమాజ అంగీకారం లభిస్తోంది. వివాహ వ్యవస్థ లేకుండా సంతానాన్ని పొందడానికి ఏ సమాజమూ అంగీకరించదు. కుటుంబం, వివాహ వ్యవస్థ ద్వారా సంతానోత్పత్తి జరిగి కుటుంబం, సమాజం మనుగడ సాగిస్తున్నాయి. ఎల్.హెచ్.మోర్గాన్, సమ్నర్, కెల్లర్, టైలర్ తదితర పరిణామవాదులు వివాహ వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలను ప్రస్తావిస్తూ మొదట మానవ జాతిలో స్త్రీ, పురుషులు సరైన రీతిలో సంబంధాలు (వావి వరుసలు) లేకుండా విచ్చలవిడిగా కలిసి ఉండేవారని తెలిపారు. అలాంటి స్వేచ్ఛా సంపర్కాన్నే 'స్వైరితం' లేదా 'స్వేచ్ఛారతి' అంటారు. స్వైరితం క్రమంగా కొంతకాలానికి సామూహిక వివాహంగా అంటే కొందరు పురుషులు, కొందరు స్త్రీలను సామూహికంగా వివాహమాడే పద్ధతిగా మారిందని, కాలానుక్రమంలో సామూహిక వివాహం బహువివాహంగా, తర్వాత ఏక వివాహ పద్ధతిగా ఏర్పడిందని వీరి అభిప్రాయం.

> స్త్రీ పురుషుల మధ్య ఉండే సాపేక్షమైన శాశ్వత బంధమే వివాహం.
> – రాబర్ట్ హెచ్.లూయీ (ప్రముఖ మానవ సమాజ శాస్త్రవేత్త)



వివాహ నియమాలు

1) అంతర్ వివాహం: ఒక సమూహానికి చెందిన స్త్రీ/పురుషులు భాగస్వామిని తమ సమూహం నుంచి మాత్రమే వివాహం చేసుకునే పద్ధతిని 'అంతర్వివాహం' అంటారు. వివాహ సంబంధాలు ఆ సమూహానికి మాత్రమే పరిమితమై ఉంటే 'అంతర్వివాహ సమూహం'గా వ్యవహరిస్తారు. ఉదాహరణకు హిందూ సమాజంలో కులం అంతర్వివాహ సమూహం. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ కులస్థులనే వివాహం చేసుకోవాలి. వివాహం విషయంలో వారి కులాల పరిధులను దాటి పోకూడదు.

హిందూ సమాజంలో గోత్రం బహిర్వివాహ సమూహమైతే, కులం అంతర్వివాహ సమూహం. సామాన్యంగా అన్ని తెగలు, మత సమూహాల్లో అంతర్వివాహ పద్ధతి ఆచరణలో ఉంది.

2) బహిర్వివాహం: ఒక సమూహానికి చెందిన స్త్రీ/పురుషులు భాగస్వామిని అదే సమూహం నుంచి కాకుండా వేరొక సమూహం నుంచి వివాహం చేసుకునే పద్ధతిని బహిర్వివాహం (exogamy) అంటారు. ఉదాహరణకు హిందూ సామాజిక వ్యవస్థలో సగోత్ర వివాహాలు నిషిద్ధం. అంటే హిందూ సమాజంలో ఎవరూ సగోత్రులను వివాహం చేసుకోకూడదు. వేరే గోత్రంలోని వారినే వివాహం చేసుకోవాలి. హిందూ సమాజంలో గోత్రం విషయంలో బహిర్వివాహం, కులం విషయంలో అంతర్వివాహం ఆచరణలో ఉన్నాయి.

భారతీయ సమాజం




3) అధిగణన వివాహాలు: ఈ వివాహాలు హిందూ సమాజంలో, అనేక ఇతర సమాజాల్లోనూ ఆచరణలో ఉన్నాయి. అధిగణన వివాహ నియమం ప్రకారం ఒక వ్యక్తికి, ప్రత్యేకించి కొందరు బంధువులను వివాహం చేసుకునే హక్కు ఉంటుంది. సమాంతర పితృసంతతి వివాహం (parallel cousin marriage), మేనరిక వివాహం (cross cousin marriage), మేనమామ, మేనకోడలు వివాహం (uncle-niece marriage), దేవర న్యాయం (levirate), భార్యాభగినీ న్యాయం (sororate) మొదలైనవి అధిగణన వివాహాలకు ఉదాహరణలు.

సమాంతర పితృ సంతతి వివాహం: ఇద్దరు అన్నదమ్ముల సంతానం మధ్య లేదా ఇద్దరు అక్కచెల్లెళ్ల సంతానం మధ్య జరిగే వివాహాన్ని 'సమాంతర పితృసంతతి వివాహం' అంటారు. కొన్ని సమాజాల్లో ఈ విధంగా బంధువులను వివాహం చేసుకోవడాన్ని ఒక హక్కుగా భావిస్తారు. ఇలాంటి వైవాహిక సంబంధాలకే ప్రాధాన్యం ఇస్తారు. కొన్ని అరబ్ దేశాలు, భారతదేశంలోని కొంత మంది ముస్లింలలో సమాంతర పితృసంతతి వివాహం ఆచరణలో ఉంది.

మేనరిక వివాహం: ఒక వ్యక్తి తన తండ్రి సోదరి కుమార్తెను లేదా తన తల్లి సోదరుడి కుమార్తెను వివాహం చేసుకోవడాన్ని 'మేనరిక వివాహం' అంటారు. అదేవిధంగా ఒక వ్యక్తి తన సోదరి కుమార్తెను వివాహం చేసుకుంటే 'మేనమామ - మేనకోడలు వివాహం' అని పిలుస్తారు. దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మేనరిక వివాహాలు ఆచరణలో ఉన్నాయి. మేనమామ, మేనకోడలు వివాహం ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువగా ఆచరణలో ఉంది. ఒక వ్యక్తి సోదరుడు చనిపోతే, చనిపోయిన తన సోదరుడి భార్యను వివాహం చేసుకోవడాన్ని 'దేవర న్యాయం' అంటారు. ఇది రెండు విధాలుగా ఉంటుంది. 1) ఒక వ్యక్తి తన అన్న మరణానంతరం అతడి భార్యను అంటే వదినను వివాహం చేసుకోవడం. ఈ ఆచారాన్ని కనిష్ఠ దేవరన్యాయం అంటారు. 2) ఒక వ్యక్తి తమ్ముడు చనిపోతే అతడి భార్యను, అంటే మరదలిని వివాహం చేసుకోవడం. ఈ ఆచారాన్ని 'జ్యేష్ఠ దేవర న్యాయం' అంటారు. భారతదేశంలోని ఒరావన్, సంతాల్, గోండు, ఫౌల్, ఖాసా, తోడా లాంటి ఆదిమ తెగలు దేవర న్యాయాన్ని పాటిస్తున్నాయి.



> ఒక నిర్దిష్ట ప్రదేశంలో స్త్రీ పురుషులిద్దరూ కలసి నివసించడం, వ్యష్టి కుటుంబాన్ని రూపొందించడం మొదలైన అంశాలతో ఉండే విశ్వవ్యాపిత సంస్థ వివాహం.
> – మర్డాక్ (మానవ సమాజ శాస్త్రవేత్త)



భార్యాభగినీ న్యాయం: ఒక వ్యక్తి భార్య చనిపోయినప్పుడు, తన చనిపోయిన భార్య అవివాహిత సోదరిని వివాహం చేసుకోవడాన్ని 'భార్యాభగినీ న్యాయం' అంటారు. దేశంలోని చాలా సమాజాలు భార్యాభగినీ న్యాయాన్ని అనుసరిస్తున్నాయి.

వివాహం - లక్షణాలు

వివాహం విశ్వసనీయమైంది. అది కొన్ని నియమాలతో కూడి ఉంటుంది. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడం, ఆర్థిక వ్యవహారాలు మొదలైనవి ఉంటాయి. వివాహానంతరం దంపతులు ఎక్కడ నివసించాలి అనే అంశానికీ పద్ధతులు ఉంటాయి. పెళ్లి ద్వారా కొత్త పాత్రలు ఏర్పడతాయి. వీటికి సమాజం కొన్ని అధికారాలను ఇస్తుంది. దాదాపు అన్ని సమాజాల్లో వైవాహిక బంధం శాశ్వతమైంది. కానీ కొన్ని సమాజాల్లో శాశ్వతంగా ఉండాల్సిన అవసరం లేదు. అంటే వివాహం ఒక ఒప్పందం మాదిరి ఉంటుంది.



రచయిత: బద్దం పురుషోత్తం రెడ్డి

కరెంట్ అఫైర్స్



మాదిరి ప్రశ్నలు

◆ 2025 సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 11 వరకు 11వ ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఎక్కడ నిర్వహించారు? (ఈ ప్రతిష్ఠాత్మక పోటీలను భారత్‌లో నిర్వహించడం ఇదే మొదటి సారి.)
జ: అహ్మదాబాద్

◆ ప్రపంచ గర్భనిరోధక దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2007 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు? 2025లో ఈ దినోత్సవాన్ని 'ఏ ఛాయిస్ ఫర్ ఆల్- ఏజెన్సీ, ఇంటెన్షన్, యాక్సెస్' అనే థీమ్‌తో నిర్వహించారు.)
జ: సెప్టెంబరు 26

◆ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం ఎప్పటి వరకు పొడిగించింది? (సైనిక వ్యవహారాల కార్యదర్శిగా కూడా జనరల్ అనిల్ చౌహాన్ వ్యవహరిస్తున్నారు.)
జ: 2026 మే 30

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలు (30)
చివరి తేదీ: 2025 నవంబరు 26

☛ సీసీఆర్‌హెచ్ దిల్లీలో గ్రూప్ - ఏ, బీ, సీ పోస్టులు (90)
చివరితేదీ: 2025 నవంబరు 26

కార్పొరేట్ కొలువుల్లో నాయకుడిగా నిలవాలంటే..! — లైఫ్‌స్కిల్స్



జీవితంలో తోటివారి కంటే ముందంజలో నిలిచేందుకు ఉండాల్సిన ముఖ్యమైన నైపుణ్యమే నాయకత్వ సామర్థ్యం. చొరవ, రిస్క్ తీసుకునే ధైర్యం, ఉద్యోగమిచ్చిన సంస్థ కోసం అదనంగా పనిచేయాలన్న తపన ఉన్నవారు నాయకుడిగా నిలవొచ్చు. తనతో ఉండేవారిని సమాయత్తపరుస్తూ అసాధారణ ఫలితాన్ని సాధించవచ్చు. అందుకే ఉద్యోగులు ఎంతమంది ఉన్నా నాయకత్వ లక్షణాలున్న సిబ్బంది కోసం కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు ఎదురుచూస్తుంటాయి. మిమ్మల్ని నాయకుడిగా నిలిపే లక్షణాలు ఏమిటి? స్వయంకృషితో వాటిని ఎలా అలవరచుకోవాలో తెలుసుకోవాలి? అలా పనిచేసి ఉన్నత స్థానాలకు చేరిన వ్యక్తుల గురించి తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

గ్రామీణ ప్రాంతాలే నిరుద్యోగ కేంద్రాలు!





మనదేశంలో ప్రధానమైన సామాజిక, ఆర్థిక సమస్యలే పేదరికం, నిరుద్యోగం. ఇవి రెండూ ఒక దానితో ఒకటి ముడిపడి ఉంటాయి. ప్రాథమిక అవసరాలు తీరకపోవడమే పేదరికం కాగా, నిరుద్యోగం అనేది పేదరికానికి ఒక కారణం. వ్యవసాయంపై అధిక శాతం జనాభా ఆధారపడటం, నెమ్మదిగా జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధి లాంటివి పేదరికం, నిరుద్యోగానికి ప్రధాన కారణాలు. ఈ సమస్యల తీవ్రత, గణాంకాలు, కొలిచే సూచికలు, పరిష్కార మార్గాలపై పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. భారతదేశంలో పేదరికం, నిరుద్యోగంపై దాదాభాయ్ నౌరోజీ నుంచి అమర్త్యసేన్ వరకు ఆర్థికవేత్తల అభిప్రాయాలు, ప్రభుత్వం చేపట్టిన పేదరిక నిర్మూలన పథకాలు, ఉపాధిని పెంచే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వాటి లక్ష్యాలను సమగ్రంగా తెలుసుకోవాలి.

ఇండియన్ ఎకానమీ

భారతదేశంలో పేదరికం - నిరుద్యోగం (కారణాలు, సూచనలు - పథకాలు)

1. కిందివాటిలో భారతదేశంలో దారిద్య్రరేఖ అంచనాలతో సంబంధం ఉన్న సంస్థను గుర్తించండి.
   1) భారతీయ రిజర్వ్ బ్యాంకు
   2) నీతి ఆయోగ్
   3) జాతీయ నమూనా సర్వే సంస్థ
   4) భారత వ్యవసాయ పరిశోధనా మండలి
2. నీతి ఆయోగ్ ప్రచురించిన జాతీయ బహుమితీయ పేదరిక సూచిక (ఎంపీఐ) బహుళ లేమితనాలను పరిగణనలోకి తీసుకుని పేదరికాన్ని కొలుస్తుంది. కిందివాటిలో దేనిని ఎంపీఐలో చేర్చలేదు?
   1) ఉపాధి 2) విద్య
   3) ఆరోగ్యం 4) ఏదీకాదు
3. పేదరికానికి సంబంధించి కింది కమిటీలను పరిగణించి వాటి ఏర్పాటును సరైన కాలక్రమానుసారం అమర్చండి.
   ఎ) లక్డావాలా కమిటీ బి) రంగరాజన్ కమిటీ
   సి) టెండూల్కర్ కమిటీ
   డి) దండేకర్, రాత్ కమిటీ
   కింది కోడ్ నుంచి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   1) డి, ఎ, సి, బి 2) ఎ, డి, బి, సి
   3) ఎ, డి, సి, బి 4) డి, ఎ, బి, సి
4. కిందివాటిలో పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని గుర్తించండి.



   1) జననీ సురక్ష యోజన
   2) స్వచ్ఛ భారత్ యోజన
   3) ఇందిరా ఆవాస్ యోజన 4) ఏదీకాదు
5. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దారిద్య్రరేఖకు దిగువన ఉన్న జనాభా శాతం?
   1) 32% 2) 22% 3) 42% 4) 27.8%
6. కిందివాటిలో ఏ కమిటీ పేదరికాన్ని గుర్తించడానికి జీవన వ్యయాన్ని ప్రాతిపదికగా తీసుకుని లెక్కించింది?
   1) టెండూల్కర్ కమిటీ 2) రంగరాజన్ కమిటీ
   3) అలఘ్ కమిటీ 4) లక్డావాలా కమిటీ
7. కిందివాటిలో దారిద్య్రరేఖ అనే భావనను సమీక్షించడానికి ఏ కమిటీని ఏర్పాటు చేశారు?
   1) వాంచూ కమిటీ 2) దత్ కమిటీ
   3) సురేష్ టెండూల్కర్ కమిటీ
   4) లక్డావాలా కమిటీ
8. కిందివాటిలో ఏ పథకం తక్కువ నిధులతో నడుస్తున్న సంస్థలను అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడం, వాటికి రుణాలు అందించే లక్ష్యంతో రూపుదిద్దుకుంది?
   1) ఆర్‌బీఐ రుణ పథకం
   2) ముద్రాయోజన పథకం
   3) పీఎం జన్‌ధన్ యోజన
   4) అంకుర పథకం
9. జాతీయ ఉపాధిహామీ పథకం ఒక ఆర్థిక సంవత్సరంలో ఎన్నిరోజుల పాటు ఒక కుటుంబంలోని వయోజన సభ్యులకు కనీస వేతనంతో కూడిన ఉపాధి కల్పించేందుకు ఏర్పాటైంది?
   1) 120 రోజులు 2) 90 రోజులు
   3) 100 రోజులు 4) 180 రోజులు
10. భారతదేశంలో నిరుద్యోగం, పేదరికం అంచనాలు వేటిపై ఆధారపడి ఉంటాయో గుర్తించండి.
    1) సీఎస్ఐ గృహ వినియోగ వ్యయ సర్వే
    2) ప్రణాళికా సంఘం గృహ వినియోగ సర్వే
    3) ఎన్ఎస్ఎస్ఓ కుటుంబ ఆదాయ సర్వే
    4) ఎన్ఎస్ఎస్ఓ గృహ వినియోగ వ్యయ సర్వే
11. కిందివాటిలో ఏ కమిటీ పట్టణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వ్యయం రూ.1,407, గ్రామీణ ప్రాంతాల్లో రూ.972ను దారిద్య్రరేఖ కొలమానంగా నిర్ణయించింది?



    1) రంగరాజన్ కమిటీ
    2) లక్డావాలా కమిటీ
    3) వి.ఎం.దండేకర్ కమిటీ
    4) జలాన్ కమిటీ
12. కిందివాటిలో ఏ సంస్థ భారతదేశంలో తీవ్ర పేదరికం 2011 నుంచి 2019 నాటికి 12.3% తగ్గిందని అంచనా వేసింది?
    1) ఎన్ఎస్ఓ సర్వే 2) ఐఎంఎఫ్ సర్వే
    3) ప్రపంచ బ్యాంకు సర్వే
    4) ఎన్ఎస్ఎస్ఓ సర్వే
13. ఉపాధి హామీ చట్టం ప్రకారం గ్రామీణ వయోజనుడికి ఎన్ని రోజుల్లో పనిపొందేలా చట్టబద్ధ హామీ ఇచ్చారు?
    1) 30 2) 15 3) 10 4) 35
14. ఒక దేశ శ్రామిక శక్తి అంటే కింది వారిలో ఏ వయోవర్గాన్ని లెక్కిస్తారు?
    1) 18 - 60 2) 16 - 64
    3) 21 - 60 4) 15 - 65
15. భారత ప్రభుత్వం యువతకు నైపుణ్య శిక్షణ అందించాలని ఏ కార్యక్రమ లక్ష్యంగా పెట్టుకుంది?
    1) మేక్ ఇన్ ఇండియా 2) స్కిల్ ఇండియా
    3) డిజిటల్ ఇండియా 4) స్టార్టప్ ఇండియా
16. నిరుద్యోగాన్ని పరిష్కరించడంలో స్టార్టప్‌లు ఎలాంటి పాత్ర పోషిస్తాయి?
    1) అవి ప్రభుత్వ ఉద్యోగాలను పెంచుతాయి
    2) సంప్రదాయ పరిశ్రమలను ప్రోత్సహిస్తాయి
    3) ఇవి కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయి
    4) వ్యవసాయాధార పరిశ్రమలను ప్రోత్సహిస్తాయి
17. కిందివాటిలో భారతదేశంలో ఆత్మనిర్భర్ భారత్ చొరవ ప్రాథమిక దృష్టి ఏమిటో గుర్తించండి.
    1) దిగుమతుల పెరుగుదల
    2) వివిధ రంగాల్లో స్వావలంబన సాధించడం
    3) శ్రమశక్తిని తగ్గించడం
    4) విదేశీ పెట్టుబడులను పరిమితం చేయడం
18. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం (పీఎంఈజీపీ) ప్రధాన లక్ష్యం?
    1) స్వయం ఉపాధి, వ్యవస్థాపకతకు మద్దతు ఇవ్వడం
    2) విద్యకు ఆర్థిక సహాయం అందించడం
    3) ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యక్ష ఉపాధి పెంచడం
    4) కార్మిక మార్కెట్‌ను నియంత్రించడం
19. కిందివాటిలో భారతదేశంలో పేదరికపు అంచనాలకు సంబంధించి వివరించిన గ్రంథాలలో సరికానిది?
    1) పావర్టీ ఇన్ ఇండియా (రాత్, దండేకర్)
    2) ప్లానింగ్ అండ్ ది పూర్ (బి.ఎస్.మిన్హాస్)
    3) రీజనల్ డిస్పారిటీస్ అండ్ ది పావర్టీ ఇన్ ఇండియా (గౌరవ్ దత్, మార్టిన్ రావెల్లిన్)
    4) ది ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా (ఆర్.సి.దేశాయ్)
20. పేదరికానికి సంబంధించి 'ఛాయిస్ ఆఫ్ టెక్నిక్' గ్రంథ రచయిత?
    1) అరవింద్ పనగరియా 2) రతిన్ రాయ్
    3) సుర్జిత్ బల్లా 4) అమర్త్యసేన్
21. ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం 'పీ4' పేదరిక నిర్మూలన' కార్యక్రమాన్ని ప్రారంభించింది?



    1) కేరళ 2) మహారాష్ట్ర
    3) ఆంధ్రప్రదేశ్ 4) తెలంగాణ
22. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
    1) 2015 2) 2011 3) 2009 4) 2014
23. 2019లో ప్రారంభించిన ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ యోజన కిందివారిలో ఎవరి రక్షణ కోసం ఉద్దేశించింది?
    1) సంఘటిత కార్మికులు 2) వ్యవసాయ కూలీలు
    3) అసంఘటిత కార్మికులు
    4) గనుల్లో పని చేసే శ్రామికులు
24. 'ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన' పథకం ఎవరికి ఉద్దేశించింది?
    1) 16 రకాల చేతివృత్తులవారికి
    2) సంఘటిత కార్మికులకు పింఛన్
    3) వ్యవసాయ కూలీలకు ఆరోగ్య బీమా
    4) ఏదీకాదు
25. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ద్వారా 2015లో ప్రారంభించిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఏ వయసు వారికి బీమాను అందిస్తుంది?
    1) 15 - 50 2) 16 - 70
    3) 18 - 35 4) 20 - 60
26. 2025లో ప్రారంభించిన ఎన్ఏవీవైపై (నవ్య) పథకం ముఖ్య ఉద్దేశం?
    1) మహిళలకు అక్షరాస్యత
    2) కౌమార బాలికల సామాజిక ఆర్థిక స్వాతంత్య్రం
    3) పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం
    4) ఏదీకాదు
27. వైజ్ – కిరణ్ అనే పథకం ముఖ్య లక్ష్యం?
    1) డిజిటల్ పరిజ్ఞానానికి సంబంధించి మహిళలకు శిక్షణ
    2) మహిళలకు ఆర్థిక చేయూత
    3) సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళా భాగస్వామ్యం
    4) మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ
28. భారతదేశంలో పేదరికాన్ని ప్రధానంగా కిందివాటిలో దేని ఆధారంగా కొలుస్తారు?
    1) సంపద అసమానతలు 2) ఉపాధి రేటు
    3) ఆదాయం, వినియోగం 4) జీవన ప్రమాణాలు
29. భారతదేశంలో పేదరికం కింద పేర్కొన్న ఏ ప్రాంతంలో ఎక్కువగా కేంద్రీకృతమైంది?
    1) పట్టణ ప్రాంతాలు 2) తీర ప్రాంతాలు
    3) గ్రామీణ ప్రాంతాలు 4) ఉత్తర భారత రాష్ట్రాలు
30. కిందివాటిలో భారతదేశంలో నిరుద్యోగానికి ప్రధాన కారణం ఏది?
    1) నెమ్మదిగా పారిశ్రామికాభివృద్ధి
    2) నైపుణ్య అసమతౌల్యత
    3) వ్యవసాయంపై ఆధారపడటం
    4) పైవన్నీ
31. ఫిలిప్స్ కర్వ్ సిద్ధాంతం కిందివాటిలో దేని మధ్య సంబంధాన్ని వివరిస్తుంది?
    1) నిరుద్యోగం - ద్రవ్యోల్బణం
    2) పారిశ్రామికీకరణ - ఆదాయం
    3) వృద్ధి - నిరుద్యోగం
    4) వ్యవసాయం - ఆదాయం
32. ఒక వ్యక్తి మార్కెట్‌లో ఉన్న వేతన రేటుకు పనిచేయడానికి సిద్ధంగా ఉండి, అతనికి పని దొరక్కపోతే, దాన్ని ఏ రకమైన నిరుద్యోగం అంటారు?
    1) స్వచ్ఛంద నిరుద్యోగం
    2) అసంకల్పిత నిరుద్యోగం
    3) సీజనల్ నిరుద్యోగం 4) ఏదీకాదు

సమాధానాలు

1-3, 2-1, 3-1, 4-3, 5-2, 6-1, 7-3, 8-2, 9-3, 10-4, 11-1, 12-3, 13-2, 14-2, 15-2, 16-3, 17-2, 18-1, 19-4, 20-4, 21-3, 22-2, 23-3, 24-1, 25-2, 26-2, 27-3, 28-3, 29-3, 30-4, 31-1, 32-2.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

క్యాంప్‌లో కొత్తగా చేరిన సైనికుల సంఖ్య ఎంత?

కాలం - పని

ముఖ్యాంశాలు

- ✦ ఒక పని పూర్తి చేసేందుకు కావాల్సిన వ్యక్తుల సంఖ్య ఆ పని పూర్తి చేసేందుకు పట్టే కాలానికి విలోమానుపాతంలో ఉంటుంది.
- ✦ A ఒక పనిని x రోజుల్లో పూర్తి చేస్తే A ఒక రోజులో చేసే పని $=\frac{1}{x}$
- ✦ A ఒక రోజులో చేసే పని $\frac{1}{x}$ అయితే ఆ పనిని పూర్తి చేయటానికి x రోజులు అవసరం
- ✦ కాలం, పని విలోమానుపాతంలో ఉంటాయి.
- ✦ A ఒక పనిని 8 రోజుల్లో B అనే వ్యక్తి 6 రోజుల్లో పూర్తి చేస్తే A.. 8 యూనిట్ల పని, B.. 6 యూనిట్ల పని చేయగలరు.
- ✦ AB = 8 : 6 లేదా 4 : 3 అయితే వీరి కాలపరిమితి 3 : 4 అవుతుంది.
- ✦ A ఒక పనిని x రోజుల్లో, B అదే పనిని y రోజుల్లో పూర్తి చేసినట్లయితే, ఇద్దరు కలిసి ఆ పనిని $\frac{xy}{x+y}$ రోజుల్లో పూర్తి చేయగలరు.
- ✦ A, Bలు ఒక పనిని x రోజుల్లో పూర్తి చేయగలరు. A ఒక్కడే ఆ పనిని y రోజుల్లో పూర్తి చేస్తే, B ఒక్కడే ఆ పనిని చేయటానికి పట్టే కాలం $\frac{xy}{x-y}$

MDW సూత్రం:

M_1 వ్యక్తులు W_1 పనిని D_1 రోజుల్లో చేస్తే.. M_2 వ్యక్తులు W_2 పనిని D_2 రోజుల్లో పూర్తి చేస్తే

$M_1D_1W_2 = M_2D_2W_1$ అవుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. 8 మంది ఒక పనిని 5 రోజుల్లో పూర్తి చేయగలరు. ఇదే పని 10 రోజుల్లో పూర్తి కావాలంటే ఎంత మంది అవసరం?

1) 3 2) 4 3) 5 4) 7

సాధన: 5 రోజుల్లో పూర్తి చేయటానికి 8 మంది అవసరం.

10 రోజుల్లో పూర్తి అవ్వడానికి కావల్సిన వారు $=\frac{5}{10}\times 8 = 4$

సమాధానం: 2

2. ఒక వ్యక్తి ఒక పనిని 10 రోజుల్లో పూర్తి చేయగలడు. ఒక రోజులో అతడు చేసే పని?

1) $\frac{1}{5}$ వ వంతు 2) $\frac{1}{2}$ వ వంతు
3) $\frac{2}{3}$ వ వంతు 4) $\frac{1}{10}$ వ వంతు

సాధన: ఒక వ్యక్తి ఒక పనిని 10 రోజుల్లో పూర్తి చేస్తే ఒక రోజులో చేసే పని $=\frac{1}{10}$ వ వంతు

సమాధానం: 4

3. ఒక క్యాంప్‌లో 1500 మంది సైనికులకు 55 రోజులకు సరిపడే ఆహారం ఉంది. 15 రోజుల తర్వాత అదనంగా కొద్దిమంది సైనికులు చేరడంతో ఆ ఆహారం 30 రోజులకే సరిపోయింది. అయితే అదనంగా వచ్చిన వారు ఎందరు?

1) 500 2) 1000 3) 900 4) 850

సాధన: 15 రోజుల తరువాత ఆహారం సరిపోవాల్సిన రోజులు

$= 55 - 15 = 40$

రోజుల నిష్పత్తి $= 40 : 30 = 4 : 3$

సైనికుల నిష్పత్తి $= 3 : 4$

3 నిష్పత్తులు = 1500

1 నిష్పత్తి = 500

లేదా $(4 - 3) = 1$ నిష్పత్తి = 500

సమాధానం: 1

4. శ్రీవాత్సవ్ ఒక పనిని 20 రోజుల్లో పూర్తి చేయగలరు. ఇతడి కంటే 25% ఎక్కువ సామర్థ్యం కలిగి ఉన్న అరుణ్ అదే పనిని ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలడు?

1) 15 2) 18 3) 17 4) 16

సాధన: ఇద్దరి సామర్థ్యం $= 125 : 100 = 5 : 4$

అరుణ్ ఒక పనిని పూర్తి చేయడానికి పట్టిన రోజులు x అయితే

$\frac{5}{4} : \frac{20}{x} = 16$ రోజులు

సమాధానం: 4

5. A ఒక పనిని 30 రోజుల్లో, B అదే పనిని 40 రోజుల్లో పూర్తి చేస్తారు. వారిద్దరు కలిసి ఆ పనిని ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలరు?

1) 20 రోజులు 2) $17\frac{1}{7}$ రోజులు
3) $19\frac{1}{7}$ రోజులు 4) $20\frac{1}{7}$ రోజులు

సాధన: A ఒక రోజులో చేసే పని $=\frac{1}{30}$ వ వంతు

B ఒక రోజులో చేసే పని $=\frac{1}{40}$ వ వంతు

A, B లు కలిసి ఒక రోజులో చేసే పని $=\frac{1}{30}+\frac{1}{40}$

$=\frac{4+3}{120}=\frac{7}{120}$

పనిని పూర్తి చేసేందుకు పట్టే కాలం $=\frac{120}{7}$

$=17\frac{1}{7}$ రోజులు

సమాధానం: 2

6. A, B ల పని సామర్థ్యాలు 5 : 4 నిష్పత్తిలో ఉన్నాయి. A ఒక పనిని 12 గంటల్లో చేస్తే, అదే పనిని B ఎన్ని గంటల్లో చేస్తాడు?

1) 16 2) 18 3) 12 4) 15

సాధన: A, B ల పని నిష్పత్తి = 5 : 4

A, B ల కాలాల నిష్పత్తి = 4 : 5

A కు పట్టే కాలం = 4 నిష్పత్తులు = 12 గంటలు

1 నిష్పత్తి = 3 గంటలు

B కి పట్టే కాలం = 5 నిష్పత్తులు $= 5 \times 3 = 15$ గంటలు

సమాధానం: 4

7. అయిదుగురు ఒక పనిని 20 రోజుల్లో పూర్తి చేయగలరు. అదే పనిని 10 మంది వ్యక్తులు ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలరు?

1) 40 2) 10 3) 15 4) 5

సాధన: వ్యక్తులు రెట్టింపు అయితే కాలం సగం అవుతుంది.

కాబట్టి $\frac{20}{2} = 10$ రోజుల్లో పూర్తి అవుతుంది.

సమాధానం: 2

8. 16 మంది టైపిస్టులు రోజుకు 4 గంటల చొప్పున పనిచేస్తే 12 రోజుల్లో పని పూర్తి చేయగలరు. అదే పనిని 8 మంది రోజుకు 4 గంటల చొప్పున పని చేస్తే ఎన్ని రోజుల్లో ఆ పనిని పూర్తి చేయగలరు?

1) 96 2) 24 3) 48 4) 36

సాధన: $M_1D_1T_1 = M_2D_2T_2$

$16 \times 12 \times 4 = 8 \times 4 \times D_2$

$D_2 = \frac{16 \times 12 \times 4}{8 \times 4}$

= 24 రోజులు

సమాధానం: 2



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్,
విషయ నిపుణులు

Word of the Day 840

Decorous

Telugu meaning: సమర్థనీయమైన, సరిపోయే

English meaning: The word decorous (డెకరస్) is an adjective that describes behaviour that is polite, proper, and socially acceptable.

Synonyms: Polite, Dignified; ***Antonyms:*** Indecent, Rude

Usage: **1.** The students maintained a decorous silence during the ceremony, showing respect for the guests.

2. Her decorous behaviour at the formal event impressed everyone present.

కరెంట్ అఫైర్స్



భారత్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన మొబైల్ చెల్లింపుల వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ని, యూరోపియన్ చెల్లింపుల వ్యవస్థ టార్గెట్ ఇన్‌స్టంట్ పేమెంట్ సెటిల్‌మెంట్ (టిప్స్)తో అనుసంధానం చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. భారత్-ఐరోపా ప్రాంతాల మధ్య నగదు బదిలీ (రెమిటెన్స్)ని సులభతరం చేసే లక్ష్యంతో, యూపీఐ-టిప్స్‌ను జత చేయాలనే ప్రతిపాదన రూపొందించినట్లు పేర్కొంది.

దేశవ్యాప్తంగా కార్మికులందరికీ సామాజిక భద్రత, న్యాయం అందించేందుకు నాలుగు కార్మిక (లేబర్) కోడ్‌లను అమల్లోకి తీసుకువచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు సకాలంలో వేతనాలు చెల్లిస్తూ ఆర్థిక భద్రత కల్పించనున్నట్లు పేర్కొంది. గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లతో సహా కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు అమల్లోకి రానున్నాయని వివరించింది.

✦ దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో రూపొందించిన.. వేతనాల కోడ్-2019, పారిశ్రామిక సంబంధాల కోడ్-2020, సామాజిక భద్రత కోడ్-2020, వృత్తిపరమైన భద్రత-ఆరోగ్యం-పనిప్రదేశాల్లో పరిస్థితుల కోడ్-2020.. ఈ 4 కార్మిక కోడ్‌లను దేశవ్యాప్తంగా ఒకేసారి 2025, నవంబరు 21 నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. వీటిని నోటిఫై చేసినట్లు కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు.

ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన వారు దేశవ్యాప్తంగా 56.35% మంది ఉన్నట్లు భారత నైపుణ్యాల నివేదిక-2026 వెల్లడించింది. ఉద్యోగ అర్హత నైపుణ్యాలున్న వారిలో ఉత్తర్ ప్రదేశ్ (78.64%) మొదటి స్థానంలో నిలవగా.. ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (75.42%), కర్ణాటక (73.85%), కేరళ (72.16%), దిల్లీ (71.25%) నిలిచాయి. ఏఐసీటీఈ, సీఐఐ సహకారంతో వీబాక్స్ సంస్థ నిర్వహించిన ఈ సర్వే నివేదికను తాజాగా విడుదల చేశారు.

భారత్‌లో 2023లో 15-49 ఏళ్ల వయసు గల మహిళల్లో అయిదో వంతు మంది సన్నిహిత భాగస్వామి చేతిలో హింసకు గురవ్వగా, దాదాపు 30 శాతం మంది వారి జీవితకాలంలో ఈ సమస్య బారినపడ్డారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తెలిపింది. నవంబరు 25న 'మహిళలు, బాలికలపై హింస నిర్మూలన దినోత్సవం' సందర్భంగా ప్రపంచవ్యాప్త పరిస్థితులపై డబ్ల్యూహెచ్‌వో నివేదిక విడుదల చేసింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


భారత లా కమిషన్

స్టడీ - జోన్

సమాజంలో మంచి ప్రవర్తనా నియమావళిని అమలు చేయడానికి, వివాదాల పరిష్కారానికి, వ్యక్తిగత హక్కులు - స్వేచ్ఛను రక్షించడానికి చట్టాలు అవసరం. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ వారు తమ ఆధిపత్యాన్ని చెలాయించేందుకు అనేక చట్టాలను అమలు చేశారు. వాటి ద్వారా ప్రజల హక్కులను పూర్తిగా నాశనం చేసి, భయానక వాతావరణాన్ని సృష్టించారు. 1947 తర్వాత ఆ చట్టాలను సంస్కరించడంపై చర్చ జరిగింది. ఆ విధంగా ఏర్పడిందే భారత లా కమిషన్ (Law Commission of India). దేశంలో ప్రగతిశీల అభివృద్ధి, క్రోడీకరణ (Codification)లో ఇది ముఖ్య భూమిక పోషించింది. పోటీ పరీక్షల నేపథ్యంలో దీనికి సంబంధించిన ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

☛ దేశంలో న్యాయ పాలనను సమర్థవంతంగా నిర్వహించి, సామాజిక న్యాయాన్ని ప్రజలందరికీ అందించే లక్ష్యంతో 'లా కమిషన్'ను ఏర్పాటు చేశారు. ఇది అవసరమైన అంశాలపై శాస్త్రీయ అధ్యయనాన్ని నిర్వహించి.. ప్రభుత్వానికి తగు సూచనలు, సిఫార్సులు అందిస్తుంది.

☛ ఇది చట్టబద్ధమైన లేదా రాజ్యాంగబద్ధమైన సంస్థ కాదు. దీన్ని కేంద్ర చట్ట, న్యాయ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తుంది.



☛ దేశంలోని చట్టాల అద్భుతమైన ఆలోచనాత్మక, కీలకమైన సమీక్షను లా కమిషన్ అందిస్తుంది.

విధులు

☛ లా కమిషన్ ప్రధాన విధి చట్టపరమైన పరిశోధన నిర్వహించడం. దేశంలో అమల్లో ఉన్న వివిధ చట్టాల పనితీరును అధ్యయనం చేయడం.

☛ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వివిధ అంశాలపై అధ్యయనాలు నిర్వహించి, సంస్కరణలను సూచించడం.

☛ సమాజంలోని విభిన్న వర్గాల సామాజిక స్థితిగతులు, ఆచార సంప్రదాయాలను అధ్యయనం చేసి తగిన సిఫార్సులు చేయడం.

☛ సామాజిక, రాజకీయ, న్యాయ అంశాలపై అభిలషణీయమైన నివేదికలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదించడం.

గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు సహా పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

మహిళా సంక్షేమం - చట్టాలు



సరోగసీ నియంత్రణ చట్టం - 2021

2022 జనవరి 25 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2022 మార్చిలో సరోగసీ నియమాలను రూపొందించింది.

✦ ఈ చట్టం వ్యాపార కోణంలో సరోగసీని నిషేధించింది.

వివాహిత ముస్లిం మహిళా వివాహ హక్కుల పరిరక్షణ చట్టం - 2019

ఈ చట్టాన్ని ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టం అంటారు.

✦ షయరాబానో అనే ముస్లిం మహిళ కేసు సందర్భంగా 2017 ఆగస్టు 22న సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, సమానత్వానికి విరుద్ధమని తీర్పు చెబుతూ ట్రిపుల్ తలాక్‌ను నిషేధించింది. కేంద్ర ప్రభుత్వం ఈ విధానంపై శాసనపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

గృహహింస నుంచి మహిళల సంరక్షణ చట్టం - 2005

ఈ చట్టం 2006 అక్టోబరు 26 నుంచి అమల్లోకి వచ్చింది. గృహహింస సెక్షన్ 3 ప్రకారం శారీరక, మానసిక దాడులు, మాటలు, బ్లాక్‌మెయిల్ చేయడం, ఉద్వేగపరమైన హింస.. గృహహింస పరిధిలోకి వస్తాయి.

మాతృత్వ ప్రయోజనాల చట్టం

మాతృత్వ ప్రయోజనాల చట్టం 1961 స్థానంలో రూపొందించారు. 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఇందులో పేర్కొన్న ఆలనా కేంద్రాల ఏర్పాటు అదే ఏడాది జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది.

1829 నుంచి ఇప్పటి వరకు మహిళా సంక్షేమం కోసం చేసిన చట్టాలు, చారిత్రక తీర్పులు, ఇతర ముఖ్యమైన కేసులు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Specialist Officers Posts

Bank of India (BOI) Mumbai is inviting applications for the recruitment of Specialist Officers posts in various departments. The total no. of posts is 115. The application fee is Rs.850. The last date for receipt of online applications is 2025 November 30.

Junior Resident Jobs

Employees' State Insurance Corporation (ESIC) Alwar is conducting interviews for the recruitment of Junior Resident and Tutor posts in various departments on a contractual basis. The total no. of posts is 27. The application fee is Rs.500. Eligible candidates can appear for the interview on 27th November, 2025.

Multi-Tasking Staff Posts

CSIR-Indian Institute of Integrative Medicine (IIIM), Jammu and Kashmir, is inviting applications to fill Multi-Tasking Staff posts on a permanent basis. The total no. of posts is 19. The application fee is Rs.500. The last date for online applications is 25 November 2025.

Did You Apply..?

Today (November 24) is the last date for the following Jobs/ Apprentice posts.

- ◆ 61 Sports Quota posts - RRC South Central Railway Recruitment 2025. ***Eligibility:*** 10th/ITI/12th.
- ◆ 20 Apprentice posts in AAI. ***Eligibility:*** Degree or Diploma.
- ◆ JRF posts in NIT Nagaland. ***Eligibility:*** ME/ MTech, MS.

For more information and other notifications - scan QR code

Misspelled Words

Directions (Qs. 1 - 19): *Identify the INCORRECTLY spelt word in the following sentences.*

1. The council's report highlighted growing discontent, administrative irregularities, political instability, and public yagitation across the region.
A) Discontent B) Irregularities
C) Instability D) Yagitation

2. Her research combined credibility, objectivity, statistical precision, and insightful interpretaiton of the results.
A) Credibility B) Objectivity
C) Precision D) Interpretaiton

3. The historian examined ancient chronicles, royal genealogies, cultural evolution, and social transission across centuries.
A) Chronicles B) Transission
C) Evolution D) Genealogies

4. The minister emphasized transparency, fiscal discipline, economic revival, and administrative retification in his address.
A) Transparency B) Discipline
C) Retification D) Revival

5. The judge acknowledged the lawyer's eloquence, logical argumentation, sharp observation, and firm convicton.
A) Eloquence B) Argumentation
C) Observation D) Convicton

SSC Exams

English

6. The documentary captured the tribe's cultural diversity, spiritual rituals, artistic craftsmanship, and agricultural sustenence.
A) Sustenence B) Rituals
C) Craftsmanship D) Diversity

7. The organisation introduced new protocols, strengthened governance, improved compliance, and eliminated procedural redundency.
A) Protocols B) Redundency
C) Compliance D) Governance

8. The scientist proposed a groundbreaking hypothesis, supported by empirical validation, logical inference, and historical contex.
A) Hypothesis B) Validation
C) Contex D) Inference

9. His leadership displayed remarkable foresight, unwavering determination, tactical adaptability, and strategic accumen.
A) Foresight B) Determination
C) Adaptability D) Accumen

10. The festival showcased traditional crafts, local cuisine, folk performances, and cultural heritaje.
A) Heritaje B) Cuisine
C) Performances D) Crafts

11. The diplomat handled the tense situation with calm demenaour, strong negotiation skills, rational moderation, and political acummulation.
A) Demeanour B) Acummulation
C) Moderation D) Negotiation

12. The journalist exposed large-scale embezzlement, administrative malfunction, official complicity, and political colaboration in the scandal.
A) Embezzlement B) Colaboration
C) Complicity D) Malfunction

13. The librarian preserved rare manuscripts, ancient scripts, historical chronology, and literary tresures with great care.
A) Manuscripts B) Scripts
C) Tresures D) Chronology

14. The athlete's routine required strict discipline, specialised training, nutritional regimen, and mental forttitude.
A) Discipline B) Training
C) Forttitude D) Regimen

15. The conference focused on digital literacy, cyber security, technological advancement, and societal transfermation.
A) Literacy B) Security
C) Advancement D) Transfermation

16. The novel explores societal oppression, personal liberation, moral ambiguity, and psychological dissonence.
A) Oppression B) Liberation
C) Ambiguity D) Dissonence

17. The museum showcased ancient artefacts, historical inscriptions, cultural succession, and archaeological excevation.
A) Excavation B) Inscriptions
C) Succession D) Artefacts

18. Her presentation demonstrated remarkable clarity, logical structuring, persuasive argumentation, and deep insigthfulness.
A) Clarity B) Structuring
C) Insigthfulness D) Argumentation

19. The counsellor emphasized emotional resilience, behavioural adjustment, cognitive reframing, and stress managament.
A) Resilience
B) Managament
C) Reframing
D) Adjustment

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

బిహార్‌లో తల్లి పాలలో యురేనియం

పట్నా: బిహార్‌లో జీవిల నిర్వహించిన ఓ పరిశోధనలో తల్లి పాలలో రేడియో యాక్టివ్ మెటీరియల్ ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ విషయమై దిల్లీ ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్ అశోక్ శర్మ మీడియాతో మాట్లాడారు. బిహార్‌లోని కొన్ని గ్రామాలకు చెందిన 40 మంది బాలింతల నుంచి పాలను సేకరించి పరీక్షించగా, వాటిలో



యురేనియం ఉన్నట్లు గుర్తించామన్నారు. బాలింతల పాలల్లో యురేనియం స్థాయిలు తక్కువగా ఉన్నప్పటికీ వాటిని తాగే శిశువులు దీర్ఘకాలంలో క్యాన్సరేతర సమస్యలు ఎదుర్కొనే అవకాశముందన్నారు. దీనివల్ల, తల్లుల ఆరోగ్యంపైనా ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు గుర్తించామన్నారు. బిహార్‌లోని పలువురు బాలింతల పాలలో యురేనియం ఉన్నట్లు వస్తున్న వార్తలపై సీనియర్ శాస్త్రవేత్త, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ అధికారి డాక్టర్ దినేష్ అస్వాల్ స్పందించారు. తల్లి పాలలోని యురేనియం స్వల్ప మోతాదులో ఉన్నప్పటికీ శిశువులకు ఎలాంటి ప్రమాదం ఉండదని స్పష్టం చేశారు. అధ్యయనంలో పేర్కొన్న యురేనియం నమూనాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతించదగిన పరిమితి కంటే తక్కువగానే ఉన్నాయని.. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మరో విఫల వాతావరణ సదస్సు

- శిలాజ ఇంధనాల ప్రస్తావన లేకుండానే ముగిసిన కాప్-30
- ఆర్థిక సాయంపైనా లేని స్పష్టత



సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కాప్-30 అధ్యక్షుడు ఆంద్రే కొరియా డొలాగో

ఐక్యరాజ్యసమితికి చెందిన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) సదస్సులంటే.. ఒకప్పుడు ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసేది. భూతాపాన్ని అరికట్టేందుకు, వాతావరణ మార్పుల కట్టడికి ఆ సమావేశాల్లో తీసుకొనే నిర్ణయాలపై అందరి చూపు ఉండేది. గత కొన్నేళ్లుగా పరిస్థితులు మారాయి. కాప్ సదస్సులు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. ఆదివారం బ్రెజిల్‌లో ముగిసిన కాప్-30 సదస్సు కూడా ఆ కోవలోకే చేరింది.

పారిస్ వాతావరణ సదస్సులో భూతాపం.. పారిశ్రామిక యుగం పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ పెరగకుండా చేయాలని ప్రపంచ దేశాలు ప్రతినబూనాయి. ఆ లక్ష్యం నెరవేరాలంటే కర్బన ఉద్గారాలను కట్టడి చేయాలి. అందుకు ప్రధానంగా చేయాల్సింది శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం. ఎందుకంటే కర్బన ఉద్గారాల్లో వాటి వాటాయే దాదాపు 80 శాతం. అందుకే దుబాయ్‌లో జరిగిన కాప్-28 సదస్సులో శిలాజ ఇంధనాల వాడకాన్ని క్రమంగా తగ్గించాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయి. దీంతో కాప్-30 సదస్సులో దీనిపై నిర్మాణాత్మక చర్చలు జరుగుతాయని, వీటి కట్టడికి ఒక నిర్ణయం తీసుకుంటారని అందరూ ఊహించారు. కానీ ఆదివారం వెలువడిన కాప్-30 తుది ప్రకటనలో అలాంటి నిర్ణయాలేవీ లేకపోగా, 'శిలాజ ఇంధనాలు' అనే పదమే మాయమవ్వడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఇది ఊహించని పరిణామం కూడా కాదు. సదస్సుకు ముందే సభ్యదేశాలు గ్రూపులుగా విడిపోయాయి. సౌదీ అరేబియా, రష్యా నేతృత్వంలోని చమురు, సహజ వాయువులు, బొగ్గు ఉత్పత్తి చేసే దేశాలు.. శిలాజ ఇంధనాల వ్యతిరేకంగా తీర్మానం చేయకుండా భారీస్థాయిలోనే లాబీయింగ్ చేశాయి. దీంతో ఆ దేశాల ఒత్తిడికి తలొగ్గి.. తుది ఒప్పందంలో 'శిలాజ ఇంధనాల' ప్రస్తావనను తొలగించారు.

ఆర్థిక సాయంపైనా తకరారు

శిలాజ ఇంధనాలతో పాటు మరో కీలక సమస్య ఆర్థిక సాయం. 2015లో జరిగిన పారిస్ వాతావరణ ఒప్పందంలోని అధికరణం 9.1 ప్రకారం, వాతావరణ మార్పులు కట్టడి చేయడానికి పేద దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థికంగా చేయూతనందించాలి. ఈ చట్టబద్ధమైన బాధ్యతను ధనిక దేశాలు విస్మరిస్తూ వచ్చాయి. అంతంత మాత్రంగానే ఆర్థిక సాయం అందిస్తున్నాయి. ఇస్తున్న నిధులు కూడా ఎక్కువ రుణాల రూపంలోనే ఉండటంతో పేద దేశాలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ రకమైన సాయాన్ని వర్ధమాన దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గ్రాంట్ల రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. కాప్ 30 సదస్సులో కూడా ఈ విషయంలో స్పష్టత రాలేదు. 2035కల్లా ఏడాదికి 1.3 ట్రిలియన్ డాలర్లకు సాయాన్ని పెంచుతామని బ్రిటన్, ఐరోపా యూనియన్ దేశాలు పేర్కొన్నాయి. ఆ హామీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సదస్సులో అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక సాయం అందిస్తున్న తీరును భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. పారిస్ ఒప్పందాన్ని తుంగలో తొక్కడంపైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది.

- నేషనల్ డెస్క్

హాజరుకాని అమెరికా

అమెరికా హాజరుకాకపోవడమూ ఈ సదస్సుపై ప్రభావం చూపిందని చెప్పాలి. గత కాప్ సదస్సుల్లో అగ్రరాజ్య హోదాలో దౌత్యపరంగా తన బలాన్ని ఉపయోగించి.. చమురు ఉత్పత్తి దేశాలైన సౌదీ అరేబియా, రష్యాతో పాటు ఇతర దేశాలను దారికి తెచ్చేది. ఈ సారి అమెరికా అధికారిక బృందాన్ని కూడా పంపలేదు. పైగా ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాతావరణ మార్పులపై అగ్రరాజ్య వైఖరి పూర్తిగా మారిపోయింది. శిలాజ ఇంధనాలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. దీంతో సౌదీ, రష్యా తదితర చమురు ఉత్పత్తి దేశాలు విజయవంతంగా తమ ఎజెండాను అమలుపరచగలిగాయి. తుది ఒప్పందంలో శిలాజ ఇంధనాల ప్రస్తావన లేకుండా చేయగలిగాయి.

ఉషావాన్స్ వెడ్డింగ్ రింగ్‌పై చర్చ..



వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి ఉషా వెడ్డింగ్ రింగ్ వార్తల్లో నిలిచింది. అమెరికా ఫస్ట్ లేడీ మెలానియాతో కలిసి ఆమె ఇటీవల నార్త్ కరోలినాలో జరిగిన మెరైన్ కోర్ కేంద్రాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఉషా చేతికి వెడ్డింగ్ రింగ్ ధరించలేదు. ఇప్పటికే జేడీ వాన్స్, చార్లీ కిర్క్ సతీమణి ఎరికా కిర్క్‌తో వేదిక పంచుకొన్న వేళ జరిగిన పరిణామాలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆ ప్రచారాలు తగ్గక ముందే ఉషా చేతికి వెడ్డింగ్ రింగ్ లేకుండా కనిపించడం అమెరికా మీడియాలో చర్చనీయాంశమైంది. ఆ దేశంలోని సంప్రదాయవాదులు దీనిని ఆన్‌లైన్‌లో చర్చనీయాంశంగా మార్చేశారు. తాజాగా దీనిపై ఉషా వాన్స్ ప్రతినిధి స్పందించారు. "ఆమె ముగ్గురు చిన్న పిల్లల తల్లి. ఆమె చాలా పాత్రలు కడగాల్సి ఉంటుందని.. అందుకే రింగ్‌ను తీసేసి ఉంటారు" అని పీపుల్స్ మేగజైన్‌తో పేర్కొన్నారు.

జమ్మూకశ్మీర్‌లో వైబ్రంట్ విలేజస్ ప్రోగ్రామ్

- రెండో దశ కింద 124 గ్రామాల అభివృద్ధికి కృషి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో వైబ్రంట్ విలేజస్ ప్రోగ్రామ్(వీవీపీ) రెండో దశ కింద 8 జిల్లాల్లోని 124 సరిహద్దు గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధమైనట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రామాలు 43 బోర్డర్ బ్లాకుల్లో ఉన్నాయి. రోడ్లు, విద్యుత్, టెలికాం, డిజిటల్ కనెక్టివిటీ వంటి నాలుగు ప్రధాన రంగాల్లో లోటుపాట్లను పూరించేందుకు ఈ చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 1,378 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించగా.. మిగతా 30 ప్రధాన గ్రామాలకు పీఎంజీఎస్‌వై-4 ద్వారా ప్రణాళికలో ఉంది. జమ్మూ, సాంబా, కథువా జిల్లాలో నూరు శాతం విద్యుదీకరణ పూర్తయింది. కుప్వారా, బందిపొరాలో మిగిలిన ఇళ్లకు విద్యుత్ కనెక్టివిటీ త్వరితగతిన ఇవ్వాలని విద్యుత్ అభివృద్ధిశాఖను ఆదేశించారు. సరిహద్దు గ్రామాలకు డీటీహెచ్ సేవలను కూడా అందిస్తున్నారు.

ఎల్‌ఏసీ వెంట మహిళలతో సరిహద్దు పోస్టులు

దిల్లీ: భారత్-చైనా మధ్య 3,488కి.మీ పొడవున్న వాస్తవాధీన రేఖ వెంబడి అందరూ మహిళలే ఉండే 10 సరిహద్దు పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) దళం తెలిపింది. 2020 లద్దాఖ్‌లో జరిగిన సైనిక ఘర్షణ తర్వాత ప్రారంభించిన 'ఫార్వర్డైజేషన్' ప్రణాళికలో భాగంగా ఈ దళం ఇప్పటికే 215 పోస్టులను ఏర్పాటు చేసింది. లద్దాఖ్‌లోని లుకుంగ్, హిమాచల్‌లోని థంగీ సహా మొత్తం 10 సరిహద్దు పోస్టులు త్వరలోనే పని ప్రారంభించనున్నాయని అధికారులు తెలిపారు.

కర్రెగుట్టలో పోలీసు భద్రతా శిబిరం ఏర్పాటు

బీజాపుర్: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో ఆరునెలలుగా నక్సల్స్ ఏరివేత కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న భద్రతా బలగాలు ఇప్పుడు అక్కడ ఓ భద్రతా శిబిరాన్ని ఏర్పాటుచేశాయి. బీజాపుర్ జిల్లా ఉసూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని తాడపాల గ్రామం వద్ద ఏర్పాటుచేసిన ఈ కేంద్రానికి భద్రత, ప్రజోపయోగ శిబిరం అని పేరు పెట్టారు. దీన్ని ఏర్పాటుచేసిన ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టు సీనియర్లు తలదాచుకున్న చోటు కావడం గమనార్హం.

బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి

- హెజ్‌బొల్లా అధిపతే లక్ష్యం

బీరుట్: కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నా.. లెబనాన్‌లోని వివిధ ప్రాంతాలపై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ తొలిసారి రాజధాని బీరుట్‌పై ఆదివారం విరుచుకుపడింది. హెజ్‌బొల్లా అధిపతి నయీమ్ ఖాసీం లక్ష్యంగా దాడులు చేశామని పేర్కొంది. ఈ దాడిలో హెజ్‌బొల్లా సీనియర్ నేత హయతం తబ్తాబాయ్ ప్రాణాలు కోల్పోయారని, 21 మందికి గాయాలయ్యాయని లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. దాడిని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఖండించారు. కాల్పుల విరమణను ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని ఆరోపించారు.

రష్యా మినీ యుద్ధ నౌకను అడ్డుకున్న బ్రిటన్

లండన్: ఇంగ్లిష్ ఛానల్ మీదుగా ప్రయాణిస్తున్న రష్యా మినీ యుద్ధ నౌక, ట్యాంకర్‌ను బ్రిటన్ నౌకాదళం అడ్డుకుంది. 'గత రెండు వారాల్లో రష్యా మినీ యుద్ధ నౌక ఆర్ఎఫ్ఎన్ స్టోయికీ, ట్యాంకర్ యెల్‌న్యాలను పెట్రోలింగ్ చేస్తున్న హెచ్ఎంఎస్ సెవెర్న్ నౌక అడ్డుకుంది' అని ఆదివారం బ్రిటన్ రక్షణశాఖ వెల్లడించింది. ఈ ప్రాంతంలో రష్యా కదలికలను గమనించేందుకు మరో 3 నిఘా విమానాలను మోహరించామని వివరించింది.

పుతిన్ భారత్ పర్యటన ఫలవంతం కావడం ఖాయం

- అధ్యక్ష భవనం ప్రతినిధి వ్యాఖ్య

మాస్కో: రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ పర్యటన అత్యంత ఘనంగా, ఫలవంతంగా సాగబోతోందని ఆ దేశ అధ్యక్ష భవనం విదేశాంగ విధాన ప్రతినిధి యూరీ ఉషకోవ్ తెలిపారు. 'మాతోపాటు భారత ప్రతినిధులు ఈ పర్యటన కోసం సిద్ధమవుతున్నారు. ప్రతి అంశంలోనూ ఇది విజయవంతం అవుతుందని ఆశిస్తున్నాం. ఎందుకంటే ఇది దేశాధినేత అధికార పర్యటన' అని ఆయన పేర్కొన్నారు. పర్యటన తేదీలను రెండు దేశాలు ఒకేసారి అధికారికంగా వెల్లడిస్తాయని తెలిపారు.

జపాన్ హద్దులు దాటింది..

- చైనా హెచ్చరిక

బీజింగ్: తైవాన్ వ్యవహారంలో సైనిక పరంగా జోక్యం చేసుకునే అవకాశం లేకపోలేదంటూ జపాన్ నూతన ప్రధానమంత్రి సనై తకాయిచి చేసిన వ్యాఖ్యలను చైనా తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యల ద్వారా టోక్యో తన హద్దులను దాటిందని చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీ మండిపడ్డారు. తైవాన్ తమ దేశంలో అంతర్భాగమని బీజింగ్ ఎప్పటినుంచో వాదిస్తున్న విషయం తెలిసిందే. తైవాన్ విషయంలో చైనా నౌకాదళ ముట్టడి, ఇతరత్రా దుందుడుకు చర్యలు.. జపాన్ సైనికపరమైన జోక్యానికి కారణం కావొచ్చని ఇటీవల తకాయిచి వ్యాఖ్యానించారు. దీన్ని ఖండిస్తూ.. వాంగ్ యీ పేరిట చైనా విదేశాంగశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. "తైవాన్ విషయంలో సైనిక జోక్యానికి యత్నిస్తామని జపాన్ నేతలు బహిరంగంగా తప్పుడు సంకేతాలు పంపడం, సంబంధం లేని విషయాలపై మాట్లాడటం దిగ్భ్రాంతికరం. ఈ వ్యవహారంలో రెడ్ లైన్ దాటారు. మేం దీటుగా స్పందిస్తాం" అని వాంగ్ యీ హెచ్చరించారు.

త్వరలో కెనడా పౌరసత్వ నిబంధనల్లో మార్పులు


- భారతీయులకు ప్రయోజనం

ఒట్టావా: కెనడా పౌరసత్వం కోసం ఎదురు చూస్తున్న వారికి మరికొన్నాళ్లలో తీపి కబురు వెలువడనుంది. అతి త్వరలోనే పౌరసత్వ నిబంధనల్ని కెనడా సర్కారు మార్చనుంది. ఇందుకోసం పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ తయారుచేసిన బిల్లు సీ-3కి ఇప్పటికే ఆమోదముద్ర లభించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సంస్కరణతో అనేక మంది భారతీయ కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. విదేశాల్లో జన్మించిన పిల్లల తల్లిదండ్రుల్లో కనీసం ఒకరైనా కెనడాలో పుట్టడమో.. కన్నుమూయడమో జరిగి ఉండాలి. వారికే పౌరసత్వాన్ని అందించాలని 2009లో కెనడా నిబంధనను తీసుకువచ్చింది. దీని కారణంగా చాలామంది పౌరసత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఎదురైంది. కానీ, ఆంటారియో న్యాయస్థానం ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దీనిని ప్రభుత్వం కూడా అంగీకరించి.. అప్పీల్‌కు వెళ్లలేదు. తాజాగా తీసుకురానున్న బిల్లు ద్వారా పాత నిబంధన ప్రకారం పౌరసత్వం కోల్పోయిన వారందరికీ ఇప్పుడు సిటిజన్‌షిప్ వచ్చే అవకాశాలున్నాయి. కెనడా బయట జన్మించిన తల్లిదండ్రులు పిల్లలను కెనడానికి లేదా దత్తత తీసుకోవడానికి ముందు కనీసం 1,095 రోజులు దేశంలోనే ఉన్నట్లు నిరూపించుకోవాలి. బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పౌరసత్వ ప్రక్రియలో ఇటువంటి విధానాలను పాటిస్తున్నారు. క్యాబినెట్ ఉత్తర్వు తేదీని నిర్ణయించిన తర్వాత ఈ చట్టం అమల్లోకి వస్తుంది. న్యాయస్థానం కూడా దీని అమలు తుదిగడువును 2026 జనవరి వరకు పొడిగించింది. ఇది అమల్లోకి రాగానే పౌరసత్వ దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు.

సింధ్ మళ్లీ భారత్‌లో కలవొచ్చు

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కీలక వ్యాఖ్య

దిల్లీ: పాకిస్థాన్‌లోని 'సింధ్' ప్రాంతం విషయంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంతం నేడు భారత్‌లో భాగం కాకపోయినా.. ఇక్కడి నాగరిక వారసత్వంతో ఇప్పటికీ ముడిపడి ఉన్నారు. సరిహద్దులు మారొచ్చని, 1947లో దేశ విభజన అనంతరం పాక్‌లో భాగమైన సింధ్.. భవిష్యత్తులో తిరిగి భారత్‌లో కలవొచ్చని వ్యాఖ్యానించారు.



దిల్లీలో జరిగిన సింధీ సమాజం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "సింధీ హిందువులు.. ముఖ్యంగా తన తరం వారు సింధ్‌ను భారత్ నుంచి వేరుచేయడాన్ని ఇప్పటికీ అంగీకరించలేదని భాజపా అగ్రనేత ఎల్‌కే అడ్వాణీ తన ఓ పుస్తకంలో రాశారు. కేవలం సింధ్‌లోనే కాదు.. భారత్ వ్యాప్తంగా హిందువులు సింధు నదిని పవిత్రంగా భావించేవారు. నేడు ఆ ప్రాంతం భారత్ భాగం కాకపోవచ్చు. కానీ.. నాగరికత ప్రకారం ఎల్లప్పుడూ మన దేశంలో భాగంగా ఉంటుంది. ఇక భూమి విషయానికొస్తే.. సరిహద్దులు మారొచ్చు. ఎవరికి తెలుసు.. భవిష్యత్తులో సింధ్ మళ్లీ మన దేశంలో కలిసిపోవచ్చు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

పాఠశాల సమీపంలో పేలుడు పదార్థాలు లభ్యం

- ఉత్తరాఖండ్‌లో ఘటన

చంపావత్: ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో ఓ పాఠశాల సమీపంలో పేలుడు పదార్థాలను గుర్తించినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. ఈ ఘటన ఈ నెల 21 చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. దబారా గ్రామంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో అనుమానాస్పద వస్తువులను గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సమీప పొదల్లో 20 కిలోల బరువున్న 161 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి ఉగ్రకోణంతో సంబంధం లేదని..రోడ్డు నిర్మాణ కాంట్రాక్టరు వీటిని అక్కడ వదిలేసి వెళ్లి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

పెట్టుబడి పేరుతో.. రూ.1.44కోట్ల టోకరా

- మోసపోయిన రిటైర్డ్ పోలీసు, ఓ వైద్యుడు

ఠాణె: పెట్టుబడి పథకంలో అధిక రాబడి ఇస్తామని ప్రలోభపెట్టిన దుండగుల ఉచ్చులో పడిన రిటైర్డ్ పోలీసు అధికారి, అతని స్నేహితుడైన ఓ వైద్యుడు రూ. 1.44 కోట్లు మోసపోయారు. మహారాష్ట్రలోని ఠాణెలో ఈ ఉదంతం వెలుగుచూసింది. రెండేళ్లుగా జరుగుతున్న ఈ మోసానికి సంబంధించి పుణె, గోవాలోని ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఠాణె జిల్లాలోని కల్యాణ్ నివాసి అయిన 67 ఏళ్ల మాజీ పోలీసు అధికారి, వైద్యుడైన అతని స్నేహితుడిని నిందితులు షేర్ ట్రేడింగ్ కంపెనీలలో పెట్టుబడి పెట్టించాడు. బాధితుల విశ్వాసం పొందడానికి మొదట్లో కొంత మొత్తంతిరిగి చెల్లించారు. క్రమంగా ఆ చెల్లింపులను నిలిపివేశారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

భారత్‌పై పాక్ మీడియా దుష్ప్రచారం

- ఖండించిన ఫ్రాన్స్ నౌకాదళం

ఇంటర్నెట్ డెస్క్: 'ఆపరేషన్ సిందూర్' విషయంలో భారత్‌పై పాకిస్థాన్ విషం కక్కుతూనే ఉంది. ఇటీవల ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల సమయంలో గగనతలంలో పాకిస్థాన్ పైచేయి సాధించిందని, భారత్ రఫేల్ జెట్లు కోల్పోయిందంటూ ఫ్రాన్స్ నౌకాదళ అధికారిని ఉటంకిస్తూ స్థానిక మీడియాలో కథనం వెలువడింది. అయితే, దీన్ని ఫ్రాన్స్ నౌకాదళం తీవ్రంగా ఖండించింది. అది అసత్య వార్తగా పేర్కొంటూ.. పాక్ మీడియా దుష్ప్రచారానికి చెక్ పెట్టింది. "ఆపరేషన్ సిందూర్ సమయంలో వైమానిక దాడుల్లో పాకిస్థాన్ ఆధిపత్యాన్ని చెలాయించింది. యుద్ధ కార్యకలాపాల విషయంలో మెరుగ్గా సన్నద్ధమైంది. మరోవైపు.. చైనా జే-10సీ యుద్ధ విమానాల సాంకేతిక సామర్థ్యం వల్ల రఫేల్ యుద్ధ విమానం కూలిపోలేదు" అంటూ ఫ్రాన్స్ నేవీ అధికారి కెప్టెన్ జాక్వెస్ లానే అన్నట్లు పాక్‌కు చెందిన జియో టీవీ ఓ కథనాన్ని ప్రచురించింది. దీన్ని ఫ్రాన్స్ నౌకాదళం కొట్టిపారేసింది. "ఇది తప్పుడు సమాచారం. ఆ అధికారి పేరు జాక్వెస్ లానే కాదు.. యువన్ లానే. కథనంలో చెప్పినట్లు కాకుండా.. ఆయన కేవలం ఓ నౌకాదళ ఎయిర్ స్టేషన్ అధికారి మాత్రమే. 'ఆపరేషన్ సిందూర్' గురించి అడిగినప్పుడు.. భారత యుద్ధ విమానాలు కూలిపోయినట్లు ఆయన ఎక్కడా ధ్రువీకరించలేదు" అని 'ఎక్స్' వేదికగా ఫ్రాన్స్ నౌకాదళం పోస్ట్ చేసింది.

హసీనాను మాకు అప్పగించండి

- భారత్‌కు అధికారిక లేఖ పంపిన బంగ్లాదేశ్

ఢాకా: పదవీచ్యుతురాలై భారత్‌లో తలదాచుకుంటున్న తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ బంగ్లాదేశ్ దిల్లీని కోరింది. ఇందుకోసం దేశ తాత్కాలిక ప్రభుత్వం అధికారికంగా శుక్రవారం లేఖ రాసిందని విదేశీ వ్యవహారాల సీనియర్ సలహాదారు మహ్మద్ తౌహిద్ హొసైన్ ఆదివారం వెల్లడించారు. ఇంతకు మించి అదనపు వివరాలను ఆయన తెలపలేదు. ఈ మేరకు ప్రభుత్వ వార్తా సంస్థ బీఎస్ఎస్ తెలిపింది. దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ద్వారా ఆ లేఖను భారత ప్రభుత్వానికి అందించినట్లు వివరించింది. ఈ నెల 17న హసీనాకు బంగ్లాలోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ-బీడీ) మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే.

స్వదేశానికి బంగ్లా చొరబాటుదారుల క్యూ

- గుబులు పుట్టిస్తున్న ఓటర్ల సవరణ
- దొరికిపోతే ఇబ్బందని స్వస్థలాలకు పయనం
- సరిహద్దులో పెరిగిన తాకిడి

హకీంపుర్ (పశ్చిమబెంగాల్): ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పశ్చిమబెంగాల్‌లో అక్రమ వలసదారుల్లో దడ పుట్టిస్తోంది. అధికారిక పత్రాలను సమర్పించలేమని తెలిసి బంగ్లాదేశీయులు తమ స్వదేశానికి పరుగులు తీస్తున్నారు! దీంతో సరిహద్దులో ఒక్కసారిగా తాకిడి పెరిగింది. 'మమ్మల్ని ఇంటికి వెళ్లిపోనివ్వండి' అని సరిహద్దు భద్రత దళం (బీఎస్ఎఫ్) బలగాలను వేడుకుంటున్నవారు పెద్దసంఖ్యలో కనిపిస్తున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకీంపుర్ బీఎస్ఎఫ్ ఔట్‌పోస్టు ద్వారా వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నవారితో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. పిల్లాపాపలతో, మూటాముల్లె సర్దుకుని వారంతా అక్కడే నిరీక్షిస్తున్నారు. ఔట్‌పోస్టు నుంచి రోజుకు 150 నుంచి 200 మంది బంగ్లాకు తరలిపోతున్నట్లు బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. మొదట్లో ఇలాంటివారిని పోలీసు స్టేషన్లకు తరలించేవారు. వందలమందిని ఉంచేందుకు సరిపడా స్థలం లేక ఇప్పుడు శిబిరాల్లో పెడుతున్నారు.



ముడుపులతో అన్ని రకాల కార్డులు

"పేదరికం వల్ల మా దేశం నుంచి ఇక్కడికి వచ్చాం. నెలకు రూ.20,000 వరకు సంపాదించి, ఒక చిన్నగదిలో సర్దుకుని, మిగుల్చుకున్న డబ్బును ఇంటికి పంపేదాన్ని. ఇప్పుడు తిరిగి ఖుల్నాకు వెళ్లిపోవాలనుకుంటున్నాను" అని షహీన్ బీబీ అనే మహిళ తెలిపారు. అక్రమ వలసదారుల్లో చాలామందికి ఆధార్, రేషన్, ఓటరు కార్డులు ఉన్నాయి. దళారులకు ముడుపులు ముట్టజెప్పి ఇవన్నీ సంపాదించుకుంటున్నారు. ఎస్ఐఆర్ కింద పాత పత్రాలను సమర్పించాల్సి ఉండటం వారిలో గుబులు రేపుతోంది. కోల్‌కతా, హావ్‌డా పారిశ్రామిక ప్రాంతాల నుంచి అనేక మంది ఇప్పుడు సరిహద్దు బాటపడుతున్నారు. శిబిరాల్లో ఉంచినవారికి భోజన సదుపాయాన్ని బీఎస్ఎఫ్ కల్పిస్తోంది. మిగిలినవారు మాత్రం దాతలపై ఆధారపడాల్సి వస్తోంది. బెంగాల్లోకి వచ్చేందుకు రూ.5,000 నుంచి రూ.20,000 వరకు సమర్పించుకున్నామని పలువురు చెబుతున్నారు.

సవరణ కాదు.. అణచివేత: కాంగ్రెస్

బెంగాల్లో చేపట్టిన కార్యక్రమం ఓటర్ల జాబితా సవరణ కాదని, అది అణచివేత అని కాంగ్రెస్ విమర్శించింది. ఎస్ఐఆర్ పేరుతో పౌరుల్ని వేధిస్తున్నారని, అనవసర ఒత్తిడిని తట్టుకోలేక మూడు వారాల్లో 16 మంది బూత్‌స్థాయి అధికారులు చనిపోయారని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. నిజమైన ఓటర్లను తొలగించడానికే సంక్షిప్త ప్రక్రియ చేపట్టారని చెప్పారు. ఓటుబ్యాంకు కోసం భారీగా చొరబాట్లను తృణమూల్ కాంగ్రెస్ ప్రోత్సహించిందని భాజపా ఆరోపించింది. విదేశీయులు దొంగచాటుగా ఎలా రాగలిగారని, సరిహద్దుల్లో నిఘా బాధ్యత కేంద్రానిది కాదా అని తృణమూల్ ప్రశ్నిస్తోంది.

శాంతి ప్రణాళిక మార్పునకు ఐరోపా దేశాల మద్దతు

- ఉక్రెయిన్ వెల్లడి
- జెనీవాలో కొనసాగుతున్న చర్చలు

జెనీవా: రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా ప్రతిపాదించిన 28 సూత్రాల శాంతి ప్రణాళికను మార్చాల్సిన అవసరముందని ఐరోపా దేశాలు అభిప్రాయపడ్డాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలు.. ఈ ప్రణాళిక మార్పు విషయంలో తమ వెంటే ఉన్నాయని ఉక్రెయిన్ వెల్లడించింది. ఆదివారం జెనీవాలో ప్రారంభమైన చర్చల్లో ఈ హామీ లభించినట్లు అధ్యక్షుడు జెలెన్స్కీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆండ్రీ యెర్మక్ తెలిపారు. అమెరికా శాంతి ప్రణాళిక.. రష్యాకు అనుకూలంగా ఉందని స్పష్టం చేశారు. తదుపరి సమావేశం అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో, సైనిక కార్యదర్శి డాన్ డ్రిస్కోల్, ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్‌లతో జరగనుందని వివరించారు. ఉక్రెయిన్‌లో శాంతి సాధనకు చర్చలను కొనసాగిస్తూనే ఉంటామని వెల్లడించారు.

37 ఏళ్ల తర్వాత కుమారుడిని కుటుంబంతో కలిపిన 'సర్'

- పశ్చిమబెంగాల్‌లో ఘటన

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమం(సర్)లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. పురులియాలోని ఓ గ్రామానికి చెందిన చక్రవర్తి అనే వ్యక్తి పెద్ద కుమారుడు వివేక్ చక్రవర్తి 1988లో ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు ఎన్నో ఏళ్లపాటు వివిధ ప్రాంతాల్లో అతడి కోసం సాగించిన అన్వేషణ ఫలించలేదు. దీంతో ఆశలు వదిలేసుకున్నారు. తాజాగా రాష్ట్రంలో చేపట్టిన సర్ అద్భుతం చేసింది. ఈ కార్యక్రమంలో వివేక్ చక్రవర్తి సోదరుడు ప్రదీప్ చక్రవర్తి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో)గా విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తన పేరు, ఫోన్ నంబరు ముద్రించిన ఫారాలను పంచిపెట్టారు. ఓటరు జాబితాలో పేరు కోసం సంబంధిత పత్రాలపై సందేహాల నివారణకు కోల్‌కతాలో నివసిస్తున్న వివేక్ కుమారుడు ఫారంలోని ప్రదీప్ ఫోన్ నంబరుకు కాల్ చేశాడు. అతనితో ప్రదీప్ సాగించిన సంభాషణలో ఇరువురు తమ కుటుంబాల గురించి ప్రస్తావించుకోగా అసలు విషయం బయటపడింది. ఆ మాట్లాడిన అబ్బాయిని తన అన్న కుమారుడిగా ప్రదీప్ గుర్తించారు. ఈ క్రమంలో వివేక్ తన సోదరుడు ప్రదీప్‌తో భావోద్వేగంతో మాటలు కలిపాడు. చివరగా తాను తన కుటుంబంతో 37 ఏళ్ల తర్వాత తిరిగి కలవబోతున్నట్లు ఆనందంతో చెప్పాడు. ఈ పరిణామానికి కారణమైన ఎన్నికల కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

బిహార్ ఎన్నికల్లో రిగ్గింగ్

- ప్రశాంత్ కిశోర్ ఆరోపణ

దిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. అయితే.. దీన్ని నిరూపించేందుకు తన వద్ద ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఆదివారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో మా పార్టీ ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోవడం బాధాకరం. ఎన్నికల సమయంలో మా బృందం సేకరించిన అభిప్రాయాలకు, ఫలితాలకు పొంతనలేదు. ఎక్కడో ఏదో తప్పు జరిగిందని నమ్ముతున్నాను. ప్రజలకు తెలియని పార్టీలకు కూడా లక్షల ఓట్లు రావడం అనుమానం రేకెత్తిస్తోంది. ఈవీఎంలు తారుమారు అయ్యాయని చెప్పాలని కొందరు నన్ను అడుగుతున్నారు. ఓడిన తర్వాత చేసే ఆరోపణలు ఇవి. దీనికి సంబంధించి నా దగ్గర ఆధారాల్లేవు. కానీ, చాలా విషయాలు సరిపోలడం లేదు. ప్రాథమికంగా ఏదో జరిగినట్లు నాకు అన్పిస్తోంది. అదేంటో తెలియదు' అని ప్రశాంత్ అన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అనంతరం రాష్ట్రంలోని మహిళలకు అధికార ఎన్డీయే కూటమి రూ.10వేలు అందజేయడంపై ఆయన విమర్శలు చేశారు. ఓటమి నేపథ్యంలో తన రాజకీయ జీవితం ముగిసిందంటూ వస్తున్న వార్తలను ప్రశాంత్ తోసిపుచ్చారు.

శబరిమలలో 3 పూటలా అన్నదానం

- రోజూ 10 వేల మందికిపైగా ఆహారం



ఈటీవీ భారత్: కేరళలోని శబరిమల అయ్యప్ప క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మలికప్పురం ఆలయం వెనుక ఉన్న ఈ సత్రంలో రోజూ 10 వేలమందికిపైగా భక్తులకు మూడు పూటలా ఉచితంగా ఆహారం అందజేస్తున్నారు. ఒకేసారి వెయ్యి మంది కూర్చుని తినే సామర్థ్యం ఉన్న హాల్ ఇక్కడ అందుబాటులో ఉంది. ఉదయం ఆరు గంటల నుంచి 11 వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 3.30 వరకు, సాయంత్రం 6.45 నుంచి ఆ రోజు ఆలయం మూసివేసే వరకు మూడు పూటలా ఆహారం అందజేస్తారు. వంటలు చేయడం, వడ్డించడం, క్లీనింగ్ కోసం 235 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఈ నెల 16న మండల- మకరవిలక్కు వార్షిక తీర్థయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇక్కడ భోజనం చేసిన వారి సంఖ్య శనివారం నాటికి లక్ష దాటిందని అధికారులు పేర్కొన్నారు.

భద్రతా విధుల్లో ఆర్‌ఏఎఫ్..

శబరిమలకు వచ్చే భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కోయంబత్తూర్ బేస్ క్యాంప్ నుంచి వచ్చిన 140 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) బృందాన్ని సన్నిధానంలో మోహరించారు.

టెట్‌కు 65% మంది మహిళా అభ్యర్థుల దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్‌)కు అత్యధికంగా మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. టెట్‌ దరఖాస్తుకు ఆదివారం చివరి గడువు కాగా.. సాయంత్రం వరకు 2,58,638 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో మహిళా అభ్యర్థుల 1,67,668 మంది ఉండగా, పురుష అభ్యర్థులు 90,970 మంది ఉన్నారు. మొత్తం దరఖాస్తుల్లో 65% మంది మహిళలే ఉన్నారు. సెకండరీ గ్రేడ్‌ టీచర్‌(ఎస్జీటీ)కి నిర్వహించే పేపర్‌-1ఎ కు 1,01,882, స్కూల్‌ అసిస్టెంట్‌కు నిర్వహించే పేపర్‌-2ఎ కు 1,51,220 దరఖాస్తులు వచ్చాయి.

ఇంటర్‌ ఉత్తీర్ణత పెంచేందుకు 'సంకల్ప్‌'

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇంటర్మీడియట్‌ విద్యా శాఖ 'సంకల్ప్‌-2026' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. మొత్తం 50 రోజుల ప్రణాళికను డైరెక్టర్‌ రంజిత్‌ బాషా విడుదల చేశారు. ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 20 వరకు ఈ ప్రణాళిక అమలు చేయనున్నారు. ఉదయం 9.10 నుంచి 12.40 గంటల వరకు అన్ని సబ్జెక్టుల్లో బోధించిన అంశాలను పూర్తిచేస్తారు. మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రివిజన్‌, ఇతర టెస్టులు, డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీఫైనల్‌ పరీక్షలు నిర్వహిస్తారు. డిసెంబరు 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయి.

నేషనల్‌ మజ్దూర్‌ యూనిటీ అసోసియేషన్‌ నూతన కార్యాలయానికి శంకుస్థాపన

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలోని కొలనుకొండలో నేషనల్‌ మజ్దూర్‌ యూనిటీ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యాలయ నూతన భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అసోసియేషన్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విశిష్ట అతిథులుగా ఏపీజేఏసీ ఛైర్మన్‌, ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌, మజ్దూర్‌ యూనియన్‌ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాలుగు జోన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మామా హైదరాబాద్‌ వచ్చా.. కలుద్దాం!

- మిత్రుడికి సందేశం పంపి.. పోలీసులకు చిక్కిన ఐబొమ్మ రవి
- నాలుగురోజు కస్టడీలోనూ తెలివిగా సమాధానాలు




ఈనాడు, హైదరాబాద్‌: ఐబొమ్మ రవి కేసు.. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం. మూడు నెలల పాటు అతని కదలికలపై నిఘా ఉంచిన నగర సైబర్‌క్రైమ్‌ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇమంది రవిని ఐదురోజుల కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులకు.. పొంతనలేని సమాధానాలిస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నట్లు సమాచారం. ఆదివారం నాలుగో రోజు విచారణలో ఆధారాలు ఎదురుంచి ఉంచి.. విదేశాల్లో సర్వర్లు, యూకే, కరీబియన్‌ దీవుల్లో పనిచేస్తున్న సిబ్బంది గురించి అడగ్గా.. డేటా విదేశాల్లో ఉందని సమాధానం దాటవేసినట్లు తెలుస్తోంది. పైరసీ సినిమాలతో తాను చేస్తున్న వ్యాపారం ఏదో ఒకరోజు బయటపడుతుందని తెలుసని, అయితే ఇంత త్వరగా పట్టుబడతానని ఊహించలేదంటూ పోలీసు అధికారులతో చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇమంది రవి పోలీసులకు ఎలా చిక్కాడనేది ఆసక్తిగా మారింది.

గుట్టుచెప్పిన ఈ-మెయిల్‌?

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సాంకేతిక పరిజ్ఞానంపై ఎంతటి పట్టున్న మాయగాడైనా ఏదో ఒక ఆధారం వదిలేస్తాడు. ఐబొమ్మ కేసులోనూ సైబర్‌క్రైమ్‌ పోలీసులు ఈ-మెయిల్‌ లింక్‌ ఆధారంగా నిందితుడి కదలికలను పసిగట్టారు. ఇమంది రవి ఈఆర్‌ ఇన్ఫోటెక్‌ కంపెనీ పేరుతో డొమైన్‌లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అక్కడ లభించిన ఫోన్‌ నంబరు ఆధారంగా రవి ఎవరెవరితో మంతనాలు సాగిస్తున్నాడో పోలీసులు విశ్లేషించారు. ఎక్కువ సమయం విదేశాల్లో గడిపే రవి అరుదుగా కూకట్‌పల్లి నివాసానికి వచ్చి, ఒక స్నేహితుడితో కలిసి మద్యం తాగేవాడని తెలిసింది. ఈ-మెయిల్‌ లింకుల ద్వారా పోలీసులు నగరంలో ఆ మిత్రుడెవరనేది ఆరా తీసి అతడి ఫోన్‌ నంబరు సంపాదించారు. తరువాత రవి నగరానికి ఎప్పుడొచ్చినా పోలీసులకు సమాచారం వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో అతను ఫ్రాన్స్‌ నుంచి రాగానే 'మామా.. హైదరాబాద్‌ వచ్చా' అంటూ మిత్రుడికి కూకట్‌పల్లిలోని ఇంటికి ఆహ్వానిస్తూ మెసేజ్‌ పెట్టాడు. దీంతో రవి నగరానికి వచ్చినట్లు నిర్ధారించుకున్న పోలీసులు వెంటనే వెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

భారత అంధ మహిళా క్రికెట్‌ జట్టు విజయం గర్వకారణం

- సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: భారత అంధ మహిళా క్రికెట్‌ జట్టు.. తొలి టీ20 వరల్డ్‌ కప్‌ విజేతగా నిలవడం దేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు కొనియాడారు. వారి అంకితభావం స్ఫూర్తిదాయకమని ఎక్స్‌ వేదికగా పేర్కొన్నారు. క్రికెట్‌ బృందానికి అభినందనలు తెలిపారు.

● భారత జట్టు గెలుపుపై క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌, శాప్‌ ఛైర్మన్‌ రవినాయుడు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన తెలుగు తేజం పి.కరుణకుమారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

అంధ మహిళల జట్టు గెలుపు చరిత్రాత్మకం: మంత్రి నారా లోకేశ్‌

భారత అంధ మహిళల క్రికెట్‌ జట్టు టీ20 వరల్డ్‌కప్‌ గెలవడం చరిత్రాత్మకమని మంత్రి నారా లోకేశ్‌ కొనియాడారు. జట్టు సభ్యులకు ఎక్స్‌ వేదికగా అభినందనలు తెలిపారు. "ఇది దేశానికి అత్యున్నత గౌరవాన్ని తెచ్చిన సందర్భం. అంతర్జాతీయ వేదికపై వారు చూపిన ధైర్యం, దృఢ సంకల్పం ఆనందదాయకం" అని పేర్కొన్నారు.

కౌశల్య టీచర్‌ బోధన ప్రశంసనీయం

ఆటపాటలతో అలరిస్తూ సామెతలు, సూక్తులతో అనంతపురం జిల్లా పైదొడ్డి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల టీచర్‌ జుకొరామిరెడ్డి పల్లి కౌసల్య చేస్తున్న బోధన ప్రశంసనీయమని లోకేశ్‌ పేర్కొన్నారు. "ఇంగ్లిష్‌ మేడ్‌ ఈజీ, లెట్స్‌ లెర్న్‌ విత్‌ టెక్నిక్స్‌ అనే విధానంలో ఆంగ్ల, గణితం సబ్జెక్టులను ఆమె సులువుగా నేర్పిస్తున్నారు. సామాజిక మాధ్యమ వేదికగా ఆమె చేస్తున్న కంటెంట్‌ బాగుంది" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

కరుణకుమారి ప్రతిభ రాష్ట్రానికే గర్వకారణం: మంత్రి డోలా

టీ20 వరల్డ్‌కప్‌ ఫైనల్‌లో నేపాల్‌పై అద్భుత విజయాన్ని సాధించిన భారత జట్టుకు దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి శుభాకాంక్షలు తెలిపారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థిని కరుణకుమారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆమెకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక శిక్షణ ఇప్పించి ప్రోత్సాహించామని పేర్కొన్నారు. ఆమె ప్రతిభ రాష్ట్రానికే గర్వకారణమన్నారు.

ప్రపంచానికి సత్యసాయి సన్మార్గాన్ని చూపించారు: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రపంచానికి జ్ఞానాన్ని, సన్మార్గాన్ని భగవాన్‌ శ్రీసత్యసాయిబాబా చూపించారని సీఎం చంద్రబాబు కొనియాడారు. సత్యసాయి శతజయంతి వేడుకల సందర్భంగా ఎక్స్‌ వేదికగా బాబా సేవల్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "మన ముందు నడయాడిన దైవం సత్యసాయి. సమానత్వం, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తిమార్గం, అసాధారణ శక్తులు, సమస్త మానవాళి పట్ల ప్రేమతో సత్యసాయి కోట్ల మంది జీవితాల్ని ప్రభావితం చేశారు. పుట్టపర్తిని ఆధ్యాత్మికతకు కేంద్రంగా మార్చారు. విద్య, వైద్యం, తాగునీరు, మానవ ప్రశాంతత వంటి కార్యక్రమాలతో కోట్ల మంది జీవితాల్లో మార్పులు తెచ్చారు" అని చంద్రబాబు గుర్తుచేశారు.

అందరికీ ప్రేమను పంచిన దైవ స్వరూపుడు సత్యసాయి: జగన్‌

అందరినీ ప్రేమించి.. అందరికీ ప్రేమను పంచిన దైవ స్వరూపుడు భగవాన్‌ శ్రీసత్యసాయి బాబా అని వైకాపా అధినేత జగన్‌ కొనియాడారు. సత్యసాయి శతజయంతి సందర్భంగా ఆయన భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

జల్‌జీవన్‌ మిషన్‌కు సత్యసాయిబాబా ప్రేరణ: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్‌ మాధవ్‌

కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్‌ జీవన్‌ మిషన్‌కు భగవాన్‌ సత్య సాయిబాబా ప్రేరణ అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్‌ మాధవ్‌ తెలిపారు. ప్రధాని మోదీ స్వయంగా ఈ విషయాన్ని పలుమార్లు చెప్పారని అన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సత్య సాయిబాబా శతజయంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆయన చిత్రపటానికి మాధవ్‌ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన భాజపా జిల్లా అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తు కార్యాచరణ, క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, పార్టీలో కొత్త నాయకుల చేరికలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణ నిధులు ఎందుకు మంజూరు చేయరు?

- వైకాపా అధినేత జగన్‌

ఈనాడు, అమరావతి: దీనస్థితిలో ఉన్న రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధులు ఎందుకు మంజూరు చేయడం లేదంటూ సీఎం చంద్రబాబును వైకాపా అధినేత జగన్‌ ప్రశ్నించారు. రైతుల తరఫున తాము పోరాటం చేస్తే.. దాన్ని పక్కదారి పట్టించడానికి ఎదురుదాడి చేస్తున్నారని ఎక్స్‌ వేదికగా ఆదివారం పేర్కొన్నారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల కాలంలో దాదాపు 16 ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఒక్కసారి కూడా పెట్టుబడి రాయితీ ఇచ్చి ఆదుకోలేదు. ఉచిత పంటల బీమాను రద్దు చేశారు. ఆర్బీకేలు, ఇ-క్రాప్‌, పొలం వద్దే పంట కొనుగోలు ఇలా అన్నీ నిర్వీర్యం చేశారు. చివరకు ఎరువులను బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి తెచ్చారు. పది వేల మందితో టెలికాన్ఫరెన్స్‌ పెట్టడం కాదు. అదే నోటితో పది మంది కలెక్టర్లకు ఫోన్‌ చేసి నిధులు కేటాయించమని, రైతులకు మంచి ధరలు వచ్చేలా చేయమని ఎందుకు చెప్పలేక పోయారు' అని జగన్‌ ప్రశ్నించారు.

మన్యంలో వైద్య సేవలకు డ్రోన్లు



ట్రయల్‌ రన్‌లో భాగంగా చింతపల్లి వచ్చిన డ్రోన్‌

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలోని మారుమూల గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఔషధాలు అందించేందుకు, వారి రక్త నమూనాలు సేకరించేందుకు డ్రోన్‌ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ దిశగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానం వరకు ఆదివారం ట్రయల్‌ రన్‌ నిర్వహించారు. మారుమూల గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాలు, హెల్త్‌ సెంటర్లలో రోగులకు అత్యవసర మందులు తీసుకువెళ్లేందుకు వీటిని వినియోగిస్తున్నామని బెంగళూరుకు చెందిన రెడ్‌వింగ్‌ కంపెనీ ఎండీ ఆశీష్‌ తెలిపారు. పాడేరు, అరకులోయ, చింతపల్లి, ముంచంగిపుట్టు ప్రభుత్వ ఆసుపత్రులకు ఇవి అందుబాటులో ఉంటాయన్నారు.

అనర్హుల గుర్తింపునకు కార్యాచరణ

- పశుసంవర్ధక సహాయకుల నియామకంలో అక్రమాలపై ప్రభుత్వం దృష్టి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వైకాపా హయాంలో పశుసంవర్ధక సహాయకులు (ఏహెచ్‌ఏ) పోస్టులకు కొందరు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాలు పొందారని ఆరోపణలు ఉన్నాయి. వైకాపా హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటులో భాగంగా పశుసంవర్ధక సహాయకుల పోస్టులు భర్తీ చేసింది. ఈ ఉద్యోగాలకు పదో తరగతి తర్వాత పశువైద్యం, డెయిరీలో డిప్లొమా కోర్సులు చదివిన వారిని అర్హులుగా ప్రకటించింది. ఈ పోస్టులు భర్తీ చేసే సమయానికి తగినంత మంది అభ్యర్థులు లేకపోవడంతో చాలా ఖాళీలు మిగిలిపోయాయి. దీంతో మరో రెండుసార్లు ప్రకటనలు ఇచ్చి భర్తీ చేశారు. కొందరు పొరుగు రాష్ట్రాల్లోని విద్యాలయాల్లో డిప్లొమా, ఒకేషనల్‌ కోర్సులు చదివినట్లు ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాలు పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర పశువైద్య మండలి వివిధ వర్గాల నుంచి సమాచారం సేకరిస్తోంది. వందల మంది నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారని గుర్తించారు. సోమవారం పశువైద్య మండలి సమావేశమై నకిలీ ధ్రువపత్రాల విషయమై ఒక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా పశుసంవర్ధక సహాయకుల ధ్రువపత్రాలు సేకరించి అసలు ఆయా విద్యాలయాల్లో చదివారా? సదరు కళాశాలలు ఉన్నాయా? ధ్రువపత్రాలు కళాశాలలు ఇచ్చినవేనా? కళాశాలలకు పశువైద్య మండలి గుర్తింపు ఉందా? వంటి వివరాలు సేకరించనున్నారు. ఈ విషయమై పశువైద్య మండలి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని ఏపీ పశువైద్య మండలి అధ్యక్షుడు పారా లక్ష్మయ్య తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాలు పొందినట్లు సమాచారం రావడంతో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయమై సమావేశంలో చర్చిస్తామన్నారు. అర్హత లేనివారు పశువైద్యం చేయడం వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు.


ప్రముఖ రచయిత్రి తెన్నేటి సుధాదేవి కన్నుమూత



ఈనాడు డిజిటల్‌, హైదరాబాద్‌, నల్లకుంట-న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత్రి తెన్నేటి సుధాదేవి (73) కన్నుమూశారు. నల్లకుంటలోని స్వగృహంలో ఆదివారం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 'వంశీ' సంస్థల అధినేత వంశీ రామరాజు సతీమణి సుధాదేవి స్వస్థలం హనుమకొండ. వీరికి ఇద్దరు కుమారులు. ఈమె తెలుగు అకాడమీ ఉప సంచాలకురాలిగా 32 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించారు. తెలుగు 'పరిశోధన పత్రిక'కు సహ సంపాదకురాలిగా పనిచేశారు. సామెతలు, నాటికలు, కవితా సంపుటి తదితర రచనలు చేశారు. ఇటీవలే ఓ కథల సంపుటిని ప్రచురణకు ఇవ్వగా.. అది పూర్తికాకముందే ఆమె కాలధర్మం చెందారు. సోమవారం అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు జరగనున్నాయి. సుధాదేవి భౌతికకాయానికి పలువురు సాహితీవేత్తలు నివాళులర్పించారు. సుధాదేవి తల్లిదండ్రులు అహల్యాదేవి, సుబ్బారావు ఉపాధ్యాయులు.. సాహితీప్రియులు. వారి ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచే సుధాదేవి నాటికలు రాశారు. అమ్మ, అరవింద, రవళి, మహిళలు-రాజ్యాధికారం రిజర్వేషన్‌ సమస్య, తెలుగు సామెత నాటికలు, బలిజేపల్లి లక్ష్మీకాంతకవి నాటక కళావైదుష్యం, వినిపించని వేదన, రచయిత్రుల కొత్త కథలు.. వంటి కవితా, కథల సంపుటాలు రచించారు. వాసిరెడ్డి రంగనాయకమ్మ స్మారక పురస్కారం సహా పలు అవార్డులు అందుకున్నారు.

సీనియర్‌ బుష్‌కు గ్రహాంతర వాసుల సమాచారం

- న్యూయార్క్‌ పోస్టు డాక్యుమెంటరీలో వెల్లడి



ఇంటర్నెట్‌ డెస్క్‌: గ్రహాంతర వాసులపై కచ్చితమైన సమాచారం లేకపోయినప్పటికీ.. ఏదో ఒక గ్రహంపై జీవం ఉండే అవకాశముందని పలువురు నమ్ముతున్నారు. వాటికి మరింత ఊతమిచ్చే అనేక ఘటనలు చోటుచేసుకున్నట్లుగా పలు దేశాల శాస్త్రవేత్తలు పేర్కొంటుంటారు. తాజాగా న్యూయార్క్‌ పోస్టు విడుదల చేసిన ఓ డాక్యుమెంటరీలోనూ గ్రహాంతర జీవుల ప్రస్తావన వచ్చింది. వాటికి సంబంధించిన సమాచారం సీఐఏ చీఫ్‌గా పనిచేసిన సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్‌ బుష్‌ సీనియర్‌కు తెలుసని అందులో పేర్కొన్నారు. '1964లో న్యూమెక్సికోలోని హాలోమన్‌ వైమానిక స్థావరంలోని సిబ్బంది గ్రహాంతర వాసులను ప్రత్యక్షంగా చూశారు. అమెరికా సెంట్రల్‌ ఇంటెలిజెన్స్‌ డైరెక్టర్‌గా జార్జ్‌ బుష్‌ సీనియర్‌ ఉన్న సమయంలో (1976-77) గ్రహాంతర వాసులకు సంబంధించిన నివేదికను అధికారులు ఆయనకు అందించారు' అని న్యూయార్క్‌ పోస్టు డాక్యుమెంటరీలో ఉంది. అయితే దీనికి సంబంధించిన ఆధారాలు ప్రస్తుతం అందుబాటులో లేవని తెలిపింది. న్యూయార్క్‌ పోస్టు విడుదల చేసిన 'ద ఏజ్‌ ఆఫ్‌ డిస్‌క్లోజర్‌' అనే డాక్యుమెంటరీలో ఎరిక్‌ డేవిస్‌ అనే ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఈ విషయాన్ని వెల్లడించారు. 2003లో తాను జార్జ్‌ బుష్‌ సీనియర్‌తో సమావేశమైనప్పుడు ఆయన స్వయంగా తనకీ విషయం చెప్పినట్లు పేర్కొన్నారు. మూడు అంతరిక్ష నౌకలు హాలోమన్‌ స్థావరానికి సమీపానికి వచ్చాయని, వాటిలో ఒకటి కిందకు దిగగా.. అందులో నుంచి ఓ గ్రహాంతర వాసి కిందకు వచ్చి వైమానిక దళం సిబ్బందితో మాట్లాడటానికి ప్రయత్నించినట్లు అధికారులు బుష్‌కు సమాచారం ఇచ్చారని ఎరిక్‌ డేవిస్‌ వివరించారు. అయితే మిగతా విషయాలేవీ బుష్‌ తనతో చెప్పలేదని, ఇతరులతోనూ చర్చించలేదని వెల్లడించారు.

మన స్నేహం కలకాలం ఉండాలి

మోదీని ఉద్దేశించి మెక్రాన్‌ పోస్టు


ఇంటర్నెట్‌ డెస్క్‌: భారత్‌తో స్నేహం కలకాలం ఉండాలని ఫ్రాన్స్‌ అధ్యక్షుడు ఇమాన్యుయేల్‌ మెక్రాన్‌ అన్నారు. జీ-20 సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశానంతరం ఆయన సామాజిక మాధ్యమ వేదికగా పోస్టు చేశారు. "భారత ప్రధాని, ప్రియ మిత్రుడు నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ప్రపంచ దేశాలు ఒకదానికొకటి సహకరించుకున్నప్పుడే అవి బలంగా మారుతాయి. అదే విధంగా మన దేశాల మధ్య స్నేహం చిరకాలం ఉండాలి" అని ఆకాంక్షించారు. మోదీతో ఉన్న ఫొటోను జతచేశారు. అంతకుముందు సదస్సులో మెక్రాన్‌ మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంక్షోభాలను పరిష్కరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జీ20 కూటమి ఉనికి ప్రమాదంలో ఉందన్నారు. కొన్ని ప్రాధమ్యాలపై సమష్టిగా కృషి చేయకుంటే జీ20 ప్రమాదంలో పడుతుందని ప్రపంచ నేతలు గుర్తించాలన్నారు.

జెలెన్‌స్కీ పోరాడగలరు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌

వాషింగ్టన్‌: రష్యా-ఉక్రెయిన్‌ మధ్య శాంతికి సంబంధించి తాము ప్రతిపాదించిన ప్రణాళిక చివరిది కాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ స్పష్టం చేశారు. తాను శాంతినే కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఏదో ఒక విధంగా ఈ యుద్ధాన్ని ముగించాల్సి ఉందని పునరుద్ఘాటించారు. ఒకవేళ దీనిని జెలెన్‌స్కీ తిరస్కరిస్తే అని ప్రశ్నించగా.. తన చిన్న హృదయంతో ఆయన పోరాడగలరని వ్యాఖ్యానించారు.


24 ఏళ్లుగా గంగాజల సేకరణ.. పంపిణీ



ఈటీవీ భారత్‌: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీకి చెందిన హోటలు నిర్వాహకుడు అరవింద్‌ కుడియాల్‌ గత 24 ఏళ్లుగా వివిధ ప్రాంతాల నుంచి గంగా జలాలు సేకరించి ప్లాస్టిక్‌ డబ్బాల్లో నిల్వ చేస్తున్నారు. ప్రతి డబ్బాపై సేకరించిన తేదీ, ప్రాంతం వంటి వివరాలు నమోదుచేసి తన హోటలు రిసెప్షనులో అందుబాటులో ఉంచుతారు. అడిగినవారికి ఈ జలాన్ని ఉచితంగా అందజేస్తుంటారు. గంగా నదిపై భక్తి తన తండ్రి దర్శన్‌లాల్‌ కుడియాల్‌ నుంచి వారసత్వంగా వచ్చినట్లు అరవింద్‌ తెలిపారు. ఆయన విశ్వనాథ ఆలయంలోని శివలింగాన్ని నిత్యం గంగాజలంతో అభిషేకం చేసేవారని గుర్తుచేసుకున్నారు. తన వద్ద మానస సరోవరం, లద్దాఖ్‌లోని పాంగాంగ్‌ సరస్సు, గంగా సాగర్‌, బద్రీనాథ్‌, పంచ జ్యోతిర్లింగాలు, రామేశ్వరంలోని బావుల నీళ్లు కూడా ఉన్నట్లు అరవింద్‌ చెప్పారు.

గందరగోళం నివారణకు గీత సమున్నత సాధనం

- మోహన్‌ భాగవత్‌ వ్యాఖ్య



లఖ్‌నవూ: నైతిక గందరగోళంతో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచానికి భగవద్గీత కాలాతీత మార్గదర్శకత్వాన్ని అందిస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్‌ సంఘ్‌(ఆర్‌ఎస్‌ఎస్‌) చీఫ్‌ మోహన్‌ భాగవత్‌ అన్నారు. ఆదివారం నాడిక్కడ నిర్వహించిన గీతా ప్రేరణ మహోత్సవంలో ఆయన మాట్లాడారు. "మనం ఇక్కడున్నది గీతను కేవలం పఠించడానికి కాదు, జీవన విధానాన్ని నేర్చుకోవడానికి. దానిలో 70 శ్లోకాలను చదవాలి, ఆలోచించాలి, మన దైనందిన జీవితంలోకి ఆహ్వానించాలి" అని భాగవత్‌ అన్నారు. భారతీయుల వివేచన జ్ఞానం వేల ఏళ్లపాటు ప్రపంచానికి మార్గనిర్దేశం చేసిందని, గీత చెబుతున్నది కూడా అదేనని అభిప్రాయపడ్డారు. "కృష్ణుడు అర్జునుడికి గీత బోధన ద్వారా గందరగోళాన్ని తొలగించినట్లే.. నేటి మానవాళి తమ సవాళ్లను ఎదుర్కోవడంలో గీత సహాయపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. "భారత్‌ ఒకప్పుడు ప్రపంచశక్తి. శతాబ్దాలుగా దండయాత్రలను భరించింది. ఇప్పటికీ నిలబడే ఉంది. మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలంటే.. మన ప్రాశస్త్యాన్ని అర్థం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది" అని ఆయన తెలిపారు.

అల్‌ఫలాహ్‌ సమీపంలో అండర్‌గ్రౌండ్‌ మదర్సా!

- 5 అడుగుల మందంతో నిర్మాణం
- అనుమానాలు రేకెత్తిస్తున్న కట్టడం



ఈటీవీ భారత్‌: దిల్లీ పేలుడు ఘటన ఉగ్ర డాక్టర్లకు అడ్డాగా మారిన హరియాణాలోని అల్‌ఫలాహ్‌ యూనివర్సిటీ సమీపంలో భూగర్భ(అండర్‌గ్రౌండ్‌) మదర్సాను గుర్తించడం సంచలనంగా మారింది. ఆ కట్టడం గోడలు ఏకంగా 4 నుంచి 5 అడుగుల మందంతో అసాధారణంగా ఉండటం అనుమానాలు పెంచుతోంది. ఆ మదర్సా ప్రస్తుతం నిర్మాణ దశలోనే ఉందని తెలుస్తోంది. మదర్సాలోని ఎక్కువ భాగం భూగర్భంలోనే ఉండగా, కేవలం మూడు అడుగుల నిర్మాణం మాత్రమే భూ ఉపరితలంపై ఉంది. మొత్తం 200 గజాల స్థలంలో ఈ నిర్మాణం చేపట్టారు. అరెస్టైన ఉగ్రవాద డాక్టర్‌ ముజమ్మిల్‌ గనై నిధులు సమకూరుస్తున్నట్లు గుర్తించడం చర్చనీయాంశమవుతోంది. ఈ నిర్మాణాన్ని హరియాణా మతబోధకుడు మౌల్వీ ఇష్తియాక్‌ పేరుతో రిజిస్టర్‌ చేశారు. అల్‌ఫలాహ్‌ యూనివర్సిటీ సమీపంలోని మౌల్వీ ఇష్తియాక్‌ ఇంట్లోనే ఉగ్ర డాక్టర్లు తమ పేలుడు పదార్థాలను దాచుకున్నారు.

2019 నుంచే డాక్టర్లకు ఉగ్రవాదుల వల

మరోవైపు నవంబర్‌ 10న ఎర్రకోట వద్ద బాంబుదాడితో వెలుగులోకి వచ్చిన వైట్‌కాలర్‌ ఉగ్ర నెట్వర్క్‌ గురించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వైద్యుల్లో ఉగ్రవాద భావజాలం 2019 నాటికే సోషల్‌ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వేదికగా పురుడు పోసుకుందని దర్యాప్తు అధికారులు గుర్తించారు. సీమాంతర ఉగ్రవాదంలో మార్పు వచ్చిందనీ పాకిస్థాన్‌, ఇతర దేశాల్లోని ఉగ్ర హ్యాండ్లర్లు డిజిటల్‌ మార్గాల్లో విద్యావంతులను ఎంపిక చేసుకుని ఉగ్రభావజాలం నింపుతున్నారని దర్యాప్తులో తేలింది. ఉగ్ర డాక్టర్లు ముజమ్మిల్‌ గనై, అదీల్‌ రాథర్‌, ముజఫర్‌ రాథర్‌, ఉమర్‌ నబీ వంటివారు ఫేస్‌బుక్‌, ఎక్స్‌ వంటి సోషల్‌ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో చురుకుగా ఉన్నప్పుడు ఉకాసా, ఫైజాన్‌, హష్మీ అనే ఉగ్ర హ్యాండ్లర్లు వారిని గుర్తించాయి. తర్వాత వారిని సంప్రదించి టెలిగ్రాం, మాస్టోడాన్‌ వంటి యాప్‌ల్లో గ్రూపుల్లో చేర్చి బ్రెయిన్‌వాషింగ్‌ చేయడం ప్రారంభించారు. ఏఐ వీడియోలతో ద్వేషాన్ని నింపారని సమాచారం.

అద్దె డబ్బును ఇప్పించాలని దర్యాప్తు అధికారులను కోరిన ఇష్తియాక్‌

దిల్లీ బాంబుదాడి కేసులో అదుపులోకి తీసుకున్న హరియాణా మత బోధకుడు మౌల్వీ ఇష్తియాక్‌ ప్రవర్తన ఆసక్తిగా మారింది. అల్‌ఫలాహ్‌ యూనివర్సిటీ సమీపంలో ఉన్న మౌల్వీ ఇష్తియాక్‌ ఇంట్లోనే ఉగ్రవాదులు భారీగా దాచిన పేలుడు పదార్థాలను తొలిసారి పోలీసులు గుర్తించారు. మౌల్వీ ఇష్తియాక్‌ విచారణ అధికారులకు చెప్పిన విషయాలు ఆసక్తిగా మారాయి. గనై, ఉమర్‌లు మొదట్లో తనను సంప్రదించి ఎరువులను నిల్వ చేసుకునేందుకు గదిని అద్దెకు అడిగారని వివరించారు. నెలకు 2వేల 500 రూపాయలు చెల్లించాలని చెబితే వారు అంగీకరించారని ఇష్తియాక్‌ వివరించాడు. ఆరు నెలలుగా వారు అద్దె చెల్లించలేదని, తనకు ఆ డబ్బును ఇప్పించాలని దర్యాప్తు అధికారులనే ఇష్తియాక్‌ కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాను పేదవాడినని నలుగురు పిల్లలు ఉన్నారని, దయచేసి డబ్బు ఇప్పించాలని బతిమలాడుకున్నాడు. ఇంత తీవ్రమైన కేసు గురించి ఆలోచించకుండా ఇష్తియాక్‌ డబ్బుల గురించి మాట్లాడటంతో దర్యాప్తు అధికారులు అవాక్కయ్యారు.



వధూవరులతో జెన్నిఫర్‌ లోపెజ్‌

ఉదయ్‌పూర్‌ రాజభవనంలో ప్రపంచ ప్రముఖుల సందడి

పెళ్లి వేడుకలో తళుక్కుమన్న జెన్నిఫర్‌ లోపెజ్‌

ఉదయ్‌పూర్‌: అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారత బిలియనీరు రామరాజు మంతెన కుమార్తె నేత్ర మంతెన పరిణయం ఆదివారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వంశీ గాదిరాజుతో వైభవంగా జరిగింది. ద్వీప రాజభవనం జగ్‌మందిర్‌ ప్యాలెస్‌లో దక్షిణ భారత హిందూ సంప్రదాయ పద్ధతిలో సాగిన వివాహానంతరం సాయంత్రం జెనానా మహల్‌లో విందు ఏర్పాటు చేశారు. అందంగా ముస్తాబు చేసిన పడవల్లో అతిథులను తరలించారు. ఈ వేడుకలకు వివిధ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రముఖులు హాజరుకావడంతో ఉదయ్‌పూర్‌ గత మూడు రోజులుగా ప్రపంచ ప్రముఖుల కూడలిగా మారింది. అమెరికన్‌ గాయని, హాలీవుడ్‌ స్టార్‌ జెన్నిఫర్‌ లోపెజ్‌ భారతీయ వస్త్రధారణతో ఆకట్టుకొని పెళ్లిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం తాజ్‌ లేక్‌ ప్యాలెస్‌లో హల్దీ వేడుక, శనివారం సిటీ ప్యాలెస్‌లోని మానెక్‌ చౌక్‌లో సంగీత్‌ నిర్వహించారు. బాలీవుడ్‌ నటులు రణవీర్‌ సింగ్‌, షాహిద్‌ కపూర్‌, వరుణ్‌ ధావన్‌, కృతి సనన్‌, జాక్వెలిన్‌ ఫెర్నాండెజ్‌ తదితరులు తమ ప్రదర్శనలతో అలరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ కుమారుడు ట్రంప్‌ జూనియర్‌ ఐవరీ జోధ్‌పూర్‌ సూట్‌లో తన స్నేహితురాలితో కలిసి పెళ్లికి విచ్చేశారు. అతిథులంతా సోమవారం డబోక్‌ విమానాశ్రయం నుంచి వెనుదిరగనున్నారు.

26/11కు 'ఆపరేషన్‌ సిందూర్‌'లా బుద్ధి చెబితే బాగుండేది

- కానీ అప్పటి సర్కార్‌ మౌనవ్రతం!
- దేవేంద్ర ఫడణవీస్‌ కీలక వ్యాఖ్యలు



ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలో జరిగిన 26/11 దాడికి 'ఆపరేషన్‌ సిందూర్‌'లా బుద్ధిచెప్పి ఉంటే.. మరోసారి మన దేశాన్ని ఎవరూ లక్ష్యం చేసుకోవడానికి సాహసించేవారుకారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ అన్నారు. అయితే అప్పటి ప్రభుత్వాలు అలా చేయలేదని ఆయన పరోక్షంగా కాంగ్రెస్‌ను ఎత్తి చూపారు. 26/11 దాడికి 17 ఏళ్లు పూర్తైన సందర్భంగా గేట్‌ వే ఆఫ్‌ ఇండియా వద్ద నిర్వహించిన 'గ్లోబల్‌ పీస్‌ ఆనర్స్‌' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. '26/11 దాడి కేవలం తాజ్‌ హోటల్‌ లేదా ట్రైడెంట్‌ హోటల్‌పై జరిగిన దాడి మాత్రమే కాదు. అది భారతదేశ సార్వభౌమత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న అతి పెద్ద ఉగ్రదాడి. ముంబయి దేశ ఆర్థిక నాడి. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకూ, పర్యాటకానికీ ప్రధాన కేంద్రం కావడంతో ఉగ్రవాదులు ఈ నగరాన్ని మాత్రమే లక్ష్యం చేసుకున్నారు. భారత్‌తో ప్రత్యక్ష యుద్ధంలో గెలిచే స్థితిలో లేకపోవడంతో పాకిస్థాన్‌ ఉగ్రవాదులను పెంచి వెనక నుంచి యుద్ధం చేస్తోంది. ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగవని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టంచేశారు. దేశంపై ఉగ్ర దాడుల ముప్పు ఇంకా కొనసాగుతూనే ఉన్నందున ప్రతి ఒక్క పౌరుడు అప్రమత్తంగా ఉండాలి' అంటూ ఫడణవీస్‌ పిలుపునిచ్చారు.

సోనేపుర్‌లో ఆసియాలోనే అతిపెద్ద పశువుల మేళా



ఈటీవీ భారత్‌: ఆసియా ఖండంలోనే అతి పెద్ద పశువుల మేళా బిహార్‌లోని సారణ్‌ జిల్లా సోనేపుర్‌లో అట్టహాసంగా కొనసాగుతోంది. నవంబరు 9న మొదలైన ఈ మేళా డిసెంబరు 10 వరకు జరగనుంది. ఆవులు, గేదెలు, మేకలు, కుక్కలు, గుర్రాల వంటి పలురకాల జంతువులను ఇక్కడ ప్రదర్శించి విక్రయిస్తారు. ఇరుగు, పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులు వస్తారు. ఈ ప్రదర్శనలో బాదల్‌, వర్షారాణి, జాన్‌బాజ్‌, కోబ్రా, లుక్కా అనే గుర్రాలు అందరినీ ఆకట్టుకొంటున్నాయి. ఇందులో మూడు పొట్టి గుర్రాలు కాగా.. జాన్‌బాజ్‌, కోబ్రా రేసింగులో దిట్టలు. సందర్శకులంతా వాటి చుట్టూ చేరి సెల్ఫీలు దిగుతున్నారు. ఈ గుర్రాలను విక్రయానికి కాకుండా కేవలం ప్రదర్శనకు మాత్రమే తీసుకువచ్చినట్లు వాటి యజమానులు చెబుతున్నారు.